# రండి!
# నిజ ఆరాధ్య దైవాన్ని కలుసుకోండి!

డాక్టర్ ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ



**Haqeeqi Mabood se**
**Mulaqat Keejiye** (Telugu)

# రండి, నిజ ఆరాధ్య దైవాన్ని కలుసుకోండి!


మూలం

**డాక్టర్ ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**
M.B.B.S., D.Ch.,

తెలుగు అనువాదం

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**



ప్రకాశకులు

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

సందేశ భవనం, లక్కడ్‌కోట్,
ఛత్తాబజార్, హైదరాబాద్ – 500 002
ఫోన్ : 040–24576237, 24564583
e-mail : geeturaiweekly@gmail.com

**Randi Nija Aaradhya Daivanni Kalusukondi**

**Haqeeqi Mabood se Mulaqat Keejiye** (Telugu)

TIP Series : 273

Writer : Dr.Mohammed Moazzam Ali
M.B.B.S., D.Ch.

Telugu Rendering : Mohammad Azeez-ur-Rahman

*All Rights Reserved with Publishers*

First Edition : September, 2019

Copies : 1000

**Price** **: Rs.100/-**

Publishers : **Telugu Islamic Publications Trust**
Sandesha Bhavanam, Lakkadkote,
Chatta Bazar, Hyderabad- 500 002
Ph.040-24576237, 24564583
e-mail : geeturaiweekly@gmail.com

Printed at : **Cosmic Printers**
Sandesha Bhavanam, Lakkadkote,
Chatta Bazar, Hyderabad- 500 002

# విషయసూచిక


**ముందుమాట** (Preface) ................. 05

×. **మొదటి అధ్యాయం** (Chapter - I) ................. 09
సృష్టికర్త మానవాళి వరకూ తన సందేశాన్ని చేరవేసే
విధానం ఏమి కాగలదు? (ఒక చూపులో)

××. **రెండవ అధ్యాయం** (Chapter - II) ................. 40
దైవప్రవక్తనని ముహమ్మద్ (సఅసం) చేసిన ప్రకటన
సత్యమేనా? ... ఒక చూపులో!

×××. **మూడవ అధ్యాయం** (Chapter - III) ................. 91
విశ్వ సార్వభౌముని గ్రంథం : ఖుర్ఆన్ ... ఒక చూపులో!

×ఎ. **నాల్గవ అధ్యాయం** (Chapter - IV) ................. 119
విశ్వ సార్వభౌముని ప్రవక్త ముహమ్మద్ (సఅసం)
... ఒక చూపులో !

ఎ. **ఐదవ అధ్యాయం** (Chapter - V) ................. 146
విశ్వసార్వభౌముడే నిజ ఆరాధ్యదైవం ... ఒక చూపులో!

ఎ×. **ఆరవ అధ్యాయం** (Chapter - VI) ................. 194
పరలోకం ... ఒక చూపులో

ఎ××. **ఏడవ అధ్యాయం** (Chapter - VII) ................. 225
ఉపదేశం ... ఒక చూపులో!

ఎ×××. **ఎనిమిదవ అధ్యాయం** (Chapter - VIII) ................. 235
హెచ్చరిక ... ఒక చూపులో

# అంకితం

నిజ ఆరాధ్య దైవం అన్వేషణలో చిత్తశుద్ధి కలవారికి, విశాల హృదయంతో సత్యాన్వేషణకై ప్రయత్నించే వారికి, సంకుచితత్వాన్ని, దురభిమానాన్ని సత్యాన్వేషణా మార్గంలో అడ్డురానివ్వని వారికి, తమ ఆత్మకు న్యాయం చేసుకోగోరేవారికి, సత్యం పట్ల న్యాయం చెయ్యదలిచేవారికి ఈ పుస్తకం అంకితం.

# ముందుమాట (Preface)

ఇంతకు ముందు "మనిషీ! నీ సృష్టికర్తను తెలుసుకో" అనే పుస్తకంలో మనం ఈ జగతిని, మానవుణ్ణి పుట్టించిన వాడొకడున్నాడనే విషయాన్ని తెలుసుకున్నాం. దానిపై మనం పూర్తిగా సంతృప్తి చెందాము కూడా. దాంతోపాటు మనకు మరో విషయంపై కూడా పూర్తిగా సంతృప్తి కలిగింది – అంటే, ఆ సృష్టికర్త ఒక్కడే ఈ జగతిని, మనిషిని ఆయనే పుట్టించాడు. ఆయన ఒక్కడే. ఆయనకు పరివారం లేదు. ఆయనకు సహాయకులు కూడా ఎవరూ లేరు. ఆయన బలహీనతలన్నింటికీ అతీతుడు. ఆయన ఎవరిపైన కూడా ఆధారపడి లేడు. ఆయన స్వతంత్రుడు. నిరపేక్షాపరుడు. తిరుగులేని అధికారం కలవాడు. సుగుణాలన్నీ ఆయన స్వంతం. జీవన పరిమితులన్నింటికీ ఆయన అతీతుడు. ఆయన సర్వసత్తాధికారి. సార్వభౌముడు. ఏమీ లేనపుడు కూడా ఆయన ఉన్నాడు. ఈ విశ్వం అంతమయ్యాక కూడా ఆయన ఉంటాడు. ఆయనకు అంతం అంటూ ఉండదు. ఆయన నిద్ర పోడు, ఆయనకు కునుకు కూడా పట్టదు.

ఈ జగతిని, మనుషులను పుట్టించినవాడే మానవుల నిజ ఆరాధ్య దైవం కాగలడన్న నిర్ధారణకు కూడా మనం వచ్చాము. సామంజస్యత (Reasoning) తో, హేతుబద్ధంగా మనం ఈ విషయాన్ని తెలుసుకున్నాం. సృష్టికర్తకు ఏ ఏ సుగుణాలుంటాయో, అవే సుగుణాలు ఆరాధ్య దైవానికి కూడా ఉంటాయన్న విషయం కూడా ఈ పుస్తకం మొదటి అధ్యాయంలో గుర్తు చేయబడింది. ఇది ప్రాకృతిక యదార్థం. ముందుకు సాగే ముందు ఈ విశ్వం ఉనికి, దాని మనుగడ, మనిషి పట్ల సృష్టికర్తకు గల ప్రేమ, సృష్టికర్తలోని గుణాలు వాంఛించేదేమిటి? లాంటి విషయాలు కూడా ఇందులో ప్రస్తావనకు వస్తాయి.

ఇంతకు ముందు వచ్చిన పుస్తకంలో జరిగిన చర్చ, దాని సారాంశం అంతా ఒక ఊహ మాత్రమే. అది తప్పూ కావచ్చు, ఒప్పూ కావచ్చు. ఎంతోమంది కాల్పనిక దేవుళ్ళను మేము మా పరిశోధన ఆధారంగా త్రోసిపుచ్చాము (Reject చేశాము). 'ఊహ' వాస్తవం కాగలగాలంటే సృష్టికర్త తరపున ఆయన

స్వయం పరిచయం జరగాలి. దాసులకు ఆయన సందేశం అందాలి. అప్పుడే ఆ ఊహకు వాస్తవికత చేకూరుతుంది. సృష్టికర్త అనే వాడుంటే, ఆయన తప్పకుండా దాసులకు–ఏదో ఒక విధంగా తన గురించి తెలిపి ఉంటాడనే విషయం కూడా ఈ భావనలో అంతర్లీనమై ఉంది. ఆయన మనిషిని ఏమీ తెలియని స్థితిలో వదలిపెట్టి ఉండడు. తెలియని స్థితిలో మనిషిని అతని మానాన వదలిపెట్టడం ఆ సార్వభౌముని ఘనత్వానికి ఎంతమాత్రం శోభించదు కూడా.

సృష్టికర్త తన గురించి పరిచయం చేసుకుని ఉంటే ఈ 'ఊహ' వాస్తవం అవుతుంది. ఇంతకీ సృష్టికర్త తనను పరిచయం చేసుకున్నాడా లేదా అన్న దానిని ఇప్పుడు శోధించాలి. ఒకవేళ పరిచయం చేసుకోకుండా ఉంటే, దాని 'క్లూ' ఎక్కడా దొరకదు. అట్టి పరిస్థితిలో సృష్టికర్త ఒక ఊహగానే మిగిలిపోతాడు. అందులో వాస్తవం ఉండదు.

ఒకవేళ ఆయన తరఫున పంపబడిన 'పరిచయం' గనక లభిస్తే, దాని ప్రామాణికత (Authenticity) కూడా నిశ్చితం (Confirm) అయిపోతే, ఇక అది భావనగా ఉండదు. అదొక యదార్థం అవుతుంది – అంటే సృష్టికర్త వద్ద నుంచి 'సందేశం' వచ్చిందనడానికి, ఆయన ఉనికి ఒక సత్యం అనడానికి అది ప్రబల తార్కాణం అవుతుంది.

ప్రామాణిక ఆధారాలతో ఆయన పరిచయం గనక లభ్యమైనట్లయితే, ఆయన తన గురించి క్షుణ్ణంగా తన దాసులకు పరిచయం చేయించుకున్నా డన్నమాటే.

కచ్చితమయిన ఆధారాలతో సృష్టికర్త పరిచయం లభ్యమైతే, దాని అర్థం ఏమిటి? ఆయన తన గురించి తన దాసులకు పూర్తిగా తెలియజేశాడు! తన దాసులు జీవితాంతం మార్గవిహీనతా లోయల్లో తచ్చాడకుండా, తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఉండటానికి ఆయన ఈ ఏర్పాటు చేశాడన్నమాట! సృష్టికర్త తనకు సంబంధించి చేయించుకున్న స్వీయ పరిచయమే (Self-Introduction) సరైన, సంపూర్ణమైన, నమ్మదగిన పరిచయమై ఉంటుంది.

మానవ మనుగడకు సృష్టికర్త సంపూర్ణ పరిచయం ఎంతో అవసరం. ఈ పరిచయం జరిగినప్పుడే నిజ భావంలో మనిషికి సృష్టికర్తతో స్ఫూర్తిదాయక మైన సంబంధం ఏర్పడుతుంది.

సృష్టికర్త వైపు నుండి సందేశం రాగానే సృష్టికర్త భావన (దైవభావన)పై

నమ్మకపు ముద్రపడిపోతుంది. ఇప్పుడు భావన భావనగా మిగిలి ఉండదు. అదొక యదార్ధమైపోతుంది. కేవలం భావనవల్ల నమ్మకం కుదరదు. అది ఆచరణాశక్తి నివ్వదు. నమ్మకం మాత్రమే ఆచరణా శక్తిని ప్రసాదిస్తుంది – ఏకాంతంలోనూ, సమూహంలోనూ, కష్టాల్లోనూ, సుఖాలలోనూ, కలిమిలోనూ, లేమిలోను నమ్మకమే టానిక్కు. అందుకే కేవలం భావనతో సంతృప్తి చెంది కూర్చుండిపోకూడదు; సృష్టికర్త తరఫు నుండి ఏర్పాటైవున్న సన్మార్గాన్ని శోధించాలి. అప్పుడే ప్రాథమిక భావన లక్ష్యం సిద్ధిస్తుంది. మార్గదర్శనం ప్రాప్తమైనప్పుడే భావన కాస్తా యదార్ధంగా రూపొందుతుంది.

ఇప్పుడు విశ్వ సృష్టికర్త చేసుకున్న స్వయం పరిచయాన్ని (Self-Introduction) అన్వేషించాలి. ఏ ఏ మార్గాల ద్వారా ఈ 'పరిచయం' లభించిందో, వాటి ప్రామాణికత (Authenticity) ఏమిటో కూడా శోధించి సంతృప్తినొందాలి. (ఇంతకు ముందు మేము సమర్పించిన **'మనిషీ! నీ సృష్టికర్తను తెలుసుకో'** అనే పుస్తకంలో కూడా "నిజ ఆరాధ్య దైవం వాస్తవిక దృక్పథం" అనే Chapter లో ఈ అంశంపై కూలంకషంగా చర్చించి ఉన్నాము).

సృష్టికర్త పరిచయం కానివ్వండి, లేదా ఆయన సందేశంగానివ్వండి ... ఆ అన్వేషణ, మరి దానిపై తృప్తి, ఇంకా సమాచార సాధనాల (Means of Information or Message) పై సంతృప్తి అనేది సవాళ్ళతో కూడిన వ్యవహారం (Challenging Task). అదొక లక్ష్యఛేదనా యాత్ర (Expedition) వంటిది. ఈ యాత్రను విజయవంతంగా నెరవేర్చే ప్రయత్నమే ఈ పుస్తకం.

నిజ ఆరాధ్య దైవం అన్వేషణలో ఉన్నవారి కొరకు ఈ పుస్తకం వ్రాయబడింది. అందుకే సంకుచిత భావానికి, దురభిమానానికి తావీయకుండా సత్యం వైపునకు దృష్టిని మరల్చుతూ ఈ కృతిని రూపొందించటం జరిగింది. ఎందుకంటే సంకుచిత భావాలు, దురభిమానాలు సత్యాన్ని వినటంలో, సత్యాన్ని కనడంలో, సత్యంపై చింతన చేయడంలో సదా అడ్డంకిగా నిలిచాయి.

చిత్తశుద్ధితో పరిశోధనకు ఉపక్రమించే వారికి ఒక మనవి – వారు ప్రామాణిక గ్రంథాలను మాత్రమే అధ్యయనం చేయాలి. దైవప్రవక్తనని ప్రకటించుకున్న వాని జీవిత చరిత్రను, అతని ప్రత్యక్ష సహచరుల వృత్తాంతాలను కూడా నిశిత దృష్టితో తరచి చూడాలి. తద్వారానే ఈ లక్ష్యం సిద్ధిస్తుంది. కాబట్టి ఈ పవిత్ర కార్యానికి పూనుకున్నవారు ఎల్లప్పుడూ ప్రమాణబద్ధమైన

మార్గాల ద్వారానే 'జీవిత చరిత్ర' (Biography)ని పొందాలి. అప్పుడే దురభిమానానికి అతీతమైన విషయం ప్రాప్తమవుతుంది. ఈ సందర్భంగా వారు ప్రాచ్య నిపుణుల (Orientalists) పుస్తకాలను చదివి మోసపోకూడదు.

ప్రామాణికమైన పుస్తకాలు చరిత్ర పట్ల ఆసక్తి ఉన్న చరిత్రకారులు మాత్రమే వ్రాస్తారు. వారు ఎలాంటి మార్పుల (Manipulation)కి, దురభిమానపు మనస్తత్వాని (Prejudice Mind)కి తావీయకుండా తమ పనిని చేసుకుపోతారు. అలాగాకుండా ముందుగా ఏర్పరచుకున్న భావాలకు కట్టుబడి పుస్తకం రాసేవాడు వాస్తవాలను మరుగుపరుస్తాడు లేదా యదార్థాలను మార్చేస్తాడు.

ఈ పుస్తకంలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. మొదటి రెండు అధ్యాయాల (Chapters) లో ప్రవక్తనని ప్రకటించుకున్న వాని 'దావా'ను బౌద్ధికంగా విశ్లేషించే ప్రయత్నం జరిగింది. దీనిద్వారా ముందుకు వచ్చే ముఖ్యాంశం – దైవ సందేశహరుడు ముహమ్మద్ (సఅసం) ద్వారా అందజేయబడిన ఖుర్‌ఆన్ గ్రంథం విశ్వప్రభువు ప్రసాదించిన గ్రంథం. అందుచేత అది సత్యబద్ధమైనది, పరిశుద్ధమైనది, కడు ప్రామాణికమైనది.

ఖుర్‌ఆన్ స్వయంగా తన గురించి పరిచయం చేసుకుంటుంది. తనను మోసుకువచ్చిన వానిని గురించి కూడా అది క్షుణ్ణంగా పరిచయం చేస్తుంది. తనను ఇచ్చి పంపిన వానిని గురించి కూడా చెబుతుంది. తరువాత అది మానవ జీవిత లక్ష్యం నెరవేరే మార్గం ఏదో కూడా విడమరచి చెబుతుంది – అంటే అందరికీ న్యాయం జరిగే తీర్పుదినం ఒకటి ఉంటుంది. అందరూ ఒకచోట సమీకరించబడతారు. అక్కడ చేసుకున్న వారికి చేసుకున్నంత – న్యాయంగా – ఇవ్వబడుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. శిక్షా బహుమానాల పూర్తి ఏర్పాట్లుంటాయి.

ఇందులో ప్రతి టాపిక్ (Topic) కొరకు వేర్వేరు అధ్యాయాలు (Chapters) ఏర్పరచాము. ఇందలి వాస్తవాలపై గంభీరంగా ఆలోచించగలందులకు 'ఉపదేశం', 'హెచ్చరిక' అనే రెండు అధ్యాయాలను కూడా పొందుపరచాము.

**– డా॥ ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

M.B.B.S., D.Ch.

**మొదటి అధ్యాయం :**

**(Chapter - I)**

# సృష్టికర్త మానవాళి వరకూ తన సందేశాన్ని చేరవేసే విధానం ఏమి కాగలదు? (ఒక చూపులో)

- గతాన్ని ఓ సారి నెమరువేసుకోండి
- సృష్టికర్త సందేశాన్ని మానవాళి వరకూ చేర్చడమెలా?
- సందేశాన్ని అందజేసే మార్గాలు, వాటి ప్రామాణికతకు సంబంధించిన శోధన
- దావా చేసేవాడు తనేమిటో నిరూపించుకోవడం
- శ్రోతల పరిశోధన
- పరిశోధన ఆవశ్యకత, ప్రాముఖ్యత
- పరిశోధనకు కావలసిన ముఖ్యాంశాలు
- ఇవే ఆ ముఖ్యాంశాలు
- దావా చేసినవాడు సత్యవంతుడా? అబద్ధీకుడా? అనేది తెలుసుకోవడమెలా?
- నిస్వార్థ కృషి
- ఐడియాలజీ (Ideology)

# సృష్టికర్త మానవాళి వరకూ తన సందేశాన్ని చేరవేసే విధానం ఏమి కాగలదు? (ఒక చూపులో)

## గత చర్చల సారాంశం

'మనిషీ, నీ సృష్టికర్తను తెలుసుకో' అనే వెనుకటి పుస్తకంలో విశ్వ సృష్టికర్త గురించీ, ఆయన నిజ ఆరాధ్య దైవం అయ్యే విషయం గురించీ బౌద్ధికమైన ఆధారాల వెలుగులో తెలుసుకున్నాం. ఆ విషయాన్ని ఇక్కడ సంక్షిప్తంగా ప్రస్తావించుకుందాం.

ఏ వస్తువు అయినాసరే నిర్మించనంత వరకూ దాని నిర్మాణం అవదు. ప్రతి దానికీ ఒక నిర్మాత తప్పక ఉంటాడు. అయితే ఆయన కనిపించడు. మార్కెట్లకు వెళ్ళినప్పుడు దుకాణాలలో ఎన్నో వస్తువులు కనిపిస్తాయి. మరెన్నో మెషీన్లు, పరికరాలు ప్రదర్శించబడతాయి. కాని వాటి నిర్మాత కూడా వాటితో పాటు అక్కడ నిలబడి ఉండడు. మరైతే ఆ పరికరాలు వాటంతట అవే నిర్మితమయ్యాయా? లేక వాటిని నిర్మించిన వాడున్నాడా? అన్న దానిని గురించి మనం ఆలోచించం.

మరొక విషయం ఏమిటంటే; ఏ వస్తువు అయినాసరే దాని ఆరంభం (Starting Point) ఒకానొక సజీవి ద్వారానే జరుగుతుంది. ప్రాణం లేని వానివల్ల జరగదు. ఒక సజీవి మాత్రమే జీవం లేనిదానికి జీవం పోయగలడు. ఉదాహరణకు : యంత్రం లాంటి ఒక నిర్జీవమైన వస్తువు ఉనికిలోకి రావడానికి మానవుడు వంటి సజీవి కారకుడవుతాడు. ఈ జగతి ఉనికి కూడా అంతే.

అది ఒక మహా మేధావి, మహా వివేకి జీవనం మూలంగా ఉనికిలోకి వచ్చింది. యంత్రం ఉండేది కాదు గాని మనిషి అనేవాడుండేవాడు. అతను యంత్రానికి ఉనికినిచ్చాడు. అలాగే ఈ జగతి ఉండేది కాదు గాని సృష్టికర్త ఉండేవాడు. ఆయన ఈ సృష్టికి శ్రీకారం చుట్టాడు.

సృష్టికర్త అనేవాడు సమస్త బలహీనతలకు, పరిమితుల (Limitations) కు అతీతుడు, పవిత్రుడై ఉండాలన్న విషయం గురించి కూడా లోగడ మనం చర్చించుకున్నాం. ఆయన సమస్త సద్గుణాల సంచయనంగా ఉండాలనీ, ఆయన ఎవరిపైనా ఆధారపడి ఉండకూడదనీ, ఆయన పరిపూర్ణత ఎన్నటికీ తరిగి పోకూడదనీ, ఆయనకు నిద్రగానీ, అంతంగానీ ఉండకూడదని కూడా చెప్పుకున్నాం. నిద్ర, మరణం లాంటిది అశక్తతకు, నిస్సహాయతకు నిదర్శనం.

ఆయనకు భార్యాపిల్లల, సహాయకుల అవసరం కూడా ఉండకూడదు. ఈ బలహీనత ఆధారభూతాని (Dependance) కి ఆనవాలు. కాబట్టి ఆ సృష్టికర్త ఒకే ఒక్కడై ఉండాలి. స్వయం ప్రతిపత్తి కలవాడై ఉండాలి. నిరపేక్షాపరుడై ఉండాలి. అందుకే ఆయన కార్యక్రమాలలో, ఏర్పాట్లలో ఎవరూ జోక్యం చేసుకోలేరు. ఒక రాజ్యానికి లేదా వ్యవస్థకు ఒకే రాజ్యాధిపతి లేక అధ్యక్షుడు ఉన్నట్లే సమస్త జగతికి ఆయన ఒక్కడే సృష్టికర్త, పాలకుడు, ప్రభువు.

పైన పేర్కొనబడిన ఉపమానాన్ని దృష్టియందుంచుకుని ఆలోచించి నప్పుడు తెలిసేదేమంటే; జగతిని, మనిషిని పుట్టించినవాడే వాటి పోషకుడు కూడా. ఆయనే యజమాని. కాబట్టి ఆయనే ప్రభువు కాగలడు. సార్వభౌముడు అయ్యే హక్కు కూడా ఆయనకే ఉంది. కాబట్టి మనిషనే వాడు తన సృష్టికర్తకు కృతజ్ఞుడై ఉండాలి. ఆయన్ని స్తుతించాలి. తన స్వామి సన్నిధిలో వినమ్రుడై నిలబడటం, ఆయన ముందు వంగటం, సాష్టాంగపడటం అతని విధ్యుక్త ధర్మం. ఇంకా అతను తన ప్రభువునే అర్థించాలి, ఆయన్నే నమ్ముకోవాలి. ఆయనపైనే ఆశలు పెట్టుకోవాలి. ఆయన్నే ప్రేమించాలి. తన యజమాని ఆజ్ఞలనే శిరసావహించాలి. ఆయన విధేయతకు కట్టుబడి ఉండాలి. మనిషి చేసే ఈ పనులన్నీ 'ఆరాధన'గానే పరిగణించబడతాయి. ఎవరి సమక్షంలో ఈ విధులు నిర్వర్తించబడతాయో, ఆయన ఆరాధ్యుడు అనబడతాడు. ఆ ఆరాధ్యుడు ఎవడో కాడు, సృష్టికర్తే. దీనినిబట్టి విదితమయ్యేదేమిటంటే, మానవులను సృష్టించినవాడే మానవుల నిజ ఆరాధ్య దైవం కాగలడు. మరి సృష్టికర్త ఒక్కడే కాబట్టి నిజ ఆరాధ్య దైవం కూడా ఒక్కడే కాగలడు. ఈ

వాస్తవాన్ని మేము ఇంతకు ముందు పుస్తకంలో విపులంగా చర్చించాము. అదొక హేతుబద్ధమైన మౌలికాంశం (Logical Derivation).

సృష్టికర్త అనేవాడు అత్యుత్తమ సుగుణాలు కలవాడని కూడా మనం చర్చించుకున్నాం. అటువంటి సుగుణాలే కచ్చితంగా ఆరాధ్య దైవంలో కూడా ఉండాలి. వాటిలో కొన్నింటిని ఇక్కడ మరోసారి పునశ్చరణ నిమిత్తం పొందుపరుస్తున్నాము –

## మనం నిజ ఆరాధ్య దైవంగా కొలిచే వానిలో ఉండవలసిన గుణాలు:

- మనకు జీవితాన్ని వొసగినవాడే ఆరాధ్య దైవం కావాలి – మనం లేము, కాని ఆయన మనకు ఉనికిని ప్రసాదించాడు. కాబట్టి మన సాష్టాంగ ప్రణామానికి హక్కుదారుడు ఆ మహోపకారి మాత్రమే కాగలడు.
- సిసలయిన, తొలి జీవితం, నిజ జీవితం సృష్టికర్తదే. కనుక సృష్టికర్తే ఆరాధ్యుడు. కాబట్టి జీవన్మరణాలు ఆ నిజ ఆరాధ్య దైవం హస్తగతమై ఉన్నాయి. అందుకే ఆయనే ఆరాధనకు, దాస్యానికి అర్హుడు.
- ఒకరు ఇచ్చిన జీవన దానంపై జీవించి ఉన్నవాడు ఆరాధ్య దైవం ఎలా అవుతాడు? స్వయంగా – తనంతట తానుగా – జీవించి ఉన్నవాడే ఆరాధ్య దైవం కాగలడు. అంటే ఆయన జీవితం అనంతం (Infinite) అయి ఉండాలి. అంటే ఏమీ లేనపుడు కూడా ఆయన ఉన్నాడు. ఏమీ లేకుండా పోయినప్పుడు కూడా ఆయన ఉంటాడు.
- ఆరాధ్య దేవుని అతి ముఖ్యమైన గుణం ఏమిటంటే ఆయనకు మరణమన్నదే ఉండకూడదు. ఆయన నిత్య సజీవుడై ఉండాలి.
- ఆయన సదా వెలుగొందుతూ ఉండాలి. తన తేజోవిలాసాలతో వర్ధిల్లుతూ ఉండాలి. అప్పుడే మానవ జీవితాలు పూర్తి విశ్వాసంతో, ధీమాతో జీవన ప్రదాత వైపునకు మరలుతాయి.
- సదా శాశ్వతంగా, సురక్షితంగా ఉండేవాడే ఆరాధ్య దైవం అవుతాడు. అంటే ఎప్పుడూ ఆయన అస్వస్థతకు లోను కాకూడదు. కష్టాలు కడగండ్లపాలై అశక్తతకు గురికాకూడదు. ఆయన పరిపూర్ణత ఎన్నటికీ అరిగిపోరాదు, కరిగిపోరాదు.

- తాను స్వయంగా కష్టాల పాలయ్యేవాడు ఇతరులను కష్టాల నుండి ఎలా గట్టెక్కించగలుగుతాడు?
- అలసటను, అలసత్వాన్ని, ప్రమత్తతను, పరధ్యానాన్ని దరి చేరనివ్వనివాడే ఆరాధ్య దైవం కాగలడు. అంటే ఆయనకు నిద్రగానీ, కునుకుగానీ పట్టకూడదు. విశ్రాంతి తీసుకోవలసిన అగత్యం ఆయనకు ఏర్పడకూడదు.
- ప్రతి దాన్నీ ఎరిగినవాడు, ప్రతి కాలం గురించి, ప్రతి ప్రదేశం గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు, సమస్తాన్నీ తన జ్ఞానపరిధిలో చేర్చుకున్నవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.
- భూమ్యాకాశాలన్నింటిపై అదుపు అజమాయిషీ పూర్తిగా కలిగి ఉన్నవాడే ఆరాధ్య దైవం అవుతాడు. జగతిలోని ఏ ఒక్క అంగుళం కూడా ఆయన సార్వభౌమత్వ పరిధికి ఆవల ఉండకూడదు.
- సువిశాలమైన ఈ విశ్వ వ్యవస్థలో సమస్త ఏర్పాట్లు చేయటం, వేనవేల ఏండ్లుగా ఎలాంటి అవరోధం లేకుండా ప్రాణులకు కావలసినవన్నీ సమకూర్చటం, ఒక్క క్షణం కూడా సృష్టితాలు ఆయన అదుపాజ్ఞల నుండి బయటికి పోకుండా నియంత్రించటం – ఇన్ని ఘనకార్యాలు చేసేవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- బలహీనతలు, లోపాలు, దోషాలకు అతీతుడైనవాడు, సకల సుగుణాలు నిండుగా ఉన్నవాడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు.
- పరమ పవిత్రుడు, పరిశుద్ధుడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు. ఏ విషయంలోనయినా చెడుకు ఊహామాత్రంగా కూడా ఆస్కారం లేనివాడు ......
- ఆరాధ్య దైవం సదా నిరపేక్షాపరుడై ఉంటాడు.
- ఆరాధ్య దైవం అనేవాడు ప్రతిదానిపై తిరుగులేని అధికారం కలిగి ఉండాలి. ఆయన ఎవరికయినా ఏదయినా ఇవ్వదలిస్తే ఎలాంటి అడ్డు ఉండకూడదు.
- జీవితాన్ని, జీవనావసరాలను శూన్యం నుండి వెలికితీయగలవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- జీవన్మరణాలు హస్తగతమై ఉన్నవాడే ఆరాధ్య దైవం.
- జగతిలోనూ – జగతిలోని వస్తువులలోనూ సానుకూలతను, సారూప్యాన్ని

పొందుపరచి, వాటి మనుగడకు అపురూపమయిన ఏర్పాటు చేయగలవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.

- ❖ ఆరాధ్య దైవం ఎవడంటే, ఆయన ఇచ్చిన తీర్పును సవాలుచేసే ధైర్యం ఎవరికీ ఉండకూడదు. ఆయన నిర్ణయాన్ని అమలుకాకుండా అడ్డుకునే సాహసం కూడా ఎవరూ చేయకూడదు. తాను గైకొన్న చర్యలకు గాను ఆయనకు ఎవరికీ జవాబు ఇచ్చుకోవలసిన పరిస్థితి రాకూడదు. ఆయన అందరికన్నా ఉన్నతుడు, సర్వాధికారి అయి ఉండాలి.
- ❖ తన జీవన వ్యవధికి, జీవన శక్తికి ఎలాంటి పరిమితి లేనివాడే ఆరాధ్య దైవం కాగలడు.
- ❖ ఆరాధ్య దైవం అనేవాడు కనుమరుగై ఉండాలి. అగోచరుడై ఉండాలి. మనం ప్రతిచోటా, ప్రతి క్షణం ఆయన గుణగణాల ఆధారంగా ఆయన్ని ఊహించుకుని, మనకు అత్యంత చేరువలో ఉన్నాడని తలపోయాలి. ప్రతిచోటా, ప్రతి సమయం ఆయన మనల్ని చూస్తున్నాడు, మనం చెప్పేది వింటున్నాడు. ఆయన ఎక్కడయినాసరే, ఏదయినాసరే చేయగల సమర్థుడు. కనుక మనం కూడా ఆయన్ని అత్యంత సమీపంలో ఉన్నవానిగా, ప్రేమించేవానిగా, దయజూపేవానిగా, క్షమాభిక్ష పెట్టేవానిగా ఎందుకు ఊహించకూడదు? ఈ సుగుణాలన్నీ ఆ లక్షణాలలో నిక్షిప్తమై ఉన్నాయి.
- ❖ సృష్టికర్తే ఆరాధ్యుడు కాగలడు. సృష్టికర్త ఒకే ఒక్కడు, అద్వితీయుడు. కాబట్టి ఆరాధ్య దైవం కూడా ఒక్కడే అయి ఉండాలి.
- ❖ ఆరాధ్య దైవం అనేవానికి కుటుంబం, కుటుంబ బాదరబందీలు ఉండ కూడదు. కుటుంబం ఉంది అంటే ఆయనకూ అవసరాలు ఉంటాయి. సమస్యలుంటాయి. కోర్కెలుంటాయి. ఇవి అతని బలహీనతలుగా పరిణమిస్తాయి. బలహీనుడైన వానిని ఆరాధ్య దైవంగా చేసుకోకూడదు.
- ❖ నిజ ఆరాధ్య దైవం ఎవడంటే ఒకరు ఆయన్ని నమ్మినా నమ్మకపోయినా, విధేయత చూపినా, చూపకపోయినా, ఆయన సమక్షంలో మోకరిల్లినా మోకరిల్లకపోయినా ఆయన ఔన్నత్యంలో ఎలాంటి తేడా రాదు, రాకూడదు.
- ❖ ఆరాధ్య దైవం అనేవాడు ఒకరి ద్వారా చేయబడినవాడు, పుట్టించ బడినవాడు అయి ఉండకూడదు. ఆయన్ని పోలినవాడు ఎవడూ

ఉండకూడదు. ఆయనకు సమఉజ్జీ కూడా ఉండకూడదు. అన్ని బలహీనతలకు, లోపాలకు, పరిమితుల (Limitations) కు అతీతుడు, పవిత్రుడైనవాడే నిజ ఆరాధ్య దేవుడు.

పుట్టడం / పుట్టించబడటం ఒక బలహీనత

మరణం అశక్తతకు, నిస్సహాయ స్థితికి తార్కాణం.

❖ ఎవరిముందూ సంజాయిషీ ఇచ్చుకోవలసిన స్థితి రాకుండా ఉండనివాడే ఆరాధ్య దైవం అవుతాడు. ఏదో ఒక బలహీనత ఉన్నవానికే సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. బలహీనత ఉన్నవాడే తప్పు చేస్తాడు, తన వద్ద ఉన్న శక్తిని, అధికారాలను దుర్వినియోగం చేస్తాడు. జులుం చేస్తాడు, ఒకరి హక్కును హరిస్తాడు. ఒకరికి అన్యాయం చేస్తాడు. కాగా; నిజ ఆరాధ్య దైవం ఇలాంటి దోషాలన్నింటికీ అతీతుడై, సర్వోన్నత సార్వభౌముడై ఉండాలి.

❖ నిజ ఆరాధ్య దైవానికి పరిపాలనా దక్షత కూడా ఉండాలి. ఆదేశించే గుణం ఉండాలి. జగతిలోని ప్రతిదీ ఆయన ఆదేశాలకు లోబడి ఉండాలి.

❖ ఆరాధ్య దైవానికి ఉండవలసిన మరో విశిష్ఠ లక్షణం ఏమిటంటే ఆయన శరణుపొందిన వ్యక్తికి పూర్తిగా అభయం లభించాలి. ఆ వ్యక్తి నిశ్చింతగా, ప్రశాంతంగా ఉండగలిగే స్థితి ఏర్పడాలి. ఇది ప్రతి మనిషిలోని సహజ వాంఛ.

❖ తన దాసుని మొరను ఆలకించి, సమాధానం ఇచ్చేవాడే, అతనికి సహాయపడేవాడే, అతనికి మార్గదర్శనం చేసేవాడే, అతన్ని గండం నుంచి గట్టెక్కించేవాడే నిజ ఆరాధ్య దైవం. ఇలాంటి అస్థిత్వమే ఆరాధనలకు, కృతజ్ఞతలకు, స్తోత్రాలకు, సాష్టాంగ ప్రణామాలకు యోగ్యమైనది.

❖ ఆరాధ్య దైవం అనేవానికి మానవ వ్యవహారాల పట్ల శ్రద్ధాసక్తులు ఉండాలి. మానవుని దైనందిన జీవిత సమస్యల పట్ల ఆయన నిర్లక్ష్యం వహించకూడదు. ఆయన అతని సమస్యల పట్ల శ్రద్ధ వహించినప్పుడే అతని మనసు ఆరాధనకు సుముఖంగా ఉంటుంది. ఆరాధ్య దైవమే చొరవచూపకుండా నిర్లిప్తంగా ఉండిపోతే ఇంక మనిషికి మాత్రం దైవదాస్యం పట్ల శ్రద్ధ ఎక్కడుంటుంది?

- మానవుని దైనందిన జీవితావసరాలన్నింటినీ ఉత్తమ రీతిలో ఏర్పాటు చేసేవాడే నిజ ఆరాధ్య దైవం కాగలుగుతాడు. ఒకవేళ అతను ఇవేమీ చేయలేని పక్షంలో దాసుల పూజాపునస్కారాలను అందుకునే అర్హత ఆయనలో లేదన్నమాటే. ఇలాంటి వానిని ఆరాధ్యదైవంగా నమ్మటం వల్ల ప్రయోజనమేమీ ఉండదు.
- దైనందిన జీవితంలో మనిషితో ఆరాధ్య దైవానికి గల సంబంధం అత్యంత దగ్గరి సంబంధం అయి ఉండాలి. ఆయన నిత్యం తనతో ఉంటాడన్న అనుభూతి మనిషికి కలగాలి. ఈ సామీప్య భావన మానవ జీవితంపై మంచి ప్రభావం చూపుతుంది. అతని జీవితపు అన్ని విభాగాలలో గొప్ప నైతిక విప్లవం వస్తుంది. జీవన వ్యవహారాలలో మనిషిలో ఒక నిలకడ, నెమ్మది ప్రాప్తిస్తుంది. అతని జీవితం సదా సరైన రీతిలో, పూర్తిస్థాయి గమనం (Dynamic) తో ముందుకు దూసుకుపోతుంది.
- తన దాసుని పశ్చాత్తాపాన్ని దయతో స్వీకరించి, అతన్ని క్షమించి, ఔదార్యం ప్రదర్శించేవాడే ఆరాధ్య దైవం కాగలడు. ఎందుకంటే, ఈ ఔదార్యం వల్ల నిన్నటి వరకూ అవిధేయుడుగా ఉండి బ్రతుకును దుర్భరం చేసుకున్న వానికి ఊరట లభిస్తుంది. అతను భవిష్యత్తులో చిత్తశుద్ధితో తన ఆరాధ్య దైవం వైపునకు మరలే అవకాశముంటుంది.
- మానవులందరినీ సమభావంతో చూసేవాడు, అందరినీ ప్రేమించేవాడు, వారి మధ్యన ఎలాంటి విచక్షణ చూపనివాడే నిజ ఆరాధ్య దైవం అనదగినవాడు. జన్మతః ఆయన ఎవరినీ ప్రియతమునిగా పరిగణించ కూడదు. ఆరాధన విషయంలో ఆయన ఒకరి మధ్యవర్తిత్వాన్ని (వాస్తాను) ఇష్టపడకూడదు. అందరికీ ప్రత్యక్షంగా తనతో ఊసులాడే అవకాశం కల్పించాలి. ఆ పద్ధతి ఏదో విశదపరచాలి.
- తీర్పుదినాన – సదాచరణల ఆధారంగా – ఒకరి సిఫారసు అవసరం కూడా ఏర్పడకుండా – న్యాయం చేయగలవాడే నిజ ఆరాధ్య దైవం.
- న్యాయాన్ని రక్షించి, దానిని స్థాపించి శిక్షాబహుమానాలను వొసగేవాడే నిజ ఆరాధ్యదైవం కాగలడు.
- ప్రతి ప్రాణినీ పుట్టించిన మీదట, దాని ఉనికి పరమార్థాన్ని నెరవేర్చుకునేం దుకు మార్గనిర్దేశన చేసేవాడే నిజ ఆరాధ్య దైవం కాగలగాలి. అంటే

దాని జీవిత లక్ష్యం ఏమిటో దాని స్వభావంలోనే పొందుపరచాలి. ఆ లక్ష్యాన్ని ఎలా ఛేదించాలో దానికి ఎరుకపరచాలి. ఈ విధంగా ఆయన మానవునికి కూడా మార్గబోధన చేయాలి.

- జీవిత గమనం కోసం నిర్దేశిక నియమాలను ప్రసాదించి, అత్యుత్తమ ప్రబోధనల ద్వారా మానవాళికి సుఖశాంతుల జీవనం ఇవ్వగలవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు. ఆ ప్రబోధనలను మానవులందరి వరకు చేర్చే ఏర్పాటు కూడా ఆయన చేయాలి.
- సజీవిగా లేనివాడు, జీవితానికి మూల సరోవరం కానివాడు ఆరాధ్య దైవం కాజాలడు.
- చచ్చేవాడు, చంపబడేవాడు, తన జీవితానికి రక్షణ కల్పించుకోలేని వాడు ఆరాధ్య దైవం కాలేడు.
- అందరికన్నా గొప్పవాడు, అందరిపైనా ఔన్నత్యం (Supreme) కలవాడే నిజ ఆరాధ్య దైవం.
- దోషాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడైనవాడే నిజ ఆరాధ్య దైవం.
- సమస్త స్తుతి స్తోత్రాలకు, ప్రశంసలకు అర్హుడైనవాడే ఆరాధ్యుడు.
- నిరర్థకమయిన, అర్థరహితమయిన పని ఏదీ చేయనివాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు.
- ప్రతి దానిని గురించి పూర్తిగా ఎరిగి ఉన్నవాడే నిజ ఆరాధ్యదైవం కాగలడు. సమాచారం లేనివాడు ఆరాధ్య దైవం ఎట్లా అవుతాడు?
- జీవితపు సకల బలహీనతలు, అక్కరలు, అశక్తతలకు అతీతుడైనవాడే నిజ ఆరాధ్య దైవం.
- జగతిలోని సమస్త ప్రాణికోటికి కావలసిన వాటిని సమకూర్చడంలో ఎలాంటి ప్రతిబంధకాన్ని ఎదుర్కోకుండా – తిరుగులేని విధంగా – పాలన చేసేవాడే నిజ ఆరాధ్య దైవం.
- నిజ ఆరాధ్య దైవం అయినవాని అధికారం ఎలా అప్రతిహతంగా ఉండాలంటే, ఆయన జారీ చేసిన ఒక్కగానొక్క ఆజ్ఞ కార్యనిర్వహణకు సరిపోవాలి. అంటే ఏదేని ఒక పని చేయడానికి ఆయన ప్రయాసపడ వలసిన అగత్యం ఉండకూడదు. దేనిగురించి అయినా సంకల్పించుకుని 'అయిపో' అనంటే చాలు, అది అయిపోవాలంతే.

- ఆరాధ్య దైవం అయినవాడు ఎల్లప్పుడూ, ప్రతి పనిలో, సర్వవిధాలా సర్వస్వతంత్రుడై ఉండాలి. అలాగాకుండా ఒకరిపై ఆధారపడటం కూడా ఒక బలహీనతే. బలహీనుడైనవాడు ఆరాధ్యదైవం కాజాలడు. బలహీనత లున్నవాణ్ణి ఆరాధించటమంటే మనల్ని మనం కించపరచుకోవటమే.
- ఆరాధ్య దైవం సకల లోపాలకు అతీతుడు, సకల సుగుణాలకు నిలయమైనవాడై ఉండాలి. సృష్టించేవాడు అత్యంత శక్తిమంతుడు, వివేకవంతుడు, జ్ఞాన సంపన్నుడు, సర్వ స్వతంత్రుడు, స్వయం నిర్ణయాధికారి, స్వయం మార్గదర్శకుడు (Self Guided) అయి ఉంటాడు. సృష్టించేవాడే ఆరాధ్య దైవం అవుతాడు.
- భూమ్యాకాశాల ఆరాధ్య దైవమే మన ఆరాధ్య దైవం కూడా.
- నిజ ఆరాధ్య దైవం ఎదుట అందరూ అశక్తులే. ఆయనే సర్వోన్నతుడు (Dominant)
- భూమ్యాకాశాలలో ఉన్న వాటన్నింటిపై పూర్తి అదుపు అజమాయిషీ కలవాడే ఆరాధ్య దైవం కాగలడు.
- ఏ అధికారమూ లేనివానికి ఆరాధ్య దైవం అయ్యే అర్హత లేదు.
- జగతి మరియు జగతిలోని సమస్త జీవరాశుల మనుగడకు కావలసిన వాటన్నింటినీ సమకూర్చేవాడే ఆరాధ్య దైవం అవుతాడు.

**ఆరాధ్యుడు, స్తవనీయుడు ఎవడంటే .....**

- సృష్టించేవాడు, సృష్టించబడనివాడు.
- అన్ని లోపాలకు, దోషాలకు అతీతుడు, పవిత్రుడు.
- అత్యంత బలశాలి; బలహీనత లేనివాడు.
- ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా స్వయంగా నిలదొక్కు కున్నవాడు.
- అనశ్వరుడు, శాశ్వతంగా ఉండేవాడు.
- అక్కరలు తీర్చేవాడు. ఏ అక్కరా లేనివాడు.
- సూక్ష్మద్రష్ట, ప్రతిదీ చూసేవాడు, ప్రతిదీ వినేవాడు.
- పరమ పవిత్రుడు.

ఇలాంటివాడు మాత్రమే పూజనీయుడు. ఇటువంటి గొప్ప శక్తిమంతుని ఎదుట మోకరిల్లటమే సరైనది. ఇందులోనే మానవ గౌరవం

ఇమిడి ఉంది. లోపమున్నవాడు పవిత్రుడు కాజాలడు. అలాంటి వానికి సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేసి మనిషి తనను తాను కించపరచుకుంటాడు.

ఈ చర్చ సారాంశం ఏమిటంటే, చింతన ద్వారా, హేతుబద్ధమైన ఆధారాల ద్వారా సృష్టికర్త అనేవాడొకడున్నాడన్న భావన మనకు లభించింది. ఆయన ఒక్కడేనని, అత్యంత ముఖ్యమైన సుగుణాలు ఆయనలో ఉన్నాయనే విషయం కూడా తెలిసివచ్చింది. ఆయనే ఈ సృష్టిక కర్త అనీ, నిజ ఆరాధ్యదైవం అని కూడా బోధపడింది. సహేతుకమయిన ఆధారాల ద్వారా మనకు లభ్యమైన ఈ భావనపై మనకు గట్టి నమ్మకం ఏర్పడాలి. నమ్మకంతోనే మనసు కుదుటపడుతుంది. సంతృప్తి ప్రాప్తమవుతుంది. కనుకనే నిజ ఆరాధ్య దైవం యొక్క భావనను సరైన, సంపూర్ణమైన పద్ధతి ద్వారా పరిగ్రహించాలి. ఇది జీవితం యొక్క అత్యంత ముఖ్యమైన అవసరం. ఈ అవసరం తీరినప్పుడే గుండె నిండా నెమ్మది నిండుతుంది. మానసికంగా సుఖశాంతులు సంప్రాప్తమవు తాయి. ఇట్టి పరిస్థితిలోనే దేవునితో సంబంధం పటిష్టమవుతుంది. కేవలం దైవ భావన ఉంటే సరిపోదు. దానికి ఆచరణ కూడా తోడవ్వాలి.

మనకు నమ్మకం కుదరడానికి సృష్టికర్త తరఫున ఆయన పరిచయం చాలా అవసరం. ఇక ఈ లోకంలో మన ఉనికి లక్ష్యం ఏమిటి? జగతిలో మనకు గల స్థానం ఏమిటి? ఈ లోకంలో నివసించే ఇతర జీవరాసులతోనూ, తోటి మనుషులతోనూ మన సంబంధం ఎలాంటిదై ఉండాలి? మన కొరకు ఉచితమైనదేది? అనుచితమైనదేది? మన లాభనష్టాలు ఎందులో ఉన్నాయి? అన్న సందేశం కూడా ఆ సృష్టికర్త తరఫు నుండి మనకు చేరాలి.

సృష్టికర్త యెడల మనలో గల ఈ దృక్పథం కేవలం 'దృక్పథం' కాకుండా అదొక 'వాస్తవం' అయినట్లయితే, ఆయన తప్పకుండా మన జీవితావసరాలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని ప్రసాదించి ఉంటాడు. ఒకవేళ ఆ ఏర్పాటు గనక జరిగి ఉండకపోతే, సృష్టికర్త పట్ల మన భావన కేవలం 'భావన' తప్ప మరేమీ కాదు. దానికొక వాస్తవికత అన్నదే లేదు. అలాంటి భావనను మనో మస్తిష్కాలలో ఏర్పరచుకుని ఉన్నంతమాత్రాన ప్రయోజనమేమీ లేదు. అందుకే – మన ఈ అవసరం తీరాలంటే ఈ సందేశాన్ని శోధించి సాధించాలి.

సృష్టికర్త అనే వాడొకడుంటే, ఆయన ఈ అవసరాన్ని ఎలా తీర్చాడో, ఏ విధంగా తన పరిచయం చేసుకున్నాడో, ఏ విధంగా తన సందేశాన్ని

చేరవేశాడో, దీనికొరకు ఏ విధానాన్ని (Methodology) అవలంబించాడో చూద్దాం. ఆ విధానం (Methodology) అవశ్యంగా సహజమైనదై ఉండాలి; క్రియాత్మకమైనదై ఉండాలి. అది ప్రామాణికమైనదనడంలో సందేహానికి తావుండకూడదు. ఆ సందేశాన్ని అర్థం చేసుకోవడంలో కూడా ఇబ్బంది ఉంకూడదు. అంటే అది చాలా స్పష్టంగా ఉండాలి.

వివిధ విధానాల (Methodology) పై ఆలోచించినపుడు మూడు పద్ధతులు ముందుకు వస్తాయి. ఈ మూడు పద్ధతులను విశ్లేషించి, వాటిలో సృష్టికర్త అవలంబించిన అన్నిటికన్నా ఎక్కువ సముచితమైన (Most suitable) విధానం ఏదో, క్రియాత్మకమైనది (Practicable) ఏదో కూడా చూద్దాము. ఆపైన దానిని అన్వేషిద్దాము.

## సృష్టికర్త సందేశాన్ని మానవుల వరకూ చేర్చే విధానం ఏదై ఉంటుంది?

సృష్టికర్త పరిచయమైనా, ఆయన సందేశం మానవాళికి చేరడమైనా – బౌద్ధికంగానూ, ఆచరణాత్మకంగానూ – మూడే పద్ధతుల ద్వారా సాధ్యమవుతుంది.

1. **మొదటి పద్ధతి :** ఏమిటంటే, సృష్టికర్త మానవుణ్ణి వ్యక్తిగతంగా గానీ, సామూహికంగా గానీ పిలిచి, తన పరిచయం చేసుకోవాలి.
2. **రెండవ పద్ధతి :** సృష్టికర్త స్వయంగా మానవుని దగ్గరకు వచ్చి, అతనికి కావలసిన సమాచారాన్ని ఇచ్చివెళ్ళాలి.
3. **మూడవ పద్ధతి :** ఈ పని కోసం సృష్టికర్త మానవుల్లో నుంచే ఒక వ్యక్తిని ఎన్నుకోవాలి. ఆ వ్యక్తి బుద్ధికుశలుడై, విశ్వసనీయుడై ఉండాలి. విజ్ఞుడై ఉండాలి. అతనెన్నడూ అబద్ధమాడని సచ్ఛీలుడు, నిజాయితీపరుడై ఉండాలి. అతను ఎప్పుడూ ఎవరికీ ద్రోహం చేయనివాడై ఉండాలి. అతను సతతం విశ్వ సార్వభౌమాధికారి ఎదుట నిలబడి జవాబు ఇచ్చుకోవాలనే భావనతో జీవించేవాడై ఉండాలి. అలాంటి మానవోత్తముణ్ణి సృష్టికర్త తన సందేశహరునిగా ఎన్నుకోవాలి.

ఏ వ్యక్తిలో ఈ ఉన్నత మానవీయ గుణాలుంటాయో, ఏ సుగుణాల కారణంగా అతను సమాజంలో ప్రసిద్ధిచెందుతాడో, ఏ వ్యక్తి జన బాహుళ్యం

మధ్యన తిరుగాడుతూ వారి దైనందిన వ్యవహారాల పట్ల ఆసక్తి కనబరుస్తాడో, వారి సేవలు చేస్తాడో, ఇంకా ఈ సేవల కారణంగా ప్రజల హృదయాలను గెలుచుకుంటాడో అలాంటి పురుషోత్తముణ్ణి మాత్రమే సృష్టికర్త తన సందేశహరునిగా ఎంపిక చేస్తాడు.

ఆపైన అతనిని ప్రజల్లోకి పంపిస్తాడు. అతని చుట్టుప్రక్కల ఉండే ప్రజలకు ఆ సందేశాన్ని చేరవేయమని అతనిక ఆజ్ఞాపిస్తాడు. ఆ సందేశాన్ని మనోవాక్కాయ కర్మల చేత పూర్తిగా ప్రవేశపెట్టమని ఆదేశిస్తాడు. ఈ విధంగా సృష్టికర్త తరఫున వొసగబడిన ప్రబోధనలను ఆచరించి, వాటిని సమాజంలో ప్రవేశపెట్టే పద్ధతి కూడా ఒక ఉపమానం రూపంలో ముందుకు వస్తుంది. ఆ తరువాత ఆ సందేశం యొక్క ప్రాముఖ్యత, ఆవశ్యకత మూలంగా ఒకరింకొకరి ద్వారా సృష్టికర్త సందేశం మరింతమంది వరకు చేరుతూ పోతుంది. ఇది ప్రతి మనిషికీ అవసరమైన సందేశం గనక, అన్ని ప్రాంతాలలో నివసించేవారు దీనిని సంగ్రహిస్తారు గనక, సందేశహరుని తదనంతరం కూడా ఇది విశ్వవ్యాప్తం అవుతుంది. కేవలం ప్రవక్త పుట్టిన ప్రదేశానికే పరిమితం అయి ఉండదు. ఇలాంటి అపురూపమైన ఏర్పాటును సృష్టికర్త తప్పక చేస్తాడు.

సందేశాన్ని చేరవేసే మొదటి రెండు పద్ధతులు ఎన్నడూ కనీ వినీ ఎరుగనివి. అవి విశ్వసార్వభౌముని ఔన్నత్యానికి ఎంతమాత్రం శోభాయమానం కావు. కాబట్టి ఈ రెండు పద్ధతుల్ని అవలంబించే ప్రసక్తే లేదు. అవి ఆచరణ సాధ్యం కావు కూడా.

అందువల్ల సృష్టికర్త తన సంపూర్ణ జ్ఞానం వివేచనల వెలుగులో మూడవ పద్ధతినే అవలంబించాడు. మనుజ జాతి చరిత్రలో దీని ప్రస్తావన వస్తుంది (ఉదాహరణకు : మూసా, ఈసా, ఇబ్రాహీమ్ అలైహిముస్సలాం వంటి మహా పురుషులు దైవ సందేశహరులుగా నియుక్తం చేయబడ్డారు). ఈ పద్ధతి సహజమైనది, ఆచరణాత్మకమైనదీను. పైగా ఈ విధానం హృదయాలను చూరగొంటుంది. చాలా స్పష్టంగా, సుబోధకంగా కూడా ఉంటుంది. వినేవారిని సంతృప్తపరుస్తుంది. నమ్మకం కలిగిస్తుంది. కనుక ఒక మానవమాత్రునికి సందేశం ఇచ్చి మనుషుల మధ్యన పంపాలి. ఆ వ్యక్తి మానవాళికి మార్గదర్శకత్వం వహించాలి. మానవుని భాషను మానవుడు బాగా అర్థం చేసుకుంటాడు. మానవ జీవితంలోని ఎత్తుపల్లాలను సాటి మనుషులే సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు. అతని భావాలు భావనలను అర్థం చేసుకుంటూ అతన్ని ఆదరిస్తారు, ప్రశంసిస్తారు

(Appreciate చేస్తారు). ఈ విధంగా సృష్టికర్త సందేశం మానవాళికి ఎంతో ప్రభావవంతమైన రీతిలో చేరుతుంది. ఒకవేళ దేవుడే దిగివచ్చి సందేశాన్ని అందజేసినా లేక దైవదూతలు వచ్చి చేరవేసినా అది మానవమాత్రులకు అర్థం కాదు.

వెనుకటి పుటల్లో ప్రస్తావించబడిన మానవీయ సుగుణాలలో ఈ క్రింది రెండు గుణాలు చాలా ముఖ్యమైనవి. సృష్టికర్త సందేశాన్ని తెలుసుకోవడంలో అవి ఎంతో కీలకమైనవి.

క్రింద పొందుపరచబడిన రెండు సుగుణాల కారణంగా తనను దైవప్రవక్తగా ప్రకటించుకునే వ్యక్తి విశ్వసనీయుడైన వ్యక్తిగా పరిగణించబడతాడు. వాటిలో ఒకటి : అతను గొప్ప నిజాయితీపరుడై ఉండటం. రెండవది : అతను తిరుగులేని విధంగా (Unchallengeable) సత్యవంతుడై ఉండటం. తత్కారణంగా అతను సృష్టికర్త సందేశాన్ని యధాతథంగా, ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా – దాని సిసలైన రూపంలో ప్రజలకు చేరవేస్తాడు. ఈ విషయానికి సంబంధించి అతను సర్వజ్ఞాని అయిన సృష్టికర్తకు జవాబుదారు అయి ఉంటాడు.

ఈ విశ్వసనీయమైన గుణాల కారణంగా ప్రజలు దైవదౌత్య ప్రకటన చేసే వ్యక్తి మాటను ప్రశాంతంగా వింటారు. అతని సందేశంపై వారికి లేశమైనా సంశయం ఉండదు. అందుకే దైవప్రవక్త అనబడే వాని మాటలకు – చేతలకు మధ్య వైరుధ్యం ఉండకూడదు. పైగా అతని పలుకులు, ఆచరణలు ప్రమాణబద్ధమైనవిగా, ఆదర్శప్రాయమైనవిగా ఉండాలి.

ఇదీ సృష్టికర్త తన దాసులకు తనను గురించి పరిచయం చేయడానికి అవలంబించిన వివేకవంతమైన విధానం (Methodology). ఈ విధానం ద్వారానే ఆయన తన కారుణ్య సందేశాన్ని పంపి మానవ జీవిత లక్ష్యాన్ని విశదపరిచాడు. జీవిత విధానాన్ని వివరించాడు.

## సందేశ మార్గాలు, వాటి ప్రామాణికతకు సంబంధించిన పరిశోధన

దాసుల పేరు మీద సృష్టికర్త సందేశం వచ్చిందంటే చాలు, సృష్టికర్త ఉనికిపై దృఢ నమ్మకం ఏర్పడుతుంది. కాని సృష్టికర్త వద్ద నుంచి తనకు సందేశం అందుతోందని ప్రకటించిన వాని మాటను నమ్మేదెలా? అతను చెప్పేది నిజమో కాదో తెలిసేదెలా?

సృష్టికర్త సందేశం మానవుల వరకూ చేరడానికి 'సాధనం'గా ఉపయోగపడే వ్యక్తి, (తనకు సృష్టికర్త నుంచి సందేశం అందిందని అతను ప్రకటించుకుంటాడు) గురించి పరిశోధించవలసి ఉంటుంది. అతను నిజంగానే సృష్టికర్త తరఫున ఎంపిక చేయబడిన వాడని నిర్ధారించబడినప్పుడు ఆ సందేశం సత్యబద్ధమైనదన్న నమ్మకం కూడా ఏర్పడుతుంది. కనుక సందేశాన్ని తెచ్చిన వాని సచ్ఛీలతను పరికించవలసిన ఆవశ్యకత ఉంది. దాంతోపాటు అతను తెచ్చిన సందేశం సత్యమైనదేనా? కాదా? అన్న దానిని కూడా చూడవలసి ఉంటుంది.

ఆ వ్యక్తిపైన, అతను తెచ్చిన 'గ్రంథం'పైన ఒకసారి నమ్మకం కుదిరిన తరువాత సృష్టికర్తకి – అతని సందేశహరునికి మధ్య సంబంధం ఎలా ఏర్పడాలి, ఈ అంతరం (Gap) ఎలా పూడుకోవాలి? ఈ చిక్కుముడి దైవ సందేశహరుని ద్వారా, అతను తెచ్చిన గ్రంథం ద్వారా సులభంగా విచ్చుకుంటుంది.

ఒకవేళ ఆ వ్యక్తిత్వంపైన, అతని సందేశంపైన నమ్మకం కలగకపోతే, అతని ప్రామాణికతపై సందేహం కలిగితే ... వ్యవహారం మళ్లీ మొదటికి వస్తుంది.

ఇక్కడ గమనార్హమైన విషయం ఒకటుంది. విశ్వప్రభువు తన సందేశహరుని గురించి పరిచయం చేయడానికి బహిరంగ సభలాంటిది పెట్టి ప్రకటన చేయడు. ఆ విషయాన్ని ప్రవక్తకే వదలిపెడతాడు. ప్రవక్త స్వయంగా ప్రజాబాహుళ్యంలోనికి వెళ్ళి తన గురించి పరిచయం చేసుకోవలసి ఉంటుంది. దైవప్రవక్త ప్రజల మధ్యన నిలబడి ఎంతో గంభీరంగా, మరెంతో ధీమాగా తన పనిని మొదలెడతాడు. నేను దైవ సందేశహరుణ్ణి, నన్ను నమ్మండి, నేను మీకు అందజేసే విషయాన్ని అంగీకరించి తదనుగుణంగా నడుచుకోండి. నేను రాజాధిరాజు, విశ్వసార్వభౌముడైన దేవుని తరఫున పంపబడిన ప్రవక్తను. నేను ఆయన సందేశాన్ని, ఉపదేశాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా మీకు అందజేస్తున్నాను. కాబట్టి నేను మీకు అందజేసిన సృష్టికర్త సందేశాన్ని విశ్వసించండి. తద్వారానే మీరు సాఫల్యం పొందుతారు. అన్యథా ఘోరమయిన నష్టానికి గురవుతారు అనంటాడు.

దేవుని తరఫున ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన వ్యక్తికి, ప్రజలకు అందజేయవలసిన సందేశాన్ని ఇచ్చి పంపినపుడే అతను దైవప్రవక్తగా గుర్తించబడతాడు. తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి నిజంగా విశ్వ

సార్వభౌముని తరఫున పంపబడిన ప్రవక్తేనని నిరూపితమైనపుడు అతను తెచ్చిన సందేశం కూడా సత్య సందేశమని, దైవ సందేశమని రుజువవుతుంది. దీనినిబట్టి బోధపడేదేమంటే సందేశం మరియు సందేశహరుడు – ఇవి రెండూ ఒకే నాణానికి ఇరువైపులు. ఒకవేళ ఆ సందేశం సృష్టికర్త తరఫు నుండి అయివుంటే, దానిని తీసుకు వచ్చినవాడు తప్పకుండా ఆ సృష్టికర్త పంపిన సందేశహరుడే అయి ఉండాలి. ఇవి రెండూ ఒకదాని కొకటి ధ్రువీకరణగా, సహాయకారి (Support)గా ఉంటాయి. ఒకటి సత్యమని రుజువైతే రెండవది కూడా సత్యంగానే తేలుతుంది. ఒకదానిపై నమ్మకం కుదిరిందంటే, రెండవ దానిపై కూడా దానంతటదే నమ్మకం ఏర్పడుతుంది. ఆ సందేశం గనక సృష్టికర్త తరఫు నుండి అయివుంటే, దానిని తీసుకు వచ్చినవాడు కూడా ఖచ్చితంగా సృష్టికర్త తరఫు నుండే ఎన్నుకోబడినవాడై ఉంటాడు. సందేశాన్ని చేరవేసే ఈ పద్ధతి ఎంతో సున్నితమైనది. పరీక్షతో కూడుకున్నది.

దైవప్రవక్త ప్రజలలోనికి వెళ్ళి తనను ప్రవక్తగా పరిచయం చేసుకోవటం, వారికి సందేశాన్ని చేరవేయడం, ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తిని సంబోధితుడు ప్రవక్తగా నమ్మటం, అతని సందేశాన్ని స్వీకరించటం, దాని ప్రకారం ఆచరించటం – ఇదంతా చాలా కఠినమైన దశ. అటు ప్రవక్తకూ, ఇటు సంబోధితులకు కూడా ఇది కఠిన పరీక్షే. ఎందుకంటే ఈ ప్రక్రియలో దేవుని తరఫున ఎలాంటి ఉత్సవాలు, సదస్సులు ఉండవు. నేను ఫలానా వ్యక్తిని దైవప్రవక్తగా ఎన్నుకున్నాను. కాబట్టి మీరంతా అతను చెప్పినట్లు వినాలని దేవుడు ప్రత్యక్షంగా చెప్పడు. తరతరాల మానవ జాతి చరిత్రలో ఇలా ఎన్నడూ జరగలేదు. ఇలాంటి విషయాన్ని ఎవరూ కనీ వినీ ఎరుగరు.

విశ్వసార్వభౌముడు తన సందేశహరుని గురించి ప్రజలకు ప్రత్యక్షంగా పరిచయం చేయనప్పుడు, సందేశహరుడు స్వయంగా తన గురించి పరిచయం చేసుకుని, ప్రవక్తగా తన బాధ్యతను నిర్వర్తించవలసి ఉంటుంది.

ప్రవక్త ఆ పనిని నిస్సంకోచంగా చేస్తాడు. నేను దైవప్రవక్తను, నేను మీకు అందజేసే సందేశం విశ్వసార్వభౌముని సందేశం. దీనిని మీరు స్వీకరించండి. దీని ప్రకారం ఆచరించండి. దీనిని నమ్మి నడుచుకున్నవాడు శాశ్వతమైన స్వర్గంలో ప్రవేశిస్తాడు. దీనిని తిరస్కరించినవాడు శాశ్వతంగా నరక యాతనకు గురవుతాడు అని దైవప్రవక్త చాలా స్పష్టంగా ప్రకటిస్తాడు.

అంగీకరించటం, అంగీకరించకపోవటం అనే వాటి ఫలితాలు, జయాపజయాల (అంటే స్వర్గం నరకాల) రూపంలో వెలువడుతాయి. కాబట్టి ప్రతి వ్యక్తీ పరీక్షించబడతాడు. అంగీకరించాలా? లేక తృణీకరించాలా? అని సతమతమవుతాడు. అంగీకరించటమంటే దైవప్రవక్త తెచ్చిన సృష్టికర్త ఆదేశాల, ఉపదేశాల ముందు పూర్తిగా ఆత్మసమర్పణ (Surrender) చేసుకోవటమే. అంటే దైవప్రవక్త ఇచ్చిన దానిని పుచ్చుకోవటమే. ఆయన విడిచిపెట్టమన్న దానిని విడనాడటమే! అంటే మనిషి ఇష్టారాజ్యం చెల్లదు. తన మనోవాంఛల ప్రకారం అతను జీవితం గడపలేడు. పైగా సృష్టికర్త తరఫు నుండి అందిన వివేకవంతమయిన, ఉదాత్తమయిన, ప్రేమపూర్వకమయిన, యుక్తితో కూడిన, న్యాయవంతమయిన ప్రబోధనల వెలుగులో జీవితం గడపవలసి ఉంటుంది. అందులో ఒకవైపు సృష్టికర్త హక్కులు, మరోవైపు సృష్టితాల హక్కులు కూడా ఉన్నాయి. వాటిని నెరవేర్చవలసి ఉంటుంది. తత్ఫలితంగా అతను స్వర్గ ప్రవేశానికి అర్హుడవుతాడు. అన్యధా నరకానికి ఆహుతి అవుతాడు.

ఇప్పుడు ఒప్పుకోవాలా? లేదా? అనేది శ్రోతల ముందున్న అతి ముఖ్యమయిన ప్రశ్న. ఒప్పుకునే మాటైతే పూర్తిగా ఆత్మసమర్పణ (Submit) చేసుకోవలసి ఉంటుంది. దైవప్రవక్త చెప్పిన దాని ప్రకారం జీవితాన్ని మలచుకోవలసి ఉంటుంది. తదనుగుణంగా ఆచరించవలసి ఉంటుంది. జీవన రథం యొక్క పగ్గాలను దైవప్రవక్త చేతికి ఇవ్వవలసి ఉంటుంది. సృష్టికర్త తరఫు నుండి ఆయన తీసుకువచ్చిన ఆదేశాలన్నింటినీ శిరసావహించవలసి ఉంటుంది. ఆయనకు పూర్తిగా విధేయత చూపవలసి ఉంటుంది. లేకుంటే విశ్వసార్వభౌమునికి అవిధేయత కనబరచినట్లే. సృష్టికర్త, నిజ ఆరాధ్య దైవం గురించి దైవప్రవక్త చేసిన పరిచయాన్ని కూడా యధాతథంగా అంగీకరించవలసి ఉంటుంది. ఎందుకంటే అది కూడా సృష్టికర్త తరఫున సూచించబడినదే. ఆయన తన గురించి తన గ్రంథంలో పరిచయం చేసుకున్నాడు. ఆ గ్రంథాన్ని దైవప్రవక్త తీసుకువచ్చాడు.

ఈ ఆదేశాలను ఒప్పుకోనిపక్షంలో మనసు మెచ్చిన స్వేచ్ఛాయుత జీవితం గడపవచ్చు. ఎలాంటి బలవంతంగానీ, ప్రలోభంగానీ లేదు. అయితే చేదు పరిణామాలను అనుభవించవలసి ఉంటుంది. వాటి కొరకు సిద్ధంగా ఉండవలసి ఉంటుంది. ఇది చాలా సంక్లిష్టమయిన సమస్య.

కాబట్టి నిర్ధారణ (Confirm) చేసుకోవలసిన విషయం ఏమిటంటే

తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి నిజంగా దైవప్రవక్తేనా? కాదా? అన్నది. అందుకే బాగా ఆలోచించి, లోతుగా అధ్యయనం చేసి నిర్ధారణ చేసుకోవలసిన విషయమిది. ఎందుకంటే ఇది మనిషి సాఫల్య వైఫల్యాలకు సంబంధించిన వ్యవహారం. దీనిని తేలిగ్గా (Lightly) తీసుకోవటం భావ్యం కాదు. ఈ విధంగా నిర్ధారణ చేసుకోవలసిన బాధ్యత శ్రోతలపైనే వదలివేయటం జరిగింది. ఎందుకంటే అది వారి జయాపజయాల వ్యవహారం. చాలా గంభీరమైన (Serious) విషయం. కనుక వారు స్వయంగా పరిశీలించి, పరిశోధించి ఒక నిర్ణయానికి రావాలి.

మరోవైపు దైవ సందేశహరునికి కూడా ఇది చాలా ముఖ్యమైన విషయమే. తాను దైవప్రవక్తనని అతను కేవలం ప్రకటించుకుంటే సరిపోదు, తన ప్రకటన సత్యవంతమైనదని అతను నిరూపించుకోవాలి. అప్పుడే ప్రజలు సంతృప్తి చెంది, అతను చెప్పినట్లుగా నడుచుకుంటారు.

తమ మధ్యన ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి గుణశీలములను కూడా ప్రజలు తరచి చూడాలి. లోగడ అతను సత్యసంధునిగా గుర్తించబడ్డాడా? లేక అబద్ధీకుడుగా, అపఖ్యాతి పాలయ్యాడా? అన్నదానిని వారు జాగ్రత్తగా పరిశీలించాలి. లేకపోతే వారు అబద్ధాలకోరు అనుయాయులుగా మారి తమ జీవితాలను సర్వనాశనం చేసుకోవలసి వస్తుంది. ఇది ఎంతో జటిలమయిన వ్యవహారం.

ఇప్పుడు మనం, ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి సత్యవంతుడని తెలుసుకునేదెలా? అతను నిజంగానే దైవప్రవక్త అని ఆహూతులు నిర్ధారించుకునేదెలా? అన్నదానిని గురించి చర్చిద్దాం.

## ప్రకటనకర్త ఇచ్చే సాక్ష్యం

తనను ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి ఇచ్చే సాక్ష్యాన్ని గురించి కాస్త ఆలోచించండి – అతని సాక్ష్యం ఇది : చూడండి, నేను నా ఉనికి ద్వారా, నా ప్రబోధనల ద్వారా నా ప్రకటనకు సాక్షిగా ఉన్నాను. ప్రవక్తగా నియుక్తం కాక పూర్వం నా జీవితం, నా ప్రస్తుత జీవితం కూడా మీ ముందు సాక్ష్యంగా ఉంది. నేను చెప్పేది అక్షర సత్యమని అది చాటి చెబుతోంది. నేను ఆ రాజాధిరాజు తరఫున వచ్చిన సత్య సందేశహరుణ్ణి. నేనేం చెప్పినా, ఏ సందేశమిచ్చినా అది నా స్వంతం కాదు. అది పూర్తిగా దైవోపదేశం. ఇందులో

సందేహానికి ఏ మాత్రం తావు లేదు. ఈ విధంగా నేను, నా జీవితం, నేను తెచ్చిన సందేశానికి ఆపాదమస్తకం సాక్షీభూతంగా ఉన్నాయి. అవి పగటి వెలుగులా మీ కళ్ల ముందర ఉన్నాయి. దీనిపై ఒకటికి రెండుసార్లు పరిశీలన చేయండి. పక్షపాతబుద్ధికి, సంకుచిత స్వభావానికి తావీయకుండా – మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటూ, మీ బాగోగుల్ని కోరుకుంటూ – గంభీరంగా దీనిపై పరిశోధన (Re-search) జరపండి.

చూడండి, నేను ప్రజల మధ్యనే సంచరిస్తూ ఉంటాను. వారితో కలసి కూర్చుంటాను. వారితోపాటే కలసి తింటాను, త్రాగుతాను. వివాహాలు చేసుకుంటాను. ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ ఉంటాను. వారికి సేవలు చేస్తుంటాను. ఎన్నో కష్టాలకు, త్యాగాలకోర్చి – నిస్వార్థ బుద్ధితో – సృష్టికర్త సందేశాన్ని మానవులకు చేరవేస్తున్నాను. నా క్రియాత్మక జీవితం ద్వారా విషయాన్ని విపులీకరిస్తున్నాను. నా సందేశాన్ని స్వీకరించినవారి జీవితాలను తీర్చిదిద్దుతున్నాను. వారిలో వచ్చిన పరివర్తన మూలంగా వెలువడే సత్ఫలితాలు కూడా మీ ముందు ప్రబల తార్కాణంగా ఉన్నాయి. ఇన్ని విధాలుగా నేను చెప్పేది పూర్తిగా సత్యమని ఈ సత్ఫలితాలే సాక్ష్యమిస్తున్నాయి. ప్రజలు విషయాన్ని అర్థం చేసుకునేందుకే, నమ్మి నడుచుకునేందుకే, పాపకార్యాలకు దూరంగా ఉండేందుకే, పరలోకంలో వైఫల్యం నుండి తప్పించుకునేందుకే ఈ ప్రయాస. నిస్వార్థంతో కూడిన నా కృషి, నేను భరిస్తున్న బాధలు కూడా నేను దైవ సందేశహరుణ్ణి అని చాటి చెబుతున్నాయి.

ప్రవక్త చెప్పే మాటలు బరువుగా ఉంటాయి. వాటిలో గాంభీర్యం ఉట్టిపడుతూ ఉంటుంది. ఎందుకంటే అతను నైతికంగా అత్యున్నత స్థాయి (High - Level)కి చెందినవాడై ఉంటాడు. ఆచార వ్యవహారాలలో, ప్రజా సంబంధాలలో నికార్సుగా ఉంటాడు. అతను ప్రజల మనిషి అయి ఉంటాడు. పట్టణ ప్రజలందరి చేత సత్యసంధునిగా, నిజాయితీపరునిగా కొనియాడబడినవాడై ఉంటాడు. అందుచేత అతని మాట, అతని ప్రకటన ఉపేక్షించనలవి కానివి. అతనేదో సామాన్య మనిషి కాడు. ఆగంతకుడు అంతకన్నా కాడు. కనుక అతను చెప్పే దానిని వినటం, దానిపై యోచన చేయటంలోనే ఆహూతుల మేలు ఇమిడి ఉంది.

సందేశాన్ని చేరవేసే ఈ విధానం ప్రతి వ్యక్తి విజ్ఞతకు పరీక్షగా ఉందనిపిస్తోంది. ఒకవేళ దేవుడు ఒక సందస్సు నిర్వహించి ఫలానా వ్యక్తిని దైవప్రవక్తగా నియమిస్తున్నట్లు లాంఛనప్రాయంగా ప్రకటించివుంటే, ఈ పద్ధతి

ద్వారా మనిషిలోని దక్షత, విజ్ఞత బయటపడేది కాదు. అతని ప్రతిభకు పరీక్ష జరిగేది కాదు. మనుషుల తలలు వాటంతట అవే వంగిపోయేవి. అయితే సందేశాన్ని చేరవేయడానికి దేవుడు నిర్ధారించిన ప్రస్తుత పద్ధతి ఇరువర్గాల వారికి కూడా ఒక పరీక్షగా ఉంది – అటు సందేశప్రదాతకు, ఇటు శ్రోతలకు కూడా. దైవ సందేశహరునికి గల పరీక్ష ఏమిటంటే అతను తన స్వయం పరిచయం చేసుకోవాలి. ప్రజలకు సందేశాన్ని చేరవేయాలి. ఇక ప్రజలకు పెట్టబడిన పరీక్ష ఏమిటంటే, సందేశ ప్రకటన చేసే వ్యక్తిని దైవ సందేశహరునిగా అంగీకరించాలి, అతని సందేశాన్ని విశ్వసించాలి.

ఈ కఠిన లక్ష్యం (Task) ద్వారానే ఇరువురికీ నమ్మకం కుదురుతుంది. చిత్తశుద్ధి జనిస్తుంది. ఈ అనుగ్రహ భాగ్యం యొక్క విలువ తెలిసివస్తుంది. ఎన్నో సందేహాలు సంశయాల దశలను అధిగమించిన పిదప నమ్మకం ఏర్పడుతుంది. ఈ లోగా వారు మానసిక సంఘర్షణకు లోను కావలసి వస్తుంది. మనో వాంఛలకు వ్యతిరేకంగా పోరాటం సలపవలసి వస్తుంది. సందేశహరుడు ఎన్నో త్యాగాలకోర్చి, నిస్వార్థంగా సందేశాన్ని అందజేయవలసి ఉంటుంది. ఈ విధంగా అటు సందేశహరుని వ్యక్తిత్వం ప్రస్ఫుటం అవడంతో పాటు సందేశ గ్రహీతలలోని మంచితనం కూడా అభివ్యక్తం అవుతుంది.

విలువైన వస్తువు అతి కష్టం మీదే ప్రాప్తమవుతుంది. అదే దాని విశిష్ఠత. అందువల్లనే అది జాగ్రత్తగా కాపాడుకోబడుతుంది. సులువుగా లభించే వస్తువు భద్రత గురించి అంతగా శ్రద్ధ తీసుకోబడదు.

## ఆహూతుల పరిశోధన

శ్రోతలు లేక ఆహూతులు ఈ సందర్భంగా సందేశ ప్రదాతలో చాలా దగ్గరి నుండి రెండు ప్రత్యేకతలను చూడవలసి ఉంటుంది. ... ఒకటి : అతని సత్యసంధత. రెండు : అతని నిజాయితీతత్పరత ... ఈ సుదీర్ఘ కాలంలో – దైనందిన జీవితంలో, ఈ వయసుకు చేరేవరకు అతని జీవితం ఎలా గడిచింది? తాను సందేశహరుణ్ణి అని అతను చేసే ప్రకటన సత్యమేనా? లేక బూటకమా? ఈ విషయాన్ని నిర్ధారించుకుని మనసును కుదుటపరచు కోవడానికి అతని జీవిత చరిత్రను పరికించాలి. ఆ నగర పౌరులు అతన్ని ఒక సత్యసంధునిగా గుర్తించారా? లేక మరో విధంగానా? ఈ ప్రశ్నకు 'అవును' అని సమాధానం లభించిన తరువాతే, అతను విశ్వప్రభువు తరఫున నియుక్తుడైన సత్య

సందేశహరుడన్న నమ్మకం కలుగుతుంది. అదీగాక, అతను ఈ సందేశ ప్రకటన చేసింది అపరిచితుల మధ్యన కాదు, గత కొన్నేండ్లుగా ఏ జనుల మధ్యన పుట్టి పెరిగాడో, ఎవరి మధ్యన సంచరిస్తున్నాడో వారికే పిలుపు ఇస్తున్నాడు. అలాంటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని పసిగట్టడం ఆ జనులకు ఏమాత్రం కష్టతరం కాదు. ఒకవేళ అతను గనక కొత్త ప్రదేశంలోకి వెళ్ళి, అపరిచితుల మధ్యన నిలబడి తాను దైవ సందేశహరుణ్ణి అని ప్రకటిస్తే, ప్రజలు దానిని స్వీకరించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఎందుకంటే ఆ వ్యక్తి సత్యవంతుడో లేక అబద్ధీకుడో ఆ జనులకు తెలియదు కాబట్టి. పైగా అతని సందేశం సందేహాస్పదంగా, ప్రశ్నార్థకంగా ఉండిపోతుంది.

సందేశహరునిలోని రెండవ ప్రత్యేకత ఏమిటంటే, అతను నిజాయితీపరుడై ఉండాలి. తన ప్రభువు తరఫు నుండి తనకు అందిన సందేశాన్ని ఉన్నదున్నట్లుగా, యధాతథంగా ప్రజలకు చేరవేసే వాడై ఉండాలి. ఈ విషయంలో అతను ఒక 'అమీన్'గా వ్యవహరించాలి. అందులో ఎలాంటి మార్పుగానీ, హెచ్చుతగ్గులుగానీ చేయకూడదు. అప్పుడు అతని సందేశాన్ని స్వీకరించటంలో ఎలాంటి సందిగ్ధం ఏర్పడదు.

సందేశహరుడు సత్యసంధుడు (సాదిఖ్) మాత్రమే కాదు, నిజాయితీపరుడు (అమీన్) కూడా అని సమాజం సాక్ష్యమిచ్చినప్పుడు అతను ఒక దైవప్రవక్తగా ఆమోదించబడతాడు. 'సాదిఖ్' అయిన కారణంగా అతని వ్యక్తిత్వం స్వీకారయోగ్యం అవుతుంది. 'అమీన్' అయిన కారణంగా అతని సందేశం ఆమోదయోగ్యం అవుతుంది.

ఇక అతను సమర్పించిన 'ప్రబోధనల'ను పరికించటం ద్వారా మనసుకు సంతృప్తి కలుగుతుంది. ఆ ప్రబోధనలలోని సుగుణాలు, ... అవి సహజమైనవి, న్యాయసమ్మతమైనవి, సమతూకంతో కూడుకున్నవి, మానవత పాలిట శుభదాయకమైనవి, కారుణ్యప్రదమైనవి అయి ఉంటాయి. వాటిలో సమానతలు ఉంటాయి. ఇంకా ఆ ప్రబోధనలలో స్వయం ఆచరణా శక్తి (Self Implementing Force) ఉండటం, అవి బౌద్ధికంగానూ ఆచరణ యోగ్యంగానూ ఉండటం కూడా వాటిని స్వీకారయోగ్యంగా చేసేస్తాయి. వాటిలో మానవాళికి మేలు ఉందని, వ్యక్తిగత ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని, మార్గబోధన ఉందనీ, ప్రశాంతమైన జీవితం గడపడానికి కావలసిన ఔషధ గుణాలన్నీ వాటిలో ఉన్నాయని ఆ ప్రబోధనలు చెప్పకనే చెబుతుంటాయి.

## పరిశోధన : ఆవశ్యకత, ప్రాముఖ్యత

ఆ సందేశాన్ని స్వీకరించడం, స్వీకరించకపోవటం వల్ల సంభవించే తీవ్ర (Extreme) పరిణామాలను సందేశహరుడు తెలియపరుస్తాడు. కనుక అతను చెప్పేది నిజమా? కాదా? అన్న విషయాన్ని పరిశీలించడం చాలా అవసరం.

ఏదైనా ప్రారంభోత్సవ (Inaugural) సభో లేక నియామక (Appointment) సదస్సో పెట్టి తన ప్రవక్తను నియమించటం విశ్వ ప్రభువు విధానం (Methodology) కానేకాదు. కాబట్టి స్వార్థపరుడైన వ్యక్తి ఎవరయినా బయలుదేరి తాను దైవప్రవక్తనని అబద్ధపు ప్రకటన చేసే అవకాశం కూడా ఉంటుంది. తన నక్కజిత్తులతో, వంచనా శిల్పంతో ప్రజలను మార్గభ్రష్టతకు లోనుచేసి పబ్బం గడుపుకునే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. అందుచేత ఈ వ్యవహారంలో గంభీరంగా పరిశోధన జరపటం అవసరం.

కాబట్టి ఆహూతుడు తన వంతుగా పరిశీలించి, పరికించి నిర్ధారణకు రావటం అవసరం. ఎందుకంటే స్వీకరించటం లేక త్రోసిపుచ్చటం యొక్క సుదీర్ఘ పరిణామాలు మానవ జీవితంపై పడనున్నాయి. స్వయంగా అతని వ్యక్తిగత జీవితాన్ని అవి ప్రభావితం చేయనున్నాయి. కాబట్టి అతను దానిని తేలిగ్గా (Lightly) తీసుకోలేడు. చాలా సీరియస్‌గా వ్యవహరించాలి. దానిని స్వీకరించటం లేక త్రోసిపుచ్చటం యొక్క సంబంధం ప్రపంచంలోని శాంతితో, అశాంతితో ఉంది. ఇది మరణానంతర జీవితంలో స్వర్గ నరకాలతో కూడా ముడిపడి ఉంది.

## పరిశోధనకు కావలసినవి

సందేశహరుని మాట ఎలా ఉంది? అతని దైనందిన జీవితం అతను చెప్పేదానికి అనుగుణంగానే ఉందా? లేదా? అతని సందేశం వల్ల వ్యక్తిగత, సామూహిక జీవితంలో ఎలాంటి ఫలితాలు వెలువడుతున్నాయి? అవి ఉన్నత స్థాయికి చెందినవా? లేక తుచ్ఛమైనవా? సందేశం అందజేయక ముందు అతని జీవితం ఎలా ఉండేది? అది పవిత్ర జీవితమా? లేక చెడు జీవితమా? సమాజం అతనిని ఏ దృష్టితో చూసేది? మంచి మనిషిగా చూసేదా? చెడ్డవానిగానా? సమాజం అతనికి ఏ స్థానం ఇచ్చేది? గౌరవప్రదమైన స్థానమా?

లేక నీచమైన స్థానమా? ఏ ఏ బిరుదులతో సొసైటీ అతన్ని స్మరించేది? మంచి బిరుదులతోనా? చెడ్డ పేర్లతోనా?

సృష్టికర్త పేరుతో అతను అందజేసే విషయంపై చింతన చేసినప్పుడు మీకేమనిపిస్తోంది? అతని మాట ఒక మానవమాత్రుని మాటలా ఉందా? దివ్య వచనం మాదిరిగా ఉందా? అతని మాట తీరు, అతను చెప్పే విషయం, అతని భవిష్యవాణి, విశ్వమండలం గురించి అతను చెప్పే విషయాలు జగతిలో మనుజ జాతి గురించి అతను ప్రస్తావించే విషయాలు – ఇత్యాదివి సత్యబద్ధంగా, సహేతుకంగా ఉన్నాయా? లేదా? అన్న దానిని కూడా తరచి చూడాలి.

సందేశహరుడు చెప్పే దాని వెనుక అతని స్వార్థప్రయోజనాలేమైనా ఉన్నాయా?

తోటి మానవుల యెడల అతను కనబరచే ప్రేమానురాగాలు, శ్రేయోభిలాష వెనుక నిస్వార్థ సేవాభావం ఉన్నదా? లేదా?

అతను చెప్పదలచిన విషయాన్ని నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా, స్పష్టంగా చెబుతున్నాడా? లేక డొంకతిరుగుడు పద్ధతిలో చెప్పి స్వార్థ ప్రయోజనాన్ని కప్పిపుచ్చుకుంటున్నాడా?

అతను తన జీవితాన్ని ప్రజల ముందు తెరచిన పుస్తకంలా ఉంచాడా? లేక దాపరికంతో వ్యవహరిస్తున్నాడా? అతను ప్రజలతో కలసిమెలసి ఉంటున్నప్పుడు, వివాహాది విషయాలలో, లావాదేవీలలో ఎలా కనిపిస్తున్నాడు? అతన్ని చాలా దగ్గరి నుండి గమనించినవారు అతన్ని చిత్తశుద్ధి గల మనిషిగా కనుగొన్నారా? లేదా? తాను దేన్నయితే సత్యమని అంటున్నాడో, దానిని అతను తన నిజ జీవితంలో అవలంబించి లబ్ది పొందుతున్నాడా? లేదా? దేన్నయితే 'చెడు' అనంటున్నాడో, దానికి అతను స్వయంగా దూరంగా ఉంటున్నాడా? లేదా? – ఈ విషయాలను తరచి చూసినప్పుడు అతను సత్యవంతుడో లేక అబద్ధీకుడో తేలిపోతుంది.

మహిమలకన్నా ఎక్కువ ముఖ్యమైనది, నమ్మకం ఏర్పరచేది అతని క్రియాత్మక జీవితం. ఇంకా అతను అందజేసే ఉపదేశాలు మానవ జీవితంలో ఎలాంటి మార్పు తీసుకువస్తున్నాయి? అవి వారి పాలిట కారుణ్యప్రదంగా, జ్యోతిర్మయంగా ఉన్నాయా? లేక అంధకారాన్ని వ్యాపింపజేస్తున్నాయా? అనే

దానిని కూడా పరిశీలించాలి. దీని ఆధారంగా అతని సందేశాన్ని అంగీకరించటమో, తృణీకరించటమో చేయటం సమంజసంగా ఉంటుంది.

ఏదైనా అద్భుతం లేక సన్మాన కార్యక్రమం సందేశహరుని సందేశానికి సహాయకారి (Support) కావచ్చుగాక! అతని సందేశాన్ని ఆహూతులు స్వీకరించటంలో అది దోహదకారి కావచ్చుగాక! కాని ఆహూతుని మనసు కుదుటపడటానికి అనుశీలన, చింతన, బౌద్ధిక ఆధారాలు, సందేశహరుని క్రియాత్మక జీవితం సాక్ష్యంగా ఉండటం చాలా అవసరం.

రాగద్వేషాలకు తావీయకుండా, నిష్పక్షపాతంగా పరిశోధన చేసినప్పుడే సత్యాసత్యాలు స్పష్టంగా తేటతెల్లమవుతాయి. ఈ పరిశోధన సందర్భంగా మనిషి తన నిర్ణాయక (Judgement) శక్తిని అంతర్గత (Internal) బాహ్య ప్రభావాల (External Influence) కు లోను కాకుండా జాగ్రత్తపడాలి. ఇదే సత్యాసత్యాలను పరికించే సరైన విధానం.

తనను దేవునిగా కాకుండా దైవప్రవక్తగా చెప్పుకునే వ్యక్తి జీవితాన్ని చూడాలి. సృష్టికర్త ఉపదేశాలంటూ అతను చెప్పేవాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. అతను అంతటితోనే ఆగాడా? లేక మరింత ముందుకు పోయి తనను తాను దేవునిగా చెప్పుకుంటున్నాడా? అనే దానిని కూడా జాగ్రత్తగా గమనించాలి.

## ఈ సందర్భంగా గమనార్హమైనవి

సందేశహరుడు చేసే ప్రకటనలోని సత్యాన్ని పరికించటానికి ముందు మనం తప్పుడు భావనల నుండి మనల్ని కాపాడుకోవాలి. ఉదాహరణకు : మానవాళికి తన సందేశాన్ని చేరవేయడానికి సృష్టికర్త అసాధారణమైన, మానవేతర వ్యక్తిని ఎన్నుకుంటాడన్నది వాటిలో ఒకటి. ఇలాంటి అసహజమైన వ్యక్తిత్వం కొరకు ఎదురు చూసి మోసపోకూడదు. ఎందుకంటే ఎవరయినా మానవేతర వ్యక్తి కోసం ఎదురు చూస్తూ ఉండగా, మానవమాత్రుడైన వ్యక్తి వచ్చి తాను దైవ సందేశహరుణ్ణి అని ప్రకటిస్తే ఆ ప్రకటన జనులను ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. అందువల్ల వారు ఆ వ్యక్తి మాటను ఒక్కసారిగా త్రోసిపుచ్చుతారు. లేదా అతని సందేశాన్ని స్వీకరించే విషయంలో ఊగిసలాడుతారు. కాబట్టి మానవాళికి దైవ సందేశం అందజేయడానికి మానవమాత్రుడే ప్రవక్తగా రావాలి. ఇదే సమంజసం. ఇలా జరిగినప్పుడు మనుషులకు మానవమాత్రుడైన ప్రవక్త చెప్పే మాటను అర్థం చేసుకోవటంలో

ఇబ్బంది ఉండదు. అలాగే ఆ మానవ ప్రవక్త వారికి ఆదర్శప్రాయంగా నిలుస్తాడు. అందుకే సందేశహరుడు అదే జాతి ప్రజల నుండి వచ్చినవాడై ఉండాలి. వారి భాషలోనే సంభాషించేవాడై ఉండాలి. వారి భాషలోనే ఉపన్యసించేవాడై ఉండాలి. అప్పుడే అతని మాటను, సందేశాన్ని వారు సులువుగా అర్ధం చేసుకోగలుగుతారు.

ఈ ముఖ్యాంశాలన్నీ పరిశోధన సందర్భంగా దృష్టియందుండాలి. అన్యధా సత్యసందేశహరుణ్ణి అర్ధం చేసుకోవటంలో తప్పుడు భావాలు, భావనలు అడ్డంకిగా నిలుస్తాయి. దైవ సందేశహరుడు మానవుడైనప్పుడే ఆ జాతి ప్రజలు అతని మాటను అర్ధం చేసుకోగలుగుతారు. అతని సందేశంపై యోచన చేయగలుగుతారు. అతను అందజేసే వాక్కు అతని స్వంత వాక్కా లేక దైవప్రోక్తమా? అన్న దానిపై వారు చింతన చేస్తారు.

## అతను సత్యవంతుడో, కాడో తెలుసుకోవటమెలా?

పుట్టినప్పటి నుండే ఆ నగర ప్రజలు అతన్ని ఎరిగి ఉంటారు. అందువల్ల దైవప్రవక్తగా నియుక్తుడయిన వ్యక్తి తొలుత తన నగర ప్రజలను, తన సమీప బంధువులను సంబోధిస్తాడు. ఇతర నగరవాసులకు అతని గురించి తెలిసి ఉండదు. అందువల్ల కొత్త ప్రదేశంలో సందేశాన్ని చేరవేయటం అతనికి కష్టతరం అవుతుంది. అందువల్ల అతను సృష్టికర్త సందేశాన్ని మొదట తన జాతి ప్రజలకు, స్థానికులకు మాత్రమే అందజేస్తాడు. తన కార్యక్షేత్రాన్ని వారి వరకే పరిమితం చేస్తాడు. తన ఊరిలో, తన వాడలో సఫలీకృతుడైన మీదటే ఇతర ప్రాంతాల వైపు దృష్టి మరల్చటం సమంజసంగా ఉంటుంది.

కాగా –

అబద్ధాలకోరు కొత్త ప్రదేశంలో తన పని మొదలెడతాడు. ఎందుకంటే స్థానిక ప్రజలలో అతను అబద్ధీకుడుగా, దగాకోరుగా ముద్రపడి ఉంటాడు. స్థానిక ప్రజలు అతన్ని ఒక స్వార్ధపరునిగా, మోసగాడుగా, ప్రాపంచిక వ్యామోహం కలవాడుగా గుర్తించి ఉంటారు. ఒకవేళ అతను తన జన్మస్థానంలో పనిని మొదలెట్టినా సజ్జనులు ఎవరూ అతని వెంట రారు. స్వార్ధపరులు, అవకాశవాదులు, ప్రాపంచిక వ్యామోహం కలవారు మాత్రమే అతణ్ణి అనుసరిస్తారు. అయితే సత్య సందేశహరుని పరిస్థితి తద్భిన్నం. మానవత రీత్యా, నైతికత రీత్యా ఉన్నతులే అతనికి ఆదరువుగా నిలుస్తారు.

సందేశ ప్రకటన చేసే వ్యక్తి తాను పుట్టిన ప్రదేశంలో కాకుండా ఇతర ప్రదేశాలకు వెళ్ళి సందేశాన్ని చేరవేస్తే అది అసహజమైన పద్ధతి అవుతుంది. పైగా ఆ సందేశం ప్రశ్నార్థకంగా నిలుస్తుంది. ఇతని గురించి ఆ ప్రజలకు అసలేమీ తెలియనప్పుడు అతని సందేశం ఎలా ఆమోదయోగ్యం అవుతుంది? అతని పట్ల వారిలో ప్రేమాదరణలు ఉండవు సరికదా సందేహాలు జనిస్తాయి. ఇతనొక స్వార్థపరుడు, అబద్ధీకుడై ఉంటాడన్న అనుమానం వస్తుంది. తన మాయమాటలతో మమ్మల్ని నరకయాతన గురించి భయపెట్టి, స్వర్గం ఆశ చూపి పబ్బం గడుపుకుంటాడేమోనని ప్రజలు అనుమానిస్తారు.

అతను వేరే పట్టణానికి లేక వేరే దేశానికి వెళ్ళి తన సందేశ ప్రకటన గావించాడు కాబట్టి అతను తన వాదనలో సత్యవంతుడో, అబద్ధీకుడో తెలియదు. సత్యవంతుడైన పక్షంలో తన పట్టణంలో, తన స్వదేశంలో సందేశాన్ని ఎందుకు అందజేయలేదు? అపరిచితుల దగ్గరకు వెళ్ళి 'మేలు' గురించి మాట్లాడాడంటే ఏదో గూడుపుఠాణి ఉంది. అలాకాకుండా తాను తిరుగాడిన జనుల మధ్యన నిలబడి సందేశ ప్రకటన చేస్తే అది అతని నిజాయితీకి నిలువెత్తు అద్దం అవుతుంది. ఎందుకంటే అక్కడి ప్రజలకు అతని నీతీ నడవడికల గురించి బాగా తెలుసు.

మరొక ముఖ్య విషయం ఏమిటంటే, సత్యవంతుడైన సందేశహరుడు తాను చేసే పనికిగాను ప్రజల నుండి ఎలాంటి వేతనం తీసుకోడు. ఇది అతని ఉత్తమ నైతికతకు ఒక మచ్చుతునక. సృష్టికర్త సందేశాన్ని ప్రజలకు అందజేయడానికి అతను దివారాత్రులు శ్రమిస్తాడు. కష్టాలకు ఓర్చుకుంటాడు. బాధలు భరిస్తాడు. త్యాగాలు చేస్తాడు. ఇదంతా చిత్తశుద్ధితో, నిస్వార్థ సేవాభావం తోనే చేస్తాడు. దైవదాసులు నరకాగ్ని శిక్ష నుండి కాపాడబడాలి, స్వర్గప్రవేశానికి అర్హులవ్వాలి అన్నదే అతని తీవ్ర అభిలాష అయి ఉంటుంది.

నగర ప్రజలంతా అతని నిజాయితీతత్పరత గురించి చర్చించుకుంటూ ఉంటారు. అతనొక సత్యవంతునిగా ప్రసిద్ధి చెంది ఉంటాడు. అతనెన్నడూ అబద్ధం చెప్పి ఉండడు.

వీటన్నింటికీ తోడు సృష్టికర్త ఉపదేశాల మూలంగా ప్రవక్త జీవితం ఎంతో అందమైన జీవితంగా ఉంటుంది. ఇతరుల జీవితాలను కూడా అది ఆ ఉపదేశాల మూలంగా అందంగా మలుస్తుంది. ఈమాన్ (విశ్వాసం) రీత్యా,

నైతికత దృష్ట్యా అతను మెరిసిపోతూ ఉంటాడు. పరిసరాలను కూడా ప్రకాశమానం చేస్తుంటాడు.

అతను తన సందేశాన్ని సూటిగా, స్పష్టంగా అందజేసే ప్రయత్నం చేస్తాడు. హృదయానికి హత్తుకునేలా విషయాన్ని విపులీకరిస్తాడు. ఉందాహరణల ద్వారా విషయాన్ని విడమరచి చెప్పి, ప్రజలు దాన్ని స్వీకరించేలా చేస్తాడు. సందర్భోచితంగా మాట్లాడతాడు. ఎంతో యుక్తితో, ప్రేమతో బోధపరుస్తాడు. తన మాటను ఒప్పుకుని తీరాలని బలవంతం చేయడు. నిగ్రహం, సహనం, సంయమనం అతని ఆయుధం అయి ఉంటుంది. ఒకవైపు ప్రజలు అతన్ని వేధిస్తూ, బాధిస్తూ ఉంటే అతనేమో వారు సందేశాన్ని స్వీకరిస్తే చాలని కోరుకుంటాడు. వారికై ప్రార్థస్తూ ఉంటాడు.

సత్యవంతుడైన ప్రవక్త తన ప్రబోధనల ద్వారానే గుర్తించబడతాడు. ప్రవక్త చెప్పే విషయాలు వాటిలోని విజ్ఞత, కారుణ్యం, ఔన్నత్యం ఆధారంగా అతను చెప్పేది సత్యమని ధ్రువపరుస్తూ ఉంటాయి - అతను సృష్టికర్త వద్ద నుండి వచ్చిన ప్రవక్త అని! సత్యవంతుడైన ప్రవక్త అందమైన, ఆదర్శప్రాయమైన తన జీవితం ద్వారా కూడా గుర్తించబడతాడు.

సృష్టికర్త తరఫున ఇవ్వబడిన సందేశాన్ని అతను మానవాళికి ఎట్టి పరిస్థితిలోనూ అందజేస్తాడు. అందుకే అతను అహరహం కృషి చేస్తాడు. పరిస్థితులు సానుకూలంగా ఉన్నాసరే, ప్రతికూలంగా ఉన్నాసరే, తన కార్యక్రమం పట్ల అలసత్వం వహించడు. భయపడడు. బెదిరిపోడు. సర్వకాల సర్వావస్థల్లో తన బాధ్యతను నిర్వర్తించడంలో లీనమై ఉంటాడు.

దైవప్రవక్త సందేశ ఫలితాల ఆధారంగా కూడా అతనిలోని సత్యనిబద్ధత తెలిసివస్తుంది. అతని సందేశం యొక్క అత్యంత ముఖ్యమైన సత్ఫలితం ఏమిటంటే, అది మనిషిని పాశవికత, పైశాచికత్వం నుండి పైకెత్తి మానవత్వపు ఉన్నతస్థాయికి చేరుస్తుంది.

సృష్టికర్త తరఫున సత్యవంతుడైన ప్రవక్తను తెలుసుకునే పద్ధతి ఎంతో సులువు చేయబడింది. అతనిని తెలుసుకునే పద్ధతి సహజమైనది. అదేమిటంటే, అతను ప్రజలతో బాగా కలసిమెలసి ఉంటాడు. వారిని ఎంతో ఆప్యాయంగా పలకరిస్తాడు. అతని మాటల్లో శ్రేయోభిలాషా భావం తొణికిసలాడుతూ ఉంటుంది. ప్రజలు అతన్ని చాలా దగ్గరి నుంచి చూసి, అతని సౌజన్యాన్ని

పసిగడతారు. ప్రజాసేవ కోసం అతను సర్వదా సిద్ధంగా ఉండటం, అసాధారణ త్యాగాలు చేయటం, ముఖ్యంగా బలహీనుల, బడుగు ప్రజల పట్ల అతని ప్రేమైక భావం, స్వచ్ఛమైన అతని వ్యవహారాలు, జన సామాన్యం పట్ల ఆహ్లాదకరమైన అతని సంబంధాలు, ఉన్నత నైతిక ప్రమాణాలు – ఇవన్నీ కూడా తెరచిన పుస్తకంలా, వెలిగే దీపంలా ప్రజల ముందు ఉంటాయి. ప్రజలకు అతను అందజేసే సందేశాన్ని స్వయంగా ఆచరించి చూపుతాడు. తత్ఫలితంగా ప్రజలు అతని ఉన్నత నైతికతను, వ్యవహారాలను కళ్ళారా చూసి నమ్మకం ఏర్పరచుకుంటారు. ఈ విధంగా సత్యవంతుడైన దైవప్రవక్తను తెలుసుకోవటం సులభ సాధ్యం చెయ్యబడింది. ఇప్పుడు ఆ ప్రవక్తను గుర్తించటం, అతని మాటను అంగీకరించటం, సృష్టికర్త అతని ద్వారా అందజేసిన ప్రబోధనల ముందు తలవంచటం కష్టం కాజాలదు. సత్యాన్ని తెలుసుకునే పద్ధతి ఇంత సులభతరం చేయబడిన తరువాత కూడా జనులు క్రియాత్మకంగా తిరస్కరిస్తే అది సృష్టికర్త తప్పుగానీ, ప్రవక్త తప్పుగానీ కాబోదు. నిరాకరించేవాడే తన మార్గ విహీనతకు బాధ్యుడవుతాడు.

అందుకే పరిశోధన అవసరం. తద్వారానే ప్రవక్తపై, అతను తెచ్చిన సందేశంపై దృఢనమ్మకం ఏర్పడి మనసు కుదుటపడుతుంది. సత్యవంతుడైన ప్రవక్తలోని విశిష్ఠత ఏమిటంటే, అతను తన జీవిత పుస్తకాన్ని ప్రజల ముందు సంతోషంగా తెరచిపెడతాడు. ఎందుకంటే అతను కేవలం తన మాటలతోనే గాకుండా తన ఆచరణాత్మక జీవితం ద్వారా కూడా సృష్టికర్త సందేశాన్ని అందజేస్తాడు. దానిని తన విధ్యుక్త ధర్మంగా భావిస్తాడు.

## స్వార్ధం లేని కృషి

సృష్టికర్త సందేశాన్ని అందజేయడానికి నిస్వార్ధంగా కృషి చెయ్యడం, దివారాత్రులు ఆ పనిలో నిమగ్నుడై ఉండటం, దాని కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడటం, సత్య తిరస్కారులు పెట్టే బాధలకు, వేధింపులకు, మనస్తాపానికి ఓర్చుకోవటం, చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో, మొక్కవోని సాహసంతో, అనితర సాధ్యమైన ఓర్పుతో కార్యరంగంలో నిలబడి ప్రజల బాగోగులను కోరుకోవటం – ఇదంతా సత్యవంతుడు, బాధ్యతాయుతుడైన వ్యక్తి ద్వారానే సాధ్యం.

ఒకవైపు నుంచి ఆరోపణలను, అభాండాలను, వ్యక్తిత్వ హననాన్ని (Character assassination) సహిస్తూ, మరో వైపు నుంచి డబ్బు ప్రలోభాన్ని,

అందమైన మగువను అధికారాన్ని కూడా కాలదన్ని, ఇంకో వైపు నుంచి ఆర్థిక ఆంక్షలను, సంఘ బహిష్కరణ (Bycot) ని కూడా లక్ష్యపెట్టకుండా తన కార్య నిర్వహణలో స్థిరంగా ఉండటం, దేవుడు తనపై మోపిన బాధ్యతను సజావుగా నిర్వర్తిస్తూ ప్రజలు మరచిపోయిన పాఠాలను గుర్తుచేస్తూ ఉండటం, ప్రజలు మానసికంగా శారీరకంగా గాయపరచినప్పటికీ వారి శ్రేయస్సును కాంక్షిస్తూ కార్యనిర్వహణలో లీనమై ఉండటం – ఇదంతా అతని నిస్వార్థ సేవాపరాయణ తకు ప్రతిబింబం. ఇవన్నీ వెరసి ఇచ్చే సాక్ష్యం ఏమిటంటే, అతను సృష్టికర్త తరఫున మానవాళికి మార్గబోధన చేయడానికి నియుక్తుడయిన సత్యవంతుడయిన ప్రవక్త. అందులో సందేహానికి ఏమాత్రం తావులేదు. అది అబద్ధమయ్యే ప్రసక్తే లేదు.

సత్యవంతుడైన సందేశహరుని సత్యం వ్యతిరేక వాతావరణంలో మరింతగా ప్రస్ఫుటమై ముందుకు వస్తుంది. అతను ఓపికతో, మానవాళి మేలును కాంక్షిస్తూ స్థిరంగా తన కార్యక్రమంలో మునిగి ఉన్నప్పుడు అతనిలోని సుగుణాలు అందరికీ కొట్టొచ్చినట్లే కనిపిస్తాయి.

## సందేశహరుని సందేశం - Ideology

తనను దైవ సందేశహరునిగా ప్రకటించుకున్న వ్యక్తి సందేశం అందజేసినప్పుడు, అందులోని సత్యం రెండు అంశాల ద్వారా పరికించబడు తుంది. తాను విశ్వ సార్వభౌమాధికారి తరఫున వచ్చిన ప్రవక్తనని అతనంటాడు. విశ్వ సార్వభౌమాధికారి వాస్తవానికి సమస్త మానవులను సృష్టించినవాడై ఉంటాడు. మానవులందరినీ ఆయన సమానంగా ప్రేమిస్తాడు. మానవులందరి కోసం ఆయన సందేశం ఒక్కటే అయి ఉంటుంది. గాలి, నీరు అందరికీ ఒక్కటే అయినట్లే ఇదీను. ఏ వస్తువు ఒక మనిషికి లాభదాయకమైనదో లేదా హానికరమైనదో అది అలాగే మనుషులందరికీ సమానంగా వర్తిస్తుంది. అతని సందేశంలోని సత్యాన్ని పరికించడానికి అతని ప్రబోధనలలోని మూలాలను పరిశీలించాలి. ఆ ఉపదేశాలలో మానవునికి మానవ స్థాయి ఇవ్వబడిందా లేదా అన్నది చూడాలి. ఆ సందేశం ప్రతి మనిషిని మానవునిగానే సంబోధిస్తోందా? లేక మనుషుల మధ్య భేదాభిప్రాయాలను చూపుతుందా? ఉదాహరణకు : అందులో ధనిక – బీద తారతమ్యాలున్నాయా? నల్లవాడు – తెల్లవాడన్న విచక్షణ ఉందా? వంశం, వర్ణం, భాష, ప్రాంతం ప్రాతిపదికపై

అది అసమానతలను పాటిస్తుందా? అన్న విషయాన్ని కూడా తరచి చూడాలి. అది గనక తారతమ్యం పాటిస్తే ఒకే ఒక్క విషయంలో పాటించాలి – తన సృష్టికర్తను తెలుసుకున్న వారెవరు? ఆయనకు విధేయత చూపి, ఆయన శాసనాలను శిరసావహించి, సదాచరణ చేసి మంచి మనిషిగా రాణించే వారెవరు? అన్న విషయంలో మాత్రమే అది తేడా చూపాలి. ఇలా చేయటం ఎవరికీ కష్టం కాదు. ఇది చాలా సులభమైన పనే. ఈ లక్ష్య సాధన కోసం ఆస్తిగానీ, అంతస్తుగానీ, రంగు గానీ, రూపురేఖలు గానీ అవరోధంగా నిలబడవు. ఈ ప్రబోధనలు మానవులందరినీ ఉద్దేశించినవి. అవి మనుషులందరికీ సమానంగా వర్తిస్తాయి. ఎందుకంటే మనుషులంతా ఒకే సృష్టికర్తచే సృష్టించబడినవారు. అందరి నైజం ఒక్కటే. అందరికీ ఒకే విషయం సరిగ్గా వర్తిస్తుంది – అది లాభదాయకమైనా, హానికరమైనా. సృష్టించిన వాని దృష్టిలో మనుషులంతా సమానులే. ఆయన తాను నిర్మించిన వస్తువుల మధ్య వ్యత్యాసం చూపడు. జాతి, రంగు, వంశం, వర్ణం ఆధారంగా వివక్ష కనబరచడు. మానవుడు చేసే మంచి పనులు లేదా చెడు పనుల ఆధారంగా మాత్రమే ఆయన సజ్జనులు, దుర్జనులు అన్న తేడా కనబరుస్తాడు. దీని ఆధారంగానే వారిని అనుగ్రహిస్తాడు లేదా వారిపై ఆగ్రహిస్తాడు. దీని ఆధారంగానే వారిని సత్కరించటమో శిక్షించటమో చేస్తాడు.

సందేశ ప్రకటన గావించిన ఆ వ్యక్తి సమర్పించిన నియమబద్ధమైన మాటలు ప్రజల హృదయాన్ని తాకుతాయి. బుద్ధికి అందుతాయి. అతను చెప్పిన మొదటి ముఖ్యాంశం ఏమిటంటే, అతని ప్రబోధనలలో విశ్వజనీనత ఉంది. అవి భాష, రంగు, ప్రాంతానికి అతీతంగా ఉన్నాయి. అతని సూత్రప్రాయమైన మాటలోని రెండవ ముఖ్యాంశం ఏమిటంటే అందులో మానవ సమానత్వం ఉంది. మానవులంతా ఒక్కటే. ఎందుకంటే వారంతా ఒకే తల్లిదండ్రుల బిడ్డలు. ఒకే సృష్టికర్తచే ఉనికిలోనికి తీసుకురాబడిన జీవులు. ఈ మౌలిక సత్యాల ద్వారా అతను మనుషులందరినీ ఏకం చేస్తాడు. మానవులందరినీ ఒకే జాతికి చెందినవారుగా చేస్తాడు. ఈ రెండు మౌలిక విషయాలు భేదభావాలన్నీ సమసిపోయేలా చేస్తాయి – అవి భౌగోళికమైనవైనా, జాతి వర్గం వర్ణం ద్వారా ఏర్పడినవైనా వాటికి ఎలాంటి విలువ ఉండదు.

ఈ రెండు పునాదులపైనే ప్రబోధనలన్నీ నిలిచి ఉంటాయి. ప్రబోధనలన్నీ అందరికీ ఒక్కటే. ఎందుకంటే మానవులందరి నైజం ఒక్కటే

అందరూ ఒకే సృష్టికర్తచే చేయబడినవారు. సృష్టికర్త ఎవరికయినా సృష్టికర్తే. తాను స్వయంగా నిర్మించిన వస్తువులలో ఆయన వ్యత్యాసం చూపడు. సత్య సందేశహరుడు సమర్పించిన సూత్రాలు మానవ ఏకత్వానికి (Oneness of Humanity) కి బలమైన భావన (Strong Concept) ను ఇస్తాయి. ఆదర్శ సమాజం (Ideolistic Society) కొరకు మానవ ఏకత్వపు భావన మొట్టమొదటి షరతు అన్నది గమనార్హ విషయం. మానవ ఏకత్వ భావన ప్రాప్తికై మనుషులందరి సృష్టికర్త ఒక్కడే, మానవులంతా ఒకే తల్లిదండ్రుల సంతానం అన్న దృక్పథాన్ని కలిగి ఉండటం అవసరం.

సందేశహరుని మొదటి సూత్రప్రాయమైన విషయాన్ని అమలుపరచిన దాని ఫలితంగా కనీసం 90 శాతం పరివర్తన మానవ జీవితంలో వస్తుంది. దీనికి కారణమేమిటంటే –

(1) ఆదేశాలు, ఉపదేశాలు విశ్వసార్వభౌమాధికారి తరఫున ఉన్నాయి. తత్కారణంగా వాటిపట్ల పవిత్ర భావన, భీతి జనిస్తాయి.

(2) సృష్టికర్త ఆదేశాలు మానవ నైజానికి అనుగుణంగా ఉంటాయి. అందువల్ల అవి మానవాళికి శ్రేయోదాయకమైనవై ఉంటాయి. అందులో అన్యాయం, హక్కులను హరించటం వంటివి ఉండవు. పైగా అవి న్యాయబద్ధంగానూ, దయాగుణం కలిగినవిగానూ ఉంటాయి. తత్ఫలితంగా మానవ జీవితంలో శాంతి సుఖాలు ప్రాప్తిస్తాయి.

(3) విశ్వసార్వభౌమునికి విధేయత చూపటం వల్ల ఆయన ప్రసన్నత ప్రాప్తమవుతుంది. ఆయన ఆగ్రహం నుండి మనిషి తనను కాపాడుకోగలుగుతాడు. ఒకవేళ అతను అవిధేయత కనబరచి ప్రజలపై దౌర్జన్యానికి ఒడిగడితే శిక్షార్హుడవుతాడు. అంటే ఒక విధంగా సృష్టికర్త తన ఆదేశాల పాలనను తన ప్రసన్నతతో, అవిధేయతను అప్రసన్నతతో ముడిపెట్టి వాటిలో అమలుపరిచే శక్తిని పొందుపరిచాడు. అంటే మనిషి తనంతటతానే దైవాదేశాలను తనపై విధించుకునే శక్తి (Self Implementing Force) ని ఉంచాడు. మనిషిలో దైవాదేశాల స్వయం పరిపాలనా విధానానికి దోహదపడే 90 శాతం కారకాలివి. మిగిలిన 10 శాతం బయటి శక్తి – అంటే పోలీసు, న్యాయశాఖలాంటివి.

**రెండవ అధ్యాయం :**

**(Chapter - II)**

# దైవప్రవక్తనని ముహమ్మద్ (సఅసం) చేసిన ప్రకటన సత్యమేనా? ... ఒక చూపులో!

- ముహమ్మద్ (సఅసం) దైవదౌత్య ప్రకటనలోని సత్యాన్ని పరిశీలించటం.
- ఆయన సత్యవంతుడని ప్రజలిచ్చిన సాక్ష్యం, ప్రవక్తగా ప్రకటన, సందేశం.
- ప్రవక్తగా నియమించబడిన మొదటి మూడేండ్లలో ప్రకటనా విధానం.
- మూడేండ్ల తరువాత ప్రవక్తగా ప్రకటనా తీరు, సందేశ పరిచయ పద్ధతి.
- తనను దైవ సందేశహరునిగా ప్రకటించిన పద్ధతి, అందలి యుక్తి.
- వ్యతిరేకులు సయితం ఆయనలోని సత్యసంధతను ఒప్పుకునేవారు.
- కుటుంబీకులు, సమీప బంధువుల ముందు దైవప్రవక్తగా ప్రకటించు కోవటం, ప్రభు సందేశాన్ని వినిపించటం.
- తిరస్కారం, వ్యతిరేకత ఫలితంగా దైవదౌత్య ప్రకటనలోని సత్యం మరింత ప్రస్ఫుటమవుతుంది. దైవప్రవక్తగా ప్రకటించుకున్న విషయం సర్వత్రా చర్చనీయాంశం అవుతుంది.
- ప్రచార వ్యాప్తి, దైవ సందేశహరునిగా ప్రకటన, సందేశాన్ని చేరవేసే విధానం.
- వ్యతిరేకుల నోట ముహమ్మద్ (స) దైవదౌత్య ప్రకటనలోని సత్య ధ్రువీకరణ.
- ఖురైషు నాయకుల శిబిరాలలో కలవరం, ఆయన (స) సందేశంలోని సత్యబలానికి తార్కాణం.

- వ్యతిరేకుల దుష్ప్రచారం.
- విశ్వసించిన వారి జీవితాలలో అనూహ్యమైన నైతిక పరివర్తన.
- సమాజంలోని బలహీన వర్గాల పట్ల సద్వ్యవహారం, వారి యెడల ప్రేమైక భావం, వారి కష్టసుఖాలలో పాల్గొనటం.
- తల్లిదండ్రుల హక్కులను దివ్య ఖుర్ఆన్ వివరిస్తోంది.
- రక్తపాతానికి, పాశవికతకు దూరంగా పవిత్ర జీవితాలు.
- ముహమ్మద్ (స) అవలంబించిన విధానం వినాశం నుండి తప్పించింది.
- ఆదేశాలను విధితం చేసే స్వయం శక్తి.
- విశ్వసించినవారు పీడితులుగా ఉండి ముహమ్మద్ (స) సత్యవంతుడైన ప్రవక్త అని ప్రకటించారు.
- యదార్థాన్ని గ్రహించడానికి బాధల, పీడనల సంక్షిప్త గాథ.
- ఖుర్ఆన్‌లోని అసాధారణమైన శైలి, అది దైవవాక్కు అనడానికి నిదర్శనం.
- సృష్టికర్త వాక్కు, సందేశం సత్యబద్ధమని ఆధారాలతో సహా సమర్పిస్తోంది.
- సందేశం ప్రమాణబద్ధమవడానికి మరో దృష్టాంతం.
- ముహమ్మద్ (స)పై, ఆయన తీసుకువచ్చిన సందేశంపై సంతృప్తి.
- వహీ (దివ్యవాణి)ని అందుకుంటున్నప్పటి పరిస్థితి.

# దైవ సందేశహరునిగా ముహమ్మద్ (సఅసం) చేసుకున్న ప్రకటన సత్యబద్ధమైనదేనా?

వెనుకటి అధ్యాయంలో దైవప్రవక్తనని ప్రకటించుకునే వ్యక్తి సత్యవంతుడేనా? లేక అబద్ధీకుడా? అన్నదానిపై పరిశీలనకు సంబంధించి సర్వసాధారణ చర్చ చేయడం జరిగింది. ఇప్పుడు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని తీసుకుని, అతని దైవదౌత్య ప్రకటనపై పరిశీలించటం జరుగుతుంది. ఇది ఒక సవాలుగా మన ముందుకు రానున్నది.

## ముహమ్మద్ (స) దైవదౌత్య ప్రకటనలోని సత్యబద్ధతపై పరిశీలన

ఇప్పుడు ఒక టాస్క్ (Task) లేదా సవాలు (Challenge) మిగిలింది. గతించిన సమీప కాలంలో సృష్టికర్త తరఫున సందేశం ఇచ్చిన మానవాళి వద్దకు పంపబడిన ఆ వ్యక్తి ప్రజల మధ్యన ఉన్నాడా? లేక చారిత్రక వాస్తవంగా మిగిలిపోయాడా? ప్రపంచంలోని మనుషులలో, తాను సృష్టికర్త వద్ద నుంచి ప్రవక్తగా వచ్చిన వాడినని ప్రస్తుతం ఎలుగెత్తి ప్రకటించేవారెవరూ కనిపించరు. కాబట్టి అలాంటి వ్యక్తిని మనం చరిత్రలో అన్వేషించాలి. తాము సృష్టికర్త వద్ద నుండి వచ్చిన ప్రవక్తలమన్న పిలుపు చరిత్ర పుటలలో ఎన్నోచోట్ల వినవస్తుంది. (మూసా, ఈసా, ఇబ్రాహీమ్, దావూద్, సులైమాన్, యూసుఫ్ తదితర ప్రవక్తల పిలుపు చరిత్ర పుటల్లో నుంచి వినవస్తూ ఉంటుంది). ఆయా ప్రవక్తలు తమ తమ కాలాల్లో మానవాళికి సృష్టికర్త సందేశాన్ని అందజేశారు.

అందరికన్నా ఆఖరి పిలుపు సమీప కాలంలో ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ నుండి పవిత్ర మక్కా నగరిలో వినవస్తుంది. క్రీ.శ. 611లో – 40 ఏండ్ల వయస్సులో ఆయన తనను దైవప్రవక్తగా ప్రకటించుకున్నారు. తాను విశ్వసార్వభౌముని తరఫున, ఆయన సందేశహరునిగా నియమించబడ్డానని చెప్పారు. అలా ప్రకటించిన వ్యక్తి సత్యవంతుడా కాదా అన్న దానిని పరికించటం, పరిశీలించటం, పరిశోధించటం అవసరం. ఇది చాలా ముఖ్యమయిన పరిశోధన. దీనిని ఎంతో సావధానంగా, గంభీరంగా పరిశీలించాలి. ఎందుకంటే ఆ ప్రకటన కర్త మాటను అంగీకరించాలా? లేదా? అన్నది జీవితంలో అత్యంత ముఖ్యమయిన నిర్ణయం. అది యావజ్జీవితంపై, జీవితంలోని వివిధ విభాగాలపై బలమైన ప్రభావం (Impact) వేస్తుంది. ఆ ప్రభావం సకారాత్మకంగానూ ఉండవచ్చు, నకారాత్మకంగానూ ఉండవచ్చు. దీనిద్వారా సన్మార్గం లభించనూవచ్చు, సన్మార్గానికి దూరం కానూవచ్చు. సృష్టికర్త గురించి ప్రామాణికమైన పరిచయానికి నోచుకోనూవచ్చు లేక దానికి దూరం కానూవచ్చు. ఒకవేళ ప్రకటనకర్త అబద్ధీకుడై ఉంటే, అతనిని సత్యసంధుడుగా నమ్మినపుడు సర్వనాశనం తప్పదు.

అందుచేత చరిత్రలోకి వెళ్ళి అత్యంత ప్రామాణికమయిన సాధనాల (Authentic Sources) ద్వారా పరిశోధన చేయాలి. ముహమ్మద్ (స)కు సంబంధించినంత వరకు అన్నింటికన్నా ప్రమాణబద్ధమైన సాధనం ఆయన (స) సతీమణులు, ఆయన (స) గారి ప్రియమైన స్నేహితులు. వారు సహాబా (Companions) గా పిలువబడ్డారు. వారు చాలా దగ్గరి నుండి ముహమ్మద్ (సఅసం)ను చూశారు, విన్నారు. ఆయన (స)తో చాలా సమయం గడిపారు. జీవితంలోని ఎన్నో కీలక ఘట్టాలలో ఆయనకు తోడు ఉన్నారు. కష్టంలోనూ, సుఖంలోనూ పాలుపంచుకున్నారు. ఆయన యెడల నిష్కల్మషమైన ప్రేమాదరణలు కలిగి ఉండేవారు. తమ ప్రాణాలకన్నా ఎక్కువగా ఆయన్ని ప్రేమించారు. ఆయన (స) గారి ప్రతి వాక్కును, ప్రతి ఆచరణను భద్రపరిచారు. చేయమన్న దానిని, వారించిన విషయాన్ని కూడా రికార్డు చేసిపెట్టారు. చారిత్రక సంఘటనల్ని పదిలపరచి తమ కుటుంబీకులకు, తోటివారికి, భావితరాలకు అందజేశారు. అంతేకాదు, ఆయన (స) గారి అనుయాయులు ఆయన ఆచరించిన ప్రతి ఆచరణను అనుసరించారు. దానిని తరం తరం నిరంతరం అందజేసుకుంటూ వచ్చారు. ఇదీ ప్రామాణికమైన ఒక సాధనం. దీనిని వదలి

మిడిమిడి జ్ఞానంతో, సంకుచిత స్వభావంతో, దురభిమానంతో ఇతరత్రా అప్రమాణికమైన సాధనాలను ఆశ్రయించటం చిత్తశుద్ధి, నిజాయితీ లేని ఒనరుల వెనుక పడటం ఎంతమాత్రం తగదు. ఇది మనిషిని అయోమయాని (Confusion)కి గురిచేస్తుంది. తత్కారణంగా పరిశోధకుడు తన ప్రయాణం మధ్యలో నుంచే వెనుతిరుగుతాడు. అతని ప్రయత్నం వృధా అవుతుంది. అతనికి దక్కేదేమీ ఉండదు. అందువల్ల ప్రామాణికమైన సాధనాలపై ఆధారపడటం చాలా ముఖ్యం. తన పరిశోధనలో చిత్తశుద్ధి గలవారు ప్రామాణికమైన గ్రంథాల ద్వారా విషయాన్ని గ్రహించాలి. ముహమ్మద్ (స) దైవప్రవక్త అన్న విషయాన్ని త్రోసిపుచ్చేవారి రచనలను చదివి మోసపోకూడదు. అలాగే ముహమ్మద్ (స) యెడల అసూయతో, దురభిమానంతో ఆయన పవిత్ర జీవితాన్ని వక్రీకరించేవారి పుస్తకాలను అధ్యయనం చేయరాదు. ఇస్లాం చరిత్రపై, ముహమ్మద్ (స) పవిత్ర జీవితం (Biography) పై ఉన్న ప్రమాణబద్ధమైన గ్రంథాలను మాత్రమే తిరగ (Refer) వేయాలి. ఎంతో ముఖ్యమైన వ్యక్తి గురించి లేదా ఎంతో ముఖ్యమైన సందేశం గురించి పరిశోధన సాగిస్తున్నప్పుడు ప్రామాణికతకు పెద్ద పీట వేయటం అవసరం. అన్యధా ప్రయత్నమంతా నిరర్ధకం అవుతుంది.

చరిత్ర చెప్పేదేమిటంటే, సృష్టికర్త తరఫు నుండి సందేశాన్ని మొట్ట మొదటిసారిగా ముహమ్మద్ (సఅసం) అందుకున్నప్పుడు ఆయన ఆందోళనకు గురయ్యారు. తన ప్రాణాలకే ముప్పు ఉందని తలపోసి, తన నివాస గృహానికి వచ్చి పడుకున్నారు. ఆయన సతీమణి హజ్రత్ ఖదీజా (ర.అ) ఆయనపై కంబలి కప్పారు. తమరు ఫలానా ఫలానా సత్కార్యాలెన్నో చేస్తారు. అలాంటి మిమ్మల్ని దేవుడు వృధా గావిస్తాడా? అలా ఎన్నటికీ జరగదని ఓదార్చారు. మీరు ఎంతో ఉన్నతస్థాయి (High Quality) పనులు చేస్తారు, మీరొక మహా మనీషి అని సాక్ష్యమిచ్చారు. ఆమె ఎవరు? గత కొన్నేండ్లుగా ఆయన (స)తో దాంపత్య జీవితాన్ని పంచుకుంటూ, చాలా దగ్గరి నుండి ఆయన్ని చూసిన పుణ్య స్త్రీ. అందువల్లనే ఆమె ఆయన (స) గారికి ఆ విధంగా ధైర్యం చెప్పగలిగారు. మీ ప్రభువు మీ కృషిని వృధా కానివ్వడు. మీరు బంధువుల పట్ల సద్వ్యవహారం చేస్తారు. సదా సత్యమే పలుకుతారు. ఎవరి అమానతులను వారికి నిజాయితీగా అప్పగిస్తుంటారు. అభాగ్య జీవులకు చేయూతనిస్తుంటారు. నిరాధార జీవుల బరువును మోస్తుంటారు. అగత్యపరులను ఆర్థికంగా ఆదుకుంటూ ఉంటారు. అతిథులకు మర్యాద చేస్తారు. సత్కార్యాలలో తోడ్పడుతూ ఉంటారని ఆయనలోని సుగుణాలన్నింటినీ ఏకరువు పెట్టారామె.

ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉందని ఆయన చెప్పారంటే, అకస్మాత్తుగా ఆయనపై దైవదౌత్యపు బాధ్యత మోపబడిందని అర్థమవుతోంది. అంతేగాని ఆయన ఆ పదవిని ఆశించలేదు. ఎంత ఉన్నతశ్రేణికి చెందిన వ్యక్తిని విశ్వప్రభువు తన కార్యం కొరకు ఎన్నుకున్నాడో కూడా దీనిద్వారా విదితమవుతోంది. ఈ విషయాన్ని ఎవరో కాదు, అర్ధాంగి ధ్రువీకరించింది. ఆమె గత పదిహేను సంవత్సరాలుగా ఆయనతో కాపురం చేసింది. ఆయన్ని అతి సమీపం నుండి గమనించింది. ఆయన సద్గుణాలలో అతి ముఖ్యమైనవి సత్యసంధత, నిజాయితీతత్పరత. దైవదాసులకు సందేశాన్ని అందజేసే వారిలో ఈ రెండు సుగుణాలు అవశ్యంగా ఉండాలి.

ఇది దైవ సందేశాన్ని అందుకున్న తొలి అనుభవం. ఆ తరువాత సందేశాన్ని మానవాళికి అందజేయమన్న ఆజ్ఞ వస్తుంది. బాధ్యతా భావాన్ని గుర్తు చేయటం జరుగుతుంది. ఏ విధంగా ప్రజలకు దైవ సందేశాన్ని అందజేయాలో సూచించబడుతుంది.

దైవదౌత్యం అందకముందు ముహమ్మద్ (స) ఎటువంటి వ్యక్తిగా ఉండేవారో కూడా చరిత్ర చెబుతోంది. దైవ సందేశహరునిగా కావలసిన అర్హతలన్నింటినీ చూసిన మీదటే విశ్వ ప్రభువు ఆయన్ని తన కార్యం కొరకు ఎంపిక చేసుకున్నాడు. సందేశాన్ని చేరవేసే బాధ్యతను ఆయనపై మోపాడు. ఒక దైవప్రవక్తలో ఉండవలసిన మొదటి రెండు లక్షణాలను తీసుకుందాం. దీని ప్రస్తావన మొదటి పుటల్లో (మొదటి అధ్యాయంలో) కూడా వచ్చింది. మొదటి లక్షణం : అతడు సత్యసంధుడై ఉండాలి. జీవితంలో ఎన్నడూ అబద్ధం చెప్పనివాడై ఉండాలి. ఈ విషయానికి ఆ సమాజ సభ్యులంతా సాక్షులుగా ఉండాలి. రెండవ లక్షణం : నిజాయితీతత్పరత, అమానతుదారీతనం. ఎవరయినా తనను నమ్మి ఒక వస్తువును తన వద్ద భద్రపరిస్తే దానిని వారికి యధాతథంగా తిరిగి అప్పగించేవాడై ఉండాలి.

ప్రవక్తగా నియమితులు కాకపూర్వం 15 సంవత్సరాలు ఆయనతో కలసి కాపురం చేసిన ఆయన శ్రీమతి స్వయంగా ఆయన సత్యసంధులని ధ్రువీకరించింది. ఇంతకు మించిన సాక్ష్యం ఏదీ ఉండదు. ఆ తరువాత ఆయన పినతండ్రి కుమారుడు హజ్రత్ అలీ, ఆయన బానిస జైద్ బిన్ హారిసా, ఆయన ప్రాణ స్నేహితుడు అబూబకర్ బిన్ ఖహాఫా కూడా ఆయన (స) సత్యసంధతకు

తిరుగులేని సాక్షులుగా నిలిచారు. దానికి తోడు నగర ప్రజలు ఇచ్చిన సాక్ష్యం! ముహమ్మద్ (స) సఫా పర్వతంపై నిలబడి ప్రజలకు పిలుపు ఇచ్చారు. ప్రజలారా! ఈ పర్వతానికి అవతల ఒక శత్రు సైన్యం మీపై దండెత్తడానికి మోహరించి ఉందని నేను చెబితే మీరు నమ్ముతారా? అని అడిగినప్పుడు, అందరూ ముక్త కంఠంతో, "ఎందుకు నమ్మము? నీవు అబద్ధం చెప్పగా మేమెన్నడూ వినలేదు" అని చెప్పారు.

అంటే, ఆయన (స) సత్యసంధుడని సాక్ష్యమిచ్చిన వారిలో కేవలం సమీప బంధువులు, ప్రత్యేక వ్యక్తులు మాత్రమే గాకుండా సమాజ సభ్యులంతా ఉన్నారు. వారిలో ధనికులు, పేదలు, బానిసలు, స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు, మతాధిపతులు, రాజకీయవాదులు – అన్ని రకాల వారున్నారు. వారంతా ఒక్కుమ్మడిగా ఆయన (స) సత్యసంధతపై ఆమోద ముద్రవేశారు. కేవలం సమీప బంధువులు సాక్ష్యమిచ్చివుంటే, వారు ముహమ్మద్ (స) పట్ల గల ప్రేమాదరణల వల్ల సాక్ష్యమిచ్చి ఉంటారని అనుకోవడానికి ఆస్కారముండేది. కాని వాళ్ళ సాక్ష్యంతో పాటు సామాన్య ప్రజానీకం కూడా ఆయన సత్యసంధులని సాక్ష్యమిచ్చింది. కాబట్టి ఇప్పుడు ముహమ్మద్ (సఅసం) ఒక సత్యసంధుడు, ఆయన ఎన్నడూ అబద్ధమాడని వ్యక్తి అన్న విషయంలో తావు లేకుండా పోయింది. కాబట్టి సృష్టికర్త వ్యవహారంలో కూడా ఆయన చెప్పేది సత్యమే అయి ఉండాలి. ఆయన నిజంగా సృష్టికర్త తరఫున ఎంపిక చేయబడిన విశిష్ఠ వ్యక్తి, సత్యవంతుడైన ప్రవక్త. దైవ సందేశాన్ని ఆయన దైవదాసులకు వినిపిస్తున్నాడు. వివేకవంతమైన విషయాలను విశదీకరిస్తున్నాడు. వాటిని స్వయంగా ఆచరించి చూపిస్తున్నాడు – తద్వారా ఆయన విధానాన్ని అనుసరించటం సులభతరం అయ్యేలా చేస్తున్నాడు.

ముహమ్మద్ (స) యుక్త వయస్సులో ఉండగా జరిగిన ఒక సంఘటన – ఆయన 35 ఏండ్ల వయస్సులో ఉన్నప్పుడు పవిత్ర కాబా గృహం నవ నిర్మాణం జరిగింది. నిర్మాణం పూర్తయ్యాక "హజ్రె అస్వద్" (కాబా గృహంలో ఒక మూలన ప్రతిష్ఠించబడి ఉండే నల్లని రాయిని అరబీలో 'హజ్రె అస్వద్' అంటారు)ను దాని స్థానంలో అమర్చే విషయంలో అరబ్బు తెగల మధ్య వివాదం ఏర్పడింది. ఆ రాయిని అమర్చే గౌరవం తమకు దక్కాలంటే తమకు దక్కాలని ప్రతి తెగవారు పట్టుపట్టారు. దాంతో ఘర్షణ తీవ్రతరమయింది. వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. అప్పుడు ఆ సమూహంలోని ఒక పెద్ద మనిషి జోక్యం

చేసుకుని, “ఆగండి. రేపు ఉదయం పవిత్ర కాబా గృహ ప్రాంగణ ద్వారంలో ప్రవేశించే వ్యక్తిని తీర్పు అడుగుదాం. ఆ వ్యక్తి ఇచ్చే తీర్పును అందరం శిరసావహిద్దాం” అని సలహా ఇచ్చాడు. అరబ్బు తెగలన్నీ ఈ సలహాతో ఏకీభవించాయి. మరునాడు ఉదయం అందరికన్నా ముందు కాబా గృహ ప్రాంగణంలో ప్రవేశించిన వ్యక్తిని ప్రజలు చూశారు. ఆయన ఎవరో కాదు, ముహమ్మద్ (సఅసం). జనులు సంతోషంతో కేరింతలు కొడుతూ, “ఇదిగో సాదిఖ్ (సత్యవంతుడు) విచ్చేశారు. అమీన్ (నిజాయితీపరుడు) ఏతెంచారం”టూ హర్షధ్వానాలు చేశారు. అంటే వారు ముహమ్మద్ (స)ను ఆ క్షణంలో పేరుతో పిలువకుండా గౌరవాదరణలతో ఆయనకున్న బిరుదులతో పిలిచారు. దీనినిబట్టి ప్రజాబాహుళ్యంలో కూడా ఆయన గుణగణాలు ఎంతగా ప్రసిద్ధిచెంది ఉండేవో విదితమవుతోంది. జనుల దృష్టిలో ఇంతటి ఉన్నతస్థానం పొందటం సామాన్య విషయం కాదు. ఆ వ్యక్తి ఆచరణాత్మక జీవితాన్ని దగ్గరి నుండి గమనించిన మీదటే ఆయన గొప్పదనం గురించి వారు ఆ నిర్ణయానికి రాగలిగారు. వారి సాక్ష్యంకన్నా పెద్ద సాక్ష్యం మరెవరిది కాగలదు? అదీ ఒకరిద్దరు కాదు, సమాజ సభ్యులంతా ఆయనలోని సుగుణాలను అంగీకరించారు. ఇది చారిత్రక సత్యం.

అంతేకాదు, ముహమ్మద్ (స) విషయావగాహనలో సాటిలేని మేటి. ఆయన (స) సమస్యకు సర్వోత్తమ పరిష్కారం సూచించేవారు. “హజ్రె అస్వద్” విషయంలో చెలరేగిన ఘర్షణను నివారించడానికి ఆయన సూచించిన పరిష్కారం గమనార్హం. ఆయన (స) ఒక దుప్పటిని పరచి, ఆ నల్లని రాయిని దానిపై ఉంచారు. తెగల నాయకులంతా ఒక్కసారిగా ఆ దుప్పటిని నలుమూలల నుంచి పట్టుకుని, దానిని అమర్చవలసిన చోటికి చేర్చారు. ఆ తరువాత ఆయన (స) ఆ రాయిని ఎత్తి, దాని స్థానంలో ఉంచారు.

**అమానతు :** ముహమ్మద్ (సఅసం) ‘అమీన్’ అనే బిరుదుతో ఆ సమాజంలో ప్రసిద్ధికెక్కారు. అక్కడి చాలామంది ప్రజలు ఆయనతో విభేదించినప్పటికీ, ఆయన్ని వ్యతిరేకించినప్పటికీ తమ ధనాన్ని, విలువైన వస్తువులను ఆయన దగ్గర అమానతు (అప్పగింత)గా భద్రపరిచేవారు. ఆయన వద్ద తమ సొమ్ము ఎంతకాలం ఉన్నా అది భద్రంగా ఉంటుందన్న భరోసా వారికి ఉండేది. మరి చూడబోతే ఆ కాలంలో అక్కడ వ్రాతపత్రాలు ఉండేవి కావు. అక్కడ చదువుకున్నవారు కొద్దిమంది మాత్రమే. ముహమ్మద్ (స)కు సయితం చదవటం, వ్రాయటం రాదు. అయినప్పటికీ ఆయన ఎవరి అమానతులను వారికి సరిగ్గా వాపసు చేసేవారు.

ముహమ్మద్ (సఅసం) లోని నిజాయితీతత్పరతకు పరాకాష్ఠ శత్రువులు ఆయన ఇంటిని దిగ్బంధం చేసినప్పుడు ఆయన వ్యవహరించిన తీరు. మక్కాలోని తెగలన్నీ ఒక్కసారిగా ఆయన్ని చుట్టుముట్టి హతమారిస్తే తమ మార్గంలో ఉన్న ముల్లును సునాయాసంగా తొలగించుకున్నట్లవుతుందని శత్రువులు కుట్రపన్నారు. ఎందుకంటే ఈయనగారు సృష్టికర్త సందేశమంటూ రంగ ప్రవేశం చేసి తమ పెత్తనాన్ని అంతమొందించ గోరుతున్నారు. సమానతలను నెలకొల్పగోరుతున్నాడు. బానిసలను మనుషుల బానిసత్వం నుండి విడిపించి సృష్టికర్త బానిసలుగా చేయదలుస్తున్నాడు. మనుషులను మనోవాంఛల దాస్యం నుండి తీసి ప్రభుదాస్యంలోకి తీసుకు రావాలనుకుంటున్నాడు. అదే గనక జరిగితే ఇక తమ అధికారానికి నూకలు చెల్లినట్లే. అతని ఈ ఉన్నతాశయాలు ఖురైషు సర్దారులకు బొత్తిగా గిట్టలేదు. కాబట్టి ముహమ్మద్ (స) బెడద నుండి తమను తాము కాపాడుకోవాలంటే ఒక్కటే మార్గం – అతన్ని తమ దారి నుండి తొలగించుకోవాలి. అన్ని తెగలవారు కలసి అతనిపై మూకదాడి జరపాలి. అతన్ని కడతేర్చిన బాధ్యత అందరూ వహిస్తే బనూ హాషిమ్ తెగవారు ప్రతీకారం తీర్చుకోవటం కష్టమవుతుంది. ఈ విధంగా వారంతా వ్యూహరచన చేసి ముహమ్మద్ (స) విశ్రాంతి తీసుకుంటున్న గృహాన్ని దిగ్బంధం చేశారు. అలాంటి క్లిష్ట సమయంలో ఆయన (స) తన పెత్తండ్రి కుమారుడైన హజ్రత్ అలీ (రజి)కి ప్రజల అమానతులన్నీ ఇచ్చి, ఎవరి అమానతులను వారికి యధాతథంగా అప్పగించాలని సూచించారు. ఇదీ నిజాయితీ అంటే. ప్రాణ శత్రువుల అమానతులను సయితం ఎవరివి వారికి ఇవ్వమని చెప్పటం అమానతుదారీ తనానికి పరాకాష్ఠ. దైవానికి కావలసింది కూడా ఇలాంటి నిజాయితీపరుడే. ఇలాంటి వానికే ఆయన తన సందేశ అమానతును అప్పగిస్తాడు. అలాంటి వ్యక్తిని సందేశహరునిగా ఎంపిక చేస్తేనే సందేశం మార్పులు చేర్పులకు గురికాకుండా ఉంటుంది. హెచ్చుతగ్గులు లేకుండా అది ప్రజల వరకూ చేరుతుంది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాసరే, శత్రువుల నుండి తనకు హాని జరుగుతుందన్న భయం ఉన్నాసరే ఆ నిజాయితీపరుడు తన కర్తవ్యాన్ని సజావుగా నెరవేరుస్తాడు.

బీబీ ఖదీజా మక్కాలో సుప్రసిద్ధ వాణిజ్యవేత్త. ధనికురాలు. ఆమె ఒక వితంతు మహిళ. వ్యాపారం కొరకు ఆమె నిజాయితీపరుడైన వ్యక్తి అన్వేషణలో ఉన్నారు. చివరకు ఆమె వేతనంపై వర్తక సామగ్రిని ఇచ్చి తన

బానిస వెంట ఆయన్ని (స) సిరియా దేశానికి పంపించింది. ఆ సమయంలో ముహమ్మద్ (స) యుక్త వయస్కులు. ఆయన వయస్సు 20 - 25 ఏండ్ల మధ్య ఉంటుంది. వ్యాపారం (Business) లో ఎంతో లాభం వచ్చింది. సిరియా నుండి తిరిగి వచ్చాక ఆయన లెక్కలన్నీ ఖదీజాకు సమర్పించి, ఆమె సరకుల్ని ఆమెకు అప్పగించారు. రెండవసారి కూడా ఆమెగారు ముహమ్మద్ (స)నే సిరియాకు వెళ్ళమని అభ్యర్థించారు. ఎందుకంటే ఆయన (స) నిజాయితీ తత్పరతపై, సత్యసంధతపై ఆమెకు పూర్తి నమ్మకం ఏర్పడింది. ఆ రోజుల్లో ముహమ్మద్ (స) కూడా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు. పినతండ్రి సంరక్షణలో ఉన్నారు. బ్రతుకుతెరువు కోసం ఏదో ఒక పని చేయాల్సిన ఆవశ్యకత ఉంది. కాని ఆయన (స) వర్తకంలో మోసం చేయలేదు. 'నిజాయితీపరుడైన వర్తకుడు'గా పేరు మోశారు. ఈ కారణంగానే హజ్రత్ ఖదీజా (ర.అ) ఆయనకు వివాహ సందేశం పంపారు. ఆమె స్వయంగా ఒక పుణ్య స్త్రీ. 'తాహిరా' (పవిత్రురాలు)గా ప్రసిద్ధికెక్కారు. ముహమ్మద్ (స) జీవితంలో నిజాయితీతత్పరత, సత్యసంధతకు సంబంధించిన ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

## సత్యసంధతపై ప్రజలిచ్చిన సాక్ష్యం, ప్రవక్తగా ప్రకటన

ఒకరోజు ఉదయం ముహమ్మద్ (సఅసం) 'సఫా' పర్వతం పైకెక్కి 'యా సబాహా' (అయ్యో ప్రభాత సమయపు విపత్తు) అంటూ బిగ్గరగా కేకవేశారు. తెల తెలవారుతుండగా నగరానికి శత్రు ప్రమాదం పొంచి ఉంటే, ఈ సంగతి తెలిసిన వ్యక్తి పర్వత శిఖరంపైకెక్కి, ఈ విధంగా కేకేసి పిలవటం అరబ్బు ఆచారం. ప్రజలు ఆ వ్యక్తి పిలుపుపై నలువైపుల నుండీ పరుగులు తీస్తూ వచ్చేవారు. ముహమ్మద్ (స) పిలుపుపై కూడా అందరూ తమ ఇళ్ల నుండి బయలుదేరి వచ్చారు. అందరూ ఒక చోటికి చేరాక, "ప్రజలారా! ఈ పర్వతానికి అవతల ఒక శత్రు సైన్యం మీపై దండెత్తడానికి మోహరించి ఉంద"ని నేనంటే మీరు నమ్ముతారా? అని ముహమ్మద్ (స) అడిగారు. దానికి వారు, 'ఎందుకు నమ్మము? తప్పకుండా నమ్ముతాము. మాకు తెలిసినంత వరకు నీవు అబద్ధం పలకటం మేమెరుగము' అన్నారు. అప్పుడు ఆయన (స) ఇలా చెప్పారు : "అయితే వినండి! దేవుని కఠిన శిక్ష అవతరించక ముందే నేను మిమ్మల్ని సావధానపరుస్తున్నాను. మిమ్మల్ని మీరు ఆ శిక్ష నుండి కాపాడుకోండి. నేను అల్లాహ్‌కు ప్రతిగా మీకేవిధంగానూ సహాయపడలేను. ఇతరులు సదాచారాలు

తీసుకుని దైవ సన్నిధిలో హాజరైనప్పుడు మీరు ప్రాపంచిక దుష్కార్యాలను మీ నెత్తిపై మోస్తూ రాకూడదు సుమా! ప్రళయదినాన సదాచార సంపన్నులే నా వారవుతారు. ఆ రోజు మీరు 'ఓ ముహమ్మద్ (స)' అని అరిచినా ప్రయోజన ముండదు. నేను మీ నుండి ముఖం త్రిప్పుకుంటాను. కాకపోతే ఈ ప్రపంచంలో నా రక్త సంబంధీకులైన వారితో బంధుత్వ హక్కును నెరవేరుస్తాను."

సఫా పర్వతం పైనుండి ముహమ్మద్ (స), ఖురైషు జనులను ఉద్దేశించి ఏమన్నారో చూడండి, "సమీప బంధువులను హెచ్చరించమని అల్లాహ్ నన్ను ఆదేశించాడు. ఖురైషులైన మీరు నా సమీప బంధువులు. మీరు **'లా ఇలాహ ఇల్లల్లాహ్'**ను హృదయపూర్వకంగా అంగీకరించనంత వరకూ దైవ సన్నిధిలో నేను మీకు ఏవిధంగానూ తోడ్పడలేను. మీరు ఈ కలిమాను అంగీకరించినప్పుడే నేను మీ గురించి సాక్ష్యం ఇవ్వగలను. ఈ కలిమా మూలంగానే అరబ్బులు మీకు విధేయులు అవుతారు. దీని మూలంగానే అరబ్బేతరులు మీకు లోబడి ఉంటారు."

ఈ సంఘటనలో సందేశం ఉంది – నాటి ప్రజలకు, నేటి ప్రజలకు కూడా. ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం గురించి హెచ్చరించే పద్ధతిని ఆయన (స) అవలంబించారు –

1. పర్వత శిఖరం పైనుండి 'యా సబాహా' అంటూ హెచ్చు స్వరంతో పిలుపు ఇవ్వటం అనేది ఒకానొక విపత్తు నుండి ప్రజలకు సావధానపరిచే విధానం. ఈ విధానం ద్వారా ముహమ్మద్ (స) జనులకు మరణానంతర జీవితం గురించి, నరక యాతన గురించి హెచ్చరించి, దాని నుండి తప్పించుకునే ఉపాయం చెప్పారు.
2. పర్వత శిఖరం పైనుండి హెచ్చరించటం గమనార్హం. అక్కడ నిలబడిన వారు పర్వతానికి ఇరువైపుల ఏముందో చూడగలరు. ఇందులోని సందేశం ఏమిటంటే, విశ్వప్రభువు నన్ను తన ప్రవక్తగా నియమించాడు. ఈ ప్రవక్త స్థానం నుండి నేను ఈ జీవితాన్ని, మరణానంతర జీవితాన్ని కూడా చూస్తున్నాను. దాని సాఫల్యం గురించి మీకు ఎరుకపరుస్తున్నాను. ప్రవక్తృత్వపు ఈ స్థానంపై ఉన్నందువల్లనే నేను మరణానికి అవతల పరలోకంలో ఉన్న నరకం గురించి మీకు సమాచారం ఇవ్వగలుగు తున్నాను. మరణానంతరం ఎదురయ్యే లెక్కల దినం పట్ల మీరు మరుపునకు గురై ఉన్నారు. దానిని గురించి మీకు జ్ఞాపకం చేస్తున్నాను.

ప్రళయదిన అధినేత సమక్షంలో నిలబడి జవాబు చెప్పుకోవలసిన ఘడియను తలచుకుంటూ, దాని కొరకు సన్నాహాలు చేసుకోండి.

3. అక్కడ గుమిగూడిన ప్రజల ముందు ప్రశ్నవేసి, దానికి సమాధానంగా తాను సత్యవంతుడన్న విషయాన్ని ప్రజల చేత ధ్రువపరచుకున్నారు. "ప్రజలారా! ఈ పర్వతానికి అవతల ఒక భారీ సేన మీపై విరుచుకుపడటానికి మోహరించి ఉందని నేను చెబితే, దానిని మీరు నిజమని నమ్ముతారా?" అని ప్రశ్నించారు. దానికి అందరూ ముక్తకంఠంతో, 'అవును. మాకు తెలిసినంత వరకూ నీవు ఎన్నడూ అబద్ధం చెప్పలేదు' అని సమాధానమిచ్చారు. మరోవిధంగా చెప్పాలంటే, ఆయన దేవుని సత్యప్రవక్త అని ధ్రువీకరింపజేసుకున్నారు.

4. ఆ ధ్రువీకరణ యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే, ముందు తాను చెప్పబోయేది కూడా సత్యమేనని, సత్యం తప్ప మరొకటి కాదని చెప్పకనే చెప్పారు. అంటే తాను చెప్పే విషయాన్ని ప్రజలు చాలా గంభీరంగా తీసుకోవాలి, నరక శిక్ష సమాచారానికి ప్రాముఖ్యత ఇవ్వాలి, నరకాగ్ని యాతన నుండి తమను తాము కాపాడుకోవాలి, ఈ విషయంలో అశ్రద్ధకు లోనుకారాదు అని చెప్పదలిచారు. ఎందుకంటే నేను సదా సత్యం పలికేవాడనని మీరే అందరి సమక్షంలో సాక్ష్యమిచ్చారు. కాబట్టి నేను చెప్పే సత్యాన్ని మీరు నమ్మండి.

5. దైవదౌత్యపు అత్యున్నత స్థానంలో ఉండి ప్రపంచాన్ని, పరలోకాన్ని కానటం, ఒకానొక ప్రమాదం గురించి ప్రజలకు భయపెట్టడమంటే, నిశ్చయంగా వారి శ్రేయాన్ని కోరడమే. అలాగే ముహమ్మద్ (స) మరణానంతరం జవాబు ఇచ్చుకోవలసి ఉందని ప్రజలను సావధాన పరచి, వారికి మేలు చేశారు. నరకాగ్ని శిక్ష చుట్టుముట్టక ముందే ఆ ప్రమాదం నుండి తప్పించుకొమ్మని జాగరూకపరచారు.

6. తరువాత ఆయన (స) ఈ విధంగా కూడా ప్రకటించారు : మీ సృష్టికర్త, నిజ ఆరాధ్య దైవం ఒక్కడే. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు. సకల ఆరాధనలు, ఉపాసనలు ఆయనకే చెందాలి. మీ కాల్పనిక దైవాలన్నింటినీ తిరస్కరించి ఒకే ఒక్క నిజ ఆరాధ్య దైవాన్ని నమ్మి నడుచుకోండి. ఇలా చేస్తే మీరు మరణానంతర జీవితంలో సురక్షితంగా ఉంటారు. ప్రాపంచిక జీవితంలో కూడా గౌరవోన్నతుల్ని పొందుతారు. ప్రపంచంలో మీకు అధికారం లభిస్తుంది. ఇదీ దేవుని ఏకత్వంలోని

అసలు వాస్తవికత. సృష్టికర్త నన్ను తన సందేశహరునిగా చేసి, మీకు ఈ సందేశాన్ని ఇవ్వమన్నాడు.

## దైవదౌత్యం లభించిన మొదటి మూడేండ్లలో సందేశ ప్రకటనా విధానం

మొదటి మూడు సంవత్సరాలలో ఆయన విజ్ఞులను, మేధావులను, సజ్జనులను, స్నేహితులను, సమీప బంధువులను కలుసుకుని వ్యక్తిగతంగా బోధపరిచారు. తాను దైవప్రవక్తనని, ప్రజలకు స్వర్గలోక శుభవార్తను అందజేసే, నరకాగ్ని శిక్ష నుండి కాపాడే కర్తవ్యాన్ని దేవుడు తనపై మోపాడని నచ్చజెప్పారు. ఈ విధంగా ఎంతో యుక్తితో, మరెంతో నేర్పుతో తన ప్రవక్తాపదవి ప్రకటన గావించారు.

## మూడేండ్ల తరువాత సందేశ ప్రచార విధానం

ప్రజలలో దైవదౌత్యపు ప్రకటనను ఆయన ప్రసంగాల ద్వారా కాకుండా ఆరాధనల ద్వారా  చేశారు. కాబా గృహం వద్ద ఆయన కొత్త పద్ధతిలో దైవారాధన చేయటం మొదలెట్టారు. అది దేవుని ఏకత్వాన్ని చాటి చెప్పేదిగా ఉంది. అది ఆనాటి ఆరాధనా రీతికి భిన్నంగా ఉండటం వల్ల ప్రజలు దానిని ఆసక్తితో గమనించసాగారు. ఈ ఆరాధనా విధానం వారికి ఒక ప్రశ్నార్ధకంగా నిలిచింది. దాని గురించి ప్రజలు ఆరా తీసినప్పుడు, ఆయన సందర్భోచితంగా సమాధానమిచ్చేవారు. తాను దేవుని సత్యప్రవక్తనని చెబుతూ సృష్టికర్త ఒక్కడేనన్న భావనను చాటేవారు. ఒక్కడైన ఆ సృష్టికర్తను తప్ప మరొకరిని మొక్కరాదని చెప్పేవారు. మరణానంతర జీవితం గురించి చెబుతూ, అక్కడ ప్రతి మనిషీ ప్రభువు సమక్షంలో తన కర్మలకు జవాబు చెప్పుకోవలసి ఉందని, ఈ లెక్కల అనంతరం అతను స్వర్గానికి అర్హుడో లేక నరకానికి పాత్రుడో తీర్పు ఇవ్వబడుతుందని  విపులీకరించేవారు.

సృష్టికర్త తరఫున సన్మానసభ ఏదీ జరగలేదు, ఈయన దైవప్రవక్త అని లాంఛనంగా ప్రకటించటం జరగలేదు. కాబట్టి తాను దైవ సందేశహరుణ్ణి అని ఆయన స్వయంగా పరిచయం చేసుకోవలసి వచ్చేది. ముహమ్మద్ (స)ను దైవ సందేశహరునిగా నమ్మి, ఆయనకు విధేయత చూపి, ఆయన బోధించిన మార్గాన్ని అవలంబించే శిష్యులు కూడా తమ తమ స్నేహితుల, బంధువుల మధ్యన ఈ 'పరిచయ కార్యం' నెరవేర్చసాగారు. ఈ పద్ధతి సహజంగానే –

చదీచప్పుడు కాకుండా – పనిచేసింది. ఇది ఒక పటిష్ఠమయిన Multifold పద్ధతిగా, Multidirectional పద్ధతిగా రూఢీ అయింది.

సమాజంలోని విజ్ఞులు, శుభాత్మల సాంగత్యం కొరకు తహతహ లాడుతున్న వారంతా చాలా తొందరగా ఈ సందేశానికి ప్రభావితులయ్యారు. ఎందుకంటే ముహమ్మద్ (స) వ్యక్తిత్వం గురించి వారికి ముందు నుంచే తెలుసు. తమ స్వార్థ ప్రయోజనాలు, తమ పెత్తనం ప్రమాదంలో పడుతుందని భావించినవారు మాత్రమే ముహమ్మద్ (స) సందేశం పట్ల అభ్యంతరాలు వ్యక్తపరిచారు. ఆయన్ని వ్యతిరేకించారు. వారు తిరస్కరించినది గాక, ఇతరులను కూడా తిరస్కారం వైపు ప్రేరేపించారు.

ఈ విధమైన ప్రకటన (కాబా ప్రాంగణంలో ఆయన ప్రారంభించిన ఆరాధనా విధానం) ఓ వినూత్న ఒరవడికి చిహ్నం అయింది. ముహమ్మద్ (స) ఏ 'దేవుని ఏకత్వం' వైపునకు పిలుపు నిస్తున్నారో, ఏది సత్యమని ఆయన చాటిచెబుతున్నారో దానిని ఆయన ఖుద్దుగా తన నిజ జీవితంలో ఆచరించి చూపుతున్నారు. ఏ విషయంలో ప్రజల బాగోగులు ఉన్నాయని చెబుతున్నారో, దానిని ఆయన స్వయంగా అవలంబిస్తున్నారు. ఇది ఆయన తెచ్చిన సందేశంలోని సత్యానికి సాక్షిగా నిలిచింది.

## దైవ సందేశహరునిగా ప్రకటించిన తీరు, అందలి ఉపాయం

ఇంతకు ముందు చెప్పినట్లు, ముహమ్మద్ (స)ను దైవప్రవక్తగా ప్రకటించేందుకు సృష్టికర్త ఉత్సవ సభ లాంటిదేదీ పెట్టలేదు. "ఈయనగారు నా సందేశహరుడు, కాబట్టి మీరు ఈయన్ని విశ్వసించండి, ఈయన మాట వినండి, ఈయన నా సందేశంలోని మర్మాన్ని విశదీకరిస్తాడు" అని సృష్టికర్త తరఫున అధికార ప్రకటన ఏదీ వెలువడలేదు.

సభపెట్టి, అధికారికంగా ప్రకటించటం అనేది ఒకసారి మాత్రమే జరుగుతుంది. అన్నిచోట్లా, అన్ని సందర్భాలలో ఇలాంటి ప్రకటన చేయబడదు. ఇది సహజమైన పద్ధతి కూడా కాదు. అందుకే ఈ పద్ధతి అవలంబించబడలేదు.

తన కర్తవ్య నిర్వహణ దృష్ట్యా దైవ సందేశహరుడు స్వయంగా తన వ్యక్తిగత పరిచయం చేసుకుంటాడు. ఈ పద్ధతిలోనే ప్రవక్త హుందాతనం ఇమిడి ఉంది. ఒక దైవదాసునిగా అణకువ, అశక్తత కూడా అందులో ఉట్టిపడుతుంది. అవసరమే అతని చేత ఆ 'పరిచయం' చేయించుకుంటుంది.

ఈ పద్ధతి ద్వారా అతను సామాన్య జనులకు చేరువ కాగలుగుతాడు. తద్వారా సమత మమతలు పెంపొందుతాయి. సన్మాన సభ ద్వారా ప్రకటన చేయించటం అనేది 'వైభవానికి' చిహ్నంగా ఉంటుంది. దానివల్ల సందేశహరునికి – సామాన్య ప్రజలకు మధ్య కలివిడితనం ఉండదు. దూరాలు పెరుగుతాయి. సందేశ పరిచయ కార్యంలో ఈ పద్ధతి అవరోధంగా తయారవుతుంది.

దైవ సందేశహరుడు దైవ సందేశాన్ని అందజేస్తూ ఉన్న సమయంలో ఆహూతుడు సందేశహరుణ్ణి నిశిత దృష్టితో చూస్తాడు. అతని సంస్కారాన్ని, గాంభీర్యాన్ని, ప్రేమైక భావాన్ని, చిత్తశుద్ధిని, నిర్మొగమాటాన్ని, నిరాడంబరతను, కలుపుగోలుతనాన్ని, శ్రేయోభిలాషను తరచి చూస్తాడు. ప్రవక్త నేరుగా తనను పరిచయం చేసుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. సన్మాన సభ ద్వారా ప్రకటన చేయబడినప్పుడు ఇది సాధ్యం కాదు. అందుకే సృష్టికర్త తన సందేశహరుని పరిచయం కొరకు సహజమైన పద్ధతినే ఆమోదించాడు. ఇంకా ఈ పద్ధతిలో ఏ ఏ పరమార్థాలు దాగి ఉన్నాయో కూడా ఆయనకే ఎరుక.

## వ్యతిరేకులు సయితం ఆయన సత్యసంధతను అంగీకరించారు

ముహమ్మద్ (స)ను తీవ్రంగా వ్యతిరేకించేవారు కూడా ఆయన సత్యసంధతను ఒప్పుకునేవారు. తాము చెప్పేది, చేసేది తప్పు అని వారికి తెలుసు. కాని అజ్ఞానకాలపు అహంభావం వల్ల, తమ తాతముత్తాతల మతాచారం పట్ల గల దురభిమానం కారణంగా వారు ముహమ్మద్ (స) సందేశాన్ని వ్యతిరేకించేవారు. అందుచేతనే ముహమ్మద్ (స) ఎదురుగా నిలబడే నైతిక స్థైర్యం వారిలో లేదు.

ముహమ్మద్ (స)కు బద్ధశత్రువు అయిన అబూజహ్ల్ సయితం అనేకసార్లు ఆయన (స) సత్యసంధతను ఒప్పుకున్నాడు. తాను వ్యతిరేకించడానికి గల కారణాన్ని కూడా అతను తన స్నేహితుల ముందు చెప్పుకున్నాడు. కేవలం అసూయవల్ల అతను తిరస్కరించేవాడు. అన్యథా అతను ముహమ్మద్ (స)ను సత్యసంధునిగా పరిగణించేవాడు. ఆ విషయాన్ని అతను తన సావాసి అయిన ముగీరా బిన్ షూబ ముందు చెప్పుకున్నాడు. అతనిలా అనేవాడు : "మా గోత్రంలో దైవప్రవక్త రాలేదు. ఆయన గోత్రంలోనే ప్రవక్త ఏతెంచాడు. లేకుంటే ఆయనా, మేము సర్వవిధాలా సమానులమే. వారూ హాజీలకు నీరు సరఫరా

చేస్తారు. మేమూ హాజీల సేవ చేస్తాము. కాని ఇప్పుడు మాకు సమఉజ్జీలైన బనీ అబ్దె మునాఫ్ వారు మమ్మ్మ మించిపోయారు. మాలో ఒక ప్రవక్త ప్రభవించాడని, ఆయనపై దివ్యవాణి అవతరిస్తుందని అంటున్నారు. ఇప్పుడు మేము ఈ అంతస్తును ఎలా పొందేది, దైవసాక్షిగా! మేము అతనిని ప్రవక్తగా అంగీకరించబోము (ఒకవేళ అంగీకరించామంటే మా అంతస్తు తగ్గిపోతుంది). అన్యధా ముహమ్మద్ (స) సత్యవంతుడన్న విషయంలో మాకు ఎలాంటి సందేహం లేదు.”

చూశారా, అసూయవల్ల ఏర్పడిన మంకుతనం ఇది! అంతేగాని, ముహమ్మద్ (స) సత్యసంధత పట్ల అతనికి లేశమయినా సంశయం ఉండేది కాదు. “దైవం సాక్షి! ఈ వ్యక్తి చెప్పేది సత్యం అని నాకు తెలుసు. కాని ఒకానొక విషయం నన్ను దాన్నుండి ఆపుతోంది.” ఇంతకీ ఆ విషయం ఏదంటే, ఇంతకు ముందు ప్రస్తావించిందే. వేరొక సందర్భంలో అతను తన మిత్రునితో ఇలా అన్నాడు : “దేవునిపై ఒట్టు. ఈయన దైవప్రవక్త అని నాకు తెలుసు. కాని మేము బనీ అబ్దె మునాఫ్ తెగ వారికి ఎలా లోబడి ఉండేది?”

ఒకానొక సందర్భంలో అబూజహ్ల్ ముహమ్మద్ (స)తో ఇలా అన్నాడు: “మేము నిన్ను అబద్ధీకరించటం లేదు. అయితే నీవు తీసుకు వచ్చిన విషయాన్ని మాత్రం త్రోసిపుచ్చుతున్నాము.”

బద్ర్ యుద్ధ సందర్భంగా అఖ్నస్ అబూజహ్ల్‌ను అడిగాడు : “చూడు, ఇక్కడ నీకూ – నాకూ మధ్యన మూడోవాడు ఎవడూ లేడు. నిజం చెప్పు. ముహమ్మద్ (స) సత్యవంతుడా? అబద్ధీకుడా?” దానికి అతనిచ్చిన సమాధానం ఇది : “దేవుని తోడు! ముహమ్మద్ (స) సత్యవంతుడు. ఆయన ఎన్నడూ అబద్ధమాడలేదు.”

## సమీప బంధువుల సమక్షంలో దైవదౌత్య ప్రకటన

ఆయన తన వంశీయులను విందుకు పిలిచి దేవుని ఏకత్వపు వచనాన్ని వినిపించారు. మీరు గనక ఒక ‘కలిమా’ను స్వీకరిస్తే ఇహపరాల శ్రేయోసాఫల్యాలు మీకు ప్రాప్తిస్తాయని, అరబ్బులైన మీకు అరబ్బేతరులపై ప్రాబల్యం లభిస్తుందని చెప్పారు.

అయితే వారు ఖురైషుల నాయకులు. ఈ కలిమాను స్వీకరిస్తే తమ నాయకత్వానికి నూకలు చెల్లుతాయని వారు భయపడ్డారు. తమ పూర్వీకుల

మత ధర్మం అంతస్తుందన్న భయం కూడా వారిలో చోటు చేసుకుంది. అదే గనక జరిగితే అరబ్బులంతా తమకు వ్యతిరేకులైపోతారు. ఈ కారణంగానే వారు ఈ కలిమాను స్వీకరించేందుకు నిరాకరించారు. అంతేగాని వారిలో ఎవరూ ముహమ్మద్ (స) చెప్పే దానిని అబద్ధీకరించలేదు.

## వ్యతిరేకత వల్ల ఈ సందేశంలోని సత్యం మరింతగా ప్రస్ఫుటం అయింది. ఎల్లెడలా దీనిపై చర్చ జరిగింది

సత్య ప్రకటన చేసే వ్యక్తి సత్యాన్ని తిరస్కరించి, వ్యతిరేకతను ప్రదర్శించినపుడు ఆ వ్యక్తి వ్యక్తిత్వం మరింతగా ఇనుమడిస్తుంది. అతను చెప్పేది మరింత పైకి ఉబికి వస్తుంది. అతను సహనంతో, స్థయిర్యంతో ఎదురీత సాగించినపుడు, ప్రేమానురాగాలతో ప్రజలకు విషయాన్ని నచ్చజెప్పినపుడు ఆ సత్యాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదు. మొదటి దశలో దైవప్రవక్త చేసిన పని ఇదే.

సందేశప్రదాత చెప్పేది సత్యమని వ్యతిరేకులు గ్రహించారు. అది పూర్తిగా సృష్టికర్త తరఫున వచ్చిన సందేశమని కూడా వారికి అర్థమైపోయింది. కాని తమ నిరాకరణకు గాను వారు రకరకాల కుంటిసాకులు చెప్పారు. సందేశ ప్రదాతపై నిందలు నిష్ఠూరాలకు దిగి వ్యతిరేక వాతావరణాన్ని సృజించారు. ఈ విషయంలో వారు దౌర్జన్యాలకు ఒడిగట్టే వరకూ పోయారు. కాని సందేశ ప్రదాత మాత్రం తన మాటను నమ్మని వారిపై బలవంతం చేయలేదు. అలా బలవంతం చేసే అనుమతి సృష్టికర్త తరఫున లేదు. అందుకే సందేశ ప్రదాత ఎవరికీ ప్రలోభపెట్టలేడు, ఎవరిపైనా ఒత్తిడి తీసుకురాలేడు. కాకపోతే స్వీకరించటం, స్వీకరించకపోవటం వల్ల కలిగే లాభనష్టాలను గురించి మాత్రం చెబుతాడు. ఈ లాభనష్టాలు రానున్న జీవితంలో (మరో ప్రపంచంలో) స్వర్గ నరకాల రూపంలో ఉంటాయని విశదపరుస్తాడు.

సందేశ ప్రదాత కేవలం సృష్టికర్త సందేశాన్ని మాత్రమే అందజేశాడు. దానిని తన ప్రధాన కర్తవ్యంగా భావించి మరీ ఆ విధిని నిర్వర్తించాడు. ఈ సందర్భంగా అతను నైతిక పరిధిని దాటలేదు. మరలాంటప్పుడు అతనిపై దౌర్జన్యం ఎందుకు? నీతీ నడవడికలు వాంఛించే వాటికి కట్టుబడి పనిచేసి నందున సందేశ ప్రదాతలోని మానవీయ, నైతిక సుగుణాలు ఉద్దీప్తం కాసాగాయి. ప్రవక్తగా ఆయన వ్యక్తిత్వం మరింతగా ఇనుమడించింది.

వ్యతిరేక ప్రచార హోరులో సామాన్య ప్రజలు సత్యాసత్యాలను సరిగ్గా బేరీజువేయలేరు. ఎవరు సత్యం పలుకుతున్నారో, ఎవరు చెప్పేది అబద్ధమో విదితమవదు. కాని ఎదుటివారి నైతిక నడవడిని మాత్రం ప్రజాసామాన్యం అర్థం చేసుకోగలుగుతుంది. ఎందుకంటే మనిషిలోని అంతరాత్మ ప్రబోధిస్తుంది – ఎవరు సత్యవంతులో, ఎవరు అబద్ధీకులో. అదీగాక మానవుల్లో సత్యబలమున్న వర్గం ఎవరికీ భయపడదు. ప్రలోభాలకు లొంగదు. ఎందుకంటే వారు స్వార్థపరులై ఉండరు. అందుకే వారు పెత్తందార్లకు భయపడరు. సందేశప్రదాత సత్యవంతుడని అర్థమవగానే అతనికి ఆదరువుగా నిలుస్తారు. ఇలాంటి సంఘర్షణాపూరిత వాతావరణంలో సత్యంతో పాటు, సత్యసందేశ ప్రదాత కూడా మరింతగా మెరిసిపోవటం సహజం. ఈ విధంగా దైవప్రవక్త మిషన్ సర్వత్రా చర్చనీయాంశంగా మారుతుంది.

ముహమ్మద్ (స) సందేశానికి పాపులారిటీని ఇచ్చిన వారెవరంటే స్వయంగా వ్యతిరేకులే. అదెలాగంటారా, వారు ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని ఖండిస్తూ, మక్కాకు దూర ప్రదేశాల నుండి వచ్చిన వారి ముందు దుష్ప్రచారం చేసేవారు. దాంతో కొత్తవారిలో ముహమ్మద్ (స)ను చూడాలన్న ఆసక్తి జనించేది. వారు రహస్యంగా ముహమ్మద్ (స)ను కలుసుకుని ఆయన సందేశానికి ప్రభావితులయ్యేవారు. దానిని స్వీకరించేవారు. తమ ప్రదేశాలకు వెళ్ళి ముహమ్మద్ (స) సందేశాన్ని ప్రచారం చేసేవారు. ఇదంతా దైవికంగా జరిగిన ఏర్పాటు.

## బహిరంగ ప్రచారం, దైవప్రవక్తగా ప్రకటన, సందేశాన్ని చేరవేసిన తీరు

తన సమీప బంధువులకు సందేశాన్ని అందజేసిన పిదప ముహమ్మద్ (స) ప్రవక్త మక్కా మరియు అరేబియాలోని ప్రజలందరికీ సందేశాన్ని చేరవేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమం మక్కాలో పదేండ్ల వరకూ కొనసాగింది. వ్యాపారం కొరకు, ఉమ్రా కొరకు మక్కాకు వచ్చిన వివిధ తెగల వారిని ఆయన (స) కలుసుకుని సత్యసందేశాన్ని వినిపించేవారు. హజ్జ్ సందర్భంగా మక్కాలో విడిదిచేసిన హాజీల శిబిరాలకు, సంతలకు వెళ్ళి సత్యవాణిని వినిపించేవారు. ఆయన దేవుని ఏకత్వం గురించి నొక్కి వక్కాణించే వారు. ఖుర్ఆన్ వచనాలను చదివి వినిపించేవారు. ప్రజల సందేహాలకు

సమాధానాలిచ్చేవారు. ఒక్కడైన సృష్టికర్తను ఆరాధించాలని, ఆయనకు మాత్రమే విధేయత చూపాలని ఉపదేశించేవారు. ప్రజలు తన సందేశాన్ని స్వీకరిస్తారా? లేదా? అన్నదానిని గురించి పట్టించుకోకుండా తాను తన కర్తవ్యాన్ని సజావుగా నిర్వర్తించేవారు. ఈ సందర్భంగా ఖురైషుల తరఫున కల్పించబడే అభాండాలను, అవరోధాలను ఉత్తమ రీతిలో సహించేవారు.

ఆయన ఒక్కొక్క తెగవారు విడిదిచేసిన శిబిరానికి వెళ్ళి "లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకండి. సాఫల్యం పొందుతారు. ఈ కలిమా ద్వారా మీరు అరేబియా భూభాగానికి పరిపాలకులవుతారు. అరబ్బేతరులు మీకు విధేయులవుతారు. ఈమాన్ (విశ్వాసం) మూలంగా మీకు పరలోకంలో స్వర్గం లభిస్తుంది" ని చెప్పేవారు. ఈ మాటలంటున్నప్పుడు కొందరు ఆయన్ని ఆట పట్టించేవారు. కొందరు వెకిలి చేష్టలతో శారీరకంగా మానసికంగా వేధించేవారు. కొందరు ఉమ్మివేసేవారు. కొందరు ఆయనపై మట్టిపోసేవారు. తిట్టేవారు. కాని ఆయన మాత్రం తన సందేశ పరిచయ కార్యక్రమాన్ని ఆపకుండా – నిర్విఘ్నంగా – చేస్తూపోయారు. ప్రజలతో రహస్యంగానూ సమావేశమయ్యేవారు. బహిరంగంగా కూడా ప్రచారం చేసేవారు. ఆయన ధనికులను, పేదవారినీ, దళితులను, యువకులను, వృద్ధులను – అందరినీ కలుసుకుని మాట్లాడేవారు. మొదటి మూడేండ్లలో రహస్యంగా ప్రచారం చేశారు. తన సందేశ పరిచయ పరిధిని బంధుమిత్రుల వరకే పరిమితం చేశారు. ఆ విధంగా ఈ మూడేండ్లలో మానవతలోని సత్యబలమున్న వర్గాన్ని, మానవ నవనీతాన్ని సిద్ధం చేసుకున్నారు.

ప్రజాబాహుళ్యంలోకి వెళ్ళి ముహమ్మద్ (స) చేసిన కృషి (Approach) లో దైవదౌత్య ప్రకటనతో పాటు, దేవుని ఏకత్వపు సందేశం కూడా ఉంది. విశ్వసించటం లేక విశ్వసించకపోవటం వల్ల వెలువడే ఫలితాలు ఈ ప్రపంచం వరకే పరిమితం కావని, అవి మరణానంతర జీవితానికి కూడా వర్తిస్తాయన్న సందేశం ఉంది. సామాన్య ప్రజలను ఆయన (స) సందేశం నుండి నిరోధించాలన్నది ఖురైషుల లక్ష్యం. ఎందుకంటే ముహమ్మద్ (స) మాటల్లో ఏదో అనిర్వచనీయమైన ఆకర్షణ ఉంది. తాము మౌనంగా కూర్చుంటే ప్రజలు ముహమ్మద్ (స) అనుయాయులుగా మారిపోతారు. అదే గనక జరిగితే అరేబియాలో తమ పెత్తనం అంతమవుతుంది. అందుకే ఖురైషు సర్దారులతో ఒక్కటై ఆయనపై కత్తికట్టారు. ఆయన్ని మాంత్రికుడన్నారు. జ్యోతిష్కుడన్నారు. ఆయనకు మతి భ్రమించిందని చెప్పారు. అయితే ఏ ఒక్కరు కూడా ఆయన్ని 'అబద్ధీకుడు' అని మాత్రం అనలేదు. ఆయన (స) క్యారెక్టర్‌పై కూడా ఎవరూ

దాడి చేసేందుకు సాహసించలేదు. ఎందుకంటే ఆయన (స) వ్యక్తిత్వం మచ్చలేనిది. సత్యం ఆయన ఆయుధం. సత్యసంధత, నిజాయితీతత్పరత ఆయన ప్రత్యేక చిహ్నాలు.

## ఆ మాట ... వ్యతిరేకుల నోట

ముహమ్మద్ (స) వ్యక్తిత్వంలోని అసాధారణమైన ఆకర్షణ, దివ్య ఖుర్ఆన్‌లోని అనిర్వచనీయమైన విశిష్ఠతను వ్యతిరేకులు పసిగట్టారు. అందుకే వారు ముహమ్మద్ (స)తో చర్చలు జరిపి ఏదో ఒకవిధంగా ధార్మిక వ్యవహారంలో ఆయనతో సంధి చేసుకోవటానికి వారు ప్రయత్నించారు. ఈ విషయమై ముహమ్మద్ (స)తో సంప్రదింపులు జరపడానికి వారు ఉతబా బిన్ రబీయాను పంపారు. ఆ సమయంలో మహాప్రవక్త (స) కాబా గృహ ప్రాంగణంలోనే ఉన్నారు. అతను వచ్చి ముహమ్మద్ (స)కు కొన్ని ప్రతిపాదనలు చేశాడు. "చూడండి, మేము మిమ్మల్ని మక్కాలో అందరికన్నా గొప్ప ధనికునిగా చేస్తాము లేదా మిమ్మల్ని రాజుగా శిరసావహిస్తాము. ఒకవేళ మీకు జిన్ను (దెయ్యం) పట్టుకుందంటే చెప్పండి, మీకు వైద్యం చేయిస్తాము. లేదా మక్కాలోకెల్లా అందగత్తె అయిన అమ్మాయితో మీ వివాహం జరిపిస్తాము. దేనికైనా మేము సిద్ధమే. కాని మీరు మా పూర్వీకులు అవలంబించిన మతాన్ని విమర్శించటం మానుకోవాలి. మీ సందేశం వల్ల మా దేవీదేవతలకు అవమానం జరుగుతోంది. మా కుటుంబీకుల్లో కలతలు వస్తున్నాయి." అతని ప్రతిపాదనలు పూర్తయ్యాక మహాప్రవక్త (స), దివ్య ఖుర్ఆన్‌ని వినిపించారు. ఆ వాక్కులోని ఆదేశానికను గుణంగా సృష్టికర్త ముందు ప్రణమిల్లారు (సజ్దా చేశారు). ఆ తరువాత శిరస్సు ఎత్తి "ఇదే మీ ప్రతిపాదనలకు నా సమాధానం" అన్నారు. నా కర్తవ్యమల్లా సృష్టికర్త వాక్కును, సందేశాన్ని ఆయన దాసులకు చేరవేయటమే. నేను చేసేది కూడా అదే అన్నారు.

ఉతబా బిన్ రబీయా అక్కడి నుండి లేచి నేరుగా తన మిత్రులైన ఖురైషుల వద్దకు వెళ్ళాడు. ఆ సమయంలో వారు కాబా ప్రాంగణంలో కూర్చుని ఉన్నారు. ఏమిటి సంగతి? అని వారు ఉతబాను అడిగారు. దానికి అతను, "దేవుని సాక్షి! నేను ఇంతకు ముందెన్నడూ వినని వాక్కు విన్నాను. దేవునితోడు! అది కవిత్వం గానీ, మంత్రం గానీ, జ్యోతిష్యం గానీ కానేకాదు. ఖురైషులారా! నా మాట విని, అతన్ని అతని మానాన వదలిపెట్టండి. ఏదో ఒకనాడు ఆ

వాక్కు ఫలిస్తుందని నేననుకుంటున్నాను. ఒకవేళ అరబ్బులు అతనిపై ఆధిపత్యం వహించారనుకోండి, మీ సోదరునిపై చెయ్యిచేసుకునే దౌష్ట్యం నుండి మీరు సురక్షితంగా ఉంటారు. ఇతరులే అతని సంగతి చూసుకుంటారు. కాని ఒకవేళ అతను అరబ్బులపై ఆధిపత్యం వహిస్తే అతని సార్వభౌమత్వం మీ సార్వభౌమత్వం అవుతుంది. అతని గౌరవం మీ గౌరవం అవుతుంది" అన్నాడు. ఖురైషులు అతని మాట విని, "చివరికి నువ్వు కూడా అతని మాయాజాలంలో చిక్కుకున్నావులే" అన్నారు.

ముహమ్మద్ (స) అతనికి దివ్య ఖుర్ఆన్‌లోని హామీమ్ సజ్దా సూరాలోని ఆయత్‌ని వినిపించారు. ఆ ఆయత్ (13) అనువాదం ఇది :

> "అప్పటికీ వాళ్ళు గనక వైముఖ్యాన్ని ప్రదర్శిస్తే వారికి ఈ విధంగా చెప్పేయ్ : 'ఆద్, సమూద్ జాతులపై విరుచుకుపడినటువంటి విపత్తు గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను."

దైవప్రవక్త (స) దివ్య ఖుర్ఆన్ పారాయణం చేస్తూ ఈ ఆయత్ వరకు రాగానే ఉతబా భయంతో వణికిపోతూ తన చేతిని ముహమ్మద్ (స) పెదాలకు అడ్డుగా పెట్టాడు. బంధుత్వ సంబంధాన్ని పేర్కొంటూ, 'దయచేసి ఇటువంటి మాట అనకండి' అన్నాడు. ఈ సంఘటనను ఉదాహరిస్తూ ఉతబా ఖురైషులతో ఇలా అన్నాడు : "ముహమ్మద్ (స) ఏదన్నా మాట అంటే అది అబద్ధం కాబోదన్న సంగతి మీకు బాగా తెలుసు. అందుకే మనపై శిక్ష ఎక్కడ అవతరిస్తుందోనని నేను భయపడ్డాను."

దివ్య ఖుర్ఆన్‌ను విన్న మీదట ఉతబా తిరిగి వచ్చి ఖురైషు సర్దారులకు ఇచ్చిన సాక్ష్యం గమనార్హం – "ఇది మానవ ప్రోక్తం కానేకాదు. ముహమ్మద్ (స) మంత్రగాడో, కవిపుంగవుడో, జ్యోతిష్కుడో అంతకన్నా కాదు. అందుచేత అతన్ని, అతను తెచ్చిన సందేశాన్ని మీరు విశ్వసించకపోతే పోనివ్వండి. కాని మీరు మటుకు అతని జోలికి పోవద్దు. ఇందులోనే మీ మేలుంది."

శిక్షా వచనం విని ముహమ్మద్ (స) నోటిపై చెయ్యి అడ్డుగా పెట్టడం, ఆయన (స) నోటి నుండి వెలువడినది నిజంగా జరిగి తీరుతుందని ఉతబా ఖురైషులతో చెప్పటం దేన్ని సూచిస్తోంది. ఆయన (స) ఒక సత్యసంధుడని వ్యతిరేకులు సయితం మనసా వాచా కర్మణా సాక్ష్యమిచ్చారు. వ్యతిరేకత పరాకాష్ఠకు చేరిన సమయంలో ప్రత్యర్థులు ఈ యదార్థాన్ని తమ సమావేశాలలో ఒప్పుకున్నారు.

ముహమ్మద్ (స) ఉతబాకు దైవ సందేశాన్ని వినిపించి, తాను ప్రాపంచిక వ్యామోహానికి లోనయ్యేవాణ్ణి కానని, దైవ సందేశం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని చెప్పకనే చెప్పేశారు.

ఉతబా పెట్టిన ప్రలోభం లాంటివి వివిధ సందర్భాలలో ఇతర ఖురైష్ సర్దారులు కూడా పెట్టారు. సామదాన భేద దండోపాయాలను ప్రయోగించారు. కాని ఆయన (స) ఏమాత్రం తొణక్కుండా సృష్టికర్త సందేశాన్ని చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా వినిపించారు. తాను దైవ సందేశహరుణ్ణి అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. దైవ సందేశాన్ని దైవ దాసులకు చేరవేసే విషయంలో రాజీపడ బోనని నిర్మొగమాటంగా చెప్పేశారు. (విశ్వసించేవారికి) శుభవార్త వినిపించమనీ, (తిరస్కరించేవారికి నరక యాతన గురించి) భయపెట్టమని సృష్టికర్త నాకు ఆజ్ఞాపించాడు. అందుకే నేను నా ప్రభువు ఆదేశాలను మీకు చేరవేశాను. మీకు ఉపదేశం చేశాను. నేను మీకు అందజేసిన దైవోపదేశాన్ని స్వీకరిస్తే మీరు ఇహపరాల సాఫల్యం పొందుతారు. ఒకవేళ మీరు గనక దానిని త్రోసిపుచ్చితే అల్లాహ్ మీకూ – నాకూ మధ్యన తీర్పుచేసే వరకూ నేను ఓర్పు వహిస్తాను.

వివిధ సందర్భాలలో వివిధ విధాలుగా ముహమ్మద్ (స) తన దైవదౌత్య ప్రకటన చేశారు. జనులు ఆయన సత్యసంధతను పరికించ (Testify) డానికి, యదార్థాన్ని గ్రహించడానికి ఆయన ఇలా చెయ్యవలసి వచ్చింది. ఆయన సమక్షంలో ప్రాపంచిక ప్రలోభాలు చూపబడ్డాయి. కాని సత్యవంతుడైన ఆ ప్రవక్త కదలని కొండలా తన స్థానాన స్థిరంగా నిలబడ్డారు. తన ఆశయం నుండి ఒక్క అంగుళం కూడా జరగలేదు.

ఆయన (స) ప్రలోభాలకు తలొగ్గేవారు కాదని తెలుసుకున్న మీదట వాళ్లు మరో ఎత్తుగడ వేశారు. ఇచ్చిపుచ్చుకోవడాల వ్యవహారం చేద్దామని కోరారు. అంటే ఒక సంవత్సరం నీవు మా ఆరాధ్య దైవాలైన లాత్ ఉజ్జాలను కొలిస్తే, ఒక సంవత్సరం మేము నీ ఆరాధ్య దైవాన్ని పూజిస్తామని ప్రతిపాదించారు. అప్పుడు ముహమ్మద్ (స) దివ్య ఖుర్ఆన్‌లోని కాఫిరూన్ సూరాను వినిపించి, ధర్మావలంబన విషయంలో లావాదేవీల వ్యవహారానికి తావు లేదని ఖచ్చితంగా చెప్పేశారు.

దీనినిబట్టి అవగతమయ్యే దేమిటంటే సత్యవంతుడైన ప్రవక్త ప్రలోభాలకు లొంగడు, అమ్ముడు పోడు. తన కర్తవ్య నిర్వహణలో రాజీ

(Compromise) పడడు. ప్రాపంచిక ప్రలోభాలకు ఆశపడడు. ఖురైషు నాయకుల ఈ పాచికలు కూడా పారకపోయేసరికి వారు అబూతాలిబ్ దగ్గరకు వెళ్ళారు. అబూతాలిబ్ ముహమ్మద్ (స) పెత్తండ్రి. బాల్యం నుండే ముహమ్మద్ (స)ను సాకారు. అడుగడుగునా ఆయనకు సంరక్షకులుగా ఉన్నారు. అందువల్ల అబూ తాలిబ్ చేత ముహమ్మద్ (స)ను నిలువరించాలని భావించి, ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా చెప్పాల్సిందంతా చెప్పారు. అప్పుడు అబూ తాలిబ్ ముహమ్మద్ (స) గారిని పిలిపించి, "నాయనా! నీ జాతివారు నా దగ్గరకు వచ్చి, నీ ఉద్యమం వల్ల వారికి కలుగుతున్న నష్టం గురించి ఏకరువు పెట్టారు. దయచేసి నీవు శత్రుత్వం కొనితెచ్చుకోకు. నేను మోయలేనంత భారం నా మీద వేయకు. నీవు కూడా మోయగలిగినంత భారమే నీపైన వేసుకో. దయచేసి నీ జాతి వారికి పరాభవం మిగిల్చే పనిని మానుకో" అని సలహా ఇచ్చారు.

సమాధానంగా ముహమ్మద్ (స) ఇలా అన్నారు : "బాబాయి! ఒకవేళ నా కుడి చేతిలో సూర్యుణ్ణి, ఎడమ చేతిలో చంద్రుణ్ణి తెచ్చిపెట్టినా సరే, నేను ఈ కర్తవ్యాన్ని మానుకునేది లేదు. అల్లాహ్ ఈ కార్యాన్ని పూర్తి చేయనయినా చేయాలి లేదా ఈ మార్గంలో నేను చావనయినా చావాలి." పెత్తండ్రితో ఆయన (స) చెప్పిన ఈ మాట ఆయన సంకల్ప నిరతికి దర్పణం. ముహమ్మద్ (స) సత్యవంతుడనడానికి ఇది నిదర్శనం. సత్యవంతుడైన ప్రవక్త సంక్లిష్ట పరిస్థితులకు వెరవడు. వ్యతిరేక పవనాలకు కలవరం చెందడు.

సత్యవంతుడైన ప్రవక్త ఎట్టి పరిస్థితిలోనూ దైవ సందేశాన్ని అందజేసేందుకు కృషి చేస్తాడు. నేర్పుతో విరోధులకు కూడా వారి బాగోగులను సూచిస్తాడు. ఒకసారి ఖురైషుల ప్రతినిధి బృందం అబూ తాలిబ్ దగ్గరకు వచ్చి, "మేము న్యాయబద్ధమైన విషయం చెప్పదలిచాము. అదేమంటే మేము వారి దైవాన్ని విమర్శించము. ముహమ్మద్ (స) కూడా మా దైవాలను విమర్శించకూడదు" అని ప్రతిపాదించినప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు : "నేను వీరిని ఒక కలిమా (వచనం) వైపునకు పిలుస్తున్నాను. దానిని గనక వీళ్లు అంగీకరించి అనుసరిస్తే అరేబియా అంతటికీ అధిపతులైపోతారు. అరబ్బేతరులు వీరికి తాబేదారులవుతారు." దానికి అబూజహల్, "ఇది భలే లాభసాటి వర్తకం. నీ తండ్రి తోడు! మేము ఒక కలిమా కాదు, పది కలిమాలనయినా పఠించడానికి సిద్ధంగా ఉన్నామ"న్నాడు. అప్పుడు ముహమ్మద్ (స), "మీరంతా **'లా ఇలాహ ఇల్లల్లాహ్** (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు) అని పలకండి" అన్నారు. ఈ మాట వినగానే ఆగ్రహంతో, అసహనంతో

చిందులేస్తూ, "పదండి, మీరు మీ దేవుళ్ల ఆరాధనపైనే స్థిరంగా ఉండండి. నిశ్చయంగా ఈ మాటలో (మీకు వ్యతిరేకంగా) ఏదో మర్మం ఉంది" (సాద్–6) అంటూ వెళ్ళిపోయాడు.

సత్యవంతుడైన ప్రవక్త తన కర్తవ్యపాలనలో నిమగ్నుడై ఉంటాడు. బాధ్యతా భావన అతన్ని సతతం అప్రమత్తంగా ఉంచుతుంది. దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాడు. కఠినమైన పరిస్థితుల్లో కూడా తన బాధ్యతా నిర్వహణకు అనుగుణమైన దారిని వెతుకుతాడు. ఓర్పుతో, నేర్పుతో, మృదుత్వంతో ముందుకు సాగిపోతుంటాడు. కష్టకాలంలో అసహనానికి లోనవడు. సమస్యల నుండి పారిపోడు. గడ్డు పరిస్థితుల్లో కూడా తనకు అనువైన అవకాశాలను దొరకబుచ్చుకుంటాడు. కష్టాలలో అతని మనోనేత్రం మరింత చురుకుగా పనిచేస్తుంది. "లా ఇలాహ ఇల్లల్లాహ్ అని పలకండి. తదనుగుణంగా ఆచరించండి. ప్రపంచం మీ పాదాల వద్దకు వస్తుంది" అని ముహమ్మద్ (స) సత్యం చెప్పారు.

## ఖురైషు సర్దారుల తత్తరపాటు చెప్పకనే చెప్పింది ...

... ముహమ్మద్ (స) తెచ్చిన సందేశంలో సత్యముందని.

తాను సందేశహరుణ్ణని ముహమ్మద్ (స) బహిరంగంగా ప్రకటించిన మీదట తిరస్కారులైన ఖురైషులు తమ భవిష్యత్తుపై ఆందోళన చెందారు. హజ్జ్ సీజన్ రాబోతోంది. ముహమ్మద్ (స) అన్ని తెగలవారు విడిది చేసిన హజ్జ్ క్యాంపులకు వెళ్ళి మంత్రముగ్ధమయిన తన ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆ విధంగా యావత్ అరేబియా ద్వీపానికి ఆయన సందేశం చేరుతుంది. అందుకే, ఆయన అక్కడకు చేరుకోక ముందే మనం ఆ శిబిరాలకు వెళ్ళి, ప్రజలకు ముహమ్మద్ (స) గురించి లేనిపోని మాటలన్నీ కల్పించి చెబుదాం. అతని విషయంలో జాగ్రత్తగా ఉండండి, లేకపోతే మీరు నష్టపోతారని భయపెడదాం అన్నారు. అప్పుడు వలీద్ బిన్ ముగీరా కల్పించుకుని ఆ సలహా మండలి సభ్యులకు ఇలా సూచించాడు : "ముహమ్మద్ (స) గురించి మీరు ప్రజలకు రకరకాల మాటలు చెబితే మనపై వారికి నమ్మకం లేకుండా పోతుంది. కాబట్టి అందరూ కలసి ఏదో ఒక్కమాటనే చెప్పండి."

ఖురైషు ప్రముఖులు దీనిపై యోచన చేశారు. ముహమ్మద్ (స) ఒక జ్యోతిష్కుడు అని అందాం అన్నారు కొందరు. దానికి వలీద్ అడ్డు తగులుతూ,

దేవుని తోడు! ముహమ్మద్ (స) జ్యోతిష్కుడు కాడు. మనం జ్యోతిష్యం చెప్పేవారిని చూస్తుంటాం. వారు మాట చెప్పేటప్పుడు కూనిరాగాలు తీస్తారు. డొంక తిరుగుడు పద్ధతిలో మాట చెబుతారు. ఖుర్‌ఆన్‌కు దాంతో దూరపు సంబంధం కూడా లేదు అన్నాడు. అలాగయితే అతన్ని మతి భ్రమించినవాడని అందాం అన్నారు. అతను మతి భ్రమించిన వ్యక్తి కూడా కాడు. మనం పిచ్చిపట్టిన వారిని చూస్తుంటాము. వారు మతి చలించినట్లుగా మాట్లాడుతారు. పిచ్చి పిచ్చి చేష్టలకు పాల్పడుతుంటారు. ముహమ్మద్ (స) చెప్పే మాటలు పిచ్చిగా ఉన్నాయని నమ్మబలికే ధైర్యం ఎవరికుంది? అతని మాటల్లో ఔచిత్యం, విజ్ఞతా వివేచనలు తొణికిసలాడుతున్నాయని వలీద్ చెప్పాడు. సరే, అలాగయితే అన్ని కవిపుంగవుడని అందాం అన్నారంతా. దానికి వలీద్, అతను కవి కూడా కాడు. మనకు కవిత్వం గురించి బాగా తెలుసు. కాని అతను చెప్పే మాటలకు కవిత్వం ఎంతమాత్రం వర్తించదు అన్నాడు. పోనీ, అతన్ని ఒక మాంత్రికుడని అంటే సరిపోతుంది కదా! అని అక్కడున్నవారంతా ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనతో కూడా వలీద్ ఏకీభవించలేదు. ఎందుకంటే, మాంత్రికుల గురించి మనకు తెలియనిది కాదు. తమ మంత్రతంత్రాల కొరకు, కనికట్టు కొరకు వారు అవలంబించే పద్ధతులు కూడా మనకు తెలియనివి కావు. కాబట్టి ఈ నిందారోపణ కూడా ముహమ్మద్ (స)కు అతకదు అని అతను వివరించాడు. వలీద్ ఇంకా ఇలా అన్నాడు : “ఈ మాటల్లో ఏ ఒక్కటి చెప్పినా ప్రజలు దానిని కొట్టివేస్తారు. దానిని నిందారోపణగానే భావిస్తారు. దైవసాక్షి! అతని వాక్కులో మధురిమ ఉంది. దాని వ్రేళ్లు బాగా లోతుల్లో ఉన్నాయి. దాని కొమ్మలు రెమ్మలు ఫలవంతమైనవి.” అప్పుడు అబూజహ్ల్ వలీద్ మాటలకు అడ్డు తగులుతూ, నీవు ముహమ్మద్ (స) గురించి ఏదో ఒక నిర్ణయానికి రానంతవరకూ నీ జాతి వారు నీ యెడల సంతృప్తి చెందరు అని చెప్పాడు. దానికి వలీద్, అలాగైతే నన్ను కాస్త ఆలోచించుకోనివ్వండి అన్నాడు. దీర్ఘాలోచన తరువాత, “అతన్ని మాంత్రికుడు అని అనటమే కొంతవరకు బావుంటుంది. అతను చెప్పేమాట మనిషిని మంత్రముగ్ధుణ్ని చేసేస్తుంది. అది అతనిని అతని అన్నదమ్ముల నుండి, ఆలుబిడ్డల నుండి, మొత్తం కుటుంబీకుల నుండి వేరుచేస్తుంది” అని చెబుదాం అన్నాడు. వలీద్ చేసిన ఈ ప్రతిపాదనతో అందరూ ఏకీభవించారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం హజ్జ్‌కు ముందు ఖురైషు ప్రతినిధులంతా హాజీల శిబిరాలకు చేరుకున్నారు.

వలీద్ చెప్పిన ఈ మాటల ద్వారా సుబోధకమయ్యేదేమిటంటే ముహమ్మద్ చెప్పేది దైవవాక్కు అని అతను పరోక్షంగా అంగీకరించాడు. అయితే మక్కాలో తమ అధికారాన్ని నిలుపుకోవడానికి అతను అబద్ధం కల్పించాడు. దైవప్రోక్తాన్ని మానవ ప్రోక్తంగా చిత్రించాడు. స్వార్థప్రయోజనం, మనోవాంఛల దాస్యం, ప్రాపంచిక వ్యామోహం ఏ విధంగా మనిషిని అతని మనస్సాక్షికి వ్యతిరేకంగా మాట్లాడిస్తుందోనన్న దానికి ఇదొక దృష్టాంతం. సలహా సంప్రతింపుల సమయంలో 'ముహమ్మద్ (స)ని మాంత్రికుడు అందాం' అని జనులు ఇచ్చిన సలహాను వలీద్ బిన్ ముగీరా కొట్టివేశాడు. కాని ఆ తరువాత అదే 'అబద్ధాన్ని' స్వీకరిస్తూ 'మాంత్రికుడు' అనే దానినే వ్యతిరేక ప్రచారానికి ఆయుధంగా చేసుకుందామని సూచించాడు.

ఈ చారిత్రక సంఘటన ద్వారా స్పష్టమయ్యే ఒక ముఖ్య విషయం ఏమిటంటే వ్యక్తిగత సమావేశాలలో, సంభాషణలో మనిషి విషయాన్ని నిర్మొగమాటంగా, ఉన్నదున్నట్లు చెబుతాడు. ఎందుకంటే పరిస్థితుల్ని ఎదుర్కోవడానికి, తమను ప్రతిద్వంది‌గా ఉన్న వ్యక్తిత్వాన్ని మార్కొనడానికి ఖచ్చితంగా అంచనా వేయవలసిన ఆవశ్యకత ఉంటుంది. అందుకే ఇలాంటి సలహా సంప్రతింపుల్లో ముందుకు వచ్చే ప్రతిపాదనలు యదార్థాలకు అద్దం పడతాయి. అయితే బయట పబ్లిక్‌లో మాత్రం వాస్తవాలను కప్పిపుచ్చటం జరుగుతుంది. లేదా విషయాన్ని వక్రీకరించటం జరుగుతుంది. ఎందుకంటే ఇక్కడ మనిషి తన స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుంటాడు. ఖురైషు నాయకుల ఈ సమావేశం కూడా సత్యాసత్యాలను చాలా స్పష్టంగా విశ్లేషించింది. సమావేశంలో చెప్పబడినదంతా వాస్తవం. సభ్యులంతా దాంతో ఏకీభవించారు కూడా. అలా ఏకీభవించిన వారంతా నగర నాయకులు, సంఘపెద్దలే. వారు సామాన్య జనులు కారు. కాని సమావేశం నుండి బయట ప్రజా బాహుళ్యంలోనికి వచ్చి, వారు ముహమ్మద్ (స) గురించి చెప్పింది మాత్రం వాస్తవం కాదు. అది కల్పన, కట్టుకథ. ఈ విషయాన్ని చరిత్ర పుటలు భద్రం చేశాయి. వారు ముహమ్మద్ (స) చెప్పిన సత్యాన్ని, ఖుర్ఆన్‌లోని వాస్తవాన్ని 'అబద్ధం' ద్వారా ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. ముహమ్మద్ (స) మక్కా వాసియే. ఆయన బయటి మనిషి కారు. ఆయన (స)లోని సత్యసంధతను ఒక వైపు ఒప్పుకుంటూనే, మరోవైపున ఆయన సందేశాన్ని అబద్ధీకరించడానికి ఖురైషు ప్రముఖులు పడరాని పాట్లన్నీ పడ్డారు. వారు ఎన్ని కట్టుకథలు అల్లినా, అవి జనసామాన్యాన్ని సంతృప్తిపరచేవిగా కనిపించలేదు.

వారు తమ సమావేశాలలో వేసిన పిల్లిమొగ్గలను బట్టి, ముహమ్మద్ (స) మరియు దివ్య ఖుర్‌ఆన్‌లోని వాక్కు వారి మనోఫలకాలపై ఎలా చెరగని ముద్రవేసిందో, దానికి వారెంతగా భయపడ్డారో కూడా అర్థమవుతోంది. వారి ఈ భయం వెనుక ప్రవక్త మాటల్లోని సత్యం, దైవగ్రంథంలోని యదార్థం నిబిడీకృతమై ఉంది.

వారి ఈ దుష్ప్రచారం బెడిసికొట్టింది. దీనివల్ల మక్కా నలువైపులా ముహమ్మద్ (స)పై, ఖుర్‌ఆన్‌పై చర్చ జరిగింది. సందేశాన్ని ప్రజాబాహుళ్యంలో తీసుకురావడానికి దైవికంగా జరిగిన ఏర్పాటు ఇది.

ఈ విధంగా దైవసందేశం ప్రజల వరకూ చేరసాగింది. సహృదయులు ఈ సందేశాన్ని స్వాగతించారు, దానిని స్వీకరించారు. తమ తమ తెగల వారికి ఈ సందేశాన్ని పరిచయం చేశారు. మానవతలో సహృదయులు, సత్యబలమున్న వారు ఆ సమాజానికి నవనీతం (Cream) వంటివారు. ఒక విషయం వారి వద్దకు చేరినప్పుడు, వారు దానిని గుడ్డిగా అంగీకరించరు. దానిని పరిశోధించి అంగీకరించటమో, తృణీకరించటమో చేస్తారు. గందరగోళం చేసి చిక్కుల్లో (Confusion) పడవేసే వాతావరణంలో కూడా వారు సత్య విషయాన్ని కనుగొంటారు. ఇలాంటివారే ముమ్మందు సామాన్య ప్రజానీకానికి మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. వారు తమకు పలుకుబడి ఉన్న ప్రాంతాలలో అసాధారణమైన ప్రభావం వేస్తారు. సందేశహరుని సందేశానికి సరైన ప్రాతినిధ్యం వహిస్తారు. అప్పటి వరకూ దుష్ప్రచారం వల్ల మోసపోయి, అసత్యవాదుల అణచివేతకు గురై ఉన్న వారంతా క్రమక్రమంగా సత్యాన్ని పసిగట్టి సత్యానికి ఆదరువుగా నిలుస్తారు. వాస్తవానికి వారి అంతరాత్మ ప్రబోధించేది కూడా అదే.

సృష్టికర్త ముహమ్మద్ (స)ని తన సందేశహరునిగా నియమిస్తున్నప్పుడు బహిరంగ సభ ద్వారానో, ఉత్సవం ద్వారానో ఆ మేరకు బహిరంగ ప్రకటన చేయలేదు. అయితే తమ ప్రాపంచిక ప్రయోజనాల దృష్ట్యా ముహమ్మద్ (స)ను దేవుని సత్య సందేశహరునిగా నమ్మనిరాకరించినవారు, ఆయన అందచేసిన సందేశాన్ని అపఖ్యాతి పాల్జేయడానికి, దానిపట్ల సంశయాలు సందేహాలు జనింపజేయడానికి, తమకు అందుబాటులో ఉన్న ఒనరులను, సాధనాల (Men, Means and Media) నన్నింటినీ ఉపయోగించారు. అయితే ఒకవిధంగా ముహమ్మద్ (స) సందేశాన్ని సర్వవ్యాప్తం చేయడంలో వారు సహాయకులయ్యారు. వారి దుష్ప్రచారం వల్ల ప్రజలు సత్యాన్ని స్వీకరించటంలో కొంత ఆలస్యం జరిగినప్పటికీ, దానివల్ల జరిగిన మేలు ఏమిటంటే మానవ సముదాయంలోని

'నవనీతం' దైవప్రవక్తకు లభించింది. ఇది కూడా దైవికంగా జరిగినదే. ఎందుకంటే ఆ సందేశాన్ని దేశం నలుమూలలా వ్యాపింపజేయడానికి కొంతమంది నికార్సయిన శుభాత్మల అవసరం ఉండింది.

ఈ ప్రాపగాండా కారణంగా వివిధ ప్రాంతాలకు చెందిన వివిధ తెగల వారు ముహమ్మద్ (స) పట్ల ఉత్సుకత కనబరిచారు. ఆయనలోని సత్యాన్ని పసిగట్టి ఆయనకు చేరువయ్యారు. ఆ విధంగా మక్కా వెలుపల నివసించే తెగలలో ముహమ్మద్ (స) పేరు మార్మోగిపోయింది. ఈ విషయాన్నే అల్లాహ్ అలమ్ నష్రహ్ సూరాలో పేర్కొంటూ, "(ఓ ముహమ్మద్ – సఅసం!) మేము నీ ప్రస్తావనను ఉన్నతికి చేర్చాము" అని సెలవిచ్చాడు. అంటే, నీవు నీ వ్యతిరేకుల దుష్ప్రచారానికి మనస్తాపం చెందకు. నిజానికి మేము నీ విరోధుల ద్వారానే నీ పిలుపును నలువైపులా ప్రతిధ్వనించేలా చేశాము.

## శత్రువుల దుష్ప్రచారం వల్ల వెలువడిన సకారాత్మక ఫలితాలు – చరిత్ర వెలుగులో

(1) **తుఫైల్ బిన్ అమ్ర్ దౌసీ :** ఈయన 'దౌస్' తెగకు చెందిన నాయకులు. మర్యాదస్తులు. మొదట్లో ఈయన కూడా ఖురైషుల కట్టుకథలను నమ్మారు. కాని ఆ తరువాత తాను చేస్తున్నది సరైనది కాదని తలపోసి మక్కా వెళ్ళి ముహమ్మద్ (స)ను కలుసుకున్నారు. సత్యాసత్యాలను పరికించారు. ముహమ్మద్ (స) పిలుపు సత్యమని భావించి, విశ్వసించారు. తన స్వగ్రామానికి వెళ్ళి తల్లిదండ్రులకు, కుటుంబీకులకు, తెగవారికి ఇస్లాం సందేశం అందజేశారు. ఈయన ద్వారా సుమారు 80 కుటుంబాలు ఇస్లాం స్వీకరించాయి.

(2) **అబూజర్ గిఫ్ఫారీ :** ఈయన బనీ గిఫ్ఫారీ తెగకు చెందిన ప్రముఖులు. ముహమ్మద్ (స) గురించి తప్పుడు ప్రచారం విని, నిజానిజాలను తెలుసుకు రమ్మని తన సోదరుణ్ణి మక్కాకు పంపించారు. అతని ద్వారా రాబట్టిన సమాచారం సంతృప్తి నివ్వకపోవడంతో, తాను స్వయంగా మక్కా వెళ్ళి ఆయన (స) సందేశం విన్నారు. అప్పటికప్పుడే ముస్లింగా ధర్మపరివర్తన చెందారు. "నీవు నీ తెగవారి వద్దకు తిరిగి వెళ్ళి, వారికి ఇస్లాం వైపునకు ఆహ్వానించు. వారు గనక ఇస్లాం స్వీకరిస్తే, వారికి

నమాజ్ స్థాపించమని ఆజ్ఞాపించు. వారి జీవితాలను తీర్చిదిద్దు" అని దైవప్రవక్త (స) ఆయనకు ఉపదేశించారు.

**(3)** **అమ్ర్ బిన్ ఉబసా సులమీ :** ఈయన సులైమ్ తెగకు చెందినవారు. ఈయన కూడా ఇస్లాం సందేశం వ్యాపించిన తరువాత ముహమ్మద్ (స) పేరు విని ఇస్లాం స్వీకరించారు. 'ఉకాజ్' సంతలో ముహమ్మద్ (స)ను కలుసుకున్నారు. అక్కడే విశ్వసించారు. ఆయన ఇలా అన్నారు: "తమరు ఏ ఉపదేశం ఇచ్చి పంపబడ్డారు?" అని నేను ముహమ్మద్ (స)ను అడిగితే, "అల్లాహ్‌ను ఏకైక ఆరాధ్య దైవంగా అంగీకరించాలి. ఆయనకు భాగస్థులుగా ఎవరినీ ఎంచకూడదు" అని ఆయన సమాధాన మిచ్చారు.

**(4)** **జిమాద్ అజ్దీ :** ఈయన అజ్ద్ షన్వా తెగకు చెందినవారు. మంత్రాలు చదివి ఊదేవారు. ఈయన ఒకసారి మక్కా వచ్చినప్పుడు, ముహమ్మద్ (స)కు మతిభ్రమించిందని కొందరు అలగాజనులు చెప్పారు. ఆయన ఎక్కడున్నారో చెప్పండి, నేను ఆయన్ని మంత్రం ద్వారా నయం చేస్తానని జిమాద్ చెప్పారు. ముహమ్మద్ (స)ను కలుసుకుని, ఆయన (స) పఠించిన దైవవాక్కులు విని ఆశ్చర్య చకితులయ్యారు. నేనింత వరకు ఇలాంటి వాక్కును వినలేదు. నేను జ్యోతిష్కులు చెప్పేది విన్నాను. కవుల వచనం విన్నాను. మంత్రగాళ్ళ మంత్రాలు కూడా విన్నాను. కాని ఇటువంటి వాక్కు మాత్రం ఎన్నడూ వినలేదు. ఈ వాక్కులో సముద్రంలా ఎంతో లోతు ఉంది అని చెప్పారు. ఆ తరువాత ఇస్లాం స్వీకరించారు. తన తరఫున, తన తెగవారి తరఫున దైవప్రవక్త చేతిలో చెయ్యేసి 'బైఅత్' చేశారు.

## విశ్వసించిన వారి జీవితాలలో వచ్చిన నైతిక విప్లవం

ఈ నైతిక విప్లవం ద్వారా కూడా ముహమ్మద్ (స) దైవ ప్రవక్త అనీ, ఆయన తెచ్చిన సందేశం సత్య సందేశమన్న విషయం స్పష్టమవుతుంది. ముహమ్మద్ (స)ను ప్రవక్తగా నమ్మి నడుచుకున్న కారణంగా వారి జీవితాలలో అసాధారణమైన నైతిక విప్లవం వచ్చింది. మానవ నైజం వాంఛించేది కూడా యిదే.

# విశ్వసించిన వారి జీవితాలలో వచ్చిన గొప్ప పరివర్తన : కొన్ని దృష్టాంతాలు

## (అ) ఆడపిల్లలను సజీవ సమాధి చేయడం

పూర్వం అజ్ఞాన కాలంలో అరేబియా సమాజంలోని అమానుష కృత్యాలను తలచుకుంటేనే ఒల్లు జలదరిస్తుంది. మూడు కారణాల దృష్ట్యా కన్నవారే తమ సంతానాన్ని హతమార్చేవారు.

1. వారు ఆడపిల్లల్ని చంపివేయడానికి ప్రధాన కారణం, వారు ఒకరిని అల్లుడుగా చేసుకోవటం నామోషీగా భావించేవారు. లేదా వర్గ తెగల మధ్య పోరు జరిగినప్పుడు తమ ఆడపిల్లలు శత్రువు చేతికి చిక్కరాదన్న ఆలోచన కూడా వారికి ఉండేది.
2. ఆర్థిక ఇబ్బందుల వల్ల సంతానాన్ని భారంగా తలపోసేవారు.
3. తమ ఆరాధ్య దేవుళ్ళను ప్రసన్నుల్ని చేసుకోవటానికి పసిపిల్లల్ని బలిదానంగా సమర్పించుకునేవారు.

ముహమ్మద్ (స) సందేశాన్ని స్వీకరించిన పిదప వారు తమ ఈ అమానుష కృత్యంపై సిగ్గుతో కుంచించుకుపోయారు. దైవ సన్నిధిలో పశ్చాత్తాపం ప్రకటించారు. విశ్వసించిన మీదట తమ సంతానాన్ని అల్లారు ముద్దుగా పెంచారు. పిల్లల పెంపకం కూడా ఆరాధనలో ఒక భాగమని తలపోశారు. దైవప్రసన్నత నిమిత్తం పిల్లలకు మంచి శిక్షణ ఇచ్చారు. ఆడపిల్లలకు జీవన దానం ప్రసాదించడమేగాక, వారిని అవ్యాజానురాగాలతో పోషించారు. తత్కారణంగా వారికి సమాజంలో గౌరవాదరణలు లభించాయి. దీని వెనుక ఉన్న దైవోపదేశాలివి :

సృష్టికర్త తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు –

> "సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, తను ఏ పాపం చేసిందని హతమార్చబడింది?" అని ప్రశ్నించబడినప్పుడు ... *(తక్వీర్ – 8,9)*

> "మీ సంతానాన్ని దారిద్ర్య భయంతో చంపేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము. మీకూ ఉపాధిని ఇచ్చేది మేమే. యదార్థానికి వారి హత్య మహా పాపం." *(బనీ ఇస్రాయీల్ : 31).*

ఈ నేపథ్యంలో మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి కొన్ని ఉపదేశాలను కూడా ఇక్కడ పొందుపరుస్తున్నాము –

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా ఉపదేశించారు: "ఎవరి వద్దనయినా ఆడపిల్ల ఉండి, అతను ఆమెను సజీవంగా పాతిపెట్టకుండా, ఆమెను అవమానకరంగా భావించకుండా (పోషించి,), మగపిల్లవానికి ఆమెపై ప్రాధాన్యత ఇవ్వకుండా ఉన్నట్లయితే, అల్లాహ్ అతనికి స్వర్గంలో చోటు కల్పిస్తాడు."

హజ్రత్ అయ్యూబ్ బిన్ మూసా తన తండ్రి నుండి, ఆయన గారేమో అయ్యూబ్ తాతగారి (హజ్రత్ ఇబ్నెసాద్ – రజి) నుండి ఉటంకించిన దాని ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు : "ఏ తండ్రి కూడా తన సంతానానికి మంచి సంస్కారంకన్నా విలువైన కానుక ఏదీ ఇవ్వలేదు." (తిర్మిజీ)

### (ఆ) బానిసత్వం

ఆ రోజుల్లో బానిసలు మూడు రకాల వారుండేవారు. (1) యుద్ధఖైదీలు (2) స్వతంత్రుడైన మనిషిని పట్టుకుని బానిసగా చేసుకునేవారు, పిదప అతన్ని బానిసగా అమ్మివేసేవారు. (3) వంశపారంపర్యంగా బానిసలుగా వ్యవహరించబడేవారు.

ముహమ్మద్ (స) తనను దైవ సందేశహరునిగా ప్రకటించుకున్న సమయంలో అరేబియా సమాజం ఈ మూడు రకాల బానిసలతో నిండి ఉండేది. ఆ సమాజమంతా బానిసల వెట్టి చాకిరీతోనే నడిచేది.

యజమానులు ఆ బానిసలతో బండెడు చాకిరీ చేయించుకునేవారు. వారిని వేధించేవారు. వారిపై అత్యాచారాలు జరిపేవారు. ముహమ్మద్ (స) తెచ్చిన ప్రబోధనలు ఈ దోపిడీని నివారించాయి. బానిసలపై వారి శక్తికి మించిన భారం మోపరాదని, వారిపై దౌర్జన్యం జరపరాదని ఆ ప్రబోధనలు చాటిచెప్పాయి. ఒక బానిసను బానిసత్వం నుండి విడిపించే పని గొప్ప ఆరాధన అనీ, అది మరణానంతరం దైవప్రసన్నతకు నోచుకుని స్వర్గంలో ప్రవేశం కల్పిస్తుందని ముహమ్మద్ (స) చెప్పారు. ఎవరయినా ఒక బానిస తన యజమానికి కొంత సొమ్ము చెల్లించి స్వాతంత్ర్యం పొందగోరితే యజమాని అతనితో సహకరించాలని, ఈ విషయంలో అతనిపై ఔదార్యం ప్రదర్శించాలని కూడా ఆయన (స) నొక్కి వక్కాణించారు. ఒకవేళ ఎవరయినా తన తరఫున స్వచ్ఛందం

(Voluntarily)గా బానిసకు స్వేచ్ఛను ఇస్తే అది దైవ సన్నిధిలో ఉత్తమ ప్రతిఫలంగా పరిగణించబడుతుందని కూడా ఆయన చెప్పారు. ముహమ్మద్ (స) గారి ఈ ప్రబోధనలకు ప్రభావితులైన సహచరులు ఆనాడు ఎంతోమంది బానిసలను కొనుగోలు చేసి స్వేచ్ఛను ప్రసాదించేవారు. ఆ విధంగా వందలాది బానిసలు కాదు, వేలాది మంది బానిసలు బానిస చెర నుండి విడుదల అయ్యారు. మనిషిని సాటి మనిషి దాస్యం నుండి విడిపించే పనిని ముహమ్మద్ (స) ఉపదేశాలు చాలా గొప్ప ఆరాధనగా ఖరారు చేశాయి. దీనికిగాను అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదిస్తాడన్న వాగ్దానాన్ని కూడా గుర్తు చేయటం జరిగింది. ఈ విధంగా సాటి మనిషిని మానవుని బానిసగా చేసుకునే ఆచారానికి చరమగీతం పాడబడింది. మానవాళికి ముహమ్మద్ (స) ప్రబోధనలు చేసిన మహోపకారాల (Contribution)లో ఇదొకటి.

దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది :

> "మీ అధీనంలో ఉన్న వారిలో (బానిసలలో) ఎవరయినా ముకాతబత్ (షరతుల పత్రం) కొరకు అభ్యర్థిస్తే, వారిలో మంచితనం ఉందని మీరు గ్రహిస్తే, వారితో 'ఒప్పందం' కుదుర్చుకోండి. అల్లాహ్ మీకు ఇచ్చిన ధనం నుండి మీరు వారికి ఇవ్వండి." *(అన్ నూర్ : 33)*

అంటే స్వేచ్ఛ కొరకు వారు అభ్యర్థించుకుని ధన రూపేణా గానీ, వస్తుసేవల రూపేణా గానీ ప్రతిఫలం ఇవ్వడానికి ప్రతిపాదిస్తే అలాంటి వారిపట్ల యజమానులు విశాల హృదయంతో వ్యవహరించాలి. ఈ విధంగా ముహమ్మద్ (స) బానిసల యెడల సద్వ్యవహారం చేయమని, వారికి స్వాతంత్ర్యం ప్రసాదించమని నొక్కి వక్కాణించారు. ఈ నేపథ్యంలో ప్రవక్త (స) వారి కొన్ని ఉపదేశాలను ఉదాహరిస్తున్నాము –

> ప్రవక్త మహనీయులు (సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబూజర్ (రజి) ఉల్లేఖించారు : "వీరు (ఈ బానిసలు) మీ సహోదరులు. అల్లాహ్ వీరిని మీ చేతిక్రింద ఉంచాడు. అల్లాహ్ ఎవరి స్వాధీనంలోనయినా వారి సోదరుణ్ణి ఉంచితే, వారు అతనికి తాము తినేదే తినిపించాలి. తాము తొడిగేదే అతనికీ తొడిగించాలి. అతని శక్తికి మించిన పనిభారం అతనిపై మోపకూడదు. ఒకవేళ మీరు అతనిపై, అతను మోయలేనంత పనిభారం వేస్తే, ఆ పనిలో మీరు కూడా అతనికి సాయం చేయాలి." *(బుఖారీ, ముస్లిం)*

మహనీయుల (స) వారి మరో ప్రవచనం ఇది :

> మహనీయ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు : "ఎవరయినా ఒక వ్యక్తి ఒక ముస్లిం బానిసకు స్వాతంత్ర్యం వొసగినట్లయితే, ఆ బానిస యొక్క ఒక్కో శరీరావయవానికి బదులుగా ఇతని ఒక్కొక్క అవయవానికి అల్లాహ్ నరకాగ్ని నుండి విముక్తి నొసగుతాడు. ఆఖరికి ఇతని మర్మస్థానానికి కూడా అతని (బానిస) మర్మస్థానానికి బదులుగా విముక్తి ప్రసాదిస్తాడు." *(బుఖారీ)*

ఇక బానిస స్త్రీ పట్ల సద్వ్యవహారానికి సంబంధించి ఆయన (స) ఏమన్నారో కూడా చూడండి –

హజ్రత్ అబూ మూసా (రజి) కథనం ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ఉద్బోధించారు : "ఎవరివద్దనయినా బానిస స్త్రీ ఉండి, అతను ఆమెను ఉత్తమ రీతిలో పోషించి, ఆమెకు బానిసత్వం నుండి విడుదల చేసి, ఆమెను వివాహమాడితే అతనికి రెండింతల పుణ్యఫలం ప్రాప్తమవుతుంది" (బుఖారీ).

ఈ విధంగా బానిస స్త్రీకి స్వేచ్ఛను ప్రసాదించడమేగాక, వివాహబంధం ద్వారా ఆమెకు గౌరవం కూడా వొసగటం జరిగింది.

ముహమ్మద్ (స) గారి ప్రబోధనలు ఏవిధంగా సమాజాన్ని సంస్కరించి ఉన్నతికి చేర్చాయో, మానవ సముదాయంలో అవి మానవత రీత్యా, నైతికత రీత్యా ఎలాంటి పరివర్తనను తీసుకువచ్చాయో చూడవచ్చు. ముహమ్మద్ (స) మరియు ఖుర్ఆన్ సత్యం అన్నదానికి ఇవి ప్రబల సాక్ష్యాధారాలు.

## సమాజంలోని బలహీనవర్గాల పట్ల సత్ప్రవర్తన, వారి యెడల ప్రేమాదరణలు, వారి కష్టాలలో పాలుపంచుకోవటం

సమాజంలోని బలహీన, పీడిత వర్గాలవారిని, మానవ హక్కుల నుండి ఉపేక్షించబడిన (Neglected) వారిని ముహమ్మద్ (స) హృదయానికి హత్తుకున్నారు. సృష్టికర్త ఉపదేశాలు మానవత రీత్యా వారికి సమాన స్థానం కల్పించాయి. మానవులంతా దేవుని దృష్టిలో సమానులే. మానవులందరినీ ఆయన ప్రేమిస్తాడు. అందుచేత సాటి మానవుల యెడల సత్ప్రవర్తన కలిగి

ఉండేవారిని, మరీ ముఖ్యంగా సొసైటీలోని బలహీనులను ఆదరించేవారిని దేవుడు ఇష్టపడతాడు. తాను ఎటువంటి వారిని ఇష్టపడతాడో ఆయన తన గ్రంథంలో తెలియజేశాడు :

> "అల్లాహ్ మీది ప్రేమతో పేదలకూ, అనాథులకూ, ఖైదీలకు అన్నంపెట్టి, మేము కేవలం అల్లాహ్ (ప్రీతి) కొరకే మీకు అన్నం పెడుతున్నామని అనేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు."
>
> *(అద్ దహ్ర్ : 8,9)*

> "వారి సొమ్ములలో అడిగేవారికి, అడగని వారికి కూడా నిర్ధారిత హక్కు ఉంటుంది. వారు ప్రతిఫల దినాన్ని సత్యమని నమ్ముతారు. వారు తమ ప్రభువు శిక్షకు భయపడుతూ ఉంటారు."
>
> *(అల్ మఆరిజ్ : 24 - 27)*

> "కనుక నీవు అనాథుల పట్ల కఠినంగా ప్రవర్తించకు. యాచకుణ్ణి కసురుకోకు. నీ ప్రభువు వరాలను అభివ్యక్తం చెయ్యి."
>
> *(అజ్ జుహా : 9-11)*

> "వారి సంపదలలో అడిగే అభాగ్య జీవులకు, అడగని అభిమాన ధనులకు కూడా హక్కు ఉండేది." *(అజ్జారియాత్ : 19)*

తండ్రిలేని బిడ్డల పోషణాభారం వహించమని, వారికి సంరక్షకులుగా ఉండమని ముహమ్మద్ (స) విశ్వాసులను ప్రేరేపించారు. వారికి అన్నం పెట్టమని, వారి యెడల సద్వ్యవహారం చేయమని పదే పదే నొక్కి పలికారు. వారిని కసురుకోరాదని బోధించారు. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు :

> "ఏ ముస్లిం ఇంట అనాథ ఉంటాడో, అతని యెడల సద్వ్యవహారం జరుగుతుందో ఆ ఇల్లు అన్నిటికన్నా ఉత్తమమైనది. ఏ ముస్లిం ఇంట అనాథ ఉండగా, అతని యెడల దుర్వ్యవహారం జరుగుతుందో, ఆ ఇల్లు అత్యంత చెడ్డది." (ఇబ్ను మాజా)

ఆయన (స) అగత్యపరులను ఆదుకోమని, వారికి అన్నవస్త్రాలను సమకూర్చమని చెప్పారు. రోగులను పరామర్శించమని బోధించారు. హజ్రత్

అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా ఉద్బోధించారు :

"ఏ విశ్వాసి (మోమిన్) అయినా ఆకలిగొన్న ఒక విశ్వాసికి అన్నం పెడితే, అల్లాహ్ అతనికి ప్రళయదినాన స్వర్గంలోని ఆహారం తినిపిస్తాడు. ఏ విశ్వాసి అయినా దప్పికగొన్న ఒక విశ్వాసి దాహం తీరిస్తే, అల్లాహ్ ప్రళయదినాన అతనికి స్వచ్ఛమైన, సీలువేయబడిన మధుపానం త్రాపుతాడు. ఏ విశ్వాసి అయినా నగ్నంగా ఉన్న ఒక విశ్వాసికి వస్త్రాలు సమకూరిస్తే, అల్లాహ్ ప్రళయదినాన అతనికి స్వర్గంలోని వస్త్రాలు తొడిగిస్తాడు." *(తిర్మిజీ)*

సృష్టికర్తకు ప్రతి మనిషిపై ప్రేమ ఉంది. ప్రతి ఒక్కరి హక్కును పరిరక్షించడాన్ని సృష్టికర్త తన ప్రసన్నతతో జోడించాడు. ఈ ప్రసన్నతను చూరగొనడానికి ఒక మనిషి సాటి మనిషి హక్కును నెరవేరుస్తాడు. అలాంటి హక్కులను ఖుర్ఆన్ హదీసుల వెలుగులో ఇక్కడ పేర్కొంటున్నాము. ఈ హక్కులను ఇవ్వటం ద్వారా ఒక వ్యక్తి సత్పౌరునిగా, పరోపకారిగా రూపొందుతాడు. తద్వారా శుభప్రదమైన, ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది. ఈ ప్రబోధనలను అవలంబించిన కారణంగా సామాజిక, నైతిక విలువలు ఉన్నత స్థాయికి చేరుకుంటాయి.

## ఖుర్ఆన్ వెలుగులో తల్లిదండ్రుల హక్కులు

"తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీ వద్ద వారిలో ఒకరుగానీ, ఇద్దరు గానీ ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా 'ఛీ' అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. (వారి కొరకు) ఇలా ప్రార్థిస్తూ ఉండండి : 'ప్రభూ! వారిపై కరుణ జూపు. బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు." *(బనీ ఇస్రాయీల్ : 23, 24)*

"బంధువుల, నిరుపేదల హక్కును ఇవ్వండి."
*(బనీ ఇస్రాయీల్ : 26)*

"అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాథుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్ధించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికీ వ్యయపరచటం (గొప్ప సత్కార్యం)."

*(అల్ బఖరా : 177)*

"మీరంతా అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములుగా చెయ్యకండి. తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ, నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించాలి. పొరుగున ఉన్న బంధువులూ, అపరిచితులైన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీ జనం పట్ల ఉదారబుద్ధితో వ్యవహరించండి."

*(అన్ నిసా : 36)*

సృష్టికర్తకు ప్రతి మనిషిపై ప్రేమ ఉందని, ప్రతి మనిషీ ఆయన దృష్టిలో సమానమేనని, ఆయన తాను సృష్టించిన మనుషుల మధ్యన వ్యత్యాసం పాటించడనీ, విశ్వాసులకు (మోమినీన్‌లకు) తెలిసినప్పుడు తాము కూడా ప్రతి వ్యక్తిని ప్రేమించాలని, ఆదరించాలని, అతని కష్టసుఖాలలో పాలుపంచుకోవాలని, అతనికి సహాయ సహకారాలు అందించటం ద్వారా సృష్టికర్త ప్రసన్నతను చూరగొనాలని గ్రహించారు. ఆపైన వారి కళ్ళ ముందు సృష్టికర్త ఉపదేశాలు, ముహమ్మద్ (స) మార్గదర్శకత్వం కదలాడుతూ ఉండేవి. తత్ఫలితంగా వారు మంచి మనుషులుగా, ఆదర్శ పౌరులుగా రాణించసాగారు.

## రక్తపాతానికి, పాశవికతకు అతీతంగా – పవిత్ర జీవితాలు

అజ్ఞానం, పాశవికత అరేబియా సమాజంలో ఎంతగా ఉండేదంటే ప్రతి చిన్న విషయానికి ఫ్యాక్షనిజం పడగవిప్పేది. వర్గ తెగల మధ్యన యుద్ధాలు మొదలయ్యేవి. యుద్ధం ఒకసారి మొదలైందంటే చాలు, అది కొన్ని తరాల వరకూ నడిచేది.

వంశం, వర్ణం, భాష, ప్రాంతం, జాతి, వర్గం పేరిట దురభిమానం సరాకాష్ఠకు చేరింది. నల్లవాడు – తెల్లవాడు అన్న వివక్ష సంగతి ఇక సరేసరి. ఒకడు మరొకణ్ణి సహించేవాడు కాడు. అతి చిన్న విషయంపై కత్తులు

దూసుకునేవారు. మనిషీ – మనిషీ మధ్య ఏర్పడిన ఈ వివక్ష, అసమానతలే వారిని సర్వనాశనం చేశాయి.

## వినాశం నుండి కాపాడే మార్గం చూపారు ముహమ్మద్(స)

ముహమ్మద్ (స) ప్రబోధనలు మనిషిని మనిషిగానే సంబోధించాయి. మనుషుల మధ్య ఎలాంటి భేదభావం చూపకుండా 'మానవుని'గా గౌరవం ఇచ్చాయి. మానవులు అందరూ సృష్టికర్తచే సృష్టించబడిన వారనీ, వారంతా ఒకే తల్లిదండ్రుల సంతానమనీ చెప్పి, అసమానతలను రూపుమాపి మానవ ఏకత్వ భావనను ఇచ్చాయి.

మానవుడు – చిన్నవాడైనా, పెద్దవాడైనా – అతని మూలాలు ఒక్కటేనని, అందరూ ఆదం బిడ్డలేనని, ఆదమ్ మట్టితో చేయబడ్డారని ఈ ప్రబోధనలు నిర్దిష్టంగా చాటి చెప్పాయి.

> "మేము మానవుణ్ణి కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గారతో సృష్టించాము." *(అల్ హిజ్ర్ : 26)*

పిదప ఈ మనుజజాతి పరంపర అత్యంత అల్పమైన వీర్యంతో నడిచే పద్ధతిని సృష్టికర్త ప్రవేశపెట్టాడు. అంటే ప్రతి మనిషీ (మాతృగర్భంలో) స్ఖలించబడిన అల్పమైన రేతస్సుతో సృష్టించబడ్డాడు. అలాంటప్పుడు నేను అధికుణ్ణి, అతను అల్పుడు అని విచక్షణ పాటించే హక్కు అతనికెక్కడుంది?

ఖుర్ఆన్ ఇలా అంటోంది –

> "మేము మానవుణ్ణి పరీక్షించడానికి అతన్ని ఒక మిశ్రమ వీర్య బిందువుతో సృష్టించాము." *(అద్ దహ్ర్ : 2)*

> "మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండీ, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసినవాడూను."
>
> *(అల్ హుజురాత్ : 13)*

సృష్టికర్త అవిధేయత, అప్రసన్నత నుండి తనను కాపాడుకుంటూ, ఆయన విధించబోయే శిక్షకు భయపడేవాడే, సృష్టికర్త దృష్టిలో ఆదరణీయుడు. అతనే మనుషులందరిలోకెల్లా మంచివాడు. తాను మంచివాడు కావాలో లేదో నిర్ణయించుకునే స్వేచ్ఛాధికారం మనిషి చేతుల్లోనే ఉంది. మనిషి యొక్క ఎంపికే అతన్ని సాఫల్యానికి లేదా వైఫల్యానికి కారణమవుతుంది.

భయభక్తుల ఈ గీటురాయిని ముందుంచుకుని మనిషిని మానవత్వపు శిఖరాగ్రానికి చేర్చే అత్యుత్తమమైన పద్ధతిని సృష్టికర్త మనిషికే వదలిపెట్టాడు. ఈ గీటురాయిని ముందు పెట్టుకుని ప్రతి చదువరి అర్థం చేసుకోగలడు – ముహమ్మద్ (స)ను ప్రవక్తగా అంగీకరించి, ఆయన అందజేసిన ప్రబోధనలను అవలంబించటం వల్ల తాను ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకోగలడో! అంటే అసలు సిసలు ప్రమాణ నికషం తఖ్వా, అదే ధర్మనిష్ఠ! దైవభీతి!! దేవుని అవిధేయత నుండి తప్పించుకునే స్పృహ!!! మిగిలినవన్నీ పాక్షిక, సాపేక్షిక విషయాలే.

## అంతర్ప్రేరణ

ముహమ్మద్ (స) అందజేసిన ప్రబోధనలలోని మరో విశిష్ఠ గుణం ఏమిటంటే, అవి మనిషిలోని మనస్సాక్షిని తట్టి లేపుతాయి. తాను చేసే ప్రతి పనినీ దేవుడు గమనిస్తూ ఉన్నాడు, ఆ పని మంచిదేనా? కాదా? అతను దైవానికి విధేయత చూపుతున్నాడా? లేక అవిధేయతకు పాల్పడుతున్నాడా? అతను ఏ మంచి పని చేసినా దైవం మెప్పుకోసమే చేస్తున్నాడా లేక పరుల మెప్పు కోసం చేస్తున్నాడా? అనే విషయం అతన్ని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంచుతుంది. అతనిని క్రియాశీలునిగా మలిచే మరో ఫ్యాక్టర్ (Factor) తీర్పుదినాన జరిగే న్యాయం. అది అతనిలో జవాబుదారీ భావనను దృఢతరం చేస్తుంది. ఈ లోకంలో తాను చేసిన ప్రతి పనికీ ప్రళయదిన అధినేత సమక్షంలో జవాబు ఇవ్వవలసి ఉంది, ఆ పనిలోని మంచీ చెడుల ఆధారంగానే తనకు స్వర్గమో నరకమో లభించనుంది. అందులోనే తాను కలకాలం ఉండవలసి ఉంది అన్న ఆలోచన అతనిని అనుక్షణం హెచ్చరిస్తూ ఉంటుంది. దాంతో అతను ఏ సత్కార్యం చేసినా సత్సంకల్పంతో చేస్తాడు. దైవప్రసన్నత కోసమే చేస్తాడు. దైవప్రవక్త (స) చూపిన విధానానికి అనుగుణంగా చేస్తాడు. ఈ సందేశానికి, సందేశహరునికి ప్రభావితులైన వారు చరిత్ర సృష్టించారు. వారు

మానవత్వానికే నిర్వచనంగా చరిత్రలో నిలిచిపోయారు. ఈ సద్ఫలితాలు కూడా సందేశహరుని సత్య నిబద్ధతకు సాక్షీభూతంగా ఉన్నాయి.

## విశ్వసించినవారు పీడనలను భరించి, ముహమ్మద్ (స) సత్యవంతుడైన ప్రవక్త అని నిరూపించారు

తమ స్వార్థ ప్రయోజనాల కోసం విశ్వసించేందుకు నిరాకరించినవారు విశ్వసించిన వారిపై జులుం చేశారు. వారిని వేధించారు, పీడించారు, వారిపై అత్యాచారాలు జరిపారు.

వారి అమానుష చర్యలను సభ్యసమాజం ప్రత్యక్షంగా వీక్షించింది. జరిగేదంతా అన్యాయం, దౌర్జన్యం అని వారికి తెలుసు. ఇంతకీ వారిపై జరిగే దౌర్జన్యానికి కారణమేమిటయ్యా అంటే, వారు తమ తాతముత్తాతల మతాచారాన్ని విడిచిపెట్టి ఏకేశ్వరోపాసనను బోధించే ధర్మాన్ని ఆశ్రయించటమే. 'దేవుని ఏకత్వపు' నమ్మకం మనిషిలో విశిష్ఠ నడవడికి ప్రాతిపదిక అవుతుంది. ఈ ఏకత్వపు భావనలో దేవుని దైవత్వపు గుణాలు, అధికారాలు అన్నీ ఆయన ఒక్కడిలో ఏకత్రమై ఉంటాయి. కాబట్టి ఆయనకే ప్రణమిల్లాలి. ఆయనకే తలవంచాలి. ఆయన్నే నమ్ముకోవాలి. ఆయనపైనే కార్యభారం మోపాలి. ఆయన్నే అర్థించాలి. ఆయన్నే ప్రేమించాలి. ఈ విధంగా మనిషి చేసే సకల ఆరాధనలు ఆయన ప్రసన్నత కొరకే ప్రత్యేకమై ఉండాలి.

అయితే ఇక్కడ గమనార్హమైన విషయం ఏమిటంటే, ధర్మావలంబన విషయంలో మనిషికి స్వేచ్ఛ ఇవ్వబడింది. ప్రతి వ్యక్తికీ తనకు ఇష్టమైన ధర్మాన్ని అవలంబించే హక్కు ఉంది. అతని ఈ వ్యక్తిగత స్వేచ్ఛ (Personal Liberty)ని ఎవరూ హరించలేరు. ఈ స్వేచ్ఛను దేవుడే మనిషికి ఇచ్చి ఉన్నప్పుడు, దానిని ఎవరూ కాదనలేరు. ఈ స్వేచ్ఛాయుత మార్గంలో అవరోధం కల్పించటం, తన హక్కును వినియోగించుకోకుండా అడ్డుకోవటం ఒకవిధంగా "జులుం" అవుతుంది. దానికి తోడు శారీరకంగా, మానసికంగా వేధించటం, సామాజిక దాడులు జరపటం దారుణం.

తమపై ఎన్ని దాడులు జరిగినా, తమను ఎంతగా వేధించినా తాము నమ్మి నడుచుకునే ఏకేశ్వరోపాసనా మార్గాన్ని విడిచిపెట్టేది లేదన్న విశ్వాసుల (మోమినీల) వైఖరి విజ్ఞులను, సభ్య సమాజ సభ్యులను ఆలోచింపజేసింది. ముమ్మాటికీ ఇది దేవుని ఏకత్వం (తౌహీద్)లో ఉన్న విశిష్ఠత, ఇది మనిషిని

ఉన్నత స్థానానికి చేర్చుతుంది, కాని బహుదైవోపాసనలో ఆ సుగుణం లేదు. అది కొన్ని సందర్భాలలో మానవుణ్ణి మానవత్వపు స్థానం నుండి దిగజార్చి, అజ్ఞానాంధకారం వైపునకు తీసుకుపోతుంది.

అయితే దీనికి ప్రతిగా దైవ సందేశహరుడు అందజేసిన సందేశం విశ్వాసుల జీవితాలనే మార్చివేసింది. అదే సమయంలో అమాయకులపై జరిగిన దౌర్జన్యాలకు వారు వహించిన సహనాన్ని చూసి విజ్ఞులకు కనువిప్పు కలిగింది. ఇది కూడా పైగంబరు ప్రబోధనలలోని వాస్తవికతను పగటి వెలుగులా సుస్పష్టం చేసింది. సత్యామృతాన్ని ఆస్వాదించిన దివ్యాత్మలపై కాలపు కాళనాగులు విరుచుకుపడి కాటేసినా, వారు ఓపికలో అందెవేసిన చేయిగా నిరూపించు కోవటం, తాము నమ్మిన సందేశంపై కదలని కొండలా స్థిరంగా ఉండటం చరిత్రలో అరుదైన దృష్టాంతం. నిశ్చయంగా ఇది ముహమ్మద్ (స) తెచ్చిన సందేశంలోని ప్రమాణబద్ధత (Authentic) కు ప్రబల తార్కాణం. ఇదంతా జాగ్రత్తగా గమనిస్తూ వచ్చిన మానవతలోని సత్యబలమున్న వర్గం విశ్వాసుల అనుపమ త్యాగాలకు అమితంగా ప్రభావితం అయింది. అదే సమయంలో ఈ సందేశాన్ని త్రోసిపుచ్చేందుకు వ్యతిరేకుల వద్ద హేతుబద్ధమైన ఆధారాలుగానీ, నైతికమైన ఆధారాలు గానీ లేకుండాపోయాయి. అందుకే వారు అమానుషాల, అత్యాచారాల పద్ధతిని ఎన్నుకున్నారు. ఇస్లాం ధర్మం స్వీకరించిన వారిని వెనక్కి మళ్ళించడానికి వారు అవలంబించిన హింసాపూరిత వృత్తాంతాలు వర్ణనాతీతం. వాటిని గురించి చదువుతుంటేనే ఒల్లు జలదరిస్తుంది. శరీరంలోని రోమాలు నిక్కబొడుచుకుంటాయి. అయినప్పటికీ ఆ త్యాగధనులు ఎంత కాలితే అంతే కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసిపొయ్యారు. ధర్మపథంలో నికార్సుగా నెగ్గుకువచ్చారు.

## అత్యాచారాలు, ఆగడాల సంక్షిప్త వృత్తాంతం

### మహనీయ బిలాల్ (రజి)

హజ్రత్ బిలాల్ బిన్ రిబాహ్ (రజి) ఒక బానిస. నీగ్రో కూడా. ముహమ్మద్ (స) పిలుపునకు ఈ దళిత హృదయం సకారాత్మకంగా స్పందిం చింది. అందరి సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, యజమాని ఒక్కడే అయి ఉండాలన్న విషయం ఆయన మనోఫలకంపై చెరగని ముద్రవేసింది. అందుకే ఆయన ఆనాటి విగ్రహాలన్నింటినీ తిరస్కరించారు. సత్య తిరస్కారుల

చిత్రహింసను భరిస్తూ కూడా అహద్, అహద్ (ఆ దేవుడు ఒక్కడే ... ఒక్కడే) అంటూ ఉండేవారు. మధ్యాహ్నం మలమలా మాడే ఎండలో మక్కాలోని ఇసుక మైదానాలపై ఈయన్ని పడుకోబెట్టి, ఈయన ఛాతీపై బరువైన రాయి పెట్టేవారు. మెడలో త్రాడు వేసి తుంటరి పిల్లవాళ్ళకు అప్పగించేవారు. వాళ్లు మక్కా పర్వత కనుమల్లో బిలాల్‌ను ఈడ్చుకుంటూ తిరిగేవారు. అయినా ఆయన నోట స్థిరంగా ఒకే నినాదం వెలువడేది – **"అహద్ ... అహద్"**.

## హజ్రత్ అమ్మార్ (రజి)

అమ్మార్ తల్లిదండ్రులు, ఆయన పినతండ్రి తీవ్రమయిన బాధల్ని భరిస్తూ అసువులు బాసారు. కాని తాము నమ్మిన సత్యం నుండి మాత్రం విముఖులు కాలేదు. సత్యం సత్యమేనని స్పష్టంగా రూఢీ అయింది. హజ్రత్ అమ్మార్‌ను అగ్ని చువ్వలతో వాతలుపెట్టారు. నీటిలో ముంచి నానా తిప్పలు పెట్టారు. అయినా ఈయన తన ధర్మంపై నిలకడ కలిగి ఉన్నారు.

## హజ్రత్ ఖబ్బాబ్ (రజి)

హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ పదహారణాలా అరబ్బు. అయితే పసితనంలో దుండగులు ఈయన్ని పట్టుకుని వచ్చి బానిసగా అమ్మేశారు. కమ్మరి పనిచేసేవారు. కత్తులు, కటారులు చేసేవారు. కాని ఈయన విశ్వాసి (మోమిన్)గా మారారని తెలిసిన నాటి నుండీ ఈయనపై కష్టాల కొండలు విరుచుకుపడ్డాయి. ఈయన యజమానులు ఈయనకు వేతనం ఇవ్వకుండా ఆర్థికంగా ఆంక్ష విధించారు. నిప్పులపై పడుకోబెట్టారు. ఆ సమయంలో ఆయన కదలకుండా ఉండటానికి ఆయన ఛాతీపై రాయిపెట్టేవారు. అప్పుడు నిప్పు వేడికి ఆయన శరీరం నుండి కారిన క్రొవ్వుతో అగ్ని చల్లారిపోయేది.

కొంతమంది తమ కన్న కొడుకులకు అన్నం పెట్టకుండా శిక్షించేవారు. వారిపై కొరడా ఝుళిపించేవారు. అలా కొడుతూ కొడుతూ అలసిపోతే కాస్సేపు విశ్రాంతి తీసుకున్న తరువాత మళ్ళీ కొట్టేవారు.

విశ్వసించిన బానిస స్త్రీల పట్ల కూడా ఇలాంటి దుర్వ్యవహారమే జరిగేది.

తగు కారణమేదీ లేకుండా తోటి మానవులను హింసించే ఈ అమానుష చేష్టలపై వివేకవంతులు ఆలోచించారు. వారి అంతరాత్మ మేల్కొంది. దాంతో వారు నిర్భయంగా ముందుకు వచ్చి సత్యధర్మాన్ని స్వీకరించసాగారు.

ఈ విధంగా సత్య తిరస్కారుల హింస వారికే బెడిసికొట్టింది. పీడిత ప్రజలు అనుదినం బాధల్ని భరిస్తూ కూడా తాము నమ్మిన ధర్మంపై కదలని కొండలా స్థిరంగా నిలబడటం ప్రజల మనస్సాక్షిని కుదిపివేసింది. అందుకే వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సత్యామృతాన్ని ఆస్వాదించసాగారు.

## దివ్య ఖుర్ఆన్ అసాధారణ వాక్కు అవటం కూడా, అది సృష్టికర్త వాక్కు అనడానికి ప్రబల తార్కాణమే

సత్యవిషయాన్ని సత్యమని మనసు సాక్ష్యమిస్తుంది. కేవలం మనసే కాదు, మనిషి ఆచరణ కూడా దీనికి సాక్ష్యంగా నిలుస్తుంది. ఈ మనసు, ఈ ఆచరణ ఎవరో తటస్థ వ్యక్తిది కాదు, ఇస్లాం బద్ధవిరోధిది, అతను ఆ సత్యాన్ని నోటితో తిరస్కరించినాడు. ఇలాంటి ఒక సంఘటనను చరిత్ర పుటలు భద్రపరిచాయి. అలాంటివారు ఒకరిద్దరు కాదు సుమా! మొత్తం ముగ్గురు. ఆ ముగ్గురు ధర్మవిరోధుల మనసు, వారి చేతలు ముహమ్మద్ (స) తీసుకువచ్చిన వాక్కును సత్యమని ధ్రువపరిచాయి. అసలు విషయం ఏమిటంటే మానవ నైజం సత్యం వైపునకు లాక్కెళుతుంది. మనిషి తన ప్రాపంచిక ప్రయోజనాల దృష్ట్యా సత్యాన్ని పైకి తిరస్కరించినప్పటికీ మానవ నైజం వాంఛించే దానిని మాత్రం త్రోసిపుచ్చలేదు.

ప్రవక్త మహనీయులు (స) దైవ సందేశాన్ని బహిరంగంగా ప్రకటించిన తొలి కాలంలో ఒకరోజు రాత్రి ఏం జరిగిందంటే; ఇస్లాం విరోధులైన అబూజహల్, అబూ సుఫ్యాన్, అఖ్నస్ బిన్ షరీఖ్ – ఈ ముగ్గురు రాత్రి పూట ముహమ్మద్ (స) నమాజులో పఠించే ఖుర్ఆన్‌ను వినడానికి తమ ఇండ్ల నుండి బయలుదేరారు. అంటే ఆ వాక్కులోని మధురిమ వారిని వారి ఇండ్ల నుండి తన వైపునకు లాగింది. ఆ ముగ్గురిలో ఒకరింకొకరికి తాము వస్తున్న సంగతి తెలియదు. తెల తెలవారుతుండగా వారు ఒకరినొకరు చూసుకున్నారు. తమను తామే నిందించుకున్నారు. ఇక మీదట ఎన్నడూ అలా చేయకూడదని ఒట్టేసుకున్నారు. ఎందుకంటే ఈ విధంగా – రాత్రివేళ దొంగచాటుగా ఖుర్ఆన్ వింటున్నామన్న సంగతి జనులకు తెలిస్తే అది ఎన్నో అనుమానాలకు తావునిస్తుంది. కాని రెండో రోజు కూడా మళ్లీ అదే కథ పునరావృతమయింది. మళ్లీ ఒట్టేసుకున్నారు. అయితే మూడో రోజు రాత్రి కూడా అదే సీను. అంటే వాళ్లు ఆ మధురవాణి నుండి తమ్ము తాము ఆపుకోలేకపోతున్నారు.

దీనిని బట్టి బోధపడేదేమిటంటే ముహమ్మద్ (స) పఠించే వాక్కు సాధారణమయింది కాదు, అది అసాధారణమైన, అద్వితీయమైన దైవప్రోక్తం. అది మానవ రచన కాదు. ఈ కారణంగానే పగటివేళ ముహమ్మద్ (స)ను బాధించే సత్యతిరస్కారులు రాత్రివేళ చాటుమాటుగా ఖుర్ఆన్ పారాయణాన్ని వినేవారు. అలా విన్నవారు ఒక్కరు కాదు, ముగ్గురు. వారి రహస్యం బయటపడేసరికి, ఇకమీదట ఇలాంటి చేష్టకు పాల్పడబోమని పరస్పరం వాగ్దానం చేసుకున్నారు. కాని ఆ సత్యవాక్కులోని ఆకర్షణా శక్తి వాళ్లను మళ్లీ మళ్లీ లాక్కుని వచ్చింది. తమ లోగుట్టు ప్రజలకు తెలిస్తే తలవంపు తప్పదని భయపడుతూనే నిరంతరం మూడురాత్రులు వచ్చారు. ఏ సందేశం నుండి జనసామాన్యాన్ని ఆపుతున్నారో, అదే సందేశాన్ని దొంగచాటుగా రాత్రిపూట వింటున్నారు. అదీ విచిత్రం!

ముహమ్మద్ (స) తన వ్యక్తిత్వంలో సత్యసంధులైనట్లే, ఆయన అందజేసిన సందేశం కూడా నిలువెల్లా సత్యమైనది.

## సృష్టికర్త సందేశం, తన సత్యబద్ధతను ఆధారాలతో సహా సమర్పిస్తోంది

### (1) తల్లి గర్భాశయంలో శిశువు క్రమ వికాసం

దీనికి సంబంధించి ముహమ్మద్ (స) తెచ్చిన సందేశం ఏమంటుందో చూద్దాం –

> "మేము మానవుణ్ణి మట్టి సారంతో సృష్టించాము. తరువాత మేమతనిని నీటి (వీర్య) బిందువు రూపంలో ఒక సురక్షిత స్థానంలో ఉంచాము. తరువాత మేము ఆ నీటి బిందువును జిగట పదార్థంగా చేశాము. తరువాత దానిని మాంసపు ముద్దగా చేశాము. పిదప ఆ మాంసపు ముద్దలో ఎముకలను సృజించాము. దరిమిలా ఆ ఎముకలపై మాంసం ఎక్కించాము. ఆపైన దానిని మేము సరికొత్త సృష్టిగా ఆవిష్కరించాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదమైనవాడు. అత్యుత్తమ సృష్టికర్త. ఆ తరువాత మీరు తప్పక మరణించవలసి ఉంది. పిమ్మట మీరు ప్రళయదినాన అవశ్యంగా లేపబడతారు."
>
> *(అల్ మోమినూన్ : 12 – 16).*

ముహమ్మద్ (స) తెచ్చిన సందేశం చెప్పేదేమిటంటే, మొట్టమొదటి

సారిగా మానవుడు మట్టితో చేయబడ్డాడు. ఆ తరువాత అతని సృష్టి ప్రక్రియ– ఒక పద్ధతి ననుసరించి జరిగింది. దీని ననుసరించి అనేక దశల (Stages)ను అధిగమిస్తూ మానవుడు మాతృగర్భంలో క్రమవికాస మొందుతాడు. ముహమ్మద్ (స) ఈ విషయాన్ని ప్రకటించిన కాలంలో దీని గురించి ఎవరికీ తెలీదు. తల్లి గర్భాశయంలో మానవ క్రమవికాసం(Human Study)కి సంబంధించిన సైన్సు అప్పట్లో ఇంతగా వృద్ధి చెందలేదు. దీనిని గురించి అధ్యయనం చేసే పరికరాలు (Instruments) కూడా అప్పట్లో లేవు. ముహమ్మద్ (స) ఒక నిరక్షరాసి అయివుండి గర్భాశయంలో శిశువు పెరుగుదలను గురించి సూక్ష్మాతిసూక్ష్మంగా – దశల వారీగా (Phase by Phase) విడమరచి చెప్పటం అసంభవమైన విషయం. దీనినిబట్టి విదితమయ్యే దేమిటంటే మాతృగర్భంలో శిశువు క్రమవికాసానికి సంబంధించిన సమాచారాన్ని మనిషిని సృష్టించిన సృష్టికర్తే ఇచ్చి ఉంటాడు. ఈ విషయం సృష్టికర్త తరఫు నుండి అయి ఉన్నప్పుడు, ముహమ్మద్ (స) గ్రంథం ఆధారంగా చెప్పేదంతా సృష్టికర్త తరఫునే అయి వుండాలి. అంటే ముహమ్మద్ (స) సృష్టికర్త పంపిన సందేశాన్ని మానవాళికి అందజేస్తున్నారు. ముహమ్మద్ (స) తరఫున సమర్పించబడే ప్రతి విషయం, దానిని ఆయన దేవుని తరఫు నుండి వచ్చినదని చెబుతున్నప్పుడు, ఆ విషయం దైవిక (Divine) విషయమవుతుంది, ప్రామాణిక (Authentic) విషయం అవుతుంది.

## సందేశం ప్రామాణికమైనదనడానికి మరొక దృష్టాంతం

### (2) సముద్రంలో రెండు రకాల నీళ్ళు ఉండటం, అవి పరస్పరం కలుసుకోకపోవటం

ముహమ్మద్ (స) అందజేసిన సందేశం ప్రమాణబద్ధమైన దనడానికి మరొక సనదును ఇదే సందేశం నుండి – అంటే ఖుర్ఆన్ నుండి – గ్రహిద్దాం. నడి సముద్రంలో ఉప్పు నీరుతోపాటు మంచి నీరు (తియ్యని నీరు) ఉండటం. ఆ రెండు రకాల నీళ్లు పరస్పరం కలుసు (Mixup) కాకుండా ఉండటం, తియ్యని నీరు కలుషితం కాకుండా సురక్షితంగా ఉండటం, ప్రయాణీకులు దానిద్వారా లబ్ది పొందటం. దీనికి సంబంధించిన 'ఆవిష్కరణ' ముహమ్మద్ (స) సందేశంలో ఉంది. మరి చూడబోతే ముహమ్మద్ (స) ఎన్నడూ సముద్ర ప్రయాణం చేయలేదు. ఆనాటి అరబ్బు పౌరులకు ఈ వాస్తవం తెలియదు కూడా. కాబట్టి నిశ్చయంగా ఈ జ్ఞాన సరోవరం అగోచర జ్ఞాని అయిన

విశ్వప్రభువు వద్ద నుండే జాలువారి ఉండాలి. అంటే ముహమ్మద్ (స) సమర్పించిన ఈ సందేశం యదార్ధానికి ముహమ్మద్ (స)ది కాదు, అది విశ్వసార్వభౌమాధికారిది.

ముహమ్మద్ (స) తీసుకువచ్చిన సృష్టికర్త సందేశం ఈ యదార్ధాన్ని ఇలా ప్రస్తావించింది –

"రెండు జల ప్రవాహాలను (సముద్రాలను) కలిపినవాడు ఆయనే. ఇదేమో తియ్యనిది, అదేమో ఉప్పగా, చేదుగా ఉండేది. వాటి మధ్యన ఆయన ఒక తెరను ఉంచాడు – పటిష్టమైన అడ్డుగోడలాగా! అది వాటిని వేరుగా ఉంచుతుంది." *(అల్ ఫుర్ఖాన్ – 53)*

మరొకచోట ఇలా సెలవిచ్చాడు :

"రెండు సాగర జలాలను కలసి ప్రవహించేలా వదలినవాడు ఆయనే. అయితే రెండింటి మధ్య ఒక అడ్డుతెర ఉంది. దానిని అవి దాటిపోవు. మరి మీరు మీ ప్రభువు యొక్క ఏ ఏ అద్భుతాలను కాదనగలరు?"
*(అర్రహ్మాన్ : 19 – 21)*

## ముహమ్మద్ (స) పట్ల, ఆయన తీసుకువచ్చిన సందేశం పట్ల సంతృప్తి

ఇప్పటి వరకూ జరిగిన సుదీర్ఘమయిన చర్చ ద్వారా సంతృప్తికరంగా అవగతమైన విషయం ఏమిటంటే, ముహమ్మద్ (స) ఒక సత్యవంతుడైన, నమ్మకస్థుడైన ప్రవక్త. ఆయన తీసుకువచ్చిన సందేశం కూడా ప్రామాణికమైనది. అంటే – సందేశం, సందేశహరుడు రెండునూ విశ్వ ప్రభువు తరఫున పంపబడినవే. ముహమ్మద్ (స) అందజేసిన ప్రతి ఒక్క వచనం అక్షర సత్యమని రుజువు అయినప్పుడు, ఆయన ఉదాహరించే ప్రతి ఆధారం (Reference) ప్రమాణబద్ధం (Authentic) అనీ, దైవికమని తేలినప్పుడు, మరో ప్రశ్నకు కూడా సమాధానం మనం తెలుసుకుందాం – అదేమంటే, సృష్టికర్తకీ – ఆయన సందేశహరునికి మధ్య సందేశాన్ని చేరవేసే సాధనం (Link) ఏదై ఉండేది? దీనికి సమాధానంగా సృష్టికర్త పంపిన గ్రంథం ఉండనే ఉంది. అదే దివ్య ఖుర్ఆన్. దానిని గనక అధ్యయనం చేసినట్లయితే, సృష్టికర్త స్వయంగా ఈ సందేశాన్ని ముహమ్మద్ (స) వరకు చేరవేయించిన విధానం ఏమిటో అర్ధమవుతుంది ....

> "మీ సహచరుడు (ముహమ్మద్ –స) దారి తప్పనూ లేదు, అపమార్గానికి లోను కానూ లేదు. అతను తన మనసు కోరినట్లుగా కూడా మాట్లాడడు. అతనేం చెప్పినా, అది అతనికి పంపబడే వహీ (దివ్యవాణి) అయి ఉంటుంది. అది అత్యంత శక్తిమంతుడు (అయిన దైవదూత) నేర్పినది. అతడు శక్తి, యుక్తి కలవాడు. అతను (కర్తవ్యబోధ చేసేందుకు) నిలబడ్డాడు. అతడు ఎత్తయిన ఆకాశపుటంచుపై ఉన్నాడు. ఆ తరువాత సమీపించసాగాడు ... మరింత క్రిందికి వచ్చాడు. రెండు ధనస్సులంత దూరాన లేదా అంతకన్నా దగ్గరగా ఉండిపోయాడు. తరువాత అల్లాహ్ తన దాసునికి వహీ చేయవలసినది వహీ చేశాడు. దైవప్రవక్త మనసు అతను చూసిన దానిని అబద్ధమంటూ కొట్టివేయులేదు. అలాంటప్పుడు మీరు అతను చూసిన దానిపై అతనితో వాదులాడుతున్నారా? అతను మరోసారి కూడా అతనిని (దైవదూత జిబ్రీల్‌ని) దిగుతుండగా చూసి ఉన్నాడు." *(అన్ నజ్మ్ : 2 – 13)*

దైవ సందేశహరుడు ఏమి చెప్పినా తన తరఫున చెప్పడు. అతని వద్దకు దైవవాణి వస్తుంది. దైవవాణి (వహీ) ద్వారా విషయం తెలిసిన మీదటే అతను ఏం చెప్పినా చెబుతాడు. అందుకే అతను చెప్పేది సత్యం. ఆ విషయాన్ని అతను స్వయంగా కల్పించలేదు. ఆ గ్రంథాన్ని చదివిన తరువాత అర్థమయ్యేది కూడా యిదే – ఇది మానవ రచన కానేకాదు. ఎందుకంటే మానవ రచనకు – దైవప్రోక్తానికి మధ్య భూమ్యాకాశాలంత వ్యత్యాసం ఉంటుంది. ఉంది కూడా. అదీగాక ఈ ఖుర్ఆన్ గ్రంథం తన స్వంత వాక్కు కాదనీ, ఇది దైవ గ్రంథమనీ ముహమ్మద్ (స) స్వయంగా చెప్పారు.

అల్ అంబియా సూరా ఏడవ ఆయత్‌లో కూడా ఈ విషయం వచ్చింది :

> "నీకు పూర్వం కూడా మేము మానవులనే ప్రవక్తలుగా చేసి పంపాము. మేము వారివద్దకు 'వహీ' (దివ్యవాణి) పంపేవారము. మీకు గనక (ఈ విషయం) తెలియకపోతే గ్రంథవహులను అడిగి తెలుసుకోండి."

అన్ నహ్ల్ సూరా 43, 44 ఆయత్‌లలో కూడా 'వహీ' ద్వారా గ్రంథాన్ని పంపిన ప్రస్తావన వచ్చింది –

> "(ప్రవక్తా!) మేము నీకు పూర్వం కూడా మానవులనే ప్రవక్తలుగా చేసి పంపాము. వారివద్దకు మేము దివ్యవాణి (వహీ)ని పంపే వారము. ఒకవేళ మీకు తెలీకపోతే జ్ఞాపిక (గ్రంథం) కలిగి ఉన్న వారిని అడిగి తెలుసుకోండి. మేము వారిని (ఆ ప్రవక్తలను) స్పష్టమయిన నిదర్శనాలతో, గ్రంథాలతో సహా పంపాము. అలాగే మేము నీపైన కూడా జ్ఞాపిక (ఖుర్ఆన్)ను అవతరింపజేశాము – మేము మానవుల కొరకు పంపిన దానిని నీవు వారికి విపులీకరించ టానికి, తద్వారా వారు ఆలోచించటానికి."

దైవ సందేశాన్ని అందజేసే ఒకే ఒక్క ప్రామాణికమైన (Standard) పద్ధతి మొదటి నుండీ నడుస్తూ వచ్చింది. ఒక రాజు తన సేవకుల ద్వారా తన ఉత్తరాలను నగర ప్రముఖుల వద్దకు పంపినట్లే, ఒక ప్రత్యేక వ్యక్తికి సందేశాన్ని చేరవేయడానికి సృష్టికర్త తన 'దూత'ను ఉపయోగించుకుంటాడు. పిదప ఆ సందేశాన్ని మానవాళికి చేరవేసే బాధ్యతను ఆ 'ప్రత్యేక వ్యక్తి' (దైవప్రవక్త)పై మోపుతాడు. ఇది సృష్టికర్త యొక్క సహజమైన విధానం! ఎంతో యుక్తితో కూడుకున్న పద్ధతి!! ఇంతకు మించి ఆ దైవదూతకు గానీ, ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన వ్యక్తికి గానీ మరో అధికారం లేదు. వారిద్దరూ దేవుని దైవత్వంలో భాగస్వాములు కాజాలరు. ప్రపంచంలో మనుషులు వారిని ప్రార్థిస్తే, వారి పనులు చేసిపెట్టే అధికారం కూడా వారికి లేదు.

> "యదార్థమేమిటంటే, అల్లాహ్ దైవదూతలలో నుండి, మానవులలో నుండి కూడా తన సందేశ వాహకులను ఎన్నుకుంటాడు. ఆయన అంతా వినేవాడు, అంతా గమనించేవాడూను." *(అల్ హజ్జ్ : 75)*

దైవ సందేశాన్ని దైవదూత దేవుడు ఎంపిక చేసిన 'ప్రత్యేక వ్యక్తి'కి అందజేస్తాడు. దేవుడు ఆ ప్రత్యేక వ్యక్తిని తన సందేశహరునిగా మానవుల వద్దకు పంపిస్తాడు. దైవ సందేశహరుడైన ఈ మానవుడు తన మాటల ద్వారా, చేతల ద్వారా కూడా దైవదాసులైన మానవులకు – హెచ్చుతగ్గులు లేకుండా – సందేశాన్ని అందజేస్తాడు.

తన సందేశాన్ని తన దాసులకు అందజేయడానికి అల్లాహ్ అవలంబించిన పద్ధతి (Methodology) ఏమిటంటే, సజ్జనుడైన తన దాసుల వరకూ 'వహీ' (దివ్యావిష్కృతి) ద్వారా విషయాన్ని అందజేయటం. ఈ 'వహీ'ని దేవుని ప్రత్యేక దూత తీసుకుని అవతరిస్తాడు.

"(ఓ ప్రవక్తా!) శక్తిమంతుడూ, వివేకవంతుడు అయిన అల్లాహ్ నీ వైపునకూ, నీకు పూర్వం గడచినవారి (ప్రవక్తల) వైపునకూ దివ్యవాణిని పంపుతూ వచ్చాడు." *(అష్ షూరా – 3)*

"నీవు పురముల కేంద్రం (మక్కా) వారికి, దాని పరిసరాలలో నివసించేవారికి భయబోధ చేయడానికీ, అందరూ సమావేశమయ్యే ఆ రోజు గురించి సావధానపరచడానికి మేము నీ వైపునకు అరబీ ఖుర్ఆన్‌ను పంపాము, ఆ రోజు రావటంలో సందేశానికి ఆస్కారమే లేదు. (అప్పుడు) ఒక వర్గం స్వర్గంలో ఉంటే, మరో వర్గం నరకాగ్నిలో ఉంటుంది." *(అష్ షూరా – 7)*

పై ఆయత్‌ల ద్వారా అవగతమయ్యే దేమిటంటే పూర్వం గతించిన ప్రవక్తల కొరకు ఏ విధానం అవలంబించబడిందో అదే విధానం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) విషయంలోనూ అవలంబించటం జరిగింది. ఈ దివ్య వచనాల ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే, మనుషులంతా ప్రవక్త చెప్పినట్లు వినరు. కొందరు ప్రవక్తను అనుసరించి స్వర్గంలో ప్రవేశిస్తే, మరికొందరు ప్రవక్త మాట వినకుండా నరకాగ్నికి ఆహుతి అవుతారు. కాబట్టి ప్రవక్త సందేశాన్ని తిరస్కరిస్తున్నవారు కాస్త ఆగి, తమ అంతిమ పరిణామం గురించి ఆలోచించాలి.

దైవప్రవక్త పవిత్ర ఖుర్ఆన్ ఆధారంగా తన పరిచయం చేసుకుంటాడు. తాను కూడా అందరిలాంటి మానవమాత్రుణ్ణేనని, అయితే తన వద్దకు దైవవాణి వస్తుందని అంటాడు. అందరి సృష్టికర్త, నిజ ఆరాధ్యదైవం ఒక్కడేనని ఆ సందేశంలో స్పష్టంగా చెప్పబడింది :

"(ప్రవక్తా!) వారికి చెప్పు : 'నేనూ మీలాంటి ఒక మానవమాత్రుణ్ణే. కాకపోతే నాకు దివ్యవాణి (వహీ) పంపబడుతుంది. మీ ఆరాధ్య దైవం ఒకే ఆరాధ్య దైవం. కనుక తన ప్రభువుతో సమావేశమవ్వాలని ఆశించేవాడు సదాచరణ చేయాలి. తన ప్రభువు దాస్యంలో వేరెవరినీ భాగస్వామిగా చేర్చరాదు." *(అల్ కహ్ఫ్ – 110)*

అంటే పైగంబరులు కూడా మానవులే. అయితే వారి వద్దకు దైవసందేశం పంపబడుతుంది. అంటే, వారిపై చాలా ముఖ్యమైన బాధ్యత మోపటం జరుగుతుంది.

అల్లాహ్ తన దాసులతో ప్రత్యక్షంగా సంభాషించకుండా, సందేశాన్ని అందజేసే వేరే పద్ధతిని అవలంబిస్తాడు. దాని వెనుక దాగివున్న పరమార్థాన్ని దిగువ నిస్తున్నాము. సందేశాన్ని అందజేసే మూడు పద్ధతులు అవలంబించబడ్డాయి. వాటిని గురించి అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో ప్రస్తావించాడు :

> "ఏ మానవ మాత్రుడూ అల్లాహ్‌తో ప్రత్యక్షంగా సంభాషించలేదు. అయితే వహీ (దివ్యవాణి) ద్వారా గానీ, తెర వెనుక నుంచి గానీ లేదా ఆయన పంపిన దైవదూత ద్వారా గానీ ఇది సంభవమే. అదైనా అల్లాహ్ అనుజ్ఞతో ఆయన కోరిన సందేశాన్ని (వహీని) మాత్రమే అందజేయగలడు. నిశ్చయంగా ఆయన మహోన్నతుడు, వివేకసంపన్నుడు." *(అష్ షూరా - 51)*

అంటే ప్రవక్త మాధ్యమంతో దాసులకు దైవ సందేశం అందుతుంది. ప్రవక్త కూడా మానవమాత్రుడే కాబట్టి సృష్టికర్త ఆయనతో కూడా ప్రత్యక్షంగా సంభాషణ జరపడు. 'వహీ' ద్వారా ఈ సంపర్కం జరుగుతుంది.

## 'వహీ'ని అందుకున్నప్పటి పరిస్థితి

మొట్టమొదటిసారి దివ్యవాణి (వహీ) అవతరించినప్పుడు ముహమ్మద్ (స) సహజంగానే భయాందోళనకు గురయ్యారు. ఆ వైనాన్ని చరిత్ర రికార్డు చేసింది. దైవదూత జిబ్రీల్ దైవ సందేశం తీసుకుని అవతరించినప్పుడు, సృష్టికర్త సందేశాన్ని వినిపిస్తూ 'పఠించు' అని చెప్పినప్పుడు ముహమ్మద్ (స) పరిస్థితి ఎలా ఉందో ఖుర్‌ఆన్ గ్రంథంలోని 'అల్ అలఖ్' సూరాలోని మొదటి అయిదు వచనాలలో ఉంది.

ముహమ్మద్ (సఅసం) భయాందోళనతో హిరా గుహ నుండి తన నివాస గృహానికి వచ్చారు. తన సతీమణి హజ్రత్ ఖదీజా (ర.అ)తో, "దుప్పటి కప్పు. నా ప్రాణం పోయేలా ఉంద"ని అన్నారు. ఇది సహజం కూడా. ఎందుకంటే అప్పటి వరకూ ముహమ్మద్ (సఅసం) గారికి 'వహీ' గురించి తెలీదు. దైవదూతను కూడా ఆయన అప్పటి వరకూ చూడలేదు.

తొలి కాలంలో ఖుర్‌ఆన్‌ను తీసుకుని దైవదూత జిబ్రయీల్ (అ) అవతరిస్తున్నప్పుడు ముహమ్మద్ (స) ఆ సందేశాన్ని గ్రహించడానికి తొందర తొందరగా నోరాడించేవారు. సందేశాన్ని మరచిపోతానేమోనన్న భయంతో

ఆయన (స) అలా చేసేవారు. 'వహీ'ని గ్రహించడానికి తొందరపడవలసిన అవసరం లేదనీ, దానిని జ్ఞాపకం చేయించటం, అర్థం చేసుకునేలా చేయడం మా బాధ్యతనీ అభయం ఇవ్వటం జరిగింది. ఈ విషయం కూడా ఖుర్ఆన్‌లో రికార్డు అయివుంది. దీనినిబట్టి విదితమయ్యే దేమిటంటే, ఖుర్ఆన్ విశ్వ సార్వభౌమాధికారి తరఫున అవతరింపజెయ్యబడింది. అల్ ఖియామా సూరా 16వ ఆయత్ నుండి 19వ ఆయత్ వరకూ ఇలా సెలవీయబడింది –

> "ఓ ప్రవక్తా! నీవు దీనిని తొందరగా గ్రహించే తపనతో, దీనిని పఠించేటప్పుడు నీ నాలుకను వేగంగా త్రిప్పకు. దీనిని కూర్చే, వినిపించే బాధ్యత మాది. కనుక మేము దీనిని వినిపించేటప్పుడు నీవు శ్రద్ధగా వింటూ ఉండు. తరువాత దీనిని విశదపరచే బాధ్యత మాది."

అల్ ఆలా సూరా 6వ ఆయత్‌లో ఇలా అనబడింది :

> "(ప్రవక్తా!) మేము నిన్ను చదివిస్తాము. తరువాత నీవు దానిని మరువజాలవు".

దివ్య ఖుర్ఆన్ అవతరించిన సమయంలో ఏర్పడే బాహ్య పరిస్థితి గురించి కూడా ప్రస్తావించటం జరిగింది. ఆ పరిస్థితి దగ్గరున్నవారు గమనించే వారు. ఉదాహరణకు : తీవ్రమైన చలికాలంలో 'వహీ' అవతరించినాసరే ముహమ్మద్ (స) ముఖారవిందంపై స్వేత బిందువులు కనిపించేవి. ముఖం కందిపోయేది. ఖుర్ఆన్ అవతరించిన సమయంలో ఆయన (స) ఒంటెపై స్వారీ అయివుంటే, ఒంటె ఆ ఒత్తిడికి తట్టుకోలేక కూర్చుండిపోయేది.

మరొక ముఖ్యమయిన సంఘటన కూడా ఖుర్ఆన్‌లో పేర్కొనబడింది. ఖుర్ఆన్ కచ్చితంగా దైవవాణి అన్నదానికి అది ప్రబల సాక్ష్యాధారం. సృష్టికర్త తాను కోరినప్పుడే సందేశాన్ని అవతరింపజేస్తాడు. తాను కోరినప్పుడు దానిని ఆపివేస్తాడు. సందేశం తనకు అందినప్పుడే సందేశహరుడు దానిని ప్రజలకు చేరవేస్తాడు. సందేశం అందనప్పుడు అతను నిస్సహాయునిలా ఉండిపోతాడు. ఇదిగో ఆ సంఘటన ఇది ...

ఖురైషు నాయకులు ముహమ్మద్ (స)ను పరీక్షించడానికి మూడు చారిత్రక సంఘటనలపై ప్రశ్నలు వేశారు. నిజంగానే ముహమ్మద్ (స) వద్దకు దైవసందేశం వస్తోందా? లేక ఈయనగారు తన తరఫున మాటల్ని

కల్పిస్తున్నాడా? అని వారు పరీక్షించదలిచారు. ఈ వృత్తాంతాలు నిజానికి మక్కా ప్రజలకు కూడా తెలీవు. కేవలం యూదుల, క్రైస్తవుల చరిత్ర గ్రంథాలలో మాత్రమే అవి నమోదై వున్నాయి. ఈ మూడు సంఘటనల గురించి చెప్పమని మక్కా ఖురైషులు ప్రశ్నించినప్పుడు, “రేపు చెబుతాను” అని ముహమ్మద్ (స) వాగ్దానం చేశారు. అల్లాహ్ తరఫున వచ్చే ‘వహీ’ని విని సమాధానం ఇవ్వగలనని ఆయన అనుకున్నారు. కాని కొన్ని రోజుల వరకు దివ్యవాణి (వహీ) రాలేదు. ముహమ్మద్ (స) ఆందోళనకు లోనయ్యారు. ఆయన గారి ఈ పరిస్థితిని చూసి ఇస్లాం విరోధులు ఎత్తిపొడుపు మాటలన్నారు. కొన్ని రోజులు గడచిన తరువాత వహీ అవతరించింది. ఆ మూడు చారిత్రక సంఘటనలు కూలంకషంగా వివరించబడ్డాయి. అవి కేవలం గాథలు కావు, వాటిలో మార్గబోధన కూడా ఉంది. ఈ సందర్భంగా ముహమ్మద్ (స)కు చేయబడిన ఉపదేశం కూడా గమనార్హమైనది. ప్రవక్తా! నీవు ఎప్పుడయినా, ఎవరికయినా వాగ్దానం చేస్తే ‘ఇన్‌షా అల్లాహ్’ (దైవచిత్తమయితే) అని పలుకు, ఎందుకంటే మానవుడు అశక్తుడు. ముహమ్మద్ (స)కు ఈ విషయం బాగా అవగతమయ్యేలా చెయ్యడానికే తాత్కాలికంగా ‘వహీ’ అవతరణ నిలిపివేయటం జరిగింది.

ఈ నేపథ్యంలో సృష్టికర్త, విశ్వ సార్వభౌముడు తన ప్రవక్తకు చేసిన ఉపదేశం ఇలా ఉంది :

> “ఏ పని విషయంలోనయినా ‘ఇది రేపు చేస్తాను’ అని అనకు. ‘దైవచిత్తమయితే చేస్తాను’ (అని అను). నీవు మరచిపోయినప్పుడల్లా నీ ప్రభువును స్మరించుకో. ‘నా ప్రభువు నాకు మేలుకు సంబంధించి ఇంతకన్నా దగ్గరి మార్గం చూపుతాడని ఆశిస్తున్నాను’ అని చెప్పు.”
>
> *(అల్ కహ్ఫ్ – 23, 24)*

ఈ అధ్యాయం (Chapter) లో కూలంకషంగా జరిపిన చర్చ ద్వారా, ముహమ్మద్ (స) సృష్టికర్త తరఫున ఎంపిక చేయబడిన ప్రవక్త అనీ, ఆయన అందజేసిన గ్రంథం ఖుర్‌ఆన్ దైవ గ్రంథమనీ సుబోధకం అయి ఉంటుందని ఆశిస్తున్నాము. నిజ జ్ఞానానికి సంబంధించి ఇవి రెండూ మూల సరోవరాలు.

**మూడవ అధ్యాయం :**

**(Chapter - III)**

# విశ్వ సార్వభౌముని గ్రంథం : ఖుర్ఆన్ – ఒక చూపులో!

- గ్రంథం తన పరిచయం తాను చేసుకుంటుంది.
- అది అల్లాహ్ గ్రంథం అని ఖుర్ఆన్ ప్రకటిస్తోంది ... ఆధారాలతో సహా.
- ఖుర్ఆన్ తన రచయితను పరిచయం చేసుకుంటుంది.
- అల్లాహ్ స్వయంగా తన గ్రంథం ద్వారా తన పరిచయం చేసుకుంటాడు.
- విశ్వప్రభువు తన గ్రంథపరిచయం గ్రంథం ద్వారానే చేయిస్తాడు.
- ఖుర్ఆన్ పరిచయం : గ్రంథ యజమాని తరఫున, ఆయన ఆరాధ్య గుణాలతో సహా.
- ఖుర్ఆన్ యజమాని తరఫున ఖుర్ఆన్ యొక్క సమగ్ర పరిచయం ... జ్ఞానం, వివేకం దాని ప్రత్యేకత.
- ఖుర్ఆన్ ఏ మానవుడిదీ కాదు, అది అల్లాహ్‌ది.
- గ్రంథ యజమాని అల్లాహ్‌యే ... ఆరాధన కేవలం అల్లాహ్ కొరకే.
- ఖుర్ఆన్ విశిష్ఠత ... హెచ్చరిక, మార్గబోధన.
- గ్రంథం, ప్రవక్త – రెండూ అల్లాహ్ తరఫుననే.
- ఖుర్ఆన్, ప్రవక్త – దైవ సందేశాన్ని చేర్చే సాధనాలు.
- ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త.
- దైవప్రవక్త, ఖుర్ఆన్ – చాలా ముఖ్యమైన వస్తువును తెచ్చాయి.
- ఈ గ్రంథం అందరిదీ.
- సృష్టికర్త గ్రంథం సమస్త మానవాళిది.
- ఖుర్ఆన్ ప్రధాన చర్చనీయాంశం మానవుడే.
- ఖుర్ఆన్ – మార్గబోధన.
- ఖుర్ఆన్ ప్రత్యేకత.

- ఖుర్‌ఆన్ మనిషిని అల్లాహ్‌తో కలుపుతుంది.
- సృష్టికర్త తన గ్రంథం ద్వారా మానవులకు మార్గదర్శకత్వం వహిస్తాడు.
- ఖుర్‌ఆన్ ధర్మకాంటా.
- ఖుర్‌ఆన్ అవతరణ ముఖ్యాశయం.
- ఖుర్‌ఆన్ పరిచయం.
- ఖుర్‌ఆన్ స్పష్టంగా, అందరికీ అర్ధమయ్యేలా మార్గదర్శనం చేసే గ్రంథం.
- ప్రభు సందేశం ప్రత్యేకత – అది సూటిగా, సులభంగా, హెచ్చరిక చేసేదిగా ఉంటుంది.
- ప్రజలకు అర్ధమయ్యే భాషలో ...
- ఎవరి మాట ఎన్నదగినది?
- ఖుర్‌ఆన్ ప్రక్షిప్తాలకు అతీతమైన గ్రంథం.
- దైవగ్రంథం ప్రామాణికంగా, సురక్షితంగా ప్రజలకు చేరాలి.
- నమ్మకం, సంతృప్తి.
- ఖుర్‌ఆన్ సురక్షితంగా ఉంది.
- ఖుర్‌ఆన్ సురక్షితంగా ఉండటం అత్యంత అవసరం.
- దైవగ్రంథాలలోకెల్లా అధునాతన కృతి.
- ఖుర్‌ఆన్ ఇతర ఆకాశ గ్రంథాలను ధ్రువపరుస్తుంది.
- ఖుర్‌ఆన్ దైవప్రోక్తం. ఇది వెనుకటి దైవగ్రంథాలను సత్యమని ధ్రువీకరిస్తుంది.
- ఇతర మత గ్రంథాల ప్రబోధనలతో సారూప్యం.
- ఖుర్‌ఆన్ ఒక అపురూప కానుక.
- సన్మార్గం పొందడానికి విజ్ఞత వివేచనలను వినియోగించటం.
- ఖుర్‌ఆన్ సవాలు.
- ఖుర్‌ఆన్ పట్ల తిరస్కార వైఖరి ప్రభావం చాలాదూరం వరకు ఉంటుంది.
- ఖుర్‌ఆన్ ఆదరణీయం, విశ్వసనీయం, అనుసరణీయం.
- సన్మార్గం పొందే ఉద్దేశ్యంతో గ్రంథాన్ని అధ్యయనం చేస్తే మార్గదర్శకత్వం, కారుణ్యం ప్రాప్తమవుతుంది.
- అమోఘమయిన గ్రంథం.

# విశ్వ సార్వభౌముని గ్రంథం - ఖుర్ఆన్

## (1) ఖుర్ఆన్ స్వీయపరిచయం

### గ్రంథం తన పరిచయం తానే చేసుకుంటుంది

వెనుకటి అధ్యాయంలో సహేతుకమైన నిదర్శనాలతో, చారిత్రక ఆధారాలతో ముహమ్మద్ (స) అందజేసిన సందేశం సత్యబద్ధమని, అది సృష్టికర్త సందేశమనీ, మానవాళి మార్గదర్శకత్వం కొరకు ఆయన ఈ సందేశాన్ని అవతరింపజేశాడని తెలుసుకున్నాం. తద్వారా ఈ గ్రంథం సత్యమన్న సంతృప్తి మనసుకు కలిగింది. ఇప్పుడు మార్గబోధనకై 'గ్రంథం' వైపునకు మరలుదాం. అది తన పరిచయాన్ని తానే చేసుకుంటోంది.

ఖుర్ఆన్ తన గురించి తానే పరిచయం చేసుకుంటుంది. ప్రతి వ్యక్తీ తనకు తెలియని – అపరిచితుడైన – వ్యక్తిని కలుసుకున్నప్పుడు, ముందు తన గురించి పరిచయం చేసుకుంటాడు. కలుసుకోవడానికి గల కారణాన్ని కూడా వివరిస్తాడు. ఆ తరువాత మరిన్ని విషయాలు చెబుతాడు. ఇదే సాధారణ పద్ధతి, సహజమైన పద్ధతి కూడా. ఈ గ్రంథం కూడా ఇదే పద్ధతిని అవలంబించింది. ఈ గ్రంథం (ఖుర్ఆన్) ఎవరిదో, దీని రచయిత ఎవరో మనిషికి తెలియదు కాబట్టి, ఇది సర్వజ్ఞాని, వివేకవంతుడైన దేవుని గ్రంథమని ఈ గ్రంథం స్వయంగా చెప్పుకుంటుంది. ఈ గ్రంథాన్ని దేవుని తరపున మానవాళికి చేరవేసిన మానవుడు దైవప్రవక్త ముహమ్మద్ (స) అని కూడా ఈ గ్రంథం సూటిగా, స్పష్టంగా చెబుతోంది. ఆ ప్రవక్త (స) ఈ గ్రంథంలోని ప్రబోధనలను విడమరచి చెబుతాడనీ, క్రియాత్మకంగా వాటిని అనుసరణీయ మైనవిగా నిరూపిస్తాడని కూడా ఈ గ్రంథం అంటోంది.

ఆ విధంగా ఈ గ్రంథం తన స్వీయ పరిచయం చేసుకోవడంతో పాటు, తనను తీసుకువచ్చిన వాని పరిచయం కూడా చేస్తుంది. తనను ఈ భువిపైకి పంపిన వాని పరిచయం కూడా చేస్తుంది. మానవుని కోసం అది తీసుకువచ్చిన మార్గదర్శక సూచనలు (Instructions) ఏవో కూడా చాలా స్పష్టంగా విశదీకరిస్తుంది.

> "ఈ గ్రంథం శక్తిశాలి, వివేచనాశీలి అయిన దేవుని తరఫున అవతరింపజేయబడింది. నిశ్చయంగా మేము ఈ గ్రంథాన్ని నీ వైపునకు సత్యంతో అవతరింపజేశాము. కనుక నీవు నీ ధర్మాన్ని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని, ఆయనను మాత్రమే ఆరాధించు. బాగా విను! స్వచ్ఛమయిన ధర్మం (ఆరాధన, విధేయత) మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది." *(అజ్ జుమర్ : 1 – 3)*

పైన వచ్చిన ఆయత్‌లలో మూడు విషయాలున్నాయి – (1) ఇది అల్లాహ్ గ్రంథం. అల్లాహ్ మహాజ్ఞాని, వివేచనాపరుడు. (2) ఈ గ్రంథాన్ని తీసుకువచ్చినవారు ప్రవక్త ముహమ్మద్ (స). (3) ఈ గ్రంథాన్ని అవతరింపజేయటంలోని ముఖ్య ఉద్దేశం ప్రజలు కేవలం దైవదాస్యం చేయటం.

## ఇది దైవగ్రంథమని ఖుర్ఆన్ ప్రకటించటం ... సాక్ష్యాధారాలు

నేను విశ్వ సార్వభౌమాధికారి గ్రంథాన్ని. నా సంబోధితుడు మానవుడు. మానవుల బాగోగుల పట్ల నాకు ఆసక్తి ఉంది. నేను మనిషిని ఒక మంచి మనిషిగా, మానవునిగా మలచగోరుతున్నాను. అలా మలిచాను కూడా. చరిత్ర పుటలను తిరగవేయండి. నిష్పక్షపాతంగా చరిత్రను పరిశీలించి చూడండి – అలనాడు అరేబియా సమాజమంతా రక్తంతో తడిసి ముద్ద అయి ఉంది. నీతి బాహ్యత, విశృంఖలత్వం పెచ్చరిల్లిపోయి ఉండేది. అరాచకం, విధ్వంసం రాజ్యమేలేది. అమాయకులపై, అబలలపై దౌర్జన్యం జరిగేది. అలాంటి గడ్డు సమయంలో నేను ఏ విధంగా మనిషిని, పూర్తి సమాజాన్ని ఆ అంధకార లోయల్లో నుంచి పైకెత్తి మానవత్వపు కాంతి శిఖరాలకు చేర్చానో కాస్త తరచి చూడండి. నేటికీ నాలో ఆ సత్తా ఉంది. నా ప్రబోధనలలో ఎలాంటి మార్పులు చేర్పులు జరగలేదు. బాగా ఆలోచించి, అర్థం చేసుకుని క్రియాత్మక జీవితంలో వాటిని ప్రవేశపెట్టి చూడండి. అవే తియ్యని పండ్లు ఫలాలను ఇస్తాను.

వివిధ రాజ్యాలలో మనుషులు తమ రాజ్యాంగ నిర్మాణంలో భాగంగా

స్వయంగా రూపొందించుకున్న సూత్రాలు, శాసనాలు నా మాదిరిగా మనిషిని మానవునిగా మలచలేకపోయాయి. నా మాదిరిగా శాంతి సౌమనస్యాలు వర్ధిల్లే, మానవత్వం పరిమళించే సత్సమాజాన్ని తయారు చేయలేకపోయారు. చరిత్రలో అలాంటి ఉదాహరణ దొరకదు. దీని అర్థం ఏమిటంటే నా ప్రబోధనలు, నా మార్గదర్శక నియమాలు, నా శాసనాలు అత్యుత్తమమైనవి, అద్వితీయ (Unique) మైనవి. అనుపమ (Unparallel) మైనవి. నేను సమర్పించే నియమ నిబంధనలు, శాసనాలు మానవ నైజానికి అనుగుణమైనవి, ఈ నైజాన్ని ఎరిగినవాడు ప్రసాదించినవి. అందుకే వాటిద్వారా ఒక అత్యుత్తమ మానవ సమాజం ఉనికిలోకి వచ్చింది. ఆ సత్తా నేటికీ వీటిలో ఉంది. ఎందుకంటే అందులో మార్పు రాలేదు. మానవ నైజంలో కూడా మార్పు రాలేదు.

నా మాదిరిగా నిర్దేశిక నియమాలను, శాసనాలను సమర్పించి, అత్యుత్తమమైన మానవ సమాజాన్ని నిర్మించి చూపమన్న నా సవాలు (Challenge)ను మానవుడు స్వీకరించలేదు. నా సవాలుకు సమాధానం అతనివ్వలేదు. ఇవ్వలేకపోతున్నాడు, ఇవ్వలేడు. కాబట్టి నేనే సత్యాన్ని. అంటే నేను విశ్వసామ్రాట్టు యొక్క గ్రంథాన్ని. నాలో ఉన్న శాసనాలు విశ్వసామ్రాట్టు యొక్క శాసనాలు. మానవుల సృష్టికర్త సమ్మతించి ఆమోదించిన శాసనాలు. ఈ నియమాలను, శాసనాలను అమలుపరచడానికి కావలసిన అంతర్ప్రేరణా శక్తి కూడా వాటిలో ఉంది. నేను సృష్టికర్త అయిన అల్లాహ్ గ్రంథాన్ని అనడానికి ఇవి ప్రబల తార్కాణాలు. నేను ఏది చెప్పినా అది అల్లాహ్ తరఫుననే. అల్లాహ్ తన గురించిన సమగ్ర పరిచయం నా ద్వారా చేయించుకున్నాడు. దీని వివరాలు "విశ్వ సార్వభౌముడే నిజ ఆరాధ్య దైవం" అన్న అధ్యాయంలో రానున్నాయి.

మానవ నైజంలో మంచీ చెడులను పరికించే ఇంద్రియ జ్ఞానం (Sense) ఏదైతే ఉన్నదో దానిని నేను (ఖుర్ఆన్) మరింత సున్నితమైనది (Sensitive) గానూ, జ్యోతిర్మయం (Enlightened) గానూ రూపొందిస్తాను. మంచీ చెడులను నిర్దిష్టంగా, నిర్ద్వంద్వంగా విశ్లేషించి ఆంతర్యాన్ని ప్రకాశమానం చేస్తాను.

## (2) గ్రంథ రచయిత పరిచయం

### ఖుర్ఆన్ తన రచయిత పరిచయం చేస్తుంది

జీవిత సత్యాలను, విశ్వమండల వాస్తవాలను గుర్తుచేయడానికి సృష్టికర్త మళ్ళీ తన వద్ద నుండి ఒక గ్రంథరాజాన్ని తన ప్రత్యేక దాసుని

ద్వారా పంపాడు – ఈ జ్ఞాపకం తరువాత జనులు మార్గభ్రష్టత నుండి తమను రక్షించుకోవాలని.

కనుక మానవుల విజ్ఞతా వివేచనలు వాంఛించే దేమిటంటే, వారు సర్వసృష్టికి కర్త, పాలకుడు, పోషకుడు, సర్వాధికారి, సర్వజ్ఞాని అయిన వానిని పూజించాలి. అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్ఆన్ ద్వారా, ఖుర్ఆన్‌ను పంపటంలోని ఉద్దేశ్యాన్ని విశదీకరిస్తున్నాడు ఎందుకు? ఎందుకంటే ప్రజలు గ్రంథాన్ని ఆదరించి, తద్వారా చిత్తశుద్ధితో తమ జీవితాలలో లబ్ది పొందుతారని ...

> "భయపడే వానికి జ్ఞాపిక (ఉపదేశం)గా మాత్రమే మేము దీనిని అవతరింపజేశాము. భూమినీ, ఎత్తయిన ఆకాశాలను సృష్టించిన వాని తరఫున ఇది అవతరింప జేయబడినది. ఆ అపార కరుణామయుడు విశ్వ అధికార పీఠం (అర్ష్)పై ఆసీనుడై ఉన్నాడు. ఆకాశాలలో ఉన్నదీ, భూమిలో ఉన్నదీ, ఆ రెండింటి మధ్యన ఉన్నదీ, భూమి అడుగున ఉన్నదీ – అంతా ఆయనదే. నీవు నీ మాటను బిగ్గరగా పలికినా ఫరవాలేదు. ఆయనైతే మెల్లిగా చెప్పినా, అంతకన్నా గుట్టుగా చెప్పినా తెలుసుకుంటాడు. ఆయనే అల్లాహ్! ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు. అతి సుందరమైన పేర్లన్నీ ఆయనవే." *(తాహా : 3 – 8)*

## అల్లాహ్ స్వయంగా తన గ్రంథం ద్వారా స్వీయ పరిచయం చేసుకుంటాడు

తన గురించి సృష్టికర్తకే బాగా తెలుసు. ఆయన స్వీయ పరిచయం ఆయనైతేనే బాగా చేసుకోగలడు. చాలా చక్కగా, అర్ధమయ్యేలా చేయగలడు. ఖుర్ఆన్ ద్వారా ఆయన ఆ పని చేయించాడు.

ఖుర్ఆన్ ఇలా అంటోంది:

> "మీ దేవుడు ఒకే దేవుడు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేదు." *(అల్ బఖరా – 163)*

పరిచయంలో రెండే రెండు విషయాలు చాలా స్పష్టంగా, గట్టిగా చెప్పబడ్డాయి – (1) ఒకటి : ఆయన ఏకత్వం (2) రెండు : ఆయన కారుణ్యం.

**(3) గ్రంథ పరిచయం**

విశ్వ సార్వభౌముడు తన గ్రంథ పరిచయం 'గ్రంథం' ద్వారానే చేయిస్తాడు :

"ఇది దైవ గ్రంథం. ఇందులో సందేహానికి తావేలేదు. భయము, భక్తి కలవారికి ఇది మార్గదర్శిని." *(అల్ బఖరా - 2)*

గ్రంథం ఆరంభంలోనే గ్రంథ యజమాని అయిన అల్లాహ్ గ్రంథ పరిచయం ఇలా చేశాడు : ఇది నా గ్రంథం. నా గ్రంథం అన్న విషయంలో ఎలాంటి సందేహానికి, సంశయానికి ఆస్కారం ఉండకూడదు. బాగా పరిశీలించి, పరిశోధించి చూడండి. ఇది నా గ్రంథం గనక ఇందులో చెప్పబడినవన్నీ నూటికి నూరుపాళ్ళు నిజమైనవి. ఇందులోని ఏ ఒక్క విషయం కూడా తప్పుడు విషయంగానీ, వాస్తవ విరుద్ధం గానీ కాదు. ప్రతిదీ అక్షర సత్యం. ఎందుకంటే ఇందులోని ఏ మాట కూడా అంచనాలపై, ఊహలపై ఆధారపడినది కాదు. ఎందుకంటే సర్వం తెలిసినవాడైన సృష్టికర్త తరఫున చెప్పబడిన విషయాలివి. పై ఆయత్‌లో చెప్పబడినట్లు మానవుని మార్గదర్శకత్వం నిమిత్తం ఈ గ్రంథం వచ్చింది. పుట్టినప్పటి నుండి మరణించేవరకూ అతని జీవితాంతం అది మార్గబోధినిగా ఉంటుంది. వ్యక్తిగత జీవితంలో, సామూహిక జీవితంలో కూడా అది మార్గదర్శినిగా ఉంటుంది. సన్మార్గ దర్శకత్వం మనిషి మౌలిక అవసరం. అతను లక్ష్యబద్ధమైన జీవితం గడిపి సుఖశాంతులు పొందడానికి ఇది చాలా అవసరం. సన్మార్గం ప్రతి ఒక్కరి కొరకూ తెరచుకునే ఉంది. అయితే ఈ గ్రంథం ద్వారా మార్గదర్శకత్వం పొందడానికి మొట్టమొదటి షరతు ఏమిటంటే, సన్మార్గాన్ని పొందాలన్న తపన ఆరాటం మనిషిలో ఉండాలి. అపమార్గం నుండి తనను కాపాడుకోవాలన్న పట్టుదల ఉండాలి. ఖుర్ఆన్ చూపే మార్గాన్ని స్వీకరించి, తదనుగుణంగా ఆచరించేవాడే జీవితం గడిపే రాచబాటను పొందుతాడు. ఇదే సిసలైన మార్గదర్శకత్వం.

## ఖుర్ఆన్ పరిచయాన్ని గ్రంథ యజమాని తన దైవత్వ గుణాలతో సహా చేయటం

విశ్వ ప్రభువు అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్ఆన్‌లో ఇలా ప్రకటిస్తున్నాడు : ఇది నా గ్రంథం. కాబట్టి దీనిని తేలిక (Easy) గా తీసుకోకండి. దీనిపట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబించకండి.

ఇది సృష్టికర్త గ్రంథమని పరిచయం చెయ్యడంతో పాటు అల్లాహ్ తనలోని దైవత్వ గుణాలను కూడా ప్రస్తావించాడు. తద్వారా నిజ ఆరాధ్య దైవం యొక్క సంతులన దృక్పథం లభిస్తుంది. ఇవి ఎటువంటి మనోహరమైన గుణాలంటే, మానవ నైజం సహజంగానే తన నిజ ఆరాధ్య దైవం వైపునకు మనిషిని లాక్కెళుతుంది. అయినప్పటికీ ఒకవేళ మనిషి అహంభావంతో

అజ్ఞానిగా వ్యవహరిస్తే, దయామయుడు, క్షమాశీలుడైన ఆరాధ్య దైవం గురించి పరిచయం అయిన తరువాత కూడా తన ఆత్మకు అన్యాయం చేసుకుంటే అతను కఠిన శిక్షకు సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే ఆరాధ్య దైవం తరఫున చేయబడిన వాగ్దానం సత్యమై ఉంటుంది. గ్రంథ యజమాని తన గ్రంథం ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రకటిస్తున్నాడు :

> "ఈ గ్రంథం శక్తిమంతుడు, జ్ఞానధనుడు అయిన అల్లాహ్ తరఫున అవతరింపజేయబడినది. ఆయన పాపాలను క్షమించేవాడు, పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు. కఠినంగా శిక్షించేవాడు, అపార అనుగ్రహశాలి. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన వైపునకే మరలిపోవలసి ఉంది." *(అల్ మోమిన్ – 2, 3)*

స్వీకరించినా, స్వీకరించకపోయినా ఒక్కటేనని అనుకోరాదు. మీరంతా మా వైపునకే మరలిరావలసి ఉంది – బహుమానం పొందటానికికో లేక శిక్షను అనుభవించడానికో.

## ఖుర్‌ఆన్ యజమాని తరఫున ఖుర్‌ఆన్ సమగ్ర పరిచయం ... విజ్ఞానం, వివేకం దాని విశిష్టత

సృష్టికర్త తరఫున వచ్చే గ్రంథం విశిష్టత ఏమిటంటే, అది జ్ఞానంతో, యుక్తితో నిండి ఉంటుంది. అందులో పొరపాట్లు ఉండవు. అనవసరమైన విషయం కూడా ఉండదు. ఎట్టి పరిస్థితిలోనూ దాసునికి హాని కలిగించే మాట అందులో ఉండదు. అది ఆసాంతం కారుణ్యం. అల్లాహ్ తన గ్రంథాన్ని పరిచయం చేస్తూ ఇలా హెచ్చరిస్తున్నాడు :

> "ఇవి వివేకంతో నిండివున్న గ్రంథ వచనాలు." *(యూనుస్ – 1)*

## ఖుర్‌ఆన్ మానవ గ్రంథం కాదు

**ఖుర్‌ఆన్ మానవ విరచితం కాదు. ఇది దైవగ్రంథం.**

ఈ గ్రంథం ముహమ్మద్ (స) ద్వారా మానవ సమాజానికి అందిన విషయం నిజమేగాని, ఇది ముహమ్మద్ (స)చే రచించబడినది మాత్రం కాదు, ఇది దైవప్రోక్తం. ఇలాంటి గ్రంథాన్ని పంపగలిగే శక్తి, అధికారం ఆయనకు మాత్రమే ఉంది. ఇంకా ఈ గ్రంథాన్ని పంపటంలో ఎన్నో పరమార్థాలున్నాయి. ఇది విజ్ఞతా వివేచనలతో నిండి ఉంది.

"ఈ గ్రంథ అవతరణ శక్తిమంతుడు, వివేచనా ధురంధరుడు అయిన అల్లాహ్ తరపున జరిగింది." *(అల్ జాసియహ్ - 2)*

హిక్మత్ (విజ్ఞతా వివేచనల)తో నిండినది అంటే అర్థం, దీనివల్ల లాభాలేగాని నష్టాలుండవు. ఈ లాభాలు పలుకోణాల (Multidirectional) నుండి ఉంటాయి. వివేకంతో కూడిన విషయంలో సమత్వం, సమతూకం ఉంటుంది.

## గ్రంథ యజమాని అల్లాహ్ ... ఆరాధన కేవలం అల్లాహ్ కొరకే

ఎవరయినా వేరొకరికి ఒక గ్రంథాన్ని కానుకగా ఇస్తున్నాడంటే, ఇచ్చే వ్యక్తి ఆ గ్రంథ రచయితే అయి ఉండనవసరం లేదు. అలాగే ముహమ్మద్ (స) ఈ గ్రంథాన్ని మానవ సోదరులకు ఇచ్చినంత మాత్రాన ఆయనే ఈ గ్రంథ రచయిత అయి ఉండాలన్న ఆవశ్యకత లేదు. తాను ఈ గ్రంథ రచయితను కానని, ఇది సృష్టికర్త ప్రదానం చేసిన గ్రంథమని, ఆయనే దీని రచయిత అని ముహమ్మద్ (స) స్వయంగా చెప్పారు. మానవాళి మార్గదర్శకత్వం నిమిత్తం సృష్టికర్త దీనిని నిజాయితీపరుడైన సందేశహరుని ద్వారా పంపాడని సృష్టికర్త ఘంటాపథంగా చెప్పాడు. అంతేకాదు, కేవలం ఆ ప్రభువునే సేవించాలని కూడా ఆ సార్వభౌముడు నిర్ద్వంద్వంగా ప్రకటించాడు :

"ఈ గ్రంథం శక్తిశాలి, వివేచనాశీలి అయిన దేవుని తరపున అవతరింపజేయబడినది. నిశ్చయంగా మేము ఈ గ్రంథాన్ని నీ వైపునకు సత్యంతో అవతరింపజేశాము. కనుక నీవు నీ ధర్మాన్ని కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకుని, ఆయనను మాత్రమే ఆరాధించు. విను! నిష్కల్మషమైన ధర్మం (ఆరాధన, విధేయత) మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది." *(అజ్ జుమర్ : 1,2,3)*

## ఖుర్ఆన్ సృష్టికర్త ప్రోక్తమేగాని ప్రవక్త ప్రోక్తం కాదు

దివ్య ఖుర్ఆన్ మానవ వాక్కు కాదు. దానిని సమర్పించిన వాని వాక్కు కూడా కాదు. పైగా అది మానవులను సృష్టించిన వాని వాక్కు కాబట్టి ఏ మానవమాత్రుడు కూడా దీనిలాంటి వచనాన్ని రచించలేడు. ఈ విషయమై ఖుర్ఆన్ ఖుద్దుగా సవాలు విసురుతోంది -

> "ఏమిటీ, ఇతనే (ప్రవక్తే) దీనిని కల్పించుకున్నాడని వారంటున్నారా? వారికి చెప్పు : 'మీరు దీనిని పోలిన ఒక్క సూరానయినా (రచించి) తీసుకుండి. మీరు గనక సత్యవంతులే అయితే – అల్లాహ్ తప్ప – ఎవరెవరిని పిలుచుకుంటారో పిలుచుకోండి." *(యూనుస్ – 38)*

'ఇది ప్రవక్త గ్రంథం' అనటం ప్రవక్తపై ఒక నిందారోపణే. వాస్తవానికి ప్రవక్త స్వయంగా ప్రకటిస్తున్నారు – ఇది దైవగ్రంథమని. అందుకే దివ్య ఖుర్ఆన్ నిస్సందేహంగా దైవగ్రంథమే గాని, ముహమ్మద్ (స) రచన కాదు.

## ఖుర్ఆన్ విశిష్టత ... హెచ్చరిక, మార్గబోధన

తాను మహోన్నతుడగు ప్రభువు తరఫున అవతరించిన గ్రంథాన్ని అని ఖుర్ఆన్ స్వయంగా పరిచయం చేసుకుంటోంది. అది మానవమాత్రుని ద్వారా మానవాళికి అందజేయబడినప్పటికీ, తన రాకలోని ఉద్దేశాన్ని అది వివరిస్తోంది. తన దగ్గర ఉన్న సందేశం ఏమిటో, ఏ విధంగా అది సత్యాసత్యాలను, మంచీ చెడులను వేరుపరుస్తుందో కూడా చెబుతోంది. తాను ఏ విధంగా మానవాళిని నరకాగ్ని నుండి కాపాడుతుందో, ఈ ప్రాపంచిక జీవితపు వాస్తవికత ఏమిటో, తాను మానవుని జీవితానికి ఎలా మార్గదర్శకత్వం (Guide) వహిస్తుందో కూడా ఇది విడమరచి చెబుతోంది ...

> "సకల లోకాల ప్రభువు తరఫున అవతరింపజేయబడిన గ్రంథం ఇది. ఇందులో సందేహానికి ఆస్కారమే లేదు. ఏమిటి, ఈ వ్యక్తి స్వయంగా దీనిని కల్పించుకున్నాడని వారంటున్నారా? వాస్తవానికి ఇది నీ ప్రభువు తరఫు నుండి (వచ్చిన) సత్యం – తద్వారా నీవు, నీకు పూర్వం హెచ్చరించే వాడెవడూ రాని జాతి వారిని సావధానపరచాలని! తద్వారా వారు సన్మార్గం పొందాలని?"
>
> *(అస్ సజ్దహ్ – 2,3)*

పై ఆయత్ ద్వారా ఖుర్ఆన్ స్వయంగా, తనను తీసుకువచ్చిన వానిపై మోపబడిన నిందారోపణను ఖండించింది. ఈ ఆరోపణ కారణంగా జనించిన అపోహను, కల్పించబడే అపార్థాలను ఈ గ్రంథకర్త అయిన అల్లాహ్ స్వయంగా తన 'ప్రకటన' ద్వారా దూరం చేశాడు. ఈ గ్రంథం ఎవరిదో గ్రంథమే చెబుతోంది. ఇది లోకేశ్వరుడైన అల్లాహ్ గ్రంథం అని అంటోంది.

## (5) దైవగ్రంథం - దైవ సందేశహరుడు

### సందేశ గ్రంథం, సందేశహరుడు - రెండూ అల్లాహ్ తరపుననే

గ్రంథం దైవానిది అయినప్పుడు, గ్రంథాన్ని తీసుకువచ్చిన ప్రవక్త కూడా దేవుని తరఫునే అయి వుండాలి. కనుక గ్రంథం కూడా సత్యబద్ధమైనది. ప్రవక్త కూడా సత్యవంతుడే - రెండూ దైవ సందేశాన్ని అందజేస్తాయి. దైవప్రవక్త దైవ గ్రంథంలోని విషయాన్ని బాగా విడమరచి చెబుతాడు. ప్రజల సౌలభ్యం నిమిత్తం దాని క్రియాత్మక దృష్టాంతాన్ని ముందుంచుతాడు. ప్రవక్త సమర్పించే ఆదర్శాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా ధ్రువీకరణ (Certify) చేస్తున్నాడు...

> "మీ కొరకు దైవప్రవక్తలో అత్యుత్తమ ఆదర్శం ఉంది - అల్లాహ్‌ను, అంతిమదినాన్ని ఆశిస్తూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కని కొరకు." *(అల్ అహ్‌జాబ్ : 21)*

క్రింద పొందుపరచబడిన ఒకే ఆయత్‌లో అల్లాహ్ గ్రంథం మరియు ప్రవక్త గురించి ఈ విధంగా సెలవిచ్చాడు :

> "ఇవి దైవగ్రంథ వచనాలు. నీ ప్రభువు తరఫు నుండి నీ పైన అవతరించినదంతా సత్యం. కాని (నీ జాతి జనులలో) చాలామంది నమ్మటం లేదు." *(అర్రాద్ - 1)*

## ఖుర్‌ఆన్, దైవప్రవక్త - సందేశాన్ని చేరవేసే సాధనం

సృష్టికర్త సందేశం ఆయన దాసుల వరకు చేరే పద్ధతులు మూడే మూడు కాగలవు : (1) ప్రతి మనిషిని దేవుడు తన దగ్గరకు పిలిచి సందేశం ఇవ్వటం లేదా (2) ప్రతి మనిషి దగ్గరకు విడివిడిగా వెళ్ళి సందేశాన్ని చేరవేయటం - ఈ రెండు పద్ధతులు కూడా విశ్వ సార్వభౌముని స్థాయికి ఏమాత్రం శోభించవు. (3) మూడవ పద్ధతి ఎంతో సమంజసంగా తోస్తుంది. కార్యనిర్వహణ రీత్యా కూడా ఇది ఎంతో సముచితం అనిపిస్తుంది, ఇది విశ్వ సార్వభౌముని స్థాయికి శోభాయమానం కూడా. అదేమంటే విశ్వసనీయుడు, నిజాయితీపరుడైన వ్యక్తి వద్దకు సందేశాన్ని చేరవేసే ఏర్పాటు జరగాలి. ఆ వ్యక్తి దానిని ఇతరులకు అందజేయాలి. కేవలం అందజేయడమే కాకుండా, అందులోని మర్మాన్ని విడమరచి చెప్పాలి. తన నిజ జీవితం ద్వారా దానికి సంబంధించిన క్రియాత్మక నమూనాను కూడా ప్రజల ముందుంచాలి. ఆ విధంగా ప్రవక్త ఆదర్శ జీవితాన్ని అనుసరించటం అనుయాయులకు సులభతరం కావాలి.

అందుకే అల్లాహ్ ఖుర్ఆన్‌ను, సందేశహరుణ్ణి (సఅసం) పంపటంలోని ప్రధాన ఉద్దేశాన్ని ఈ విధంగా విశదీకరిస్తున్నాడు :

"(ప్రవక్తా!) ఇది నీ వైపునకు అవతరింపజెయ్యబడిన గ్రంథం. కాబట్టి దీని గురించి నీ మనసులో ఎలాంటి సందిగ్ధం జనించకూడదు – దీనిద్వారా నీవు జనులను సావధానపరచాలని (ఇది పంపబడినది)."

*(అల్ ఆరాఫ్ – 2)*

ఈ ఆయత్ ద్వారా అవగతమైన విషయం ఏమిటంటే, విశ్వ ప్రభువు తన దాసుల వరకు తన సందేశాన్ని చేరవేయడానికి రెండు మాధ్యమాలు (Means, Media) ఉపయోగించాడు – గ్రంథం, ప్రవక్త.

కనుక విశ్వ సార్వభౌముడైన అల్లాహ్ సందేశాన్ని తెలుసుకోదలచిన వారు అల్లాహ్ గ్రంథం ఖుర్ఆన్‌ను, అల్లాహ్ సందేశహరుడైన ముహమ్మద్ (స) ప్రవచనాలను, ఆయన పవిత్ర జీవితాన్ని అధ్యయనం చేయాలి.

## దైవగ్రంథం, దైవప్రవక్త

గ్రంథం ఆయనదే. ప్రవక్త కూడా ఆయనవాడే. ముందు గ్రంథంపై యోచన చేసినప్పుడు, దానిని తీసుకువచ్చినవాడు సత్యవంతుడైన మనిషిగా కానవస్తాడు. ఒకవేళ ముందుగా మనిషి – (ప్రవక్త)పై ఆలోచిస్తే గ్రంథం సత్యమైనదిగా కనిపిస్తుంది. అది ఆసాంతం మానవుల సృష్టికర్త వాక్కు అని కూడా బోధపడుతుంది. దీనినిబట్టి విదితమయ్యే దేమిటంటే గ్రంథం, దైవప్రవక్త – రెండూను పరస్పరం – ఒండొకదానిని – సత్యమని ధ్రువీకరించుకుం టున్నాయి.

ముహమ్మద్ (స) దైవప్రవక్త అని గ్రంథం అంటుంటే, ఖుర్ఆన్ దైవ గ్రంథమని ముహమ్మద్ (స) అంటున్నారు. రెండు వాదనలు కూడా సత్య మైనవే. కాబట్టి రెండూ అల్లాహ్ తరఫుననే అనే దృఢనమ్మకం కలుగుతుంది–

"వివేకంతో నిండిన ఖుర్ఆన్ సాక్షిగా! నిస్సందేహంగా నీవు, మేము పంపిన ప్రవక్తలలోని వాడవు. రుజుమార్గాన ఉన్నావు. ఇది (ఈ గ్రంథం) శక్తిమంతుడు, కృపాశీలుడైన అల్లాహ్ తరఫున అవతరింప జేయబడింది – ఎవరి పూర్వీకులకు భయబోధ చేయబడలేదో ఆ జనులకు నీవు భయబోధ చేయాలని. వారు పరధ్యానంలో పడి ఉన్నారు." *(యాసీన్ : 2 – 6)*

వివేకవంతమైన ఖుర్ఆన్ సాక్షిగా!

అంటే – ఈ ఖుర్ఆన్‌పై యోచన చేసినప్పుడు బోధపడేదేమిటంటే, దీనిని తీసుకువచ్చిన వాడు సత్యవంతుడైన ప్రవక్త. ఈ గ్రంథం దైవగ్రంథం. 'సావధానపరచు' అంటే ప్రజలకు భయబోధ చెయ్యి. హెచ్చరించు. ఈ పని చేయకపోవటం వల్లనే వారు ఏమరుపాటుకు, అలసత్వానికి లోనై ఉన్నారు.

## తీసుకువచ్చిన వస్తువు చాలా ముఖ్యమైనది

మానవుల సృష్టికర్త అత్యంత ముఖ్యమయిన ఒక వస్తువును తన ప్రవక్తల ద్వారా – గ్రంథరూపంలో – మానవులందరి కొరకు పంపించాడు. అదే జీవితానికి వెలుగు. మార్గదర్శిని. ఈ గ్రంథం, దీనిని తీసుకువచ్చినవారు సృష్టికర్త తరపున తమ పాలిట కారుణ్యంగా వచ్చారన్న విషయంలో మీమాంసకు తావు ఉండకూడదు. సందేహాల నుండి, సంశయాల నుండి మానవాళిని సురక్షితంగా ఉంచేటందుకు ఆయన తన సందేశహరుణ్ణి, తన గ్రంథాన్ని కొన్ని అంతర్బాహ్య చిహ్నాలతో పాటు పంపాడు.

అంతర్గత చిహ్నాల విషయానికి వస్తే, అవి ముహమ్మద్ (స) ప్రవక్త జీవితంలోనూ, ఖుర్ఆన్ ప్రబోధనలలోనూ ఇమిడి ఉన్నాయి. ఇక బాహ్యపరమైన చిహ్నాలు ఏవంటే, ఈ ప్రబోధనలను ఆచరించిన మనిషి మానవుడయ్యాడు. పాశవికత నుండి, పైశాచికత్వం నుండి పైకి లేపబడ్డాడు. మానవత్వం పరిమళించే ఒక సత్సమాజ రూపకల్పనకు పునాది వేయటం జరిగింది. న్యాయం, సమతూకంతో కూడిన ఒక కారుణ్య వ్యవస్థ నెలకొల్పబడింది. తాము దైవప్రవక్త అనీ, దైవగ్రంథమని ముహమ్మద్ (స) మరియు దివ్య ఖుర్ఆన్ స్వీయ పరిచయం (Self Introduction) చేసుకున్నప్పటికీ దేవుడు కూడా తన ప్రవక్తలో, తన గ్రంథంలో కొన్ని స్పష్టమయిన చిహ్నాలు ఉంచాడు. భావ కాలుష్యానికి లోనుకాకుండా, మానవ నైజంపై ఉన్న ప్రతి వ్యక్తికీ ఈ విషయంలో ఎలాంటి సంశయం కలగదు. కేవలం స్వప్రయోజనాలను ఆశించేవారు, ప్రాపంచిక వ్యామోహం కలవారు మాత్రమే తమ స్వార్థం కొరకు అంతరాత్మ ప్రబోధానికి విరుద్ధంగా ఈ చిహ్నాలను తిరస్కరిస్తారు – ఎందుకంటే ఖుర్ఆన్ మరియు ప్రవక్త ప్రబోధనల నుండి పలాయనం చిత్తగించి, తన మనోవాంఛల దాస్యం చేస్తూ అధర్మమైన ప్రతి చేష్టకు ఒడిగట్టాలన్నది వారి అభిమతమై ఉంటుంది. ఈ మార్గంలో వారు ఇతరుల హక్కులను కాజేస్తారు. ఇతరులపై

దౌర్జన్యానికి ఒడిగడతారు. మరణానంతర జీవితం గురించి వారు వినదలచు కోరు. తీర్పుదినం అంటే వారికి గిట్టదు. నరకాగ్నికి ఆహుతి అవటం అనే భీతికి వారు దూరంగా ఉండదలుస్తారు. అంటే ప్రాపంచిక ప్రయోజనాలను జుర్రుకునే మార్గంలో అడ్డుగా ఉండే ఏ నీతిని కూడా వారు వినగోరరు.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

"యదార్థానికి మేము మా ప్రవక్తలను నిదర్శనాలతో సహా పంపిం చాము. వారితో పాటు గ్రంథాన్ని, త్రాసును కూడా అవతరింప జేశాము – ప్రజలు న్యాయంపై స్థిరంగా ఉండాలని."

*(అల్ హదీద్ – 25)*

దైవోపదేశాలు న్యాయంతో కూడుకున్నవి. అందువల్ల వాటి ప్రకారం ఆచరించినప్పుడు మానవ జీవితాలలో పరివర్తన వస్తుంది. వాటిని ప్రవేశపెట్టడం వల్ల సమాజంలో న్యాయం, సమతూకం (Justice, Balance) నెలకొంటాయి.

### (6) మానవుడే ఖుర్ఆన్ ప్రధాన చర్చనీయాంశం

**ఈ గ్రంథం ప్రతి ఒక్కరిది :**

"ఇవి స్పష్టమయిన గ్రంథ వచనాలు." *(అష్ షూరా – 2)*

ఖుర్ఆన్ గ్రంథం ప్రత్యేకత ఏమిటంటే, దానిని ప్రతి మనిషీ సులువుగా అర్థం చేసుకోగలడు. దాని ప్రకారం ఆచరించగలడు. విషయం గనక అస్పష్టంగా, కఠినంగా ఉంటే అది సామాన్య మనిషికి అర్థం కాదు. కాని ఖుర్ఆన్ అలా లేదు. ఇది కితాబె ముబీన్ (చాలా స్పష్టమైన గ్రంథం). ఇది మార్గదర్శక గ్రంథం కాబట్టి, ఇది ఇలా ఉండటం అవసరం.

## ఖుర్ఆన్ సృష్టికర్త గ్రంథం. సమస్త మానవాళి కోసం ఉంది

సృష్టికర్త మానవులందరినీ సృష్టించినవాడు. కనుక ఆయన తన గ్రంథాన్ని సమస్త మానవుల ప్రయోజనం నిమిత్తం, మార్గదర్శకత్వం నిమిత్తం పంపాడు. కేవలం కొంతమంది ప్రముఖుల కోసమో, కొన్ని వర్గ తెగల వారి కోసమో పంపలేదు. దీనికి భౌగోళిక సరిహద్దుల్ని కూడా పెట్టలేదు.

మరి ఈ గ్రంథ యజమాని గురించి తెలీకపోవటం వల్ల జనులు ఏ విధంగా ఏమరుపాటుకు గురై, మార్గవిహీనత ఆఖరి అంచులకు చేరుకున్నారో సృష్టికర్త ద్వారానే వినండి –

"లోక వాసులందరినీ సావధానపరచేదిగా ఉండేటందుకు తన

దాసునిపై గీటురాయి (ఖుర్‌ఆన్)ని అవతరింపజేసినవాడు ఎంతో శుభప్రదమైనవాడు. భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే. ఆయన ఎవరినీ కుమారునిగా చేసుకోలేదు. ఆయన సార్వభౌమ త్వంలో ఆయనకు భాగస్వామి కూడా ఎవడూ లేడు. ఆయన ప్రతి వస్తువునూ సృష్టించడంతో పాటు, దాని విధి విధానాన్ని కూడా నిర్ధారించాడు. అయినప్పటికీ జనులు నిజ దైవాన్ని వదిలి, దేనినీ సృష్టించలేని వారిని, స్వయంగా సృష్టించబడిన వారిని తమ ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. వారు తమ స్వయానికి కూడా ఏదయినా లాభంగానీ, నష్టం గానీ చేకూర్చుకునే అధికారం కలిగిలేరు. ఒకరి జీవన్మరణాలను శాసించే అధికారం గానీ, మరణానంతరం తిరిగి బ్రతికించే అధికారం గానీ వారికి లేదు.” *(అల్ ఫుర్ఖాన్ : 1-3)*

“ఇది (ఈ ఖుర్‌ఆన్) లోకవాసులందరికీ హితోపదేశం - మీలో సరైన పంథాలో నడవదలచిన ప్రతి ఒక్కరి కోసం.”

*(అత్ తక్వీర్ - 27, 28)*

## మానవుడే ఖుర్‌ఆన్ అసలు చర్చనీయాంశం

ఖుర్‌ఆన్ ఎటువంటి గ్రంథమంటే, అది మనిషికి దాని అసలు సిసలు పరిచయం చేస్తుంది. అతను తనను గురించి తాను తెలుసుకుని, యదార్ధ జీవితం గడపడానికి ఈ పరిచయం ఎంతో అవసరం. అతని జీవిత లక్ష్యం ఏమిటో, జగతిలో అతనికి గల స్థానం ఏమిటో ఖుర్‌ఆన్ స్పష్టంగా విడమరచి చెబుతుంది. అతని ఆద్యంతాల గురించి, లాభనష్టాల గురించి, జయాపజయాల గురించి కూడా అది క్షుణ్ణంగా విపులీకరిస్తుంది. అతని జీవన విధానం ఎలా ఉండాలి, మానవుల మధ్యన పరస్పర సంబంధాలు ఎలా ఉండాలి, జగతిలోని వస్తువులతో అతనికి గల సంబంధం ఎట్టిది? లాంటి విషయాలతో పాటు మానవ మనుగడతో ముడిపడి ఉన్న మరెన్నో విషయాలను కూడా ఖుర్‌ఆన్ చర్చిస్తుంది.

“(ప్రజలారా!) మేము మీ వైపునకు ఒక గ్రంథాన్ని అవతరింపజేశాము. అందులో మీ ప్రస్తావనే ఉంది. అయినప్పటికీ మీరు అర్థం చేసుకోరా?” *(అల్ అంబియా - 10)*

నేను నా గ్రంథాన్ని మీ వద్దకు పంపి ఏ విధంగా మీ అవసరాన్ని తీర్చానో చూడండి అని అల్లాహ్ ఈ ఆయత్ ద్వారా ప్రశ్నిస్తున్నాడు.

ఇటువంటి మార్గదర్శక గ్రంథం లభించినందుకు మానవుడు సంబర పడాలి. తన సృష్టికర్తకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి.

## ఖుర్‌ఆన్ మరియు సన్మార్గం

విశ్వ ప్రభువు తన దాసులకు బోధపరచడానికి, సన్మార్గం చూపించ డానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు. అనుక్షణం అతని మార్గబోధన నిమిత్తం జగతిలోనూ, స్వయంగా మనిషిలోనూ నిదర్శనాలను పొందుపరిచాడు. ఖుర్‌ఆన్‌లో సత్యమేదో, అసత్యమేదో పలువిధాలుగా విశదీకరించటం జరిగింది–

"ప్రజలు స్పృహలోకి రావాలని మేము ఈ ఖుర్‌ఆన్‌లో అన్ని రకాల ఉపమానాలు ఇచ్చాము." *(అజ్ జుమర్ – 27)*

అన్ని రకాల జనులకు, అన్ని రకాల వృత్తులు (Professions) కలవారికి ఉపమానాలు ఇవ్వబడ్డాయి. విషయం వారికి స్పష్టంగా అర్థమయ్యేం దుకు మనోహరమైన పద్ధతులను అవలంబించటం జరిగింది.

## ఖుర్‌ఆన్ ప్రత్యేకత

ఖుర్‌ఆన్ విశిష్టత ఏమిటంటే, అది ఆద్యంతం మార్గబోధనే. నిర్మలమైన మనస్సుతో దీనిని అధ్యయనం చేసిన వారెవరయినాసరే సన్మార్గం పొందుతారు. దారి తప్పిపోరు.

"ఇది ఆసాంతం మార్గబోధన." *(అల్ జాసియహ్ : 11)*

## ఖుర్‌ఆన్ మనిషిని అల్లాహ్‌తో కలుపుతుంది

మానవుడు ఎలాంటి పక్షపాతబుద్ధి లేకుండా, సీరియస్‌గా ఆలోచించి నప్పుడు అతనికి ఒక విషయం తెలిసివస్తుంది – ఈ ఖుర్‌ఆన్ మానవుణ్ణి అతని సృష్టికర్త, యజమాని, ఆరాధ్య దైవంతో అనుసంధానం చేస్తుందని, ఇంకా దైవానికి ఇష్టమయిన మార్గంలో మానవ జీవితాన్ని మలుస్తుందని. ఖుర్‌ఆన్, తన రచయిత అయిన అల్లాహ్ గురించి ఈ విధంగా స్టేట్‌మెంట్ (Statement) ఇస్తోంది –

"(ప్రవక్తా – స!) జ్ఞానం వొసగబడినవారు, నీ ప్రభువు తరఫు నుండి నీపైన అవతరింపజేయబడినది సత్యమని, అది శక్తిమంతుడు, స్తవనీయుడు అయిన దైవమార్గం వైపునకు దర్శకత్వం వహిస్తుందని గ్రహిస్తారు." *(సబా – 6)*

సాక్ష్యం కొరకు, సత్య ధ్రువీకరణ కొరకు సదా జ్ఞానసంపన్నులనే ఎంపిక చేయడం జరుగుతుంది, అజ్ఞానులకు, అల్పబుద్ధి గలవారికి, సంకుచిత మనస్కులకు, స్వార్ధపరులకు, దురభిమానం కలవారికి ఆ అవకాశం ఇవ్వబడదు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఖుర్ఆన్ దైవదాసులను దైవంతో కలుపుతుంది. ఈ విషయం గురించి గంభీరంగా ఆలోచించినప్పుడు ఇది అర్ధం అవటమేగాక, మనసుకు నెమ్మది లభిస్తుంది.

## సృష్టికర్త తన గ్రంథం ద్వారా మానవులకు మార్గదర్శకత్వం వహిస్తాడు

సృష్టికర్త, విశ్వ ప్రభువు మాత్రమే సకల స్తోత్రాలకు అర్హుడు. ఆయన తన గ్రంథం ఖుర్ఆన్‌ను తన ప్రవక్త ద్వారా పంపించి, సత్యమేదో అసత్యమేదో విశదపరిచాడు. అంగీకరించిన దాని ఫలితంతో పాటు, తృణీకరించిన దాని పరిణామాన్ని కూడా ఎరుకపరిచాడు. లోకంలో ఉన్న తప్పుడు భావాలు భావనలు, మిథ్యా సిద్ధాంతాలను గురించి కూడా హెచ్చరిక చేశాడు –

> "స్తోత్రం అల్లాహ్‌కే శోభాయమానం. ఆయనే తన దాసులపై గ్రంథాన్ని అవతరింపజేశాడు. అందులో ఎలాంటి వక్రతనూ ఉంచలేదు. నిర్దిష్టంగా, సూటిగా, కచ్చితంగా విషయాన్ని విశదీకరించేదిగా ఉంచాడు – అల్లాహ్ తరఫున కఠిన శిక్ష ఉందని ఆయన హెచ్చరించాలనీ, సదాచరణ చేసే విశ్వాసులకు ఉత్తమ ప్రతిఫలం ఉందన్న శుభవార్తను వినిపించాలనీని. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. అల్లాహ్ ఎవరినో కుమారునిగా చేసుకున్నాడని పలికేవారిని కూడా హెచ్చరించాలని (ఈ ఏర్పాటు చేయటం జరిగింది). దాని గురించి వారికిగానీ, వారి తాత ముత్తాతలకు గానీ అసలేమీ తెలియదు. వారి నోట వెలువడే ఈ మాట ఘోరమైనది. వారు చెప్పేది అబద్ధం తప్ప మరొకటి కాదు."
>
> *(అల్ కహ్ఫ్ : 1 – 5)*

## ఖుర్ఆన్ ఒక ధర్మకాంటా

ఖుర్ఆన్‌ను అవతరింపజేయటం వెనుక ఉన్న మరో ముఖ్య కారణం ఏమిటంటే, ఇది సమతూకంతో కూడుకున్న త్రాసు. ఈ ప్రపంచంలో సత్యాసత్యాలను పరికించే సూదంటురాయి. పరలోకంలో ఈ గ్రంథం ప్రకారమే

తీర్పు జరుగుతుంది – అంటే ఎవరు ఈ గ్రంథం ప్రకారం ఆచరించారో, ఎవరు దీనిని విశ్వసించారో చూడటం జరుగుతుంది.

> (ఖుర్‌ఆన్ అంటుంది) "అల్లాహ్‌యే ఈ గ్రంథాన్ని సత్యంతో పాటు అవతరింపజేసినవాడు. ఇంకా న్యాయస్థాపన కొరకు ధర్మకాంటా (త్రాసు)ను దించినవాడు కూడా ఆయనే." *(అష్ షూరా – 17)*

## ఖుర్‌ఆన్ అవతరణ లక్ష్యం

తన గ్రంథాన్ని ఎవరిద్వారా పంపిస్తున్నాడో, ఎందుకు పంపిస్తున్నాడో గ్రంథకర్త స్వయంగా వివరిస్తున్నాడు. ఆయన స్వయంగా తన పరిచయం చేసుకుంటున్నాడు – ప్రజలు ఈ గ్రంథ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని.

> "ఇది ఒక గ్రంథం (ఓ ప్రవక్తా!) మేము దీనిని నీ వైపునకు అవతరింపజేశాము – తద్వారా నీవు జనులను కటిక చీకట్ల నుండి వెలికితీసి కాంతిరేఖల లోనికి తీసుకురావాలని; వారి ప్రభువు ఆజ్ఞానుసారం శక్తిమాన్యుడు, స్తవనీయుడు అయిన అల్లాహ్ మార్గానికి తేవాలని. ఆ అల్లాహ్ వైపునకు! గగన భువనాలలో ఉన్న సమస్తం ఆయనదే." *(ఇబ్రాహీమ్ – 1, 2)*

## ఖుర్‌ఆన్ పరిచయం

ఈ గ్రంథం మానవుని పాలిట ఎంత శ్రేయోదాయకమో, మరెంత విలువైనదో అల్లాహ్ స్వయంగా పరిచయం చేస్తున్నాడు ...

> "రమజాన్ నెల – ఆ నెలలోనే ఖుర్‌ఆన్ అవతరింపజేయబడింది. అది మానవులందరికీ మార్గదర్శిని. సన్మార్గం చూపే స్పష్టమయిన నిదర్శనాలు అందులో ఉన్నాయి. ఇంకా అది సత్యాసత్యాలను ప్రస్ఫుటం చేసే గీటురాయి." *(అల్ బఖరా – 185)*

గ్రంథ అవతరణలోని ముఖ్య ఉద్దేశం ఏమిటో ఇక్కడ స్పష్టం చేయటం జరిగింది. మనిషికి సన్మార్గం చూపడానికి, సత్యమేదో అతనికి ఎరుకపరచడానికి, అసత్యమేదో కూడా సూచించడానికి ఈ గ్రంథం పంపబడింది.

## ఉపదేశం చేసే, సందేశం ఇచ్చే గ్రంథం చాలా స్పష్టంగా ఉంటుంది

**అందరికీ అర్థమయ్యేలా మార్గబోధన చేసే గ్రంథరాజం ఖుర్ఆన్.**

కరుణామయుని వద్ద నుంచి వచ్చే వస్తువులో కారుణ్యం ఉంటుంది. ఈ గ్రంథం మానవుల పాలిట నిలువెల్లా కారుణ్యం. మానవ మార్గదర్శకత్వం నిమిత్తం వచ్చే గ్రంథం – కారుణ్యంగా – అందరికీ బోధపడేలా సులభంగా ఉండాలి. మార్గదర్శక గ్రంథం సులభశైలిలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే పద్ధతిలో విషయం చెబుతుంది. అయితే ఇది ఎంత సులభంగా ఉన్నప్పటికీ బుద్ధిజీవులు, విజ్ఞులు మాత్రమే దీనిద్వారా లబ్ది పొందగలుగుతారు. తమ బుద్ధిని ఉపయోగించి, తర్కం (Reasoning) ద్వారా విషయాన్ని గ్రహించేవారే నిర్ణయానికి రాగలుగుతారు. అవివేకులు, మూర్ఖులు, మంకుతనం కలవారు ఈ మార్గదర్శక గ్రంథం ద్వారా కూడా సన్మార్గం పొందలేరు. ఎందుకంటే ఏ గ్రంథం ద్వారానయినాసరే ప్రయోజనం పొందడానికి, దానికి సంబంధించిన కొన్ని ప్రాథమిక అవసరాలు (Pre Requisits) ఉంటాయి. వాటిలో ఒకటి : పాఠకుని మనోమస్తిష్కాలు నిర్మలంగా, దురభిమానాలకు అతీతంగా ఉండాలి.

దీంతోపాటు ఈ గ్రంథం చాలా స్పష్టంగా చెప్పే మరో విషయం ఏమిటంటే, కరుణామయుని గ్రంథాన్ని నమ్మి నడుచుకున్నప్పుడు మనిషికి గొప్ప సాఫల్యం లభిస్తుంది. తిరస్కరించినప్పుడు అతను దుష్పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుంది.

తన మార్గదర్శక గ్రంథం గురించి అల్లాహ్ ఈ విధంగా పరిచయం చేస్తున్నాడు :

> "ఇది అపార కరుణామయుడు, అనంత కృపాసాగరుడైన వాని తరపున అవతరింపజేయబడిన వాక్కు. ఇదొక గ్రంథం. దీని వాక్యాలు చాలా స్పష్టంగా విడమరచి చెప్పబడ్డాయి – అరబీ ఖుర్ఆన్‌గా! విషయ పరిజ్ఞానం గల జనుల కోసం!! ఇది శుభవార్తను ఇచ్చేదిగా, హెచ్చరిక చేసేదిగా ఉంది." *(హామీమ్ అస్ సజ్దా – 2, 3, 4)*

## ప్రభువు సందేశంలోని విశిష్టత – అది నిర్దిష్టంగా, సులువుగా, సావధానపరిచేదిగా ఉంటుంది

ప్రభువు తరపు నుండి ఏ సందేశం వచ్చినా అది చాలా స్పష్టంగా,

సూటిగా, అర్థం చేసుకునేందుకు సులువుగా ఉంటుంది. అది పంపబడటంలోని ఉద్దేశం కూడా సుస్పష్టంగా ఉంటుంది. అందులో హెచ్చరిక కూడా ఉంటుంది. హెచ్చరిక ఎందుకంటే, మరణానంతరం ఏం జరుగుతుందో, ఏ ప్రాతిపదికన న్యాయనిర్ణయం జరుగుతుందో ప్రజల ముందుకు రావాలి. ఒక విలువైన వస్తువును పోగొట్టుకోవటం వల్ల, ఆపదలో చిక్కుకుపోవటం వల్ల కలిగే నష్టాన్ని గురించి హెచ్చరించటం అవసరం. అన్యథా బాధపడక తప్పదు. ఈ హెచ్చరిక అయినా శ్రేయోభిలాషా భావంతోనే చేయబడుతుంది.

తన గ్రంథం ద్వారా అల్లాహ్ తన దాసులను అప్రమత్తం చేయ గోర్తాడు–

> "స్పష్టమయిన ఈ గ్రంథం సాక్షిగా! మేము దీనిని శుభవంతమైన రాత్రియందు అవతరింపజేశాము. నిశ్చయంగా మేము సావధాన పరచేవారము." *(అద్ దుఖాన్ – 2,3)*

## ప్రజలు అర్థం చేసుకునే భాషలో హితబోధ

సులువుగా అర్థం చేసుకునే భాషలోనే బోధపరచటం సమంజసం. అప్పుడే విషయం హృదయాంతరాళాల్లోకి చొచ్చుకుపోయి, గ్రంథం పంపటం లోని ఉద్దేశం నెరవేరుతుంది.

> "(ప్రవక్తా!) మేము ఈ ఖుర్ఆన్‌ను నీ భాషలో సులభతరం గావించాము–జనులు ఉపదేశం గ్రహించాలని" *(అద్ దుఖాన్–58)*

## ఎవరిమాట సరైనది?

జ్ఞాన సంపన్నుని మాట మాత్రమే సరైనది కాగలదు.

> "(ప్రవక్తా!) వారికి చెప్పు : భూమ్యాకాశాల రహస్యాలను ఎరిగినవాడే దీనిని అవతరింపజేశాడు." *(అల్ ఫుర్ఖాన్ – 6)*

అన్నీ తెలిసిన వాని వద్ద నుండి మార్గదర్శకత్వం లభించినట్లయితే గుండె నిండా నెమ్మది నిండుతుంది.

నిశ్చయంగా సృష్టికర్త అందరికీ అర్థమయ్యే విధంగా ప్రజలకు విషయాన్ని బోధిస్తాడు. ప్రతి ఒక్కరి అభిరుచి (Taste) ని, స్థాయి (Grade) ని బట్టి ఉపమానాలను ముందుంచుతాడు. ప్రతి ఒక్క రంగం (Field) నుండి దృష్టాంతాలను ఇస్తాడు. ఉదాహరణకు : Physiology, Geology, Astronomy,

Embryology, Zoology, Botany, Sea, Marine – ఇలా ఏ వ్యక్తికి ఏ శాస్త్రంలో ప్రవేశం ఉంటే, దాని ఆధారంగా విషయాన్ని గ్రహించి యదార్థం వరకు చేరుకుంటాడు. ఒక్క మాటలో చెప్పాలంటే, అన్ని రకాల ఉపమానాలు, ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో ఖుర్ఆన్ ఇస్తుంది.

### (8) ఇదొక సురక్షిత గ్రంథం

**ఖుర్ఆన్ అన్ని రకాల ప్రక్షిప్తాల నుండి సురక్షితంగా ఉంది**

దైవవాక్కు అయిన ఖుర్ఆన్‌లో ఏ రకమయిన మార్పులు (Changes) కూడా జరగలేదు. ఈ గ్రంథాన్ని, దాని సిసలయిన స్థితి (Original Condition) లో దైవప్రవక్త మానవులకు అందజేశారు. ఒకరి ఇష్టానికనుగుణంగా ఇందులో మార్పులు చేర్పులు జరగలేదు. ఈ హక్కు అధికారం ఎవరికీ లేదు. మన చేతుల్లో ఉన్న ఈ గ్రంథరాజం నూటికి నూరు శాతం దైవగ్రంథమన్న సంగతి ఈ క్రింది దైవాదేశం ద్వారా విదితమవుతోంది –

> "ప్రవక్తా! నీ ప్రభువు గ్రంథంలో నుండి నీపై 'వహీ'గా పంపబడే దానిని యధాతథంగా నీవు వారికి వినిపించు. దైవ వచనాలను మార్చటం ఎవరి తరం కాదు. (ఒకవేళ నీవు గనక వేరొకరి కొరకు దానిని మార్చే ప్రయత్నం చేస్తే) ఆయన నుండి తప్పించుకునేందుకు మరే ఆశ్రయాన్నీ నీవు పొందలేవు." *(అల్ కహ్ఫ్ – 29)*

దైవప్రవక్త అంతటి వానికే ఈ హెచ్చరిక చేయబడినప్పుడు, ఇక అతను ఇందులో మార్పులు చేసే సాహసం చేయగలడా? కాబట్టి ఈ గ్రంథాన్ని స్వచ్ఛమయిన దైవగ్రంథంగా, మార్పులు చేర్పులకు ఎంతమాత్రం ఆస్కారం లేని సురక్షిత గ్రంథంగా స్వీకరించి, తదనుగుణంగా అనుసరించవచ్చు.

## దైవగ్రంథాన్ని, దాని నిజస్థితిలో జనుల వరకూ చేర్చటం అవసరం

దైవవాక్కు అసలు సిసలు రూపంలో దైవదాసుల వరకూ చేర్చటం అనేది ప్రవక్తపై ఉన్న బరువైన బాధ్యత. ఎందుకంటే ప్రజలు సన్మార్గం పొందటం అనేది గ్రంథం సురక్షితంగా, నిజస్థితిలో ఉండటంపైనే ఆధారభూతమై ఉంది.

> ప్రవక్తా! వారికి చెప్పు : "నా మనసుకు తోచినవిధంగా ఇందులో మార్పులు చేర్పులు చేయటం నా పని కాదు. నా వద్దకు పంపబడిన దివ్యవాణి (వహీ)ని యధాతథంగా అనుసరించటం వరకే నా పని.

నేను నా ప్రభువు ఆజ్ఞను ధిక్కరిస్తే ఒక మహా (గడ్డు) దినాన పడే శిక్షకు నేను భయపడుతున్నాను." *(యూనుస్ - 15)*

అంటే, ఈ ఖుర్‌ఆన్ గ్రంథంలో ఎలాంటి ప్రక్షిప్తాలు గానీ, మార్పులు చేర్పులు గానీ జరగలేదు. అదొక అమానతుగా దాని నిజస్థితిలో మానవాళి వరకూ చేర్చబడింది.

## నమ్మకం, సంతృప్తి

ఖుర్‌ఆన్ పట్ల మనిషికి పూర్తి నమ్మకం ఉండాలి. ఎందుకంటే చెప్పబడినదంతా జ్ఞానం ఆధారంగా, వివేచన ఆధారంగా చెప్పబడింది. దాని భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు గైకొనబడ్డాయి. దీనికి సంబంధించిన చర్చ ఇంతకుముందే జరిగింది –

"(ఓ ప్రవక్తా!) నిశ్చయంగా ఈ ఖుర్‌ఆన్ నీకు మహా వివేకి, మహా జ్ఞాని అయిన వాని తరఫున అందజేయబడుతున్నది."

*(అన్ నమ్ల్–6)*

## ఖుర్‌ఆన్ భద్రంగా ఉంది

భావితరాలలోని ప్రతి వ్యక్తీ, ప్రతి జాతి, ప్రతి వర్గం సన్మార్గం పొందగలందులకు ఖుర్‌ఆన్‌ను జాగ్రత్తగా భద్రపరచటం జరిగింది –

"ఇకపోతే ఈ జ్ఞాపిక (ఖుర్‌ఆన్), దీనిని మేమే అవతరింపజేశాము. మేమే దీని రక్షకులము." *(అల్ హిజ్ర్ - 9)*

## ఖుర్‌ఆన్ సురక్షితంగా ఉండటం అనివార్యం

దైవ మార్గదర్శకత్వం మరియు జీవన సంవిధానమైన ఖుర్‌ఆన్ చివరి ఎడిషన్ అయిన కారణంగా అందులో ఎలాంటి మార్పులు చేర్పులకు అవకాశం లేకుండా దానిని భద్రపరచటం జరిగింది – ఈ పుడమిపై పుట్టిన ప్రతి మనిషికి మార్గదర్శకత్వం వహించడానికి ఈ కట్టుదిట్టమైన ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆఖరికి దైవ సందేశాన్ని తీసుకువచ్చిన ప్రవక్తకు కూడా ఈ గ్రంథంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులు చేసే అధికారం ఇవ్వబడలేదు. ప్రజలు స్వీకరించినా స్వీకరించకపోయినా అది వారి ఇష్టం. ఇందులో బలవంతం ఏమీ లేదు. కాని వారి కోరిక ప్రకారం గ్రంథంలో మార్పు అనేది మాత్రం జరగని పని.

మార్గబోధన మానవుని జీవితపు మౌలిక అవసరం. ఆఖరి మనిషి వరకూ ఈ అవసరం తీరుతూ ఉండాలి.

## (9) దైవగ్రంథాల ఎడిషన్లు

### దైవగ్రంథాల అధునాతన ఎడిషన్ (Edition)

మానవుల మార్గదర్శకత్వం నిమిత్తం అల్లాహ్ అన్ని కాలాలలో అన్ని ప్రాంతాలలో తన ప్రవక్తలను, గ్రంథాలను పంపాడు. ఉదాహరణకు : మూసా, ఈసా, ఇబ్రాహీమ్, దావూద్, యూసుఫ్ (అలైహిముస్సలామ్) ప్రవక్తలు. అలాగే తౌరాతు, ఇంజీలు గ్రంథాలు. ఇప్పుడు ఆ గ్రంథాల అధునాతన ఎడిషన్ (Latest Edition) దివ్య ఖుర్ఆన్. దాని ప్రస్తావనను అల్లాహ్ తన గ్రంథం ఖుర్ఆన్‌లో ఈ విధంగా చేశాడు –

> "ప్రతి యుగానికి ఒక గ్రంథం ఉంది. అల్లాహ్ తాను కోరిన దానిని చెరిపివేస్తాడు. తాను కోరిన దానిని ఉండనిస్తాడు. మాతృగ్రంథం ఆయన వద్దనే ఉంది." *(అర్రాద్ – 38, 39)*

## ఖుర్ఆన్ ఇతర ఆకాశ గ్రంథాలను ధ్రువీకరిస్తుంది

దివ్య గ్రంథం యొక్క నూతన ఎడిషన్ – అంటే ఖుర్ఆన్‌లోని విశిష్టత ఏమిటంటే, అది పాత ఎడిషన్లను ధ్రువీకరిస్తుంది. వాటిని గౌరవిస్తుంది. వాటికి గుర్తింపు (Recognition) నిస్తూ రద్దు పరుస్తుంది. అంతేగాని అవి దైవ గ్రంథాలు కావని చెప్పి ఏకంగా త్రోసిపుచ్చదు. పోనీ ఆ గ్రంథాల మూలం (Source) మరేదైనా ఉందా? అంటే అదీ నిజం కాదు. వాస్తవానికి ఈ గ్రంథాలన్నింటి మూల సరోవరం ఒక్కటే. ఒకే దేవుని వద్ద నుంచి, అవి ఒకే మౌలిక సందేశం తీసుకుని వచ్చాయి. ఆ దేవుడు ఒక్కడే, అద్వితీయుడు. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఆయన ఒక్కడే ఆరాధ్య దైవం. ఆయన వైపునకే మానవులంతా మరలిపోవలసి ఉంది. ఈ జీవితంలో చేసుకున్న ఆచరణల లెక్క ఇవ్వవలసి ఉంది. అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు :

> "(ప్రవక్తా!) మేము నీ వైపునకు వహీ (దివ్యవాణి) ద్వారా పంపిన ఈ గ్రంథం సత్యమైనది. దానికి పూర్వం నుండి ఉన్న గ్రంథాలను ధ్రువపరిచేది. నిశ్చయంగా అల్లాహ్ తన దాసుల గురించి పూర్తి సమాచారం తెలిసినవాడు, అంతా చూస్తున్నవాడు." *(ఫాతిర్–31)*

## ఖుర్‌ఆన్ సృష్టికర్త వాక్కు. అది వెనుకటి ఎడిషన్లను ధ్రువపరుస్తుంది

ఖుర్‌ఆన్ దైవవాక్కు అన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఖుర్‌ఆన్‌పైన, దాని చరిత్రపైన, దానిని అందజేసిన వ్యక్తి జీవితంపైన దృష్టిని సారించి చూడండి – దాని ప్రబోధనల క్రియాత్మక ఫలితాలపై కూడా పూర్తి నమ్మకం కుదురుతుంది. రద్దయిన వెనుకటి ఆకాశ గ్రంథాలను కూడా ఖుర్‌ఆన్ సత్యమని ధ్రువీకరిస్తుంది. అవన్నీ సృష్టికర్త వద్ద నుండి వచ్చినవేనని చెబుతుంది. ఆ గ్రంథాలను తీసుకువచ్చిన ప్రవక్తలను కూడా సత్యవంతులుగా ధ్రువీకరిస్తుంది. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

> "ఈ ఖుర్‌ఆన్ అల్లాహ్ తప్ప వేరొకరి ద్వారా చేయతరం కాదు. పైగా ఇది తనకు పూర్వం ఉన్న భవిష్యవాణులను సత్యమని ధ్రువపరిచేది, గ్రంథానికి విపులీకరణ వంటిది. ఇది లోకేశ్వరుని తరఫున ఉందన్న విషయంలో సందేహానికి తావేలేదు."
>
> *(యూనుస్ – 37)*

## ఇతర మత ధర్మాల ప్రబోధనలతో సారూప్యత

ఒకే రచయితచే లిఖించబడిన గ్రంథం యొక్క అనేక ఎడిషన్లు అవసరాల కనుగుణంగా వెలువడినప్పుడు, అందలి మౌలిక విషయాలు మాత్రం ఒక్కటే అయి ఉంటాయి. ఎన్నో విషయాలలో భావసారూప్యత ఉంటుంది. కొన్ని విషయాలలో మాత్రం వ్యత్యాసం ఉంటుంది. మరికొన్నింటిలో మార్పులు చేర్పులు జరిగి ఉంటాయి.

ఉదాహరణకు –

కాబా గృహ ప్రదక్షిణ మాదిరిగానే ఇతర మత గ్రంథాలలో కూడా 'ప్రదక్షిణ' అనేది ఉందనీ, రాతి గోడలతో నిర్మించబడిన కాబా వైపు తిరిగి సాష్టాంగ ప్రణామం చేసినట్లే, తమ మతధర్మాలలో విగ్రహాల పూజ జరుగుతుందనీ అనబడుతోంది. 'ఇహ్రామ్' పేర ప్రత్యేక వస్త్రధారణ చేసినట్లే, తాము తమ పుణ్య క్షేత్రాలకు వెళ్ళేటప్పుడు ప్రత్యేక వస్త్రధారణ చేస్తామని చెబుతుంటారు.

సృష్టికర్త తరఫున వచ్చిన గ్రంథాలు వివిధ కాలాలలో ఒకే మౌలిక

విషయం చెప్పాయి. మిగిలిన విషయాలలో కూడా సారూప్యత ఉంటుంది, వ్యత్యాసం కూడా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ, ప్రతి కాలంలో మౌలిక అవసరం, మౌలిక మార్గదర్శకత్వంలో వ్యత్యాసమేమీ ఉండదు. మౌలిక విషయాలలో కూడా వ్యత్యాసం ఒకవేళ ఉంటే, దానికి కారణం మార్గదర్శక గ్రంథాల పాత కొత్త ఎడిషన్లలోనే. దీనికి కారణాలనేకం. పూర్వకాలంలో ప్రజలలో చదువురాని వారే అధికం. సందేశం ఒకరి ద్వారా ఒకరికి చేరేది. అందువల్ల విన్న విషయాలెన్నో మరచిపోయేవారు. లేదా ఆ విషయాలలో కొన్ని ఇతర విషయాలు కూడా జొరబడేవి. లేదా మత పెద్దలుగా ఉన్నవారు తమ స్వార్థప్రయోజనాల నిమిత్తం దైవోపదేశాలలో మార్పులు చేర్పులు చేసేవారు. మరికొందరు ధార్మిక విషయాలలో తమ ఊహాస్త్రాలు సంధించి, కట్టుకథలు అల్లారు. ఈ విధంగా మౌలిక విషయాలలో తేడాపాడాలు పొడసూపాయి. ఈ కారణంగా పాత ఎడిషన్లు తమ అసలు సిసలు (Original) రూపంలో లేకుండా పోయాయి. ఒకవేళ అవి సిసలైన రూపంలో ఉండి ఉంటే, ఖుర్ఆన్‌ను నమ్మటం పెద్ద కష్టమయ్యేది కాదు.

## ఖుర్ఆన్ – మార్గదర్శకం, కారుణ్యం

ఖుర్ఆన్ ఒక కానుక – సృష్టికర్త తరఫున ఆయన దాసులకు ఈ గ్రంథం ఒక అపురూపమైన కానుక, కారుణ్యం.

"అపార కరుణామయుడు (అల్లాహ్) ఖుర్ఆన్‌ను నేర్పాడు."

*(అర్రహ్మాన్ – 1, 2)*

## సన్మార్గ ప్రాప్తికై బుద్ధిని ఉపయోగించాలి

తమ బుద్ధిని ఉపయోగించి ఈ గ్రంథాన్ని అధ్యయనం చేసినవారు, దీనిద్వారా పాఠం నేర్చుకుంటారు, సన్మార్గం పొందుతారు.

"(ప్రవక్తా!) మేము నీ వైపు అవతరింపజేసిన శుభప్రదమైన గ్రంథమిది – ప్రజలు దీని వచనాలపై యోచన చేయాలని! బుద్ధిజీవులు దీనిద్వారా హితబోధ గ్రహించాలని!!" *(సాద్ – 29)*

గ్రంథం, ప్రవక్త – రెండూను అల్లాహ్ తరఫుననే అన్న విషయం ఈ ఆయత్ ద్వారా ప్రకటితమవుతున్నది. ఈ రెండు మూల సరోవరాల ద్వారా ప్రయోజనం పొందడానికి మనిషి తన బుద్ధీజ్ఞానాలను ఉపయోగించాల్సిన ఆవశ్యకత ఉంది. సంకుచిత స్వభావానికి, మనోవాంఛలకు, పక్షపాత బుద్ధికి,

దురభిమానానికి దూరంగా ఉంటూ తన తెలివితేటలను ఉపయోగించినట్లయితే సన్మార్గం కొరకు అతని హృదయ కవాటాలు తెరచుకుంటాయి.

## ఖుర్‌ఆన్ సవాలు

సృష్టికర్తను తిరస్కరించేవారు ఖుర్‌ఆన్ విసిరే సవాలును స్వీకరించలేక పోతున్నారంటే, తమ ఆరాధ్య దైవాల సహాయ సహకారాలు తీసుకుని కూడా ఖుర్‌ఆన్‌లోని అధ్యాయాలను పోలిన ఒక్క చిన్న అధ్యాయాన్ని కూడా రచించి తీసుకు రాలేకపోతున్నారంటే, దాని అర్థం ఖుర్‌ఆన్ సృష్టికర్త గ్రంథమనేకదా. మానవుల సృష్టికర్త తప్ప వేరితరులు ఆరాధనకు తగినవారు కారని ఈ గ్రంథం చాలా స్పష్టంగా చెబుతోంది :

> "ఒకవేళ వారు (మీ కాల్పనిక దైవాలు) మీ సహాయానికి రాలేకపోతే, ఇది అల్లాహ్ జ్ఞానంతోనే అవతరించిందని, ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనే లేడని తెలుసుకోండి. మరైతే మీరు ఇప్పటికయినా (ఈ సత్య విషయం ముందు) ఆత్మ సమర్పణ చేసుకుంటారా?"
>
> *(హూద్ – 14)*

## ఖుర్‌ఆన్‌ను తిరస్కరించిన దాని ప్రభావం బహుదూరం వరకు పడుతుంది

దైవగ్రంథాన్ని తిరస్కరించిన దాని పరిణామాలు చాలా దూరం వరకు విస్తరిస్తాయి. ఇది కేవలం స్వీకరణ లేక నిరాకరణ అనుకోకండి. దీని ప్రభావం (Impact) ప్రాపంచిక జీవితం మొదలుకుని పారలౌకిక జీవితం వరకు ఉంటుంది. దైవగ్రంథాన్ని సత్యమని ఒప్పుకుంటే దానిలోని ప్రతి విషయాన్ని సత్యమని ఒప్పుకోవటం జరుగుతుంది. దానికి అనుగుణంగా ఆచరించటం జరుగుతుంది. తత్ఫలితంగా జీవితం సాఫీగా సాగిపోతుంది. పరలోక జీవితం సఫలీకృతమవుతుంది.

> "ప్రవక్తా! వారికి చెప్పు : 'మీరే చెప్పండి! ఒకవేళ ఈ ఖుర్‌ఆన్ అల్లాహ్ తరఫు నుండి వచ్చి ఉంటే, మరి మీరు దానిని తిరస్కరిస్తే, దీని వ్యతిరేకతలో బహుదూరం వెళ్ళిపోయిన వానికంటే ఎక్కువ మార్గభ్రష్టుడెవడుంటాడు?" *(హామీమ్ అస్ సజ్దా – 52)*

ఖుర్‌ఆన్‌ను తీసుకుని మనిషి తన గురించి, ఈ నిఖిల జగతి గురించి యోచన చేసినట్లయితే, ఈ గ్రంథం సత్యం అన్న విషయంలో అతనికి పూర్తిగా

నమ్మకం కలుగుతుంది. అల్లాహ్ ఆలోచించమంటున్నాడే గాని, గుడ్డిగా వ్యవహరించండి అని అనటం లేదు.

"అతి త్వరలోనే మేము వారికి మా సూచనలు చూపిస్తాము - జగతిలోనూ, స్వయంగా వారిలోనూ. కడకు ఇదే (ఈ ఖుర్‌ఆన్ గ్రంథమే) సత్యమన్న విషయం వారికి తేటతెల్లమై పోతుంది."

*(హా మీమ్ అస్ సజ్దా - 53)*

## ఖుర్‌ఆన్ విశ్వసనీయం, ఆదరణీయం, ఆచరణీయం

లోకేశ్వరుడైన ప్రభువు తరఫు నుండి వచ్చిన వస్తువు ఆదరణీయమైనది, విశ్వసనీయమైనది, స్వీకారయోగ్యమైనది, ఆచరణయోగ్యమైనది అయి ఉంటుంది. కాగా, ఖుర్‌ఆన్ సకల లోకాల ప్రభువు తరఫు నుండి వచ్చింది -

"ఇది సకల లోకాల ప్రభువు తరఫు నుండి అవతరింపజేయబడినది."

*(అల్ వాఖియహ్- 80)*

ఒక కానుక ఇవ్వబడుతుండగా, సృష్టికర్త తరఫున ఓ మహదానుగ్రహం ప్రేమతో - ఖుర్‌ఆన్ రూపంలో - ప్రసాదించబడుతూ ఉండగా, దానిని స్వీకరించేందుకు నిరాకరించటం ఎంత దౌర్భాగ్యకరమైన విషయం!?

"మరైతే మీరు ఈ మహత్పూర్వకమైన విషయం పట్ల బద్ధకం వహిస్తున్నారా? మీరు దీనిని తిరస్కరించడమే మీ వాటా (జీవనోపాధి)గా భావిస్తున్నారా?" *(అల్ వాఖియహ్ - 81,82)*

మీకు జీవనదానం ప్రసాదించిన వాడే మీకు ఒక బహు మూల్యమైన బహుమానం ఇస్తూ ఉండగా దానిని మీరు నిరాకరించడం మూర్ఖత్వం, దారిద్ర్యం కాకపోతే మరేమిటి?

## సన్మార్గం పొందే ఉద్దేశంతో అధ్యయనం చేస్తే ...

దివ్య ఖుర్‌ఆన్ వివేకం, విజ్ఞత, జ్ఞానంతో నిండిన గ్రంథం. దీనిని గ్రహించిన మనిషి దైవ కారుణ్యానికి నోచుకుంటాడు. సన్మార్గం పొందుతాడు. కాకపోతే ఈ గ్రంథం ద్వారా పూర్తిగా లబ్ధి పొందే సంకల్పం ఉండాలి. ఎందుకంటే ఏదైనా ఒక వస్తువు తనదైన స్థానంలో మేలైనది, లాభదాయక మైనదిగా ఉంటేనే సరిపోదు. అది తన పాలిట లాభదాయకం, శ్రేయోదాయకం కాగలగాలంటే మనిషిలో దానిని ఆస్వాదించాలన్న శుభసంకల్పం కూడా ఉండాలి -

"ఇవి విజ్ఞతా భరితమైన గ్రంథ వచనాలు. సదాచార సంపన్నుల కొరకు మార్గదర్శకం, కారుణ్యం." *(లుఖ్మాన్ – 2,3)*

విజ్ఞానం, వివేకం ఆధారంగా చెప్పిన మాటపై నమ్మకం ఏర్పడుతుంది. ఇంకా అలాంటి మాటలో మార్గబోధన ఉంటుంది.

ప్రేమతో చెప్పిన విషయం పట్ల కృతజ్ఞతా భావం ఉప్పొంగుతుంది. సంబోధితుడు దానిని హృదయానికి హత్తుకుంటాడు. దానిద్వారా లబ్ధి పొందుతాడు.

వివేకంతో నిండివున్న విషయం న్యాయం, సమత్వం, సమతూకంతో కూడుకుని ఉంటుంది. క్రియాత్మక జీవితంలో దాని మూలంగా సద్ఫలితాలు వెలువడుతాయి.

## అద్భుతమైన గ్రంథం

దివ్య ఖుర్‌ఆన్ జ్ఞాన సంపన్నుడు, వివేచనా ధురంధరుడు అవతరింపజేసిన గ్రంథం కాబట్టి అది విజ్ఞానంతో, వివేకంతో నిండి ఉంటుంది. అందువల్ల అందులోని ఏ విషయం కూడా తప్పుడు విషయంగా రూఢీ అవదు. ఇతరత్రా నూతన పరిశోధనలు, ఆవిష్కరణలు కూడా అందులోని విషయాన్ని నిరాధారమని కొట్టివేయ (Disprove) లేవు. పైగా వెయ్యిన్నరేండ్ల క్రితం ఖుర్‌ఆన్ చెప్పిన విషయంపై దృఢనమ్మకం ఏర్పడుతుంది –

"ఎవరయితే తమ వద్దకు ఉపదేశం (ఖుర్‌ఆన్) వచ్చినప్పుడు దానిని తిరస్కరిస్తారో (వారు ఖచ్చితంగా నష్టపోతారు). నిశ్చయంగా ఇది చాలా శక్తిమంతమైన గ్రంథం. ఇందులోనికి అధర్మం దాని ముందు నుండి గానీ, దాని వెనుక నుండి గానీ జొరబడజాలదు. ఇది వివేకవంతుని, ప్రశంసనీయుని తరఫున అవతరింపజేయబడింది."

*(హామీమ్ అస్ సజ్దా – 41, 42)*

**నాల్గవ అధ్యాయం :**

**(Chapter - IV)**

# విశ్వ సార్వభౌముని ప్రవక్త ముహమ్మద్ (సఅసం)... ఒక చూపులో !

- సృష్టికర్త యొక్క సందేశహరుని సర్వసాధారణ పరిచయం.
- ముహమ్మద్ (స) తన ప్రవక్త అని సృష్టికర్త తన గ్రంథంలో సాక్ష్యమిస్తున్నాడు.
- ముహమ్మద్ ప్రవక్త (స)ను అల్లాహ్ సకల లోకాలకు కారుణ్యంగా చేసి పంపాడు.
- నిశ్చయంగా అల్లాహ్ ముహమ్మద్ (స)ను ప్రవక్తగా చేసి పంపానని ప్రకటన గావించాడు.
- ముహమ్మద్ (స) సత్యవంతుడైన ప్రవక్త. ఆయన సమర్పించే సందేశం సత్యం.
- తన ప్రవక్త వరకూ సందేశాన్ని చేరవేసే దైవిక ఏర్పాట్లు.
- అద్భుతం : దాని స్థానం.
- సామాన్య ప్రజానీకం వరకు సందేశాన్ని చేరవేసే దైవ విధానం.
- ముహమ్మద్ (స) కేవలం ఒక ప్రవక్త మాత్రమే. ఆయన పనల్లా సందేశాన్ని చేరవేయడం వరకే.
- సందేశహరుడు మానవమాత్రుడే.
- ప్రవక్త మానవుడే అయి ఉంటాడు.
- సందేశంతో పాటు సందేశహరుడు.
- ప్రవక్త ప్రత్యేకత, స్థాయి, పరిమితులు.
- తన సందేశహరుణ్ణి పంపించటంలోని ఉద్దేశాన్ని అల్లాహ్ స్పష్టంగా విశదీకరించాడు.

- ♦ సందేశహరుడు (మానవత పాలిట మూర్తీభవించిన) కారుణ్యం. కరుణామయుని ఆదేశాలను ఆయన తీసుకు వస్తాడు.
- ♦ సృష్టికర్త తన ఆదేశాలను, సందేశాన్ని స్పష్టమయిన పద్ధతుల ద్వారా అందజేసే ఏర్పాటు చేస్తాడు.
- ♦ ప్రవక్త విశ్వసించిన వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు.
- ♦ ప్రవక్త జీవితం ఆదర్శప్రాయం, ప్రమాణబద్ధం అయి ఉంటుంది.
- ♦ ప్రవక్త మాట ప్రామాణికం అయి ఉంటుంది. అందువల్ల ఆయనకు విధేయత చూపాలి.
- ♦ ప్రవక్త తిరుగులేనివాడై ఉండటం.
- ♦ ప్రవక్త విశిష్టత : ఆయన వేతనం తీసుకోడు.
- ♦ ప్రవక్త తన దాస్యం చేయమని ఎన్నడూ చెప్పడు.
- ♦ మానవులకు లాభనష్టాలు చేకూర్చే అధికారం ప్రవక్తకు ఇవ్వబడలేదు.
- ♦ ప్రజలకు సన్మార్గం ప్రసాదించటం ప్రవక్త బాధ్యత కాదు, ప్రసాదించలేడు కూడా.
- ♦ సందేశాన్ని చేరవేసి, సావధానపరచటం వరకే ప్రవక్త పని.
- ♦ ప్రవక్త బాధ్యత ఎంతవరకు?
- ♦ ప్రవక్త పని సందేశాన్ని చేరవేశాక, దానిని స్వీకరించటం, స్వీకరించక పోవటం వల్ల సంభవించే పరిణామాలను తెలియజేయటం వరకే.
- ♦ ప్రవక్త సదా మేలు వైపునకే పిలుస్తాడు.
- ♦ అన్ని కాలాలలో, అన్ని చోట్లా, అన్ని సముదాయాల కొరకు మార్గదర్శకత్వం వహించే ఏర్పాట్లు జరిగాయి.
- ♦ ఆదం సంతతి (మానవాళి)కి మార్గదర్శకత్వ ఏర్పాటు చాలా అవసరం. అది ఆఖరి మనిషి వరకూ జరగాలి.
- ♦ ప్రవక్త (స) విశిష్టత : చివరి సందేశహరుడు.

# విశ్వ సార్వభౌముని ప్రవక్త ముహమ్మద్ (సఅసం) ... ఒక చూపులో !

విశ్వ సార్వభౌముని గ్రంథమైన ఖుర్ఆన్ ఆయన సందేశహరుడైన ముహమ్మద్ (స)ను పరిచయం చేస్తోంది.

## సర్వసాధారణ పరిచయం

ప్రవక్త ముందు ఒక గొప్ప కార్యం (Task) ఉంటుంది. సవాలు (Challenge) ఉంటుంది, అతను సామాన్య ప్రజానీకం సమక్షంలోనూ, ప్రముఖుల సమక్షంలోనూ తన పరిచయం చేసుకోవలసి ఉంటుంది. తాను విశ్వేశ్వరుని ప్రవక్తనని నమ్మకం కుదిరేలా చెప్పాల్సి ఉంటుంది. అదే సమయంలో విశ్వేశ్వరుని సమగ్ర పరిచయం కూడా చేసి, సమాజంలో నెలకొనివున్న గందరగోళ (Confusion) స్థితిలో ప్రజల విశ్వాసాన్ని చూరగొనవలసి ఉంటుంది. ఆ తరువాత తాను విశ్వేశ్వరుని వద్ద నుండి తీసుకుని వచ్చిన సందేశాన్ని దైవ సందేశహరునిగా అద్భుతంగా పరిచయం చేసి, ప్రజలు దానిని స్వీకరించేలా కృషి చేయవలసి ఉంటుంది.

ఈ మూడు లక్ష్యాలను అతను ఒంటరిగా సాధించవలసి ఉంటుంది. తన వాదనను వాక్కర్మలచేత నిరూపించు (Prove) కోవలసి ఉంటుంది. తన జీవన విధానం ద్వారానూ, తాను తీసుకువచ్చిన సందేశం ద్వారానూ తానొక సత్య సందేశహరుణ్ణి అని రుజువు చేయాల్సి ఉంటుంది. దాంతోపాటు తాను తీసుకువచ్చిన వాక్కు తన వాక్కు కాదని, అది దైవదాసుల కొరకు దైవం

పంపిన దైవవాక్కు అని కూడా రుజువు చేయాల్సి ఉంటుంది. అంతేకాదు, విశ్వప్రభువుకు సంబంధించి ప్రజల మనోమస్తిష్కాలలో ఏర్పడివున్న భావనను కూడా సంస్కరించవలసి ఉంటుంది. ఈ మూడు త్రిముఖమైన పనులు (Three Dimension Tasks) ప్రవక్త ముందుంటాయి. కాని ఈ మూడింటిలో ఉన్న గుణం ఏమిటంటే, అవి ఒకదాని తరువాత ఒకటిగా సకారాత్మకం (Vicious Circle) గా పనిచేస్తూ ఒండొకదానిని పరిచయం చేస్తాయి. ఒండొక దానిని సమర్ధించుకుంటూ ఉంటాయి – ఈ మూడింటి గురించి జనులకు సంతృప్తి కలిగేలా, తమ జీవితాల మార్గదర్శకత్వానికి గాను జనులు వాటిని స్వీకరించి, తదనుగుణంగా నడుచుకునేలా చేస్తుంటాయి.

దేవుని మార్గదర్శకత్వం ప్రతి ఒక్కరినీ ఉద్దేశించినది. దానిని పొందడం ప్రతి మనిషి జన్మహక్కు. తనను సృష్టించిన, తన పాలిట మహోపకారిగా ఉన్న, తనకు జీవనం ప్రసాదించిన వానిని గురించి అతను తెలుసుకోవాలి. తన విన్నపాలను, అభ్యర్ధనలను తీసుకుని అతను ఆయన వద్దకు చేరాలి. ఆయన ప్రసన్నతను చూరగొనడానికి ఆయన వరకు చేరడం ప్రతి మనిషికి సులభతరం కావాలి.

సృష్టికర్త తన సందేశాన్ని చాలా స్పష్టమైన పద్ధతిలో అందజేసే ఏర్పాట్లు చేస్తాడన్న విషయం వెనుకటి పుటల్లో వచ్చింది. సందేశ లక్ష్యం నెరవేరడానికి ఇది అవసరం కూడా. మరి ఈ లక్ష్యం నెరవేరడానికి ఆయన ఒక సత్యవంతుడైన, నిజాయితీపరుడైన, వివేకవంతుడైన వ్యక్తికి ఈ సందేశం ఇచ్చి పంపుతాడు. ఆ వ్యక్తి ఈ సందేశంలోని పరమార్థాన్ని బాగా విడమరచి చెబుతాడు. సులభంగా బోధపరుస్తాడు. తన నిజ జీవితం ద్వారా కూడా ఒక ఆదర్శాన్ని నెలకొల్పి ప్రజాబాహుళ్యం మధ్యన ఎలాంటి అపోహ లేకుండా చేస్తాడు. తన సందేశాన్ని ప్రజలు అర్ధం చేసుకుని, దానిని ఆచరించడం సులభమయ్యేలా వ్యవహరిస్తాడు. మానవుల కోసం ఒక మానవమాత్రుని జీవిత ఆదర్శమే స్వీకారయోగ్యం, అనుసరణీయం కాగలదు. అతని (ప్రవక్త) జీవితం ఒక ఆదర్శప్రాయమైన జీవితంగా ఉంటుంది. ఇతరుల జీవితాలు దాని ప్రమాణ నికషంపై పరికించబడగలవు. బహుమతి పొందగలవు.

దైవ సందేశహరుని జీవితానికి అనుగుణంగా ఉన్న జీవితాలు మాత్రమే దైవ సన్నిధిలో స్వీకారయోగ్యమవుతాయి. ఎందుకంటే ఆ వ్యక్తి (ప్రవక్త) ఆయన ప్రతినిధిగా ఈ లక్ష్యసిద్ధి కొరకు నియోగించబడ్డాడు.

ఒక మనిషి ప్రజల మధ్యలో వచ్చి తాను దైవ సందేశహరుణ్ణి అని ప్రకటించినప్పుడు, ఇది ప్రజలకు రెండవ పరీక్ష అవుతుంది. మొదటి పరీక్షలో సృష్టికర్త స్వయంగా కనుమరుగు అయ్యాడు. ఆయన్ని తెలుసుకోవాలి, అంగీకరించాలి. మరి సృష్టికర్త తన సందేశాన్ని మానవుల వరకు చేరవేయడానికి మనిషినే సందేశహరునిగా ఉపయోగించుకుంటాడు. అయితే ఫలానా వ్యక్తిని నేను నా సందేశహరునిగా చేసి పంపానని బహిరంగ ప్రకటన చేయడు. దానికి బదులు దేవుని తరఫున నియుక్తమైన ఆ వ్యక్తి ఖుద్దుగా చెబుతాడు – తాను దైవ సందేశహరుణ్ణి అని (ఇది అబద్ధపు ప్రకటన కూడా కావచ్చు). తాను దైవ సందేశహరుణ్ణి అని ప్రజలకు నమ్మశక్యం అయ్యేలా చెప్పుకునే బాధ్యత ప్రవక్త మీదే వదలివేయటం జరిగింది. మరోమాటలో చెప్పాలంటే పరీక్షకు గురిచేయడం జరిగింది (కాబట్టి ఇక్కడ ఆగి ఆలోచించవలసి ఉంటుంది, పరిశోధన చేయవలసి ఉంటుంది).

సృష్టికర్తను చూడకుండానే ఆయన్ని తెలుసుకోవటం, విశ్వసించటం ఒక పెద్ద పరీక్ష అనుకుంటే, ఇప్పుడు తనను తాను దైవ సందేశహరునిగా ప్రకటించుకున్న మానవుణ్ణి గుర్తించడం, అతనిని నమ్మటం, అతనికి విధేయత చూపటం, అతనిని అనుసరించటం ఇంతకన్నా పెద్ద పరీక్ష. ఒకటి : అతనిని విశ్వసించటం, అతను తెచ్చిన సందేశాన్ని అంగీకరించటం. రెండు : అతనికి విధేయత చూపటం, అతను చెప్పినట్లుగా మసలుకోవడం. అన్యధా అల్లాహ్‌కు అవిధేయులైనట్లే. చాలా గడ్డు సమస్య! ఒకవేళ అతను సందేశహరుడు కానట్లయితే అబద్ధీకుణ్ణి నమ్మి నడుచుకున్నట్లవుతుంది!!

ఖుర్ఆన్ తనను తీసుకువచ్చిన వాని సంభాషణా తీరును మన ముందుంచుతుంది – అతనెంత సూటిగా, నిర్దిష్టంగా మాట్లాడతాడో. ఇంకా అతను ఎలాంటి స్వార్ధం లేకుండా తన జీవితాన్ని తెరచిన పుస్తకంలా ప్రజల ముందుంచుతాడు. అతని వైఖరి ఈ విధంగా ఉంటుంది – చూడండి, నేను ఎలాంటి మనిషినో. నేను మీ మధ్యనే ఉంటున్నాను. అహోరాత్రులు మీ మధ్యనే గడుపుతున్నాను. నా జీవితంలోని ఓ సుదీర్ఘ వ్యవధి మీతోపాటే గడిచింది. నేనొక సత్యవంతుణ్ణి అని, నిజాయితీపరుణ్ణి అని మీరు చెప్పుకునేవారు. మరి నేను సత్యవంతుణ్ణే అయితే వినండి, అల్లాహ్ నాకూ మీకూను సృష్టికర్త అనీ, ఆయనే మనందరి పాలకుడు, పోషకుడు, నిజ యజమాని అనీ చెబుతున్నాను. ఆయనే నన్ను తన సందేశహరునిగా చేసి, నాకు సందేశం ఇచ్చి మీ వద్దకు

పంపాడని అంటున్నాను. మీరు స్వయంగా నన్ను నిజాయితీపరుణ్ణి అని కొనియాడారు కదా! మరయితే ఆ విశ్వప్రభువు నాకు ఇచ్చి పంపిన సందేశాన్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా, దానిని ఒక అమానతుగా భావించి యధాతథంగా మీకు అందజేశానని నమ్మండి. నా మాటను వినడంలోనే దైవప్రసన్నత ఇమిడి ఉందని, తద్వారానే మీకు స్వర్గం లభిస్తుందని మీకు శుభవార్త వినిపిస్తున్నాను. నా మాట వినకపోతే మీరు దైవాగ్రహానికి గురవుతారని కూడా హెచ్చరిస్తున్నాను.

ఒక వ్యక్తి రేయింబవళ్ళు ప్రజల మధ్యన ఉన్నప్పుడు, అతని జీవితాన్ని చూసి అతను సత్యవంతుడో, అబద్ధీకుడో నిర్ధారించటం కష్టమేమీ కాదు. అలాగే అతను వినిపించే సందేశాన్ని విన్న తరువాత కూడా ఆ మనిషి చెప్పేది నిజమో అబద్ధమో తెలిసిపోతుంది. అతని వాక్కు మానవ ప్రోక్తమో లేక దైవప్రోక్తమో కూడా స్పష్టమైపోతుంది. అతను తమ ముందుంచే మాట సరైనదో కాదో, శ్రేయస్కరమైనదో లేక హానికరమైనదో కూడా అర్థమైపోతుంది. అతని మాట తీరునుబట్టి అతను స్వార్థపరుడో లేక నిస్వార్థ సేవాపరాయణుడో, అతని మాటలకు చేతలకు మధ్య సారూప్యం ఉందో లేక వైరుధ్యం ఉందో ఇట్టే అవగతమైపోతుంది. అతను వినిపించే ఖుర్‌ఆన్ ప్రబోధనలలో నిజంగా మేలు గనక ఉంటే అందరికన్నా ముందు అతను స్వయంగా వాటి ప్రకారం నడుచుకుంటున్నాడా? లేదా? అతని బోధనలను నమ్మి నడుచుకునే ప్రజల జీవితాలలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

## ముహమ్మద్ (స) తన సందేశహరుడని విశ్వప్రభువు తన గ్రంథంలో సాక్ష్యమిస్తున్నాడు

సృష్టికర్త తన ప్రవక్తను ఉద్దేశించి, “నీవు నా ప్రవక్తవు అని నేను సాక్ష్యమిస్తున్నాను” అంటున్నాడు. ప్రవక్తను పంపినవాడు స్వయంగా సాక్ష్యమిస్తున్నాడు – అతను పూర్తి ఆత్మ విశ్వాసంతో, సమధికోత్సాహంతో పని చేయగలందులకు. అతనిని ప్రజలు ప్రవక్తగా నమ్మకపోయినాసరే అతను ఆవేదన చెందకుండా, తన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు అల్లాహ్ అతనిని అడుగడుగునా ఓదారుస్తున్నాడు, ధైర్యం చెబుతున్నాడు. సృష్టికర్త ఇచ్చిన ఈ సాక్ష్యం ఒక విధంగా తిరస్కారులకు హెచ్చరిక లాంటిది. నా ప్రవక్తను తిరస్కరించి మీరు ఎటువంటి పరిణామాలను కొనితెచ్చుకుంటున్నారో ఆలోచించండి! అన్న

వార్నింగ్ ఉంది. అయితే ఇక్కడా బలవంతం ఏమీ లేదు. ప్రతి ఒక్కరికీ తన మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. కాకపోతే ఆ మార్గంలో వెలువడే ఫలితాలకు వారే బాధ్యులవుతారు. ఇంకా సృష్టికర్త ఏమంటున్నాడంటే, ఈ ప్రవక్త మాకు నమ్మకస్థుడైన మనిషి. మీరు ఇతనికి విధేయత చూపడమంటే మాకు విధేయత చూపడమే. ఆయన తన గ్రంథంలో ముహమ్మద్ (స)ని సంబోధిస్తూ ఇలా సెలవిచ్చాడు :

> "(ఓ ప్రవక్తా!) మేము నిన్ను ప్రజల వద్దకు సందేశహరునిగా చేసి పంపాము. దీనికి అల్లాహ్ సాక్ష్యమే చాలు. ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. మరెవడు వెనుతిరిగి పోయాడో అలాంటి వారిపై మేము నిన్ను కాపలాదారుగా చేసి పంపలేదు." *(అన్ నిసా - 79, 80)*

## ప్రవక్త ముహమ్మద్ (స)ను అల్లాహ్ లోకవాసులకు కారుణ్యంగా చేసి పంపాడు

అల్లాహ్ కార్యాలు కారుణ్యంతో నిండి ఉంటాయి. అవి విస్తృత ప్రాతిపదిక గలవి అయి ఉంటాయి. వాటికి ఎల్లలు ఉండవు. అవి సార్వజనీనం, సార్వకాలికం అయి ఉంటాయి. అందుకే అల్లాహ్ ముహమ్మద్ (స)ను ప్రవక్తగా చేసిన పంపటంలో కూడా కరుణ ఉంది. ఆ కరుణ అన్ని కాలాల, అన్ని ప్రాంతాల మనుషులకు వర్తిస్తుంది. ఆయన (సఅసం) వచ్చిన తరువాత మానవుణ్ణి పాశవికత నుండి, పైశాచికత్వం నుండి వెలికి తీసి, తిరిగి మానవత్వపు ఉన్నత స్థానానికి చేర్చారు. అన్యాయం, అమానుషత్వం, దౌర్జన్యం, నీతిబాహ్యత, అరాచకం నుండి మానవాళిని వెలికితీసి దయ, జాలి, ప్రేమ, కనికరం, సిగ్గు, బిడియం, న్యాయం, ధర్మంతో కూడుకున్న శుభప్రదమైన వాతావరణంలో ఊపిరి పీల్చే అవకాశం కల్పించారు. మానవత్వం పరిమళించే సుఖప్రదమైన జీవితం ప్రజలకు ప్రాప్తమయింది. ఆ ప్రబోధనలు ఇప్పుడూ ఉన్నాయి. అవి మళ్ళీ మనిషికి మానవత్వాన్ని ప్రసాదించి పవిత్రమైన, శాంతియుతమైన జీవితాన్ని ప్రసాదించగలవు. అందుకే అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో ఆ ప్రవక్త ఆగమనం గురించి ఇచ్చిన శుభవార్త ఇది :

> "(ఓ ప్రవక్తా!) మేము నిన్ను లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము." *(అల్ అంబియా - 107)*

## అవును, ఆయన దైవ సందేశహరుడే

ముహమ్మద్ (స) సత్యవంతుడైన ప్రవక్త అన్న ప్రస్తావన ఉత్తమ రీతిలో, వివేకవంతమైన పద్ధతిలో చేయబడింది. దీనికి సంబంధించిన ఆధారాలు రుజువులు కూడా సంబోధితుల వద్ద నుంచే సమర్పించబడ్డాయి (అంటే వారివద్ద ఉన్న తౌరాత్, ఇంజీలు గ్రంథాల ద్వారా). ముహమ్మద్ (స)ను ప్రవక్తగా నమ్మనివారు నష్టపోతారని కూడా చెప్పటం జరిగింది –

> "మేము నీపైన అవతరింపజేసిన దానిపై ఒకవేళ నీకు ఏదన్నా సందేహం ఉంటే, నీకు పూర్వం వచ్చిన గ్రంథాన్ని పారాయణం చేస్తున్న వారిని అడిగి తెలుసుకో. వాస్తవానికి నీ ప్రభువు తరఫు నుండి నీ వద్దకు సత్యం వచ్చేసింది. కాబట్టి నీవు శంకించేవారిలో చేరకు. దైవ సూచనలను అసత్యాలంటూ కొట్టివేసిన వారిలో నీవు చేరకు. ఒకవేళ నీవుగాని అలా చేశావంటే నష్టపోయిన వారిలో ఒకడవవుతావు." *(యూనుస్ – 94, 95)*

## ముహమ్మద్ (స) సత్యవంతుడైన ప్రవక్త. ఆయన సమర్పించేది సత్యం

ప్రవక్త ఏం చెప్పినా తన తరఫున చెప్పడు. ఆయన వద్దకు వహీ (దివ్యవాణి) వస్తుంది. ఎవరి ద్వారా ఈ సందేశాన్ని అల్లాహ్ తన ప్రవక్త వద్దకు పంపిస్తాడో, దానిని అతను ఎలా గ్రహిస్తాడో కూడా అల్లాహ్ తన గ్రంథంలో విశదీకరించాడు :

> "మీ సహచరుడు దారి తప్పనూ లేదు, అపమార్గానికి లోనుకానూ లేదు. అతను తన మనసు కోరినట్లుగా కూడా మాట్లాడడు. అతనేం చెప్పినా అది అతనికి పంపబడే వహీ (దైవవాణి) అయి ఉంటుంది. అది అత్యంత శక్తిమంతుడు (అయిన దైవదూత) నేర్పినది. అతడు శక్తి, యుక్తి కలవాడు. అతను (కర్తవ్యాన్ని ఉపదేశించేందుకు) నిలబడ్డాడు. అతడు ఎత్తయిన ఆకాశపుటంచుపైన ఉన్నాడు. తరువాత సమీపించసాగాడు ... మరింత క్రిందికి వచ్చాడు. రెండు ధనస్సులంత దూరాన లేదా అంతకన్నా దగ్గరగా ఉండిపోయాడు. తరువాత అల్లాహ్ తన దాసునికి వహీ చేయవలసింది వహీ చేశాడు.

దైవప్రవక్త మనసు అతను తిలకించిన దానిని అబద్ధమంటూ కొట్టివేయలేదు. అలాంటప్పుడు మీరు, అతను తిలకించిన దానిపై అతనితో వాదులాడుతారా?" *(అన్ నజ్మ్ : 2 - 12)*

"గ్రంథం కల ప్రజలారా! మీ వద్దకు మా ప్రవక్త వచ్చాడు. అతను మీకు అన్నీ విడమరచి చెబుతున్నాడు. ప్రవక్తల ఆగమనంలో ఓ సుదీర్ఘ విరామం తరువాత (ఇది మేలిమలుపు). 'మా వద్దకు శుభవార్త వినిపించేవాడు, హెచ్చరిక చేసేవాడు ఎవడూ రాలేదే!' అని మీరు అనకుండా ఉండాలని (మేమీ మహత్తర ఏర్పాటు చేశాము). ఇదిగో, శుభవార్తను వినిపించేవాడు, సావధానపరిచేవాడు ఇప్పుడు మీ వద్దకు విచ్చేశాడు, అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు."
*(అల్ మాయిదా : 19)*

మక్కాలోని ప్రజలకు సుదీర్ఘకాలంగా దేవుని ఏకత్వం, దైవదౌత్యం, పరలోకం గురించి తెలియదు. స్వయంగా ముహమ్మద్ (సఅసం) కు కూడా దైవదౌత్యం (రిసాలత్) అపరిచిత విషయమే. మొట్టమొదటిసారి ఆయన (స)పై దైవవాణి అవతరించినప్పుడు ఆయన భయాందోళనకు లోనుకావటం, తనకు ప్రాణభయం ఉందని అనటం దీనికి ప్రబల తార్కాణం. అందువల్ల ఆయన (స) స్వయంగా తనను దైవ సందేశహరునిగా ప్రకటించుకుని ప్రజలను మోసపుచ్చే ఆస్కారమే లేదు. ఒకవేళ ఆయన యూదు తెగలలో జన్మించి ఉంటే సందేహానికి ఆస్కారం ఉండేది. ఎందుకంటే యూదులకు 'రిసాలత్' గురించి తెలుసు.

ఈ నేపథ్యంలో ఖుర్ఆన్ ముహమ్మద్ (స)తో ఏమంటున్నదో చూడండి

"ప్రవక్తా! వారితో అను : నేను మీ అందరి వైపునకు వచ్చిన దైవప్రవక్తను. ఆ దేవుడు గగన భువనాలకు సార్వభౌమాధికారి. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు. ఆయనే మృత్యువును ఇస్తాడు."

## తన ప్రవక్త వరకు సందేశాన్ని చేరవేసే దైవిక పద్ధతులు

అల్లాహ్ తన దాసులతో ప్రత్యక్షంగా సంభాషించడు - సందేశాన్ని చేరవేసేందుకు ఆయన వేరే పద్ధతిని అవలంబిస్తాడు. దాని వెనుక యుక్తి ఉంది. దిగువనివ్వబడిన ఆయత్‌లో అల్లాహ్ సందేశాన్ని చేరవేసే మూడు విభిన్న పద్ధతుల్ని తన గ్రంథంలో ప్రస్తావించాడు -

“ఏ మానవమాత్రుడూ అల్లాహ్‌తో ప్రత్యక్షంగా సంభాషించలేదు. అయితే వహీ (దైవవాణి) ద్వారా గానీ, తెరవెనుకనుంచి గానీ, లేదా తాను పంపిన దైవదూత ద్వారా గానీ ఇది సంభవమే. అదైనా అల్లాహ్ అనుజ్ఞతో ఆయన కోరిన సందేశాన్ని (వహీని) మాత్రమే అందజేయగలడు. నిశ్చయంగా ఆయన మహోన్నతుడు, వివేక సంపన్నుడు.” *(అష్ షూరా – 51)*

“అల్లాహ్ దైవదూతలలో నుండి, మానవులలో నుండి కూడా తన సందేశ వాహకులను ఎన్నుకుంటాడు. నిస్సందేహంగా అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వాన్నీ గమనించేవాడూను.”

*(అల్ హజ్జ్ – 75)*

దైవదూత దైవ సందేశాన్ని దేవుడు ప్రత్యేకంగా ఎన్నుకున్న ప్రవక్త వరకు చేరుస్తాడు. ఆ ప్రవక్త దైవ సందేశాన్ని మానవుల వరకు చేర్చడమే గాక తన మాటల ద్వారా, చేతల ద్వారా దానికి ప్రతిబింబంగా ఉంటాడు –

“(ప్రవక్తా!) ఇదేవిధంగా శక్తిమంతుడు, వివేకవంతుడు అయిన అల్లాహ్ నీ వైపునకూ, నీకు పూర్వం గడచిన వారి (ప్రవక్తల) వైపునకూ దివ్యవాణిని పంపుతూ వచ్చాడు.” *(అష్ షూరా – 3)*

“ఇదేవిధంగా (ఓ ముహమ్మద్ –స!) నీవు పల్లెల తల్లి (మక్కా – ఉమ్ముల్ ఖురా) వారిని, దాని పరిసరాల వారిని హెచ్చరించటానికి, సందేహానికి ఆస్కారమే లేని, అందరూ సమావేశమయ్యే రోజు గురించి సావధానపరచటానికి మేము నీ వద్దకు అరబీ ఖుర్‌ఆన్‌ను పంపాము. అప్పుడు ఒక వర్గం స్వర్గంలో ఉంటే, మరోవర్గం నరకాగ్నిలో ఉంటుంది.” *(అష్ షూరా – 7)*

పైన ప్రస్తావించబడిన దివ్య వచనాల ద్వారా అవగతమైన దేమిటంటే, సందేశాన్ని అందజేయడానికి ఇతర ప్రవక్తల విషయంలో అవలంబించబడిన పద్ధతే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) విషయంలో కూడా అవలంబించ బడింది. ఈ ఆయత్ ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే మానవులంతా ప్రవక్తల మాట వినరు. కొందరు వింటారు, విధేయత చూపుతారు. అలాంటివారు స్వర్గంలో ప్రవేశిస్తారు. మరికొందరు మాట వినరు. ధిక్కరిస్తారు. అలాంటివారు నరకాగ్నికి ఆహుతి అవుతారు. కనుక మాట వినకుండా హఠం చేస్తున్నవారు తమ వైఖరిపై కాస్త ఆగి ఆలోచించాలి.

## అద్భుతం (మోజిజా) - దాని స్థాయి

ప్రజలు అద్భుతాలు చూపమని కోరుతారు. అయితే 'అద్భుతం (మోజిజా)' కన్నా ఎక్కువ విలువైన వస్తువు ప్రవక్త సమర్పించిన 'ఖుర్ఆన్'. దానిపై యోచన చేసి, ఆచరించినప్పుడు వెలువడే ఫలితాలు అసాధారణం. అవి మానవ జీవితాలలో విప్లవం తీసుకువచ్చాయి. మమతానురాగాల దివ్వెలు వెలిగించాయి. వాటిని మానవుని చర్మచక్షువులు వీక్షించగలవు. మనోనేత్రం తిలకించి ఆస్వాదించగలదు. ఇది స్వయంగా ఒక 'అద్భుతం'.

ఖుర్ఆన్ యొక్క ఈ సంబోధనను కూడా చూడండి –

> "(ప్రవక్తా!) నీవు వారి ముందుకు ఏదయినా సూచన (మహిమ)ను తీసుకు రాలేకపోయినప్పుడు, 'నీవు స్వయంగానే ఏదయినా 'సూచన'ను ఎంపిక చేసుకోలేకపోయావా?' అని వారంటారు. వారికి చెప్పు : 'నా ప్రభువు తరఫున నాకు పంపబడిన దానినే నేను అనుసరిస్తాను. ఇవి మీ ప్రభువు వద్ద నుండి వచ్చే వివేకవంతమయిన విషయాలు. విశ్వసించే వారికి మార్గదర్శకం. కారుణ్యప్రదం'
> *(అల్ ఆరాఫ్ – 203).*

## సామాన్య ప్రజల వరకు సందేశాన్ని చేరవేసే దైవ విధానం

సామాన్య ప్రజానీకం వరకు సందేశాన్ని చేరవేయడానికి సృష్టికర్త స్వయంగా దిగిరాడు. గగన సీమల్లో ఉన్న సృష్టితాలను కూడా పంపడు. పైగా ఈ మహత్కార్యం కొరకు ఆయన మానవుణ్ణే ఎంపిక చేస్తాడు. అతని ద్వారా మానవులకు సందేశం చేరవేయడం మాత్రమే కాకుండా ఆ సందేశానికి క్రియాత్మకంగా నమూనాగా నిలిచే బాధ్యతను కూడా ప్రవక్తపై మోపుతాడు. తమ మధ్యన నివసించే మానవమాత్రుడు ఆ సందేశానికి నిలువుటద్దంగా నిలిచినప్పుడే తోటి మానవులు దానిని స్వీకరించి సాఫల్యం పొందడానికి ముందుకు వస్తారు. మానవేతరుల ద్వారా ఈ ఆశయం నెరవేరదు. అందుకే దైవదౌత్యం కొరకు ముహమ్మద్ (స) అనే వ్యక్తిని ఎన్నుకోవటం జరిగింది.

> "ప్రవక్తా! మేము నీకు పూర్వం కూడా మనుషులనే ప్రవక్తలుగా చేసి పంపాము. వారి వద్దకు మేము సందేశాన్ని (వహీని) పంపేవారము. ఒకవేళ మీకు తెలీకపోతే జ్ఞాపిక (గ్రంథం) కలిగి

ఉన్నవారిని అడిగి తెలుసుకోండి. మేము వారిని (ఆ ప్రవక్తలను) స్పష్టమయిన నిదర్శనాలతో, గ్రంథాలతో సహా పంపాము. అలాగే మేము నీపైన కూడా జ్ఞాపిక (ఖుర్‌ఆన్)ను అవతరింపజేశాము – మేము మానవుల కోసం పంపిన దానిని నీవు వారికి విపులీకరించడానికి, తద్వారా వారు ఆలోచించడానికి." *(అన్ నహ్ల్–43, 44)*

## ముహమ్మద్ (సఅసం) ఒక ప్రవక్త. ఆయన బాధ్యతల్లా సందేశాన్ని అందజేయటం వరకే

దేవుని మార్గబోధనను దైవదాసుల వరకు చేరవేయటం ప్రవక్త పని. అద్భుతాలు చేసి చూపమని జనులు డిమాండు చేస్తారు. అద్భుతాలు చేసిచూపటం ప్రవక్త పని కాదు. వాస్తవానికి సత్యాన్ని తిరస్కరించడానికి వారు పెట్టే అనుచితమైన షరతులు ఇవి. దైవప్రవక్త జీవితం వారి ముందుంది. అతని నీతి నడవడిక, ప్రజల పట్ల అతనికి గల నిష్కల్మషమైన ప్రేమ, అతని చిత్తశుద్ధి – ఇవన్నీ ఆ సత్య సందేశానికి సాక్షీభూతంగా ఉన్నాయి.

అల్లాహ్ తన ప్రవక్తతో ఏమంటున్నాడో చూడండి –

(ప్రవక్తా!) వారికి చెప్పు : "నా ప్రభువు పరమ పవిత్రుడు. నేను ప్రవక్తగా చేసి పంపబడిన ఒక మానవమాత్రుణ్ణి తప్ప మరేమీ కాను."

*(బనీ ఇస్రాయీల్ – 93)*

నా పనల్లా ప్రభువు సందేశాన్ని ఆయన దాసుల వరకు చేరవేయటం మాత్రమేనని ప్రవక్త దైవసాక్షిగా చెబుతున్నాడు. "నేను కూడా ఒక దాసుణ్ణే కాబట్టి నేను అద్భుతాలు చేయలేను" అని కూడా అంటున్నాడు.

## ప్రవక్త మానవుడే అయి ఉంటాడు

ప్రవక్త ఎట్టి పరిస్థితిలోనూ మానవుడే అయి ఉండాలి. మానవుని జీవితం మాత్రమే తోటి మానవులకు ఆదర్శప్రాయం కాగలుగుతుంది. దైవదూత గానీ, మరే ఇతర ప్రాణి గానీ మనుషులకు ఆదర్శప్రాయం కాజాలదు. మనుషులు కోరే అసహజమైన, అనుచితమయిన కోరికలకు సమాధానంగా అల్లాహ్ ఈ విధంగా సెలవిస్తున్నాడు :

"జనుల వద్దకు మార్గబోధన వచ్చేసినప్పుడు, దానిని విశ్వసించకుండా వారికి అవరోధంగా నిలిచిన విషయం ఒక్కటే – అదేమిటంటే,

> 'ఏమిటి, దేవుడు ఒక మానవమాత్రుణ్ణి ప్రవక్తగా ప్రభవింపజేశాడా?' అని వారు అనటమే. వారికి చెప్పు : "ఒకవేళ దైవదూతలు భూమ్మీద హాయిగా సంచరిస్తూ మనుగడ సాగించగలిగేటట్లయితే మేము ఆకాశం నుండి దైవదూతలనే ప్రవక్తలుగా పంపేవారము."
>
> *(బనీ ఇస్రాయీల్ – 94, 95)*

తాను కేవలం ఒక మానవమాత్రుణ్ణి మాత్రమేనని దైవప్రవక్త స్వయంగా ఖుర్ఆన్ ఆధారంగా పరిచయం చేసుకుంటున్నాడు. కాకపోతే అతని వద్దకు దైవవాణి (వహీ) వస్తుంది. ఆ 'వహీ' లో చాలా స్పష్టంగా చెప్పబడింది – సృష్టికర్త, ఆరాధ్య దైవం ఒక్కడేనని.

> (ప్రవక్తా!) వారితో ఇలా అను : "నేనూ మీలాంటి ఒక మానవ మాత్రుణ్ణే. అయితే నా వద్దకు దైవవాణి (వహీ) పంపబడుతుంది. మీ ఆరాధ్య దైవం ఒకే ఆరాధ్య దైవం. కనుక తన ప్రభువుతో సమావేశమవ్వాలని ఆశించేవాడు సదాచరణ చేయాలి. తన ప్రభువు దాస్యంలో వేరెవరినీ భాగస్వామిగా చేర్చరాదు." *(అల్ కహ్ఫ్–110)*

ప్రవక్త కూడా మానవుడే. అతని వైపునకు వహీ (దైవవాణి) పంపబడుతుంది. అంటే అతనిపై ఒక బాధ్యత మోపబడింది.

మానవుడు సృష్టికర్త సందేశం కొరకు నిరీక్షిస్తూ ఉంటాడు. ఆ సందేశాన్ని చేరవేయడానికి దైవదూతలో లేక మానవేతరులో దివి నుంచి భువికి దిగివస్తారని అతను ఊహించుకుంటూ ఉంటాడు. కాని సృష్టికర్త ఎవరయినా ఒక మానవమాత్రుని ద్వారా సందేశాన్ని చేర్చే ఏర్పాటు చేసేసరికి అది అతనికి వింతగా తోస్తుంది. ఈ కారణంగానే మానవాళిలోని ఒక వర్గం సృష్టికర్త సందేశాన్ని త్రోసిపుచ్చుతుంది. త్రోసిపుచ్చే వారి మనస్తత్వాన్ని గురించి అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు –

> "ఏమిటీ, మేము మానవులలో నుండే ఒక వ్యక్తికి దివ్య సందేశం ఇచ్చి జనులను హెచ్చరించమనీ, విశ్వసించిన వారికి వారి ప్రభువు వద్ద సిసలయిన ఉన్నత స్థానం ఉందన్న శుభవార్తను వినిపించమని చెప్పటం వారికి ఆశ్చర్యం కలిగించిందా? (దానిపై) సత్య తిరస్కారులు, "ఇతగాడు పచ్చి మాంత్రికుడే" అన్నారు. *(యూనుస్ – 2)*

తన గ్రంథాన్ని తన ప్రవక్త వద్దకు పంపటంలోని ప్రధాన ఉద్దేశం మానవాళికి సన్మార్గం చూపటమేనని అల్లాహ్ చాలా స్పష్టంగా చెబుతున్నాడు. ఇప్పుడు ప్రవక్త పనేమిటంటే, ఈ మార్గదర్శక గ్రంథాన్ని ప్రజల వరకు చేరవేయటం, దానిని విశదీకరించటం, దానిని అవలంబించమని చెప్పటం, తాను స్వయంగా ఆ గ్రంథానికనుగుణంగా అమలుపరచి ప్రజల ముందు ఆదర్శాన్ని నెలకొల్పటం. ప్రవక్త చేసేది ఇదే. అయితే ప్రజలను బలవంతంగా తన దారికి రప్పించటం ప్రవక్త పని కాదు. ఈ విషయంలో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ ఉంది. అయితే ప్రతి వ్యక్తీ తాను అనుసరించే మార్గానికి తాను స్వయంగా బాధ్యుడవుతాడు. దాని ఫలితాన్ని కూడా అతనే అనుభవిస్తాడు.

అల్లాహ్ తన గ్రంథంలో చాలా స్పష్టంగా ఇలా అంటున్నాడు :

"(ప్రవక్తా!) మేము మానవుల మార్గదర్శకత్వం నిమిత్తం ఈ గ్రంథాన్ని నీపైన సత్యంతో పాటు అవతరింపజేశాము. కనుక సన్మార్గాన్ని పొందినవాడు తన స్వయం కొరకే పొందుతాడు. మరెవరయినా మార్గవిహీనుడైతే ఆ మార్గవిహీనతా నష్టమంతా అతని మీదే పడుతుంది. నీవు వారి నష్టానికి బాధ్యుడవు కావు కదా!"

*(అజ్ జుమర్ - 41)*

## సందేశంతో పాటు సందేశహరుడు

సందేశంతో పాటు సందేశహరుణ్ణి, అంటే గ్రంథంతో పాటు ప్రవక్తను పంపటంలో యుక్తి కూడా ఉంది. కారుణ్యం కూడా ఉంది. ఎందుకంటే సందేశాన్ని సందేశహరుడు స్పష్టంగా విడమరచి చెప్పాలి. ఆచరించి చూపాలి. అప్పుడే సామాన్య ప్రజలు అర్థం చేసుకుని ఆచరించడం సులువవుతుంది. అందుకే సృష్టికర్త ఇలా అంటున్నాడు :

"ఈ రాత్రి యందు వివేకవంతమయిన ప్రతి వ్యవహారానికి సంబంధించి నిర్ణయం గైకొనబడుతుంది – మా వద్ద నుండి ఆజ్ఞ రూపంలో. ప్రవక్తలను పంపేది కూడా మేమే – నీ ప్రభువు దయానుగ్రహంగా. నిశ్చయంగా ఆయన సర్వం వినేవాడు, సమస్తం తెలిసినవాడు."

*(అద్ దుఖాన్ : 4–6)*

ప్రవక్త రాక మానవాళి పాలిట కారుణ్యప్రదం. ఎందుకంటే అతను కారుణ్య సందేశం తీసుకుని వస్తాడు.

## ప్రవక్త ప్రత్యేకత, పరిమితులు

దైవ సందేశాన్ని దైవదాసులకు అందజేయటం వరకే దైవప్రవక్త పని. ఆ సందేశాన్ని అతను బాగా విప్పి చెబుతాడు. క్రియాత్మక జీవితంలో దానిని ప్రవేశపెట్టి, సర్వవిధాలా సందేశం అవగతమయ్యేలా చేస్తాడు. ఏ విషయం కూడా అస్పష్టంగా ఉండకుండా జాగ్రత్త వహిస్తాడు. మానవమాత్రుడైన కారణంగా అగోచర విషయాలకు సంబంధించినంత వరకు అందరి వలెనే అతను కూడా నిస్సహాయుడే.

నీ స్థాయి ఏమిటో ప్రజలకు స్పష్టంగా చెప్పు అని అల్లాహ్ తన ప్రవక్తకు ఆదేశిస్తున్నాడు :

> వారికి చెప్పు : "నేనేమీ విలక్షణమైన ప్రవక్తను కాను. రేపు నా పట్ల ఏం జరుగుతుందో, మీ పట్ల ఏం జరుగుతుందో నాకు తెలియదు. నా వద్దకు పంపబడిన సందేశాన్ని మాత్రమే నేను అనుసరిస్తాను. నేను స్పష్టంగా భయబోధ చేసేవాడను మాత్రమే."
>
> *(అల్ అహ్ఖాఫ్ – 9)*

అగోచరాలకు సంబంధించిన ఎన్నో విషయాలు, ఉదాహరణకు – ప్రళయదినం, మరణానంతర జీవితం, లెక్కాచారం, స్వర్గం నరకం మొదలగు వాటిని గురించి ప్రవక్త విశదీకరిస్తాడు. అదే సమయంలో తాను కేవలం ఒక మానవమాత్రుడిననీ, అందువల్ల తనకు అగోచర విషయాల జ్ఞానం లేదని, సృష్టికర్త తనకు దైవదూత ద్వారా తెలియపరచిన రహస్యాలను మాత్రమే తాను ప్రజలకు వినిపిస్తున్నానని కూడా ప్రవక్త అంటాడు.

## తన ప్రవక్తను పంపటంలోని ఉద్దేశ్యాన్ని అల్లాహ్ స్పష్టీకరించాడు

> "ప్రవక్తా! మేము నిన్ను సాక్ష్యమిచ్చేవానిగా, శుభవార్త వినిపించే వానిగా, భయబోధ చేసేవానిగా పంపాము. ఇంకా నిన్ను అల్లాహ్ ఆజ్ఞతో ఆయన వైపునకు పిలిచేవానిగా, వెలిగే దీపంగా చేశాము. విశ్వసించిన వారికి అల్లాహ్ తరఫున గొప్ప అనుగ్రహం ఉందన్న శుభవార్తను వినిపించు." *(అల్ అహ్జాబ్ : 45 – 47)*

చూశారా! ప్రవక్త స్వయంగా తన జీవితాన్ని సుందరంగా మలచు కోవడమే గాక, ప్రజల జీవితాలను కూడా తీర్చిదిద్దుతున్నాడు. విశ్వాసపరంగా,

నైతికంగా తాను ఒక జ్యోతిగా వెలుగొందడమే గాక, పరిసరాలను కూడా ప్రకాశమానం చేస్తున్నాడు. ఒక్కడైన అల్లాహ్ గురించి సాక్ష్యమివ్వడానికి దైవప్రవక్త నిలువెల్లా వెలిగే దీపంలా ఉండటం అవసరం – మాటల ద్వారా, చేతల ద్వారా కూడా.

## ప్రవక్త తీసుకువచ్చే దైవాదేశాలు కారుణ్యంతో కూడుకున్నవి

సృష్టికర్తలోని కారుణ్య గుణం వాంఛించేదేమిటంటే, ఆయన స్పష్టమైన పద్ధతిలో తన ఆదేశాలను ఇచ్చి ప్రవక్తను పంపాలి. అజ్ఞానం, ఊహలు, మూఢనమ్మకాల కారణంగా మానవుడు అవలంబిస్తున్న ఆచారాలు అతని బ్రతుకును దుర్భరం చేసేశాయి. ఈ మూఢ నమ్మకాల అంధకార లోయల్లో నుంచి వెలికి తీసి అతనిని సృష్టికర్త వైపునకు తీసుకురావలసి ఉంది. కాగా, దైవప్రవక్త దేవుని కారుణ్య సందేశాన్ని తీసుకువచ్చి ప్రజలకు దాని గురించి విశదీకరించి, వారిని మధ్యేమార్గంపై నడిపిస్తాడు.

> "ఆ సందేశహరుడు వారికి మంచిని చెయ్యమని ఆజ్ఞాపిస్తాడు. చెడు నుండి వారిస్తాడు. వారి కొరకు పరిశుద్ధమయిన వస్తువులను ధర్మసమ్మతంగా ఖరారు చేస్తాడు. అపరిశుద్ధమయిన వాటిని అధర్మంగా నిర్ధారిస్తాడు. వారిపైన ఉన్న బరువులను దించుతాడు. వారికి వేయబడివున్న సంకెళ్ళను త్రెంచుతాడు."
>
> *(అల్ ఆరాఫ్ – 157)*

## సృష్టికర్త తన ఆజ్ఞలను, సందేశాన్ని సుబోధకమైన పద్ధతిలో పంపే ఏర్పాటు చేస్తాడు

సృష్టికర్త తన ఆదేశాలను తన దాసులకు చాలా స్పష్టమైన రీతిలో పంపే ఏర్పాటు చేస్తాడు. ఇందునిమిత్తం ఆయన గ్రంథాన్ని పంపించాడు. గ్రంథాన్ని పంపించడానికి ఆయన సందేశహరుణ్ణి నియమించాడు. అతను ఆ గ్రంథంలోని విషయాలను చాలా స్పష్టంగా విడమరచి చెబుతాడు. ఆచరించి చూపుతాడు.

> "అల్లాహ్ తన చిత్తంతో (మిమ్మల్ని) స్వర్గం వైపునకు, తన క్షమాపణ

వైపునకు పిలుస్తున్నాడు. ప్రజలు గుణపాఠం గ్రహించాలని ఆయన తన ఆదేశాలను వారికి విపులీకరిస్తున్నాడు." *(అల్ బఖరా – 221)*

సృష్టికర్త తరఫున నియుక్తుడయిన "ఆ ప్రవక్త" కేవలం సందేశాన్ని చేరవేయడంతో సరిపెట్టుకోవటం లేదు. ఆ సందేశంలోని మర్మాన్ని విపులీకరిస్తున్నాడు. తన నిజ జీవితంలో ఆ ఆదేశాలను పాటించి ఒక ఆదర్శాన్ని ప్రజల ముందు ఉంచుతున్నాడు. ఆ ఆదేశాల ప్రకారం ప్రజల అంతరంగాలను పరిశుద్ధపరుస్తున్నాడు :

> "అల్లాహ్ విశ్వాసులకు చేసిన మహోపకారం ఏమిటంటే, ఆయన వారి మధ్యన స్వయంగా వారిలో నుండే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతను (ఆ ప్రవక్త) వారికి దైవ వచనాలను వినిపిస్తున్నాడు. వారిని పరిశుద్ధుల్ని చేస్తున్నాడు. వారికి గ్రంథాన్ని, వివేకాన్ని బోధిస్తున్నాడు. నిశ్చయంగా దానికి పూర్వమైతే వారు స్పష్టమైన మార్గభ్రష్టతకు లోనై ఉండేవారు." *(ఆలి ఇమ్రాన్ – 164)*

## విశ్వసించిన వారి జీవితాలను ప్రవక్త తీర్చిదిద్దుతాడు

దేవుని అనురాగ రావాన్ని వినిపించి, బోధపరచడంతో పాటు దైవప్రవక్త విశ్వాసుల (మోమినీన్‌ల) జీవితాలను సంస్కరిస్తాడు. అంటే వారి ఆలోచనలను, నమ్మకాలను, వారి నీతీ నడవడికలను, వారి వ్యవహారాలను, వారి కుటుంబ జీవితాన్ని, వారి సంఘ జీవితాన్ని సంస్కరించి వారి జీవన రథాన్ని ధర్మపథంలో నడిపిస్తాడు. అతని ఈ సంస్కరణా సరణి అంతా దైవగ్రంథం వెలుగులోనే ఉంటుంది. అందుకే అల్లాహ్ తన ప్రవక్త యొక్క క్రియాత్మక జీవితాన్ని, అతని నిరంతర కృషిని గురించి వేరొకచోట ఇలా అంటున్నాడు :

> "ఆయనే నిరక్షరాస్యులలో నుండి ఒక ప్రవక్తను – స్వయంగా వారిలో నుండే – ప్రభవింపజేశాడు. అతను వారికి ఆయన ఆయత్‌లను చదివి వినిపిస్తున్నాడు. వారిని పరిశుద్ధపరుస్తున్నాడు. వారికి గ్రంథాన్నీ, వివేకాన్నీ బోధపరుస్తున్నాడు." *(అల్ జుముఅహ్ – 2)*

## దైవప్రవక్త జీవితం ఆదర్శప్రాయం, ప్రామాణికం

అల్ అహ్‌జాబ్ సూరా 21వ వచనంలో, దైవప్రవక్త (స) జీవితం మీ కొరకు ఆదర్శప్రాయం అని సెలవీయడం జరిగింది –

"మీ కొరకు దైవప్రవక్తలో అత్యుత్తమ ఆదర్శం ఉంది – అల్లాహ్‌ను, అంతిమదినాన్ని ఆశిస్తూ, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు" *(33 : 21).*

ఇది చాలా సులభం. ఎందుకంటే దైవప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శాన్ని అనుసరిస్తే సరిపోతుంది. ఇక్కడ కన్‌ఫ్యూజన్ (Confusion) ఏమీ లేదు. ఆదేశపాలన ఎలా చేయాలి? అన్న మీమాంస ఉండదు. దారితప్పే ప్రమాదం ఉండదు. ఆ ఆదర్శంపై దృఢ నమ్మకం ఉంది. అది ఎంతో ప్రామాణికమైన, ఉదాహరణ ప్రాయమైన నమూనా. అల్లాహ్ తన ప్రవక్త ముహమ్మద్ (స) క్రియాత్మక జీవితాన్ని ప్రమాణబద్ధంగా ఖరారు చేశాడు. దానిని అనుసరించిన వారి ఆచరణను అల్లాహ్ ఆమోదిస్తాడు.

మానవుడు తన ఆరాధ్య దైవానికి భయపడినప్పుడు ఆయనకు విధేయత చూపుతాడు. అల్లాహ్‌కు విధేయత చూపే అత్యుత్తమ విధానం దైవప్రవక్త విధేయత. అందుకే ప్రతి ప్రవక్తా ఈ విషయాన్నే నొక్కి వక్కాణించారు. దానిని ఖుర్ఆన్ రికార్డు చేసింది –

"కనుక మీరు దైవానికి భయపడండి. నాకు విధేయత చూపండి" *(అష్ షుఅరా – 126)*

దేవుడు తన ప్రవక్తను పంపటంలోని ముఖ్య ఉద్దేశం ఇదే. అంటే ప్రవక్త జీవితాన్ని ప్రజలు ఆదర్శప్రాయంగా ఎంచాలి. తద్వారా తమ జీవితాలలో లబ్ధి పొందాలి. లబ్ధి పొందాలంటే అల్లాహ్‌పైన, అంతిమదినం (పరలోకం)పైన దృఢనమ్మకం ఉండాలి. దైవ ప్రసన్నతను చూరగొని పరలోకంలో సాఫల్యం పొందడానికి ప్రవక్తకు విధేయత చూపటం అవశ్యం. ప్రవక్తకు విధేయత చూపటం అనేది అతని పట్ల పూర్తిగా నమ్మకం ఉన్నప్పుడే సాధ్యం.

## ప్రవక్త మాట ప్రమాణబద్ధమైనది. అందుకే ఆయన్ని అనుసరించాలి

ప్రవక్త ఏం చెప్పినా సృష్టికర్త ఆదేశానుసారం చెబుతాడు. ప్రజా జీవితాలకు మేలు చేకూర్చే విషయాలే చెబుతాడు. కనుక అతని మాట వినాలి. అతనికి విధేయత చూపాలి. ప్రవక్తను పంపటంలోని ఉద్దేశం ఇదే –

"(వారికి చెప్పు). మేము ఏ ప్రవక్తను పంపినా దైవాజ్ఞననుసరించి వారు అతనికి విధేయత చూపాలనే పంపాము." *(అన్ నిసా : 64)*

ప్రవక్త చెప్పేది కేవలం వింటే సరిపోదు, ఆయనకు విధేయత కూడా కనబరచాలి. అప్పుడే ఉద్దేశం నెరవేరుతుంది. సన్మార్గం ప్రాప్తిస్తుంది.

## ప్రవక్త మాట ప్రామాణికం ఎందుకు?

సృష్టికర్త తన సందేశాన్ని పంపటానికి ఎంతో విశ్వసనీయుడైన, నిజాయితీపరుడైన వ్యక్తిని ఎన్నుకుంటాడు. ఆ వ్యక్తి దైవ సందేశాన్ని యధాతథంగా అందజేస్తాడు. అందుకే ప్రవక్త చెప్పేది నమ్మదగినది అని అల్లాహ్ తన గ్రంథంలో స్పష్టం చేశాడు. అతనేం చెప్పినా దైవం తరఫున చెబుతాడు. ఆ సందేశంలో ఎలాంటి మార్పులు, హెచ్చుతగ్గులు చేయడు. ఎందుకంటే ఈ విషయంలో దైవప్రవక్త కూడా అల్లాహ్‌కు జవాబుదారు అయి ఉంటాడు. కాబట్టి మనిషి ప్రవక్త చెప్పే ప్రతి మాటను ప్రశాంత మనసుతో స్వీకరించవచ్చు.

> "దేనినయినా దాచిపెట్టడమనేది ప్రవక్తకు తగని పని. దాచిపెట్టిన వాడు, తాను దాచిన వస్తువును తీసుకుని ప్రళయదినాన హాజరవుతాడు. తరువాత ప్రతి ప్రాణికీ, అది సంపాదించుకున్న దాని ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు."
>
> *(ఆలి ఇమ్రాన్ – 161)*

## ప్రవక్త ప్రత్యేకత : అతను వేతనం తీసుకోడు

దైవప్రవక్త ఎంతో ముఖ్యమయిన, విలువైన వస్తువును తీసుకువస్తాడు. అంటే మానవ జీవితాలకు ఎంతో అవసరమయిన దేవుని మార్గబోధనను వినిపిస్తాడు. మానవుల ఇహపరాల సాఫల్యం కొరకు అహర్నిశలు పాటుపడతాడు. ఇంతచేసి కూడా అతను ప్రజల నుండి జీతం అడగడు. దేవుని తరఫున మోపబడిన బాధ్యతను నెరవేర్చి దేవుని నుండే దాని ప్రతిఫలాన్ని ఆశిస్తాడు. క్షమాభిక్షకై దైవాన్నే అర్థిస్తాడు. ఎందుకంటే తోటి ప్రజల నుండి ప్రతిఫలాన్ని అపేక్షించకుండా – నిస్వార్థంగా – పనిచేసినప్పుడే అతని సేవలకు ప్రజలు విలువ ఇస్తారు, అతని సందేశాన్ని స్వీకరిస్తారు.

అందుకే ఖుర్ఆన్‌లో అల్లాహ్ తన ప్రవక్త స్థాయిని గురించి చాలా స్పష్టంగా చెప్పాడు – నా ప్రవక్త ఎంత హుందాతనం (Dignified)గా పనిచేస్తున్నాడో చూడండి! అతను రేయింబవళ్ళు పరిశ్రమిస్తున్నాడు, ప్రజలను నరకాగ్ని నుండి కాపాడాలన్న తపనతో ప్రేమతో, సానుభూతితో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నాడు. కాని ఎవరి నుండీ వేతనం అడగటం లేదు –

వారికి చెప్పేయ్ : "నేను ఈ పనికి గాను మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. అయితే కోరినవారు తన ప్రభువు మార్గాన్ని అవలంబించవచ్చు (అదే నా ప్రతిఫలం)."

*(అల్ ఫుర్ఖాన్ – 57)*

అంటే మీరు ప్రభుమార్గాన్ని అవలంబిస్తే చాలు, నాకు అంతకన్నా సంతోషం మరొకటి ఉండదు.

ప్రవక్త తాను చేసిన పనికిగాను (తనపై మోపబడిన కర్తవ్యాన్ని నిర్వర్తించినందుకుగాను) తనకు ఇంత ప్రతిఫలం ప్రజల నుండి ముట్టాలన్న కోరికను కలిగి ఉండడు. తాను ప్రజలకు స్వర్గపు బాట చూపానని, నరకయాతన నుండి రక్షించానని, దైవదాసులను దేవునితో కలిపానని, అందుకుగాను ప్రజలు తనకు తగిన పారితోషికం ఇవ్వాలని అనడు.

"దీనికిగాను మీ నుండి నేను ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నాకు ప్రతిఫలం ఇచ్చే బాధ్యత సకల లోకాల ప్రభువుది."

*(అష్ షుఅరా – 109)*

## ప్రవక్త తన దాస్యం వైపునకు పిలుపు ఇవ్వడు

దైవప్రవక్త కేవలం సృష్టికర్త దాస్యం చెయ్యమని చెబుతాడు. ఎట్టి పరిస్థితిలోనూ తనను ఆరాధించమని చెప్పడు. అల్లాహ్ ఎంతో స్పష్టంగా, మరెంతో గట్టిగా ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాడు :

అల్లాహ్ ఏ మనిషికయినా గ్రంథాన్నీ, యుక్తినీ, ప్రవక్త పదవిని ప్రసాదించినప్పుడు అతను ప్రజలతో, "మీరు దైవాన్ని వదలి నా దాసులవండి" అని చెప్పటం అతనికి ఎంతమాత్రం తగదు. పైగా అతను, "మీరు సిసలైన దేవుని సేవకులవండి" అనంటాడు. ఎందుకంటే మీరు ఇతరులకు గ్రంథోపదేశం చేస్తారు. మీరు స్వయంగా కూడా దానిని పఠిస్తారు. "మీరు దైవదూతలను, దైవ ప్రవక్తలను మీ ప్రభువులుగా చేసుకోండి" అని కూడా అతను మీకు ఆజ్ఞాపించడు. ఏమిటీ, మీరు దైవవిధేయతకు తల ఒగ్గిన మీదట కూడా అతడు మిమ్మల్ని అవిశ్వాసానికి పాల్పడమని ఆదేశించటమా? (అసంభవం).

*(ఆలి ఇమ్రాన్ – 79, 80)*

## మానవులకు లాభనష్టాలు చేకూర్చే అధికారం ప్రవక్తకు ఇవ్వబడలేదు

ప్రవక్త సృష్టికర్త తరపున ప్రత్యేకంగా ఎన్నుకోబడినవాడే అయినప్పటికీ, ఆయన తెచ్చిన సందేశం చాలా గొప్ప సందేశమే అయినప్పటికీ మనుషులకు లాభంగానీ, నష్టంగానీ చేకూర్చే అధికారం, శక్తి అతనికి లేదు. అతను తన స్వయానికి కూడా ఎలాంటి లాభనష్టాలు కలిగించుకోలేడు. అల్లాహ్ పట్టు నుండి ప్రవక్తను కూడా ఎవరూ కాపాడలేరు. అల్లాహ్ నుండి పారిపోయి తలదాచుకునే ఆశ్రమం కూడా అతనికి దొరకదు. ఈ యదార్థాన్ని అల్లాహ్ తన గ్రంథంలో తన ప్రవక్త ద్వారానే చెప్పించాడు :

> (ఓ ముహమ్మద్ –స!) వారికి చెప్పు : "నేను కేవలం నా ప్రభువును మాత్రమే మొరపెట్టుకుంటాను (ప్రార్థిస్తాను). ఆయనకు భాగస్వామిగా వేరెవరినీ చేర్చను." ఇంకా ఇలా అను : "మీకు కీడుగానీ, మేలుగానీ కలిగించే అధికారం నాకు లేదు". ఇంకా ఈ విధంగా చెప్పు : "అల్లాహ్ బారి నుండి నన్నెవరూ కాపాడలేరు. ఆయన తప్ప వేరొకరి ఆశ్రయం కూడా నాకు లేదు. అయితే అల్లాహ్ ఆదేశాన్ని గ్రహించి, ఆయన సందేశాలను అందజేయటం వరకే నా బాధ్యత". ఇక ఎవరయినా అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను ఎదిరిస్తే అతని కొరకు నరకాగ్ని ఉంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు." *(అల్ జిన్న్ : 20 – 23)*

ప్రవక్త చెప్పిన ఈ మాటల్లో కూడా దేవుని ఏకత్వం (తౌహీద్) తొణికిసలాడుతోంది. లాభనష్టాలను చేకూర్చే అధికారం అల్లాహ్ చేతుల్లో మాత్రమే ఉందని, ఆయన పట్టు నుండి ఎవరూ రక్షించలేరని ప్రవక్త చెప్పటం గమనార్హం. ఆ తరువాత ఆయన తన బాధ్యతను గుర్తు చేశారు. దైవ సందేశాన్ని త్రోసిపుచ్చినవారు ఎదుర్కోబోయే తీవ్ర పరిణామాన్ని కూడా ప్రస్తావించి హెచ్చరించారు.

## సన్మార్గం వొసగటం ప్రవక్త బాధ్యత కాదు. అది అతని వల్ల అయ్యే పని కూడా కాదు

దైవ సందేశాన్ని అందజేయడం వరకే ప్రవక్త బాధ్యత. ప్రజలకు సన్మార్గం వొసగటం ఆయన పని కాదు. ఆ పని ఆయన చేయలేదు కూడా.

కేవలం ప్రయత్నించగలడు. సన్మార్గంపై నడిపించేవాడు అల్లాహ్‌యే. సన్మార్గం పొందాలన్న ఆకాంక్ష ఉన్నవారినే ఆయన ఆ మార్గాన నడిపిస్తాడు. దైవ కృపవల్ల సన్మార్గం పొందిన ఆ జనులు, దైవప్రవక్త అందజేసిన మార్గబోధన ద్వారా ప్రయోజనం పొందుతారు. ఈ యదార్థాన్ని బహిర్గతం చేసి అల్లాహ్ తన ప్రవక్త భారాన్ని తగ్గిస్తున్నాడు –

"(ప్రవక్తా!) నీవు కోరిన వారినల్లా సన్మార్గం చూపలేవు. అల్లాహ్, తాను కోరినవారికి మాత్రమే సన్మార్గం చూపుతాడు. మార్గబోధన పొందగల వారెవరో ఆయనకు మాత్రమే తెలుసు."

*(అల్ ఖసస్ – 56)*

## భయబోధ చేయటం వరకే ప్రవక్త పని

ప్రజలకు భయబోధ చేయటం వరకే పైగంబర్ పని. ఒకే ఆరాధ్య దైవాన్ని విశ్వసించటం, విశ్వసించకపోవటం వల్ల, ఆ దైవానికి విధేయత చూపటం, చూపకపోవటం వల్ల వెలువడే సత్ఫలితాలను, దుష్ఫలితాలను ఆయన ఎరుకపరుస్తాడు. ప్రవక్తను ప్రత్యక్షంగా సంబోధిస్తూ అల్లాహ్ ఇలా అంటున్నాడు:

"నీవు భయబోధ చేసేవాడవు మాత్రమే. అన్నింటికీ బాధ్యుడు అల్లాహ్ మాత్రమే." *(హూద్ – 12)*

ముహమ్మద్ (స) ప్రవక్త స్థాయిని, ఆయన సుగుణాలను, ఆయన బాధ్యతలను స్పష్టంగా వివరిస్తూ అల్లాహ్ ఇలా అంటున్నాడు :

"(ప్రవక్తా!) నిశ్చయంగా మేము నిన్ను సాక్షిగా, శుభవార్తను వినిపించేవానిగా, భయబోధ చేసేవానిగా పంపాము."

*(అల్ ఫత్‌హ్ : 8)*

## ప్రవక్త బాధ్యత ఎంత వరకు?

దైవసందేశాన్ని స్పష్టంగా దైవదాసుల వరకు చేరవేయటం మాత్రమే ప్రవక్త బాధ్యత. ఆయన ఒక మాధ్యమం. దైవదూత ద్వారా తనకు అందిన దైవ సందేశాన్ని ఆయన దైవదాసులందరికీ అందజేస్తాడు. "ప్రవక్తా! నా ఆజ్ఞను చేరవేయటం వరకే నీ పని. అంగీకరించని వారిని అంగీకరించేలా చేయటం నీ పని కాదు" అన్న విషయాన్ని అల్లాహ్ కూడా తన గ్రంథం ద్వారా మాటిమాటికీ స్పష్టం చేస్తున్నాడు. మా ప్రవక్త బలవంతంగా తన మాటను దాసులపై రుద్దడు

అన్న సంకేతం కూడా ఇందులో ఇమిడి ఉంది. కాకపోతే అంగీకరించటం, అంగీకరించకపోవటం వల్ల వెలువడే ఫలితాలను గురించి ప్రవక్త ఎరుక పరుస్తాడు. అంగీకరించే వారికి లభించే బహుమానాన్ని, తృణీకరించిన వారికి విధించబడే శిక్షను గురించి తెలియజేస్తాడు. దైవ సందేశహరుడు చెప్పే ఈ మాటను మానవుడు తేలిగ్గా తీసుకోరాదు ...

> "ఆజ్ఞను (సందేశాన్ని) స్పష్టంగా చేరవేయటం వరకే ప్రవక్త బాధ్యత."
> *(అన్ నూర్ – 54)*

## సందేశాన్ని అందజేసిన మీదట దానిని స్వీకరించటం, స్వీకరించక పోవటం యొక్క ఫలితాలను తెలియపరచటం ప్రవక్త పని

తాను అందజేసిన సత్యాన్ని ప్రజలు ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించ వలసిందేనని బలవంతం చేయటం ప్రవక్త పని కాదు. అలా చేయటం వల్ల మనిషికి దేవుడిచ్చిన స్వేచ్ఛ హరించినట్లవుతుంది. సందేశాన్ని యథాతథంగా అందజేసి, తాను స్వయంగా దానికి – ఆపాదమస్తకం – దర్పణంలా నిలువటం ప్రవక్త పని. అంటే స్వీకరించిన వారికి శుభవార్త వినిపించటం, స్వీకరించని వారిని హెచ్చరించటం. ప్రవక్త బాధ్యత ఎంత వరకు ఉంటుందో అల్లాహ్ స్వయంగా తన గ్రంథంలో విశదపరిచాడు –

> "(ప్రవక్తా!) మేము నిన్ను శుభవార్త వినిపించేవానిగా, సావధానపరిచే వానిగా మాత్రమే చేసి పంపాము." *(బనీ ఇస్రాయీల్ – 105)*

దీనినిబట్టి సుబోధకం అయ్యేదేమిటంటే, సందేశ పరిచయ కార్యక్రమాన్ని ప్రేమతో, మృదువుగా, శాంతియుతంగా నెరవేర్చాలి. ప్రజలకు తాము చేసే హితబోధలో దయార్ద్రత, శ్రేయోభిలాష ఉట్టిపడుతూ ఉండాలి. శాంతియుత పద్ధతిని కూడా సహించని వారు కొందరు ఈ మార్గంలో అవరోధాలను సృష్టించి, ప్రజాబాహుళ్యంలో అసహనాన్ని అపసవ్యతను ప్రేరేపిస్తారు. ఇస్లాం కత్తితో వ్యాపించిందని దుష్ప్రచారం చేసి ఇస్లాంపై, ముస్లింలపై బురద జల్లుతారు. వారికొక విషయం తెలియాలి – ఇస్లాం మానవ నైజాన్ని, మనిషి మనస్సాక్షిని అప్పీలు చేస్తుంది. అది వ్యక్తి మనోమస్తిష్కాలను ప్రభావితం చేసి లోపలి నుంచి అతన్ని వంచుతుంది. కరవాలంతో ప్రజల మెడలు వంచటం దాని విధానం కానేకాదు.

## ప్రవక్త సదా మేలు వైపునకే పిలుస్తాడు

మానవుల శ్రేయోసాఫల్యాలు, వారి గౌరవోన్నతులు ఎందులో ఇమిడి ఉన్నాయో దాని వైపునకే ప్రవక్త వారిని పిలుస్తాడు. మానవులను సృష్టించినవాడు కోరేది కూడా ఇదే.

"విశ్వసించిన ప్రజలారా! దైవప్రవక్త మీకు జీవితాన్ని ఇచ్చే విషయం వైపునకు పిలిచినప్పుడు మీరు దైవం మరియు దైవప్రవక్త పిలుపునకు సానుకూలంగా స్పందించండి." *(అల్ అన్‌ఫాల్ – 24)*

## అన్ని కాలాల్లో, అన్ని ప్రదేశాలలో, అన్ని సముదాయాల కొరకు మార్గదర్శకత్వ ఏర్పాటు చేయబడింది

ప్రతి సముదాయంలో ప్రవక్తలు వచ్చినది ఆ ఒక్క సృష్టికర్త తరఫునే. కాబట్టి అందరూ ఒకే సందేశాన్ని తెచ్చారు. అందువల్ల మానవులందరి నైజం ఒక్కటే. అందరి మౌలిక అవసరాలు కూడా ఒక్కటే. అందరి సృష్టికర్త అందరినీ ఒకేవిధంగా చూస్తాడు. అందరినీ సమానంగా ప్రేమిస్తాడు. అందరికీ ఒకే వస్తువును, అత్యుత్తమమైన వస్తువును ఇస్తాడు. ఆయన ప్రేమ, కరుణ, న్యాయశీలం వాంఛించేది కూడా ఇదే.

"నీవు హెచ్చరించేవాడవు మాత్రమే. మేము నిన్ను సత్యంతో పాటు శుభవార్త వినిపించేవానిగా, భయబోధ చేసేవానిగా చేసి పంపాము. భయబోధ చేసేవాడు రాని సముదాయం (ఉమ్మత్) అంటూ ఏదీ లేదు." *(ఫాతిర్ – 23, 24)*

వెనుకటి ప్రవక్తల ద్వారా కూడా సృష్టికర్త మానవాళికి మార్గదర్శకత్వం వహించే ఏర్పాటు చేశాడు. ఈ ఏర్పాటు అన్ని కాలాలలో, అన్ని ప్రాంతాలలో జరిగింది. అల్లాహ్ ఈవిధంగా సెలవిస్తున్నాడు –

"మేము మూసాకు మా సూచనలను ఇచ్చి పంపాము. 'నీ జాతి వారిని అంధకారాల నుండి వెలికితీసి వెలుగు వైపునకు తీసుకు రా. దేవుని (మహోపకారాల) దినాలను వారికి జ్ఞాపకం చెయ్యి' అని అతనికి ఆజ్ఞాపించాము. నిశ్చయంగా వాటిలో సహనమూర్తు లకు, కృతజ్ఞులకు గొప్ప సూచనలున్నాయి."

*(ఇబ్రాహీమ్ – 5)*

దైవప్రవక్తలు సూచనలతో, నిదర్శనాలతో పంపబడతారని పై ఆయత్ ద్వారా తెలుస్తోంది. ప్రవక్తగా చేయబడిన వాని చిహ్నాలు ప్రత్యక్షం (Direct) గా, బహిరంగం (Open) గా కనిపించవు. సభపెట్టి, వేదికను అలంకరించి, ఫలానా వ్యక్తిని అల్లాహ్ ప్రవక్తగా నియమించాడని ప్రకటించడం జరగదు. దానికి బదులు అతడు దైవప్రవక్త అన్న చిహ్నాలు అతని నిజ జీవితంలో కనిపిస్తాయి. అతని ప్రవచనాలతో పాటు అతని ఆచరణ నిత్య జీవితంలో చాటి చెబుతుంటాయి - ఇతను అందరిలాంటి సామాన్య మనిషి కాడనీ, ఇతనొక మహా మనీషి అని. అతని పలుకుల్లో తియ్యదనం జాలువారుతూ ఉంటుంది. అతని హితబోధ ఎంతో సహజంగా, హృదయాంతరాళంలోకి చొచ్చుకుపోయే విధంగా ఉంటుంది. అతని ఉపదేశంలో ఎదుటివారి శ్రేయోభిలాష ఉట్టిపడుతూ ఉంటుంది. అతని క్రియాత్మక జీవితాన్ని చూసినప్పుడు, అది అసాధారణంగా కనిపిస్తుంది. అతని ప్రత్యేక నడవడి అతని ప్రబోధనలకు అద్దం పట్టినట్లుగా ఉంటుంది. ఆయన ప్రబోధనలను విశ్వసించి, వాటి ప్రకారం నడుచుకున్న వారి జీవితాలలో వచ్చిన నైతిక విప్లవం కూడా, ఆయన ఖచ్చితంగా ఒక ప్రవక్తేనన్న దానికి సంకేతంగా ఉంటుంది.

## మార్గబోధన ఆదం సంతతికి అతి ముఖ్య అవసరం. ఆఖరి మనిషి వరకూ అది జరుగుతూ ఉండాలి

భూమండలంపై మానవుని ఉనికి ఉన్నంత వరకూ ఆదం సంతతికి మార్గబోధన అవశ్యమై ఉంటుంది. ఈ మార్గబోధనా ఏర్పాటును సృష్టికర్త ఎంత అద్భుతంగా చేశాడంటే, తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ఆదర్శ జీవితాన్ని, తన అంతిమ గ్రంథం ఖుర్ఆన్‌ను ప్రళయం వరకు వచ్చే మనుషుల కొరకు భద్రపరిచాడు. అందుకే అల్లాహ్ ఒకచోట తన మార్గదర్శకత్వం ఏర్పాటులోని యుక్తిని ప్రస్తావిస్తూ ఇలా అన్నాడు :

> “(ప్రవక్తా!) మేము నిన్ను సమస్త మానవులకు శుభవార్త నిచ్చేవానిగా, హెచ్చరిక చేసేవానిగా పంపాము. కాని చాలామందికి తెలియదు.”
>
> *(సబా – 28)*

మానవునికి మార్గబోధన చేసే, దైవోపదేశాల క్రియాత్మక నమూనానొకదానిని ముందుంచే సహజమైన, స్వీకారయోగ్యమైన పద్ధతి ఏమిటంటే

ఒక మానవ మాత్రునికే మార్గదర్శక సూచనలు (Guide Lines) ఇచ్చి పంపాలి. ఆ నమూనా మనుషులకు స్వీకారయోగ్యం అవడానికి, అదొక తిరుగులేని మార్గబోధనగా ఉండటానికి ఇలా చేయడం అవసరం.

> "(ప్రవక్తా!) మేము నీకు పూర్వం కూడా మానవులనే ప్రవక్తలుగా చేసి పంపాము. మేము వారి వద్దకు 'వహీ' (దివ్యవాణి)ని పంపేవారము. మీకు తెలీకపోతే గ్రంథం కల ప్రజలను అడిగి తెలుసుకోండి మేము ఆ ప్రవక్తలకు అన్నం తినకపోయినా తట్టుకోగలిగే శరీరాలను ఇవ్వలేదు. వారు (ఈ లోకంలో) శాశ్వతంగా బ్రతికి ఉండేవారు కూడా కారు." *(అల్ అంబియా – 7,8)*

ఒక వ్యక్తి తనను దైవ సందేశహరుణ్ణి అని ఘంటాపథంగా చెబుతూ, తాను సమర్పించిన గ్రంథం దైవగ్రంథం అని ఎలుగెత్తి చాటినప్పుడు, అతని ఈ దావాను తేలిగ్గా (Lightly) తీసుకోవటం భావ్యం కాదు. ఎందుకంటే, అతను నిజంగా విశ్వ ప్రభువు తరఫున నియుక్తుడయిన ప్రవక్త అయివుంటే, అతని మాట వినటం సాఫల్యానికి సోపానమవుతుంది. వినకపోవటం వైఫల్యానికి కారణమవుతుంది. తన 'వాదన'కు నిదర్శనంగా అతను తన జీవితాన్ని తెరచి ఉంచుతున్నాడు. అతని క్రియాత్మక జీవితం అతను అందజేసిన గ్రంథానికి దర్పణంగా ఉంది. అందుకే ఆ గ్రంథాన్ని చదివి, దానిపై యోచన చేయమని ప్రభువు పిలుపు ఇస్తున్నాడు :

> "ఏమిటి, వారు ఖుర్ఆన్‌పై చింతన చేయరా? ఒకవేళ ఇది అల్లాహ్ వద్ద నుండి గాక వేరొకరి తరఫున వచ్చి ఉంటే ఇందులో తీవ్రమయిన విభేదం (వైరుధ్యం) కానవచ్చేది." *(అన్ నిసా – 82)*

నూటికి నూరుశాతం మార్గబోధన ప్రాప్తించటం అనేది విశ్వప్రభువు పంపిన సందేశహరుణ్ణి గుర్తించి, అంగీకరించి, అతనికి విధేయత చూపటంలోనే ఉంది. ఎలాంటి దురభిమానానికి తావీయకుండా పరిశోధించినప్పుడే ఆ ప్రవక్త మార్గం సులభంగా లభిస్తుంది.

## ప్రవక్త (స) విశిష్టత – ఆయన అంతిమ సందేశహరుడు

ప్రవక్తల పరంపర పరిసమాప్తం గావించబడింది. ముహమ్మద్ (సఅసం) చిట్టచివరి ప్రవక్త. ఇప్పుడు మనం ఆయన అందజేసిన సందేశాన్ని

స్వీకరించి, దానికనుగుణంగా ఆచరించాలి. ఇప్పుడు మన ముందున్న సాఫల్య మార్గం ఇదొక్కటే. అల్లాహ్ తన గ్రంథం యొక్క ఆఖరి ఎడిషన్ ఖుర్ఆన్‌లో ఇలా ప్రకటించాడు –

> "(ప్రజలారా!) ముహమ్మద్ మీ పురుషులలో ఎవరికీ తండ్రి కాదు. కాని అతను దైవ సందేశహరుడు, ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసే చిట్టచివరివాడు. అల్లాహ్‌కు ప్రతి దానిని గురించి బాగా తెలుసు" (అల్ అహ్‌జాబ్ – 40).

ముహమ్మద్ (సఅసం) చిట్టచివరి ప్రవక్త అవటం వల్ల ఈ లోకం ఉన్నంత వరకూ మానవాళి కొరకు ఆయనే (స) మార్గదర్శకులు, అనుసరించ దగినవారు. ప్రవక్తను పంపినవాడు స్వయంగా ఖుర్ఆన్‌లో ఈ మేరకు ప్రకటించాడు –

> "ఇంకా వారితో వచ్చిచేరిన ఇతరుల (మార్గబోధన) కొరకు కూడా (అల్లాహ్ ఆ ప్రవక్తను ప్రభవింపజేశాడు). ఆయన గొప్ప శక్తిశాలి, వివేచనాశీలి." *(అల్ జుముఅహ్ – 3)*

**అయిదవ అధ్యాయం :**

**(Chapter - V)**

# విశ్వసార్వభౌముడే నిజ ఆరాధ్యదైవం ... ఒక చూపులో!

- పరిచయ వాక్యాలు
- సృష్టికర్త పేరు 'అల్లాహ్'
- నిజ ఆరాధ్యదైవం ప్రత్యేకతలు
- ఆరాధ్యుడు అవడానికి కావలసిన ఆరు ప్రాథమిక ప్రత్యేకతలు
- ఆరాధనకు అర్హుడు కావడానికి ఆయన ఈ విశ్వాన్ని, మానవుణ్ణి సృష్టించినవాడై ఉండాలి
- ఆరాధించదగినవాడు నిత్య సజీవుడై, సకల చరాచర సృష్టికి మూలాధారం అయి ఉండాలి
- ఆరాధ్యుడు అవడానికి కావలసిన ఒక ప్రత్యేక అర్హత
- ఆరాధ్య దైవం సర్వోన్నత అధికారి అయి ఉంటాడు. ఇది ఆయన నాల్గవ గుణం
- సార్వభౌమాధికారం కలవాడే పూజింపదగినవాడు
- ఆరాధ్యదైవం యొక్క సంపూర్ణ శక్తి
- అల్లాహ్‌యే అందరికీ అధిపతి
- శాసనం శక్తితో, కారుణ్యంతో నిండివుంది
- జీవితానికి మార్గదర్శకత్వం వహించగలవాడే నిజ ఆరాధ్య దైవం
- అల్లాహ్ మరియు ఆయన సృష్టి పరిచయం
- సృష్టి కూడా ఆయనదే, రాజ్యాధికారం కూడా ఆయనదే
- దేవుని ఏకత్వం
- దేవుని ఏకత్వం : సర్వకాల సర్వావస్థల్లో మానవుని ఆరాధ్య దైవం ఒక్కడే

- విశ్వ సృష్టికర్త పరిచయం
- ఏకేశ్వరోపాసన – బహుదైవారాధన
- మార్గదర్శకత్వం వహించటం, సన్మార్గభాగ్యం ప్రసాదించటం ఆరాధ్య దైవంలోని అతి ముఖ్యగుణం
- బలహీన కాల్పనిక దైవాలకు ఎదురుగా నిజ ఆరాధ్య దైవం
- ఆరాధ్య దైవం అవడానికి కావలసిన ముఖ్యమయిన లక్షణాలు
- మానవ నైజం – అంతరాత్మ ప్రబోధం
- ప్రభువు
- కాల్పనిక దైవాల అశక్తత
- నిజ ఆరాధ్య దైవం బలహీనతలకు, దౌర్బల్యాలకు అతీతుడై ఉంటాడు
- పుట్టించినవాడే తన సృష్టితాలకు ఆరాధ్యుడు కాగలడు
- పాలకుడు, పోషకుడు, నిజ యజమాని మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు
- జగతికి సామ్రాట్టు అయినవాడే నిజ ఆరాధ్య దైవం
- ఎవరి జ్ఞానం అన్నింటినీ ఆవరించి ఉందో ఆయనే విధేయతకు అర్హుడు
- అల్లాహ్ విలక్షణ ప్రత్యేకతలు
- జీవన్మరణాలు కేవలం అల్లాహ్ అధీనంలో ఉన్నాయి
- దాసునికి సమీపంలో ఉండటం, అతని సంకల్పం ఎరిగినవాడై ఉండటం
- మానవ సృష్టి
- ఆరాధ్య గుణాల ద్వారా అల్లాహ్ పరిచయం
- క్షమ, కరుణ వంటి గుణాల ద్వారా దాసుల పట్ల ప్రేమ
- ఆరాధ్యుడు కాగలగటానికి కావలసిన లక్షణాలు
- ఇది సృష్టికర్త గ్రంథం
- సమస్త సృష్టిచే కొనియాడబడేవాడే నిజ ఆరాధ్య దైవం
- సృష్టికర్తకు సహవర్తుల్ని ఎంచడం శోభాయమానమా?
- పరస్పర విరుద్ధ వాస్తవాలు
- ఊహాకల్పిత దైవాలను ఆరాధించటం మానవుని విచిత్ర చేష్ట!
- నిజ ఆరాధ్య దైవాన్ని ఆయన గుణగణాల ద్వారా తెలుసుకోవటం
- షిర్క్ మహా ఘోరమయిన అన్యాయం

# విశ్వ సార్వభౌముడే నిజ ఆరాధ్య దైవం

**పరిచయ వాక్యాలు :**

## సృష్టికర్త పేరు 'అల్లాహ్‌'

తన పేరు 'అల్లాహ్‌' అని సృష్టికర్త తన గ్రంథం ఖుర్‌ఆన్‌లో పేర్కొన్నాడు. దివ్య ఖుర్‌ఆన్‌లోని అనేక ఆయత్‌లలో మనం ఈ పేరును గమనించాము. రాబోయే ఆయత్‌లలో కూడా ఈ పేరు వస్తుంది. కాబట్టి ఆయన్ని, ఆయన పేర్కొన్న ఆ పేరుతోనే పిలవాలి. ప్రజలు తమ పక్షాన పెట్టుకున్న పేర్లతో ఆయన్ని స్మరించకూడదు. ఇలా చేయటం తప్పు మాత్రమే కాదు, అనైతికమైన చేష్ట అవుతుంది. మనల్ని ఎవరయినా మన పేరుతో కాకుండా మనం ఇష్టపడని మారుపేర్లతో పిలిస్తే దానిని మనం సహించలేము కదా. అదీగాక మనల్ని ఎవరయినా మారుపేర్లతో పిలిచినప్పుడు మనం వారివైపు తిరిగి చూడము కదా!

అలాగే 'అల్లాహ్‌' పేరుగల సృష్టికర్త, ఆరాధ్య దైవం దృష్టిని మన వైపునకు మరల్చుకోవడానికి మనం 'అల్లాహ్‌' అనే పిలువాలి. ఆయన పేర్కొన్న పేరుతో ఆయన్ని మొరపెట్టుకున్నప్పుడే ఆయన తన పూర్తి అస్థిత్వంతో, శక్తితో మన గోడు వింటాడు. దయతో మన వైపునకు మరలుతాడు. సృష్టికర్తే ఆరాధ్య దైవం గనక, సృష్టికర్త పేరు 'అల్లాహ్‌' గనక మనం మన నిజ ఆరాధ్యదైవాన్ని 'అల్లాహ్‌' అనే పిలువాలి.

నిజ ఆరాధ్య దైవం పేరును ఖుర్‌ఆన్‌ ఇలా పేర్కొంటోంది –

"(ప్రజలారా!) మీ ఆరాధ్య దైవమైతే అల్లాహ్‌యే. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన జ్ఞానం అన్నింటినీ పరివేష్టించి ఉంది."

*(తాహా – 98)*

మరోచోట ఈ విధంగా అనబడింది :

"ఆయనే అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన నిగూఢమైన, బహిర్గతమయిన విషయాలన్నింటినీ ఎరిగిన వాడు. ఆయన అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు."

*(అల్ హష్ర్ - 22)*

## నిజ ఆరాధ్య దైవం ప్రత్యేకతలు

మనం అన్వేషిస్తున్న 'నిజ ఆరాధ్య దైవం' ప్రత్యేకతలు ఖుర్ఆన్ అనబడే గ్రంథంలో మనకు లభిస్తాయి. అది సృష్టికర్త యొక్క గ్రంథం అని ఖుర్ఆన్ ప్రకటిస్తోంది. రెండవ అధ్యాయంలో మనం దీని ధ్రువీకరణ గురించి సంతృప్తికరంగా చర్చించాము.

నా వెనుకటి పుస్తకం 'మనిషీ! నీ సృష్టికర్తను తెలుసుకో'లో ఆరాధ్య దైవం గురించి ఏ ప్రమాణ నికషం (Criteria)పై మనం చింతన చేసి సహేతుక మైన ఆధారాలతో సంతృప్తికరంగా ఒక నిర్ధారణకు వచ్చామో అది ఖుర్ఆన్‌లో ఉంది. ఇంకా చెప్పాలంటే అది తర్కం (Reasoning)తో సహా ఉంది.

వెనుకటి పుస్తకం 'మనిషీ! నీ సృష్టికర్తను తెలుసుకో'లో నిజ ఆరాధ్య దైవానికి సంబంధించి మీ ముందుంచబడిన ప్రత్యేకతలు జ్ఞాపకార్థం ఈ పుస్తకంలోని మొదటి అధ్యాయంలో కూడా పునరుక్తం చేశాము.

మానవుల సృష్టికర్త, ఆరాధ్య దైవం తన గ్రంథం ఖుర్ఆన్‌లో తన స్వీయ పరిచయం చేసుకున్నాడు. ఆ పరిచయం ఎంత మనోహరంగా, మరెంత సులభగ్రాహ్యంగా ఉందో మీరే చూడండి.

**ఆరాధ్య దైవం అవడానికి ఆరు ప్రాథమిక ప్రత్యేకతలు** (Prime Criteria)

ఈ ఆరు గుణాలలో మరెన్నో గుణాలు కూడా అంతర్లీనమై ఉన్నాయి.

## (1) ఆరాధ్య యోగ్యుడవడానికి ఆయన ఈ జగతిని, మానవులను పుట్టించినవాడై ఉండాలి

ఆరాధ్య దైవం కాగలగడానికి కావలసిన మొట్టమొదటి ప్రత్యేకత ఏమిటంటే ఆయన ఈ జగతికి కర్త అయి ఉండాలి. మానవుల సృష్టికర్త అయి

ఉండాలి. పుట్టించినవాడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు. ఖుర్ఆన్ ఇలా అంటోంది –

"ఆయనే మీ మాతృగర్భాశయాలలో మీ రూపురేఖలను తాను కోరినవిధంగా రూపొందిస్తాడు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. ఆయన మహాశక్తిమంతుడు, వివేకవంతుడు."

*(ఆలి ఇమ్రాన్ – 6)*

అంటే, ఏమీలేని మనకు ఉనికిని ప్రసాదించినవాడే ఆరాధనకు, దాస్యానికి తగినవాడు. సాష్టాంగ ప్రణామానికి ఆయనే అర్హుడు. సృష్టి ప్రక్రియ గురించి ఖుర్ఆన్ ఇలా అంటోంది –

(ప్రవక్తా!) వారిని అడుగు : "అల్లాహ్‌ను కాదని మీరు మొరపెట్టుకునే వాటిని గురించి ఎన్నడయినా ఆలోచించారా? వారు భువిలో చేసిందేమిటో నాకు చూపండి. పోనీ గగన సీమల్లో వారికేదన్నా భాగస్వామ్యం ఉందా? మీరు చెప్పేదే నిజమైతే, దీనికి పూర్వం ఉన్న ఏదయినా గ్రంథంగానీ, చెలామణిలో ఉన్న ఏదయినా జ్ఞానవిశేషం గానీ నా వద్దకు తీసుకురండి". అల్లాహ్‌ను వదలి ప్రళయదినం వరకూ తన పిలుపునకు సమాధానం ఇవ్వలేని వారిని ప్రార్థించేవానికంటే ఎక్కువ మార్గభ్రష్టుడు ఎవడుంటాడు? తమను మొరపెట్టుకున్న సంగతి కూడా (కనీసం) వారికి తెలిసి ఉండదు. జనులు సమావేశపరచబడినప్పుడు, వారు వారికి శత్రువులైపోతారు. తమను ఆరాధించిన విషయాన్ని వారు నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చు తారు." *(అల్ అహ్‌ఖాఫ్ : 4 – 6)*

ఆరాధ్య దైవం అవడానికి కావలసిన అతి ముఖ్యమయిన గుణం 'సృష్టించటం'. మరయితే ఈ గుణం ఒక్క అల్లాహ్‌కు తప్ప జనులు కల్పించుకున్న కాల్పనిక దేవుళ్ళలో ఉందా? ఏమీ చేయలేని నిస్సహాయులు దేవుళ్ళు ఎలా కాగలగుతారని ఖుర్ఆన్ ప్రశ్నిస్తోంది –

"అయినప్పటికీ జనులు నిజదైవాన్ని వదలి, దేనినీ సృష్టించలేని వారిని, స్వయంగా సృష్టించబడిన వారిని తమ ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. వారు తమ స్వయానికి కూడా ఏదయినా లాభంగానీ, నష్టంగానీ చేకూర్చుకునే అధికారం కలిగిలేరు. ఒకరి జీవన్మరణాలను శాసించే అధికారంగానీ, మరణానంతరం తిరిగి బ్రతికించే అధికారంగానీ వారికి లేదు." *(అల్ ఫుర్ఖాన్–3)*

### పుట్టించబడినదేదీ ఆరాధ్య దైవం కాజాలదు

మొరలను ఆలకించేవాడు, లాభనష్టాలు కలిగించే శక్తి లేనివాడు పూజనీయుడు ఎలా అవుతాడు? పుట్టించేవాడు, పోషించేవాడు, ఆధ్యాత్మికంగా మార్గదర్శకత్వం వహించేవాడు, (మార్గదర్శకత్వం ఆరాధ్య దైవం యొక్క ఒక ముఖ్య గుణం. అది మానవునికి అత్యంత అవసరం) పోషించేవాడు, ఆయురారోగ్యాలు ప్రసాదించేవాడు, పాపాలను క్షమించేవాడు మాత్రమే ఆరాధ్య దైవం కావాలి.

ఖుర్‌ఆన్ ఎంతో వివేచనా భరితమయిన రీతిలో ఈ యదార్ధాన్ని స్పష్టం చేస్తోంది –

> "వారికి ఇబ్రాహీమ్ వృత్తాంతాన్ని కూడా వినిపించు. అతను తన తండ్రిని, తన జాతి వారిని ఉద్దేశించి, "మీరు పూజించేది వేటిని?" అని అడిగినప్పుడు, 'మేము విగ్రహాలను పూజిస్తున్నాము. మేము వాటి సేవకే కట్టుబడి ఉన్నాము' అని వారు చెప్పారు. ఇబ్రాహీమ్ ఇలా అడిగాడు : "ఏమిటీ, మీరు వాటిని పిలిచినప్పుడు అవి మీ పిలుపును వింటాయా? పోనీ, అవి మీకు లాభం గానీ, నష్టం గానీ కలిగిస్తాయా?" వారిలా అన్నారు : 'అదేమోగాని మా తాత ముత్తాతలను ఈ విధంగా చేయటం మేము చూశాము'. ఇబ్రాహీమ్ ఇలా అడిగాడు, "కనీసం మీరు పూజిస్తున్న వాటినయినా చూశారా? మీరయినా, మా తాతముత్తాతలయినా? ఒక్క సకల లోకాల ప్రభువు తప్ప ఇవన్నీ నా శత్రువులే. ఆయనే నన్ను సృష్టించినవాడు, మరి ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తున్నాడు, త్రాగిస్తున్నాడు. నాకు జబ్బు చేసినప్పుడు ఆయనే నాకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాడు. ఆయనే నన్ను చంపుతాడు. తిరిగి నన్ను బ్రతికిస్తాడు. ప్రతిఫలం లభించే దినాన ఆయన నా తప్పులను క్షమిస్తాడని నేను ఆశిస్తున్నాను." *(అష్ షుఅరా : 69–82)*

## పూజలందుకునేవాడు అజరుడు, సృష్టికి మూలాధారం అయి ఉండాలి

స్వతహాగా సజీవుడై ఉన్నవాడు, ఆదిమధ్యాంత రహితుడే ఆరాధ్య దైవం కాగలడు. అంటే ఏమీ లేనప్పుడు కూడా ఆయన ఉన్నాడు. ఏమీ లేకుండా

పోయినపుడు కూడా ఆయన ఉంటాడు. అల్లాహ్‌కు అంతం అంటూ లేదు. ఆయన జీవన ఆయన స్వయానిది. ఒకరు దానం చేసినది కాదు. ఆయనకు ఆది అన్నదే లేదు. అంతం అన్నది కూడా లేదు. ఇది మానవ ఊహకు అందని విషయం (It is beyond the stretch of human). ఆయన పుట్టలేదు, పుట్టించబడలేదు. ఆయన జీవితం పరిమితం అనడానికి ఆయనకు మరణం అనేది ఉంటే కదా! పైగా ఆయన జీవితం అపరిమితం, అనంతం. ఎందుకంటే ఆయనకు మరణం అన్నదే లేదు. ఆయన తనంతటి తాను నెలకొని ఉన్నాడు. అందువల్ల ఆయన అజరుడు, నిత్య సజీవుడు. అంటే ఈ జగతి లేనప్పుడు కూడా ఆయన ఉన్నాడు. ఈ జగతి ఉన్నప్పుడు కూడా ఆయన ఉన్నాడు. ఈ జగతి నశించినప్పుడు కూడా ఆయన ఉంటాడు.

తొలినాటి నుండే జీవనం కలిగి ఉన్నవాడే ఇతర జీవాలకు ఉనికిని ప్రసాదించగలడు. ఆయన ఆ జీవానికి మనుగడ ఇచ్చినంత వరకే ఆ జీవం ఉండగలుగుతుంది. అందుచేత ఇతరులకు జీవన దానం చేసేవాడే నిత్య సజీవుడు (అల్ హయ్యు), మూలాధారం (అల్ ఖయ్యూం) అనబడతాడు. ఆయనే అల్లాహ్ – ఈ జగతిని, మనిషిని సృష్టించినవాడు.

ఈ యదార్థాన్ని ఖుర్ఆన్ ఇలా అంటోంది –

> "అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. ఆయన సజీవుడు, అజరుడు, అందరికీ మూలాధారం." *(అల్ బఖరా–255)*

కాబట్టి –

ఆది నుంచీ సజీవుడుగా ఉన్నవాడు, ఎప్పటికీ సజీవంగా ఉండేవాడు, ఇతరులకు జీవనం ఇచ్చేవాడు, తాను కోరినంత కాలం ఆ జీవితాన్ని స్థిరంగా ఉండనిచ్చేవాడు ఆయనే ఆరాధ్య దైవం. తన సృష్టితాలకు జీవనదానం చేసిన సృష్టికర్తే ఆరాధ్య దైవం కాగలడు. ఆరాధనలు, ఉపాసనలందుకోవటం ఆయన ప్రాథమిక హక్కు అవుతుంది. పుట్టించడంలో భాగస్వామ్యం లేని వారు ఆరాధ్యులు ఎలా కాగలుగుతారు?

ఒకరు జీవన దానం చేయగా బ్రతికి ఉన్నవారు పూజనీయులు ఎలా అవుతారు? చూడబోతే వారు అశక్తులు, నిస్సహాయులు, బలహీనులు, వేరొకరిపై ఆధారపడినవారు, తమ స్వయానికి గానీ, ఇతరులకు గానీ సహాయం చేయలేనివారు, ఆత్మరక్షణ చేసుకోలేనివారు, ఇతరులను కాపాడలేనివారు –

ఇలాంటివారు ఆరాధ్య దైవం కాగలరా? స్వతహాగా సజీవుడు, శాశ్వతంగా స్థిరంగా ఉండేవాడే సిసలైన ఆరాధ్య దైవం. ఆ ఆరాధ్య దైవం అల్లాహ్ మాత్రమే.

సృష్టితాల జీవితం అల్లాహ్‌చే ప్రసాదించబడినది. దానికి ఒక నిర్ణీత కాలపరిమితి ఉంది. మరణం దాని అంతం, ఆరంభం కూడా. అలాంటప్పుడు వారు ఆరాధ్య దైవం ఎలా అవుతారు?

ఆది నుంచీ స్థిరంగా ఉన్నవాడు, జీవితాన్ని మిగిల్చి ఉంచేవాడు, రక్షకుడు, మహోపకారి – అలాంటి వానితో సృష్టితాల సంబంధం ప్రగాఢంగా ఉంటుంది. తత్ఫలితంగా పుట్టించబడినవాడు ఆయన్ని వేడుకుంటాడు, తన అక్కరలేమిటో విన్నవించుకుంటాడు. సహాయం కొరకు ఆయన్ని అర్థిస్తాడు, తన మహోపకారి ఆదేశాన్ని శిరసావహిస్తాడు. ఆయనకు విధేయత చూపుతాడు. అల్లాహ్ సకల చరాచర సృష్టికి మూలాధారం కాబట్టి ఆయనే ఆరాధ్య దైవం.

ఆయనే వస్తువులను, జీవనాన్ని స్థిరంగా నిలిపి ఉంచగలడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకు కూడా పట్టదు. అనుక్షణం తన దాసుల స్థితిగతులను ఎరిగినవాడు, వారి వ్యవహారాల పట్ల ఆసక్తి గలవాడు, వారి గోడును వినేవాడు – ఆయనే ఆరాధనలు అందుకోగలడు. స్వయంగా తన జీవితాన్ని నిలిపి ఉంచుకోగలిగేవాడే, తాను ప్రసాదించిన జీవితాన్ని కూడా నిలిపి ఉంచగలడు. అందువల్ల తాను ఇచ్చిన జీవితానికి (జీవికి) ఆయనే పూజ్యుడు కాగలడు. జీవితాన్ని ప్రసాదించేవాడు, దానిని నిలిపి ఉంచేవాడు అల్లాహ్‌యే గనక ఆయనే ఆరాధ్య దైవం అయ్యాడు. ఎవరి వద్దనైతే వారిదంటూ అసలు (Original) జీవితం లేదో, తమను తాము నిలిపి ఉంచుకోలేరో, ఇతరులను నిలబెట్టలేరో, అలాంటివారు ఆరాధించదగిన వారు ఎలా అవుతారు? అసలు (Original) జీవితం అల్లాహ్‌దే. ఆయన తన జీవితాన్ని తన శక్తితో నిలిపి ఉంచాడు. కాబట్టి ఆయనే సజీవుడు, నిజ ఆరాధ్య దైవం. దీనినిబట్టి తెలిసిందేమిటంటే పుట్టించినవాడే ఆరాధ్య దైవం కాగలడు గాని పుట్టించబడిన వారు కాదు.

## గమనార్హ విషయం

మానవుడు తన పరిమిత జ్ఞానం, అనుభవాలు, భావాలు, భావనలతో, తన పరిమిత అవగాహనా పరిధిలో ఆలోచించినపుడు ఆశ్చర్య చకితుడవుతాడు. ఈ ఆశ్చర్యకర స్థితిలో అతను అల్లాహ్‌ను తిరస్కరిస్తాడు – ఆయన స్వయంగా

ఎలా ఉనికిలోకి వచ్చాడు? అన్నది అతని ఆశ్చర్యానికి కారణం. అతని ఆశ్చర్యానికి, తిరస్కారానికి ప్రధాన కారణం ఏమిటంటే, అతను సృష్టికర్తను సృష్టితాల స్థానంలో ఉంచి ఆలోచిస్తాడు. అల్లాహ్ (సృష్టికర్త) అపార శక్తిసామర్థ్యాలను, జ్ఞానాన్ని, వివేచనను తన బలహీన తెలివితేటలతో ఊహిస్తాడు. పిదప బుద్ధికి అందని ఒక బలహీన ఆధారంతో ఒక నిర్ధారణకు వస్తాడు – ఈ జగతి, ఇందలి ప్రతి వస్తువు, ప్రతి ప్రాణి దానంతట అదే ఉనికిలోనికి వచ్చిందని తేల్చి చెప్పేస్తాడు.

సృష్టికర్తను తిరస్కరించినది గాక, అలా తిరస్కరించటంలో తాను తన బుద్ధి వివేకాలను సరిగ్గా ఉపయోగించుకున్నానని అనుకుంటాడు. ఆ తరువాత ఎన్నో సమాధానాలకు గాను నేచర్ (Nature) అనే పదాన్ని ఆశ్రయించి సంజాయిషీ (Explanation) ఇచ్చే ప్రయత్నం చేస్తాడు. నేచర్ (Nature) అనే పదం ఒక ఊహ, మనసుకు సర్ది చెప్పుకునే ప్రయత్నం తప్ప మరేమీ కాదు. అది తన అశక్తతను వెల్లడించేందుకు ఆసరా. Nature అనే పద ప్రయోగం వల్ల నిర్జీవమైన వస్తువు భావన జనిస్తుంది. కాగా; జ్ఞానం, సంకల్పం, శక్తి, బలం, ప్రణాళిక, దానిని ప్రవేశపెట్టే శక్తి యుక్తి – ఇవన్నీ ఏదేని 'జీవనం' (ప్రాణం)లోనే ఉంటుంది. అంతేకాదు, ఈ లక్షణాలు ఒక బ్రహ్మాండమైన జీవితానికి సాక్షీభూతంగా నిలుస్తాయి. మన సెన్స్ (Sense), అవగాహన చాలా పరిమితం అయినప్పటికీ అల్లాహ్ ప్రసాదించిన బుద్ధివివేకాలను సరిగ్గా ఉపయోగించినప్పుడు ఈ సృష్టికి కర్త ఎవరో, జీవిత లక్ష్యం ఏమిటో ఛేదించడం అసంభవం ఏమీ కాదు.

## (3) ఆరాధ్య దైవం అవడానికి కావలసిన మరో ముఖ్య గుణం

ఆరాధ్య దైవం అవడానికి అవసరమయిన మరో ముఖ్య గుణం ఏమిటంటే, ఆయనకు మరణం అన్నది రాకూడదు. ఆయనకు మరణం, నశ్వరం అన్నది ఉండకూడదు. ఆయన తొలినుంచీ సజీవంగా ఉన్నాడు. ఎప్పటికీ సజీవుడుగానే ఉంటాడు. సమస్త జగతిపై ఆయన ఒక్కడి అధికారమే నడుస్తుంది. ఈ విశిష్ట గుణం గురించి ఖుర్‌ఆన్ ఏమంటుందో చూడండి –

> "మరణమన్నదే లేని నిత్య సజీవుడు అయిన అల్లాహ్‌పైనే భారం మోపు. స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడు. తన దాసుల

పాపాలను తెలుసుకుంటూ ఉండటానికి ఆయన ఒక్కడే చాలు. ఆయనే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యన ఉన్న వాటన్నింటినీ ఆరు దినాలలో సృష్టించాడు. తరువాత ఆయన పాలనా పీఠం (అర్ష్)పై స్థిరపడ్డాడు. అపార కరుణామయుడు. ఆయన వైభవం (ఘనత్వం) గురించి తెలిసిన వారినెవరినయినా అడుగు."

*(అల్ ఫుర్ఖాన్ – 58,59)*

అల్లాహ్ సజీవంగా ఉన్నాడు. అంటే జీవితానికి సంబంధించిన సమస్త మేళ్ళతో వెలుగొందుతున్నాడు. ఆ మేళ్ళు అత్యంత పరిపూర్ణంగా ఉన్నాయి. అవి ఎన్నటికీ తరగనివి.

నిజ ఆరాధ్య దైవం ఎవరు కాగలరు? ఎవరు కాలేరు? ఎందుకు కాలేరు? అన్న ప్రశ్నలకు ఖుర్ఆన్ ఇచ్చే సమాధానం యిది –

"అల్లాహ్‌ను కాదని జనులు వేటిని మొరపెట్టుకుంటున్నారో అవి ఏ వస్తువునూ సృష్టించలేవు. పైగా అవి స్వయంగా సృష్టించబడినవి. అవి నిర్జీవమైనవి. వాటిలో ప్రాణం లేదు. వాటిని ఎప్పుడు తిరిగి లేపటం జరుగుతుందో స్వయంగా వాటికే తెలియదు. మీ దేవుడు ఒకే దేవుడు. కాని పరలోకాన్ని విశ్వసించని హృదయాలు దీనిని తిరస్కరిస్తున్నాయి. వారు గర్వాన్ని ప్రదర్శిస్తున్నారు."

*(అన్ నహ్ల్ : 20 – 22)*

బోధపడిన దేమిటంటే అల్లాహ్ మినహా మిగిలినవన్నీ – అవి ప్రాణమున్నవైనా, ప్రాణం లేనివైనా – సృష్టించబడినవే. సృష్టితాలను ఆరాధించటం తగదు. పుట్టించబడినవేవీ ఆరాధ్య దైవం కాలేవు. అవి బలహీనమైనవి, నశించేవి. బలహీనమైనవి, నశించేవీ ఆరాధనకు తగినవి కావు.

## (4) ఆరాధ్య దైవం సర్వోన్నత అధికారి అయి ఉంటాడు

తన చర్యలకు గాను ఎవరికీ జవాబుదారు కానివాడే సృష్టికర్త, పాలకుడు, యజమాని, ఆరాధ్య దైవం కాగలడు. పైగా ఇతరులందరూ ఆయన సమక్షంలో జవాబుదారులై ఉండాలి. బలహీనుడు, తప్పులు చేసేవాడే జవాబు ఇచ్చుకుంటాడు. అధికార దుర్వినియోగం చేసేవాడు, అన్యాయానికి ఒడిగట్టేవాడు, ఇతరుల హక్కును కొల్లగొట్టేవాడు మాత్రమే సంజాయిషీ

ఇచ్చుకోవలసి ఉంటుంది. కాగా, సృష్టికర్త ఈ లోపాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు. తిరుగులేని అధికారి.

పైన ప్రస్తావించబడిన గుణం ఆరాధ్య దైవం యొక్క ప్రత్యేక గుణం. దానిని గురించి ఖుర్‌ఆన్ ఇలా అంటోంది –

> "ఒకవేళ భూమ్యాకాశాలలో అల్లాహ్ గాక వేరితర దేవుళ్ళు కూడా ఉండి ఉంటే ఈ రెండింటిలో అరాచకం ఏర్పడేది. కనుక సింహాసనానికి (అర్ష్‌కు) అధిపతి అయిన అల్లాహ్ వారు కల్పించే భాగస్వామ్య (షిర్క్) విషయాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు. ఆయన తాను చేసే పనులకు (ఎవరికీ) జవాబుదారు కాడు. అయితే అందరూ (ఆయన సమక్షంలో) జవాబుదారులే."
>
> *(అల్ అంబియా – 22, 23)*

ఆరాధ్య దైవం సర్వోన్నత (Supreme) అధికారి అయి ఉంటాడు. ఆయనే అల్లాహ్.

దివ్య ఖుర్‌ఆన్ మరొక చోట ఇలా అంటోంది –

> "అల్లాహ్‌యే ఆజ్ఞలను జారీ చేస్తున్నాడు (ఆయనే పరిపాలనాధీశుడు). ఆయన నిర్ణయాలను పునఃపరిశీలించే వాడెవడూ లేడు. ఆయన చాలా శీఘ్రంగా లెక్క తీసుకునేవాడు కూడా." *(అర్ రాద్ – 41)*

## అధికారం కలవాడే ఆరాధనా హక్కు కలిగి ఉంటాడు

ఆయనే ఆరాధ్య దైవం. ఆయన అధికారం గగన భువనాలలోని ప్రతి వస్తువును పరివేష్టించివుంది. వాటిపై అదుపు సాధించటం, వాటిని పరిరక్షించటం ఆయనకు ఎంతమాత్రం కష్టం కాదు. అలాంటి శక్తిమంతుడు, సర్వోన్నత అధికారి మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆయన పేరే అల్లాహ్.

ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది –

> "ఆయన సామ్రాజ్యపీఠం భూమ్యాకాశాలను పరివేష్టించి ఉంది. వాటి పర్యవేక్షణ ఆయునకు అలుపు రానీయదు. ఆయనే సర్వోన్నతుడు, మహిమాన్వితుడు." *(అల్ బఖరా – 255)*

ఇంతగొప్ప ఏర్పాటు, అనుక్షణం పర్యవేక్షణ వేనవేల సంవత్సరాలుగా చేస్తూ రావటం, అయినా ఎక్కడా ఎప్పుడూ అలసటకు, విరక్తికి తావు ఏర్పడక

పోవటం – ఇదంతా సృష్టికర్త శక్తికి, ఔన్నత్యానికి, ఆయన దైవత్వానికి ప్రబల సాక్షిగా ఉంది. ఆయన అధికారం ప్రాణం ఉన్నవాటిపైన, ప్రాణం లేనివాటిపైన కూడా నడుస్తోంది. ఏ వస్తువు కూడా, ఏ ఒక్క క్షణం కూడా ఆయన అధికార పరిధిని దాటిపోలేదు.

ఇన్ని గొప్ప ఏర్పాట్లు చేసే సామర్థ్యం, ఇంత అద్భుతంగా పరిపాలన చేసే దక్షత వేరొకరిలో లేదు. లేనప్పుడు మరి ఈ సుగుణాలన్నింటికీ అధిపతి అయినవాడే నిజ ఆరాధ్య దైవం కాగలడు – ఆయనే అల్లాహ్.

## (6) ఆరాధ్య దైవం సంపూర్ణ శక్తి

అసాధారణమైన శక్తికి, సామర్థ్యానికి యజమాని అయినవాడే ఆరాధ్య దైవం అవగలడు. అటువంటి శక్తి సంపన్నుడైన అల్లాహ్‌ను ఖుర్‌ఆన్ పరిచయం చేస్తోంది –

> "భూమ్యాకాశాలను ప్రప్రథమంగా సృష్టించినవాడు ఆయనే. ఆయన ఏ పనినైనా చేయాలని సంకల్పించుకున్నప్పుడు, దానిని 'అయిపో' అని అంటాడు. అంతే, అది అయిపోతుంది." *(అల్ బఖరా–117)*

ఆరాధ్య దైవం, ఏదయినా పనిని చేయదలచుకున్నప్పుడు, దాని కొరకు ప్రయాస పడవలసిన అవసరం ఉండదు. ఆయన ఒక్క ఆజ్ఞ చేస్తే చాలు. ఎందుకంటే ఆయనే సృష్టికర్త, సార్వభౌమాధికారి కాబట్టి. ఆయన సంకల్పం, ఆజ్ఞ అవటమే చాలు, ఆ వస్తువు ఉనికిలోకి వచ్చేస్తుంది. నిస్సందేహంగా ఇలాంటి శక్తి కలవాడే సమస్త మానవుల ఆరాధ్య దైవం కాగలడు – ఆ శక్తిమంతుడు ఎవరో కాడు, అల్లాహ్‌యే. అంటే ఆది మానవుని నుండి ఆఖరి మనిషి వరకు – మనుషులందరికీ నిజ ఆరాధ్యదైవం అల్లాహ్‌యే. ఆయనే భూమ్యాకాశాల మధ్యన ఉన్న 'జీవని'ని సృజించాడు. కనుక ఆయనే సేవించదగినవాడు.

## (7) అల్లాహ్‌యే తిరుగులేనివాడు

ఎవరయితే పుట్టించాడో, జీవితానికి కావలసిన వాటన్నింటినీ సమకూరుస్తున్నాడో, ఆ సృష్టికర్త, పరిపాలకుని పేరే అల్లాహ్. అందువల్ల అల్లాహ్‌యే ఆరాధ్య దైవం. ఈ సత్యాన్ని ఖుర్‌ఆన్ ఇలా అభివ్యక్తం చేస్తోంది –

> "ఇలా ఎందుకంటే అల్లాహ్‌యే సత్యం కాబట్టి, అల్లాహ్‌ను వదలి వారు మొరపెట్టుకునేవన్నీ అసత్యం కాబట్టి. నిశ్చయంగా అల్లాహ్‌యే

> సర్వోన్నతుడు, అందరికన్నా గొప్పవాడు. అల్లాహ్ ఆకాశం నుండి నీటిని కురిపించటాన్ని మీరు చూడటం లేదా? తరువాత భూమి సస్యశ్యామలం అయింది. నిశ్చయంగా అల్లాహ్ సూక్ష్మద్రష్ట, సర్వం తెలిసినవాడు. భూమ్యాకాశాలలో ఉన్నదంతా ఆయనదే. నిశ్చయంగా ఆయన నిరపేక్షాపరుడు, స్తుతింపదగినవాడు.” *(అల్ హజ్జ్:62-64)*

## (8) దైవశాసనం ‘కరుణ’తో నిండివుంది

ఎవరి మీదా ఆధారపడనివాడు, నిలువెల్లా స్తవనీయుడు ఆరాధ్య దైవం కావాలి. ఆయన యొక్క ప్రతి గుణం, ప్రతి చర్యా స్తుతించదగినది అయి ఉండాలి.

జగతిలోని ప్రతి వస్తువునూ నియంత్రించడానికి ఆయన వస్తువు కొరకు శాసనాల (Laws) ను ఉంచాడు. ఉదాహరణకు : Newton's Law. వాస్తవానికి అది Newton's Law కాదు, విశ్వప్రభువు నిర్మించిన Law. దానిని Newton కనుగొన్నాడు. ఇది మానవులపై సృష్టికర్తకు గల ప్రేమకు, జాలిగుణానికి ప్రతిరూపం. ఎందుకంటే ఆయన మానవులకు తన జ్ఞానాన్ని వొసగాడు. మనిషి యోచన చేసేటందుకు ఖుర్ఆన్ స్వయంగా ఈ యదార్ధాలను మన ముందుంచింది –

> “భూమిలో ఉన్న వస్తువులన్నింటినీ అల్లాహ్ ఏ విధంగా మీకు ఉపయుక్తంగా చేశాడో మీరు గమనించటం లేదా? ఓడను కూడా! అది కూడా ఆయన ఆదేశానుసారమే సముద్రంలో నడుస్తుంది. ఇంకా ఆయనే నింగిని నేలపై పడిపోకుండా నిలిపి ఉంచాడు. అయితే ఆయన ఆజ్ఞ అయినప్పుడు అది నిలవదు. నిశ్చయంగా అల్లాహ్ జనుల యెడల మృదుస్వభావి, కరుణామయుడు.”
>
> *(అల్ హజ్జ్ – 65)*

ఎవరు జీవన ఏర్పాట్లు చేశాడో, ఎవరు ప్రతి వస్తువు కొరకు దాని నియమనిబంధనలను నిర్ధారించి చట్టాలు చేశాడో, ఎవరి మహోపకారాలను కనుగొని మానవుడు తన జీవితం కొరకు లబ్ది పొందుతున్నాడో – ఆ అల్లాహ్‌యే విధేయతకు, కృతజ్ఞతలకు అర్హుడు. ఆయనే మానవులపైన మన జీవితానికి కట్టుబాట్లను వొసగాడు. శాసనాలను రూపొందించాడు. భౌతికంగానే కాదు, నైతికంగా కూడా. మానవ మనుగడకు నీతీనియమాలు ఎంతో అవసరం.

## (9) జీవితానికి మార్గదర్శకత్వం వహించేవాడే ఆరాధ్యుడు

ప్రకృతి నియమాల పరిజ్ఞానం మనిషికి ఉందా? జగతిలో చెలామణిలో ఉన్న శాసనాల గురించి గానీ, మానవ నైజం గురించి గానీ, దానిలోని మేళ్ళను గురించి గానీ, బలహీనతలను గురించి గానీ, దాని అవసరాలను, ఆకాంక్షలను గురించి గానీ, దాని మనస్తత్వాన్ని గురించి గానీ మనిషికి పూర్తిగా తెలుసా? తెలియనప్పుడు మానవ జీవితానికి సంబంధించిన శాసనాలను నిర్మించే హక్కు అతనికెక్కడ ఉంటుంది? ఆ అధికారం అతనికి ఎలా ఇవ్వబడుతుంది? ఇది మనిషికి సాధ్యమయ్యే విషయమేనా? పూర్తిగా సరైన (Correct), లోపాలకు అతీతమయిన (Perfect) , సమతూకంతో కూడిన, న్యాయబద్ధమయిన చట్టాలను తన జీవితం కొరకు రూపొందించుకునే పరిజ్ఞానం అతనికి ఉందా? దానికొరకు ఉండవలసిన విస్తృత జ్ఞానం అతనికి లేదు. కాబట్టి మనిషిని, జగతిని సృష్టించిన వాడే వాటి సాధ్యాసాధ్యాలను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడే ఈ శాసనాలను రూపొందించగలడు. ఆయన ఈ విశ్వంలోని శాసనాలకు – జీవిత శాసనాలకు మధ్య సమన్వయాన్ని, సారూప్యతని పొందుపరిచాడు. ఆయన మానవ నైజం గురించి, దాని అంతర్బాహ్యాల (Ins & Outs) గురించి బాగా తెలిసినవాడు. ఆయన ఏ మనిషి పట్ల, ఏ మానవ వర్గం పట్ల కూడా పక్షపాతంతో వ్యవహరించడు. ఆయన సంకుచిత (Biased) స్వభావం లేనివాడు. పైగా ఆయన దృష్టిలో అందరూ సమానులే. కనుకనే ఆయన సమత్వం, సమతూకంతో కూడుకున్న, ఉదాత్తమయిన, కారుణ్యప్రదమయిన సామూహిక జీవన సంవిధానాన్ని ఇవ్వగలుగుతాడు. ఒక్కమాటలో చెప్పాలంటే లోపాలు లేనివాడు, సకల సద్గుణ సాగరుడు, శక్తిమంతుడు, మహాజ్ఞాని, వివేచనాశీలి అయినవాడే మానవ జీవితానికి మార్గదర్శకత్వం వహించగలుగుతాడు. మానవ జీవితానికి మేలు చేసే శాసనాలను ఇవ్వగలుగుతాడు. అవి పూర్తిగా సరైనవి, విశ్వసనీయమైనవి, ఆచరణీయమైనవి అన్న విషయంలో సందేశానికి తావు ఉండదు.

అత్యుత్తమయిన జీవితం గడపడానికి అవసరమయిన 'మార్గదర్శకత్వం' దేవుని ఈ గ్రంథం–ఖుర్ఆన్–లో ఉంది. కనుక ఈ గ్రంథం అల్లాహ్‌ది. ఆయన సమస్త లోకాలను, మానవులను పుట్టించినవాడు, పాలకుడు, పోషకుడు, యజమాని. ఆయన పరిజ్ఞానం వస్తువులన్నింటినీ ఆవరించి ఉంది. ఆయన వివేచనా ధురంధరుడు. దిగువనివ్వబడిన ఈ ఒక్క ఆయత్‌లో అల్లాహ్ తన గురించి, తన ఈ గ్రంథం గురించి సమగ్ర పరిచయం చేసేశాడు –

"ఈ గ్రంథం శక్తిశాలి, వివేచనాశీలి అయిన అల్లాహ్ తరఫు నుంచి అవతరింప జేయబడినది." *(అఖ్‌ఖాఫ్ – 2)*

జగతిని సృష్టించినవాడు, సృష్టించిన మీదట సహజంగా తానే తన సృష్టితాలకు యజమాని అవుతాడు. యజమానికి మాత్రమే తన వస్తువులపై అదుపు అజమాయిషీ చేసే అధికారం ఉంటుంది. మరి అలాంటివాడే తన సృష్టితాలకు ఆరాధ్య దైవం కాగలడు. విధేయత చూపదగినవాడు కూడా ఆయనే. అందువల్ల తనచే సృష్టించబడిన వాటిని పరిపాలించేందుకు కావలసిన చట్టాలను చేసే హక్కు కూడా ఆయనకే ఉంటుంది.

సృష్టికర్త తన పేరు 'అల్లాహ్'గా చెప్పుకున్నాడు కాబట్టి అల్లాహ్‌యే సృష్టితాలకు యజమాని, పాలకుడు. ఇంకా ఆయనే ఈ జగతికి సర్వాధికారి, చక్రవర్తి. ఆయనే తన దాసులకు మార్గదర్శకత్వం వహిస్తాడు. వారి జీవిత లక్ష్యం వైపునకు మార్గం సుగమం చేస్తాడు. ఆ విషయాన్ని మానవ నైజంలోనే ఆయన పొందుపరిచాడు. ఉదాహరణకు – తేనెటీగను చూడండి. అది పగలంతా తన జీవిత లక్ష్యసాధనలో నిమగ్నమై ఉంటుంది. అలాగే అల్లాహ్ తన గ్రంథం ఖుర్ఆన్ ద్వారా మనిషికి అతని జీవిత లక్ష్యం వైపునకు మార్గదర్శకత్వం వహించాడు. సాఫల్యవంతమైన జీవితం ఏ విధంగా గడపాలో సూచించాడు. ఆయన తన ప్రత్యేక దాసుడు ముహమ్మద్ (స)పై చాలా ముఖ్యమయిన బాధ్యతా భారం మోపాడు. అంటే ఈ ఖుర్ఆన్ గ్రంథాన్ని విశదీకరించి, దానికి క్రియాత్మక రూపం ఇచ్చే బాధ్యతను ఆయనకు అప్పగించాడు. తిరస్కరించేవారి ఆక్షేపణలను, వ్యతిరేకతను పట్టించుకోకుండా ఆ ప్రవక్త (స) తన కర్తవ్యాన్ని నెరవేరుస్తూ అల్లాహ్‌యే నిజ ఆరాధ్య దైవమని చాటి చెప్పారు.

అల్లాహ్ తన గ్రంథం (ఖుర్ఆన్)లో యదార్థాన్ని ఈ విధంగా వెల్లడించాడు : ఆయనే ఈ జగతికి, జగతిలో ఉన్న వస్తువులన్నింటికీ సృష్టికర్త, యజమాని, అన్నింటిపై ఆయన అధికారమే చెల్లుతుంది. ఆయనే మానవుల మార్గదర్శకత్వం నిమిత్తం తన ప్రవక్త ద్వారా గ్రంథాన్ని పంపిస్తాడు. మానవులు అల్లాహ్ దాస్యం చేయాలన్నదే దీని అసలు ఉద్దేశం.

"తాహా. మేము ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేసినది నీవు కష్టాల్లో పడిపోవాలని కాదు. భయపడేవానికి ఉపదేశంగా మాత్రమే దీనిని మేము (అవతరింపజేశాము). భూమినీ, ఎత్తయిన ఆకాశాలను

సృష్టించినవాని తరఫున ఇది అవతరింపజేయబడినది. ఆ అపార కరుణామయుడు విశ్వ అధికార పీఠం (అర్ష్)పై ఆసీనుడై ఉన్నాడు. ఆకాశాలలో ఉన్నదీ, భూమిలో ఉన్నదీ, ఆ రెండింటి మధ్యన ఉన్నది, భూమి అడుగున ఉన్నది – అంతా ఆయనదే. నీవు నీ మాటను బిగ్గరగా పలికినాసరే, ఆయనైతే మెల్లగా చెప్పినా, అంతకన్నా గుట్టుగా చెప్పినా తెలుసుకుంటాడు. ఆయనే అల్లాహ్! ఆయన తప్ప మరో ఆరాధ్యదైవం లేనేలేదు. అతి సుందరమైన పేర్లన్నీ ఆయనవే."

*(తాహా : 1 – 8)*

## (10) అల్లాహ్ మరియు ఆయన సృష్టి గురించి

సాష్టాంగ ప్రణామం చేయడానికి, విధేయత చూపడానికి తగిన ఆ అస్థిత్వం ఎటువంటిది? దీని గురించి ఖుర్ఆన్ ఇలా అంటోంది –

"మరణమన్నదే లేని నిత్య సజీవుడు, అజరుడు అయిన అల్లాహ్‌పైనే భారం మోపు. స్తోత్రంతో సహా ఆయన పవిత్రతను కొనియాడు. తన దాసుల పాపాలను తెలుసుకుంటూ ఉండటానికి ఆయన ఒక్కడే చాలు. ఆయనే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యన ఉన్న వాటన్నింటినీ ఆరు దినాలలో సృష్టించాడు. తరువాత ఆయన పాలనా పీఠం (అర్ష్)పై స్థిరపడ్డాడు. ఆయన అపార కరుణామయుడు. ఆయన వైభవం గురించి తెలిసిన వారిని అడుగు." *(అల్ ఫుర్ఖాన్–58,59)*

## (11) సృష్టి కూడా ఆయనదే, సార్వభౌమత్వం కూడా ఆయనదే

అల్లాహ్ నిత్యం సజీవంగా ఉంటాడని, ఆయన ఈ విశ్వాన్ని ఆరు దినాలలో సృష్టించి, ఈ జగతిని ఏలుతున్నాడని చెప్పటం జరిగింది. ఆయన సృష్టించిన మీదట అలసిపోయి నిద్రించలేదు. జగతి పరిపాలనా వ్యవస్థ పట్ల, మానవ వ్యవహారాల పట్ల ఆయనకు పూర్తి శ్రద్ధాసక్తులున్నాయి. మనిషి తప్పిదాలను ఆయన క్షమిస్తాడు. అల్లాహ్ తనను కరుణామయునిగా కూడా పరిచయం చేసుకున్నాడు. దయ, జాలి, ప్రేమతో ఆయన ఈ జగతిని ఏలుతున్నాడు. సుగుణాలు, మేళ్ళన్నీ ఆయనలో పూర్తి స్థాయిలో ఉన్నాయి. వాటి పరిపూర్ణత గురించి మానవుడు ఊహించనయినా లేడు.

దైవప్రవక్త తన తరఫున ఏదీ చెప్పడు. తనపైన మోపబడిన సందేశాన్ని చేరవేసే బాధ్యతను అతను పూర్తిగా నెరవేరుస్తాడు. అతను అందరిలాంటి ఒక మానవుడే. మనుషుల వరకూ ప్రభువు సందేశాన్ని చేరవేయడం అతని బాధ్యత. సృష్టికర్త, ఆరాధ్యదైవం ఒకే ఒక్కడని ఆయనకు పంపబడిన వహీ (దైవవాణి)లో స్పష్టం చేయబడింది. దైవవాణి అయిన ఖుర్‌ఆన్ ఇలా అంటోంది –

> (ప్రవక్తా!) వారికి చెప్పు : "నేనూ మీలాంటి మానవమాత్రుణ్ణే. కాకపోతే నా వద్దకు దివ్యవాణి (వహీ) పంపబడుతుంది. మీ ఆరాధ్య దైవం ఒకే ఆరాధ్య దైవం. కనుక తన ప్రభువుతో సమావేశమవ్వాలని ఆశించేవాడు సదాచరణ చేయాలి. తన ప్రభువు దాస్యంలో వేరెవరినీ భాగస్వామిగా చేర్చరాదు." *(అల్ కహ్ఫ్ – 110)*

## (12) దేవుడు ఒక్కడే

సృష్టికర్త, పాలకుడు, రాజ్యాధికారి ఒకరికన్నా ఎక్కువ మంది ఉంటే జగతిలోని వ్యవస్థ అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. ఒకరికన్నా ఎక్కువ మంది దేవుళ్ళు ఉండవచ్చన్న ఆలోచన అసహజమైనది. నిశ్చయంగా ఒక సంస్థ (Institution) కు అధిపతి ఒక్కడే ఉంటాడు.

ఈ యదార్థాన్ని ఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది –

> "ఒకవేళ భూమ్యాకాశాలలో అల్లాహ్ తప్ప వేరితర దేవుళ్ళు ఉండి ఉంటే రెండింటి (భూమి, ఆకాశాల) వ్యవస్థ అంతా అల్లకల్లోలమై పోయేది. కనుక సింహాసనాధిపతి అయిన అల్లాహ్ వారు కల్పించే మాటలకు అతీతుడు, పరిశుద్ధుడు." *(అల్ అంబియా – 22)*

అసలు ఒకరికన్నా ఎక్కువ మంది దేవుళ్ళు ఉంటారన్న ఆలోచనే తప్పు. అది నిర్హేతుకం (Unlogic)

## (13) దేవుని ఏకత్వం – సర్వకాల సర్వావస్థల్లో మానవునికి దేవుడు ఒక్కడే

ఇదే దేవుని ఏకత్వంలోని విశిష్టత – ఏ కాలంలోనయినా, ఏ ప్రాంతం వారికైనా నిజ ఆరాధ్య దైవం ఒక్కడే.

యదార్థం ఎప్పటికీ ఒక్కటే అయి ఉంటుంది. అది సమయాను కూలంగా మారదు. అల్లాహ్ ఏ కాలంలో, ఏ మానవ సముదాయం వైపునకు తన ప్రవక్తలను పంపినా, వారంతా మౌలికంగా చెప్పినమాట ఒక్కటే – మానవులందరి ఆరాధ్య దైవం ఒక్కడేననీ, కనుక ఆయననే ఆరాధించాలని.

> "మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, 'నేను తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. కనుక మీరంతా నన్నే ఆరాధించండి' అనే సందేశాన్ని ఇచ్చి పంపాము." *(అల్ అంబియా – 25)*

తాను తప్ప సాష్టాంగ ప్రణామం చేయదగిన మరో ఆరాధ్య దైవం ఉన్నాడా? లేడా? అన్న విషయం సమస్త జగతిని సృష్టించిన వానికే బాగా తెలుసు. వాస్తవం ఏమిటో సృష్టికర్త తన ప్రత్యేక దాసుని ద్వారా ఇతరులకు ఇలా సావధానపరుస్తున్నాడు. ఇది ఆయన బాధ్యత కూడా. ఈ నేపథ్యంలో ఖుర్ఆన్ ఇలా అంటోంది –

> "నేను తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. కనుక మీరు నాకు భయపడండి" అని ప్రజలను హెచ్చరించటానికి, ఆయనే దూతలకు తన 'వహీ'ని ఇచ్చి, తన ఆదేశానుసారం దానిని తన దాసులలో తాను కోరిన వారిపై అవతరింపజేస్తాడు." *(అన్ నహ్ల్ – 2)*

అల్లాహ్‌కు ముందు వెనుక, అటూ ఇటూ ఎవరూ లేరు. సూరయె ఇఖ్లాస్‌లో కూడా దీని ప్రస్తావన వచ్చింది. ఆయనకు సంతానం లేదు. ఆయన కూడా ఎవరికీ సంతానం కాదు. ఆయనకు భార్య లేదు. ప్రతిదీ ఆయన సొత్తే. అది ప్రాణం ఉన్నదైనా, ప్రాణం లేనిదయినా ప్రతిదీ ఆయన ఆజ్ఞతోనే ఉనికిలోనికి వచ్చింది. కాబట్టి అన్నీ సృష్టించబడినవే. సృష్టించబడినవి సృష్టికర్త సంతానం కాజాలవు. ఇది ఒక అపోహ, భ్రమ మాత్రమే. సృష్టితాలు సృష్టితాలుగానే ఉంటాయి. అవి సంతానం ఎలా అవుతాయి? సంతానం శరీరం నుండి పుడుతుంది. అయితే తనకు భార్యగానీ, పిల్లలు గానీ లేరని అల్లాహ్ నిర్ద్వంద్వంగా చెబుతున్నాడు. తనను పోలినదేదీ లేదని, తన వంటి సుగుణాలు కలవారు కూడా ఎవరూ లేరని కూడా ఆయన స్పష్టంగా చెబుతున్నాడు. ఈ విశ్వంలో ఉన్నదంతా ఏమిటో, దాని స్థాయి స్థానం ఏమిటో, అవి ఎలా ఉనికి లోకి వచ్చాయో కూడా అల్లాహ్ తన గ్రంథంలో స్పష్టంగా చెబుతున్నాడు :

> "అల్లాహ్ ఎవరినో కుమారునిగా చేసుకున్నాడని వారంటున్నారు. ఇలాంటి వాటి నుండి ఆయన పరిశుద్ధుడు. పైగా భూమ్యాకాశాలలో

ఉన్నదంతా ఆయనదే. అన్నీ ఆయన ఆజ్ఞకు బద్ధమై ఉన్నాయి. భూమ్యాకాశాలను ప్రప్రథమంగా సృష్టించినవాడు ఆయనే. ఆయన ఏ పనినయినా చేయ సంకల్పించుకున్నప్పుడు, దానిని 'అయిపో' అని అంటే చాలు, అది అయిపోతుంది." *(అల్ బఖరా–116,117)*

ఆయనే తొలిసారి సృష్టించినవాడు. అంటే ఏమీ లేనప్పుడు ఆయన జగతిని, జీవనాన్ని సృష్టించాడు.

## (14) సృష్టికర్త అల్లాహ్ పరిచయం

దివ్య ఖుర్ఆన్ సృష్టికర్త అల్లాహ్‌ను పరిచయం చేస్తూ, ఆయనకు కుటుంబమంటూ లేదని, ఆయన ఒక్కడేనని అంటోంది. ఆయన సజీవుడు, నిత్యుడు, ఆది మధ్యాంతరహితుడు గనక ఆయనకు సంతానం అక్కర లేదు. ఆయనలో వృద్ధాప్యం తొంగిచూడదు. ఆయనకు జబ్బు చేయదు. వేరొకరిపై ఆధారపడటానికి కారణభూతమయ్యే బలహీనతలేమీ ఆయనలో లేవు. ఆయన లోపాలన్నింటికీ అతీతుడు, పవిత్రుడు కాబట్టి, ఆయన నిరపేక్షాపరుడు, ఆయన అక్కరలేనివాడు గనక అద్వితీయుడుగా ఉన్నాడు. ఆయనకు సహవర్తులు ఎవరూ లేరు. ఆయన అస్థిత్వంలో గానీ, ఆయన గుణగణాలలో గానీ, ఆయన అధికారాలలో గానీ, ఆయన హక్కులలో గానీ ఆయనకు భాగస్వాములెవరూ లేరు. కాబట్టి వేరొకరిని అర్థించటం, సాష్టాంగపడటం తగదు. ఇంకా ఏమిటంటే, ఈ జగతిలో ఆయనను పోలిన వస్తువు ఏదీ లేదు. కాబట్టి దేనితోనయినా ఆయనను పోల్చటం తగదు. ఆయన లాంటి శక్తిమంతుడు, ఆయన మాదిరిగా దయజూపేవాడు, ప్రేమించేవాడు, క్షమించేవాడు, గమనించేవాడు, తెలిసినవాడు, ఆంతర్యాల్లోని రహస్యాలను ఎరిగినవాడు, స్వయం ప్రతిపత్తి గలవాడు ఎవడూ లేడు. ఆయన నిర్ణయం అంతిమ నిర్ణయం. ఆయన నిర్ణయాన్ని ఎవరూ సవాలు (Challenge) చేయలేడు. ఆయన ఎవరికీ జవాబుదారు కాడు – ఒక్క అల్లాహ్‌ను మినహాయిస్తే ఈ విశ్వంలోని ప్రతిదీ సృష్టించబడినదే. సృష్టించబడిన దానిని సృష్టికర్తతో ఎలా పోల్చుతారు? కనుక ఆయన తన అస్థిత్వంలో, తన గుణగణాలలో, తన అధికారాలలో ఒకే ఒక్కడు, అసామాన్యుడు.

ఈ గొప్ప యదార్థాన్ని సుబోధకం చేయడానికి ఖుర్ఆన్ పూర్తిగా ఒక సూరానే మన ముందుంచుతుంది. చాలా పెద్ద విషయాన్ని ఎంతో సమగ్రంగా, క్లుప్తమైన పదాలలో ఇలా విశదీకరించింది –

వారికి చెప్పు : “ఆ అల్లాహ్ ఒక్కడే (అద్వితీయుడు). అల్లాహ్ అక్కర లేనివాడు, (అందరూ ఆయనపై ఆధారపడి ఉన్నారు). ఆయనకు సంతానం లేదు. ఆయన కూడా ఎవరికీ సంతానం కాదు. ఆయనకు సరిసమానుడు ఎవడూ లేడు.” (సూరయె ఇఖ్లాస్)

ఖుర్‌ఆన్ యొక్క ఈ విశదీకరణ ద్వారా అవగతమైన దేమిటంటే, అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఆయనకు ఒకరి సహాయ సహకారాల అవసరం లేదు. ఆయన ఎవరిపైనా ఆధారపడిలేడు. లోపాలకు, బలహీనతలకు అతీతుడు, పవిత్రుడైన ఇలాంటి అద్వితీయుడే ఆరాధించదగినవాడు. ఆరాధ్య దైవంగా వెలుగొందే అర్హత ఆయన ఒక్కడికే ఉంది.

## (15) ఏకదైవారాధన – బహుదైవోపాసన

సత్యం ఒక్కటే అయి ఉంటుంది, అది ఒకే రూపంలో ముందుకు వస్తుంది, అసత్యం అనేక రూపాలలో ప్రత్యక్షమవుతుందన్న విషయం వెనుకటి పుటలలో వచ్చింది. ఈ చర్చ సందర్భంగా ఈ విశ్వంలోని అన్నింటికన్నా గొప్ప యదార్థం కూడా ముందుకు వచ్చింది – ఈ జగతిని నిర్మించినవాడు, మనిషికి ఉనికిని ప్రసాదించినవాడు, అతని మనుగడకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసేవాడు కేవలం ఒక్కడేనని. ఇది మినహా మిగిలిన భావాలు, భావనలన్నీ అసత్యం. వాటికి వాస్తవికత అంటూ ఏదీ లేదు. వాటి వాస్తవికతకు సంబంధించి సహేతుక ఆధారాలేమీ లేవు. అవి వట్టి ఊహలు, మనోమయ భావాలు మాత్రమే.

తిన్నాము, త్రాగాము, ఎంజాయ్ చేశాము, ఇష్టారాజ్యం చేసి చనిపోయామనడానికి ఈ జీవితం లక్ష్యరహితమయిన జీవితం కాదు. పైగా ఇదొక లక్ష్యబద్ధమయిన జీవితం. ఎవడు తన మనస్సాక్షిని ఖాతరు చేశాడు, ఎవడు సత్యవిషయాన్ని అంగీకరించాడు, ఎవడు సత్యాన్ని అనుసరించాడు, ఎవడు త్రోసిపుచ్చాడు అన్నది ఈ జీవితంలో గమనించదగిన అతి ముఖ్యమయిన విషయం. సత్యాన్ని, అంటే ఒక్కడైన అల్లాహ్‌ను నమ్మి నడుచుకోవటంలోనూ, అసత్యాన్ని అవలంబించి జీవితం గడపటంలోనూ చాలా వ్యత్యాసం ఉంది. ఒక జీవితం పవిత్రమైనది, మేలుతో మానవత్వంతో కూడుకున్నది. రెండవది అపవిత్రమైనది. అన్యాయంతో, తిరస్కార వైఖరితో కూడుకున్నది. మంచి జీవితానికి బహుమానం, చెడ్డ జీవితానికి శిక్ష లభించాలి. మానవ నైజం

వాంఛించేది, అంతరాత్మ ప్రబోధించేది కూడా ఇదే. దీనికోసం మరో ప్రపంచం నిర్మించబడింది. మరో జీవితం కూడా ఉంచబడింది. ఆ జీవితంలో లెక్కలు తేల్చబడిన మీదట బహుమానం ఇవ్వటమో, శిక్ష విధించటమో జరుగుతుంది. బహుమానం స్వర్గం రూపంలో ఉంటే, శిక్ష నరకం రూపంలో ఉంటుంది. ఎవరయితే ఈ ప్రాపంచిక జీవితం తరువాత మరో జీవితం ఉందని, మరో ప్రపంచం నెలకొనబోతోందని విశ్వసిస్తాడో, అతను ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసిస్తాడు. ఆయన దైవత్వంలో కల్తీకి (షిర్క్‌కు) పాల్పడకుండా ఉంటాడు. ఈ విషయాలను కాదనేవారు కొందరుంటారు. వారేమంటారంటే, తాము చెడు పనులు చేసినప్పటికీ సిఫారసు ఆసరాతో శిక్ష నుండి తప్పించుకుంటామంటారు. ఇది తప్పుడు నమ్మకం.

ఆరాధించబడే హక్కును దివ్య ఖుర్‌ఆన్ సృష్టితాలకు గాకుండా ఒక్కడైన సృష్టికర్తకే ఇస్తుంది –

> "అల్లాహ్‌ను కాదని జనులు వేటిని మొరపెట్టుకుంటున్నారో, అవి ఏ వస్తువునూ సృష్టించలేవు. అవి స్వయంగా సృష్టించబడినవి. అవి నిర్జీవమైనవి. వాటిలో ప్రాణం లేదు. వాటిని ఎప్పుడు తిరిగి లేపటం జరుగుతుందో స్వయంగా వాటికే తెలియదు. మీ దేవుడు ఒకే దేవుడు. కాని పరలోకాన్ని విశ్వసించని హృదయాలు దీనిని తిరస్కరిస్తున్నాయి. వారు గర్విష్టులై ఉన్నారు." *(అన్ నహ్ల్ : 20 – 22)*

మరోచోట కూడా అల్లాహ్ ప్రశ్నాస్త్రాలు సంధిస్తూ మనిషి అంతరాత్మను కుదుపుతున్నాడు – కాస్త గంభీరంగా ఆలోచించండి, జ్ఞానోదయం అవుతుంది, సత్యమేదో బోధపడుతుంది అని అనటం జరిగింది. గుడ్డివారిలా వ్యవహరించమని అనలేదు. మీలో బుద్ధివివేకాలున్నాయి. ఇంగిత జ్ఞానం ఉంది. మీలో మనస్సాక్షి అనేది ఒకటి ఉంది. దానిని మీరు అహోరాత్రులు ఉపయోగించుకుంటూ ఉంటారు. దానినే మీరు కాస్త బాగా వినియోగించుకుని చూస్తే సరైన ముగింపు (Conclusion)కు చేరుకుంటారు. మీరు చేస్తున్న పొరపాటు ఏమిటో మీకే తెలిసివస్తుంది –

> (ప్రవక్తా!) వారిని అడుగు : "అల్లాహ్‌ను కాదని మీరు మొరపెట్టుకునే వాటిని గురించి ఏనాడయినా ఆలోచించారా? వారు భువిలో చేసిందేమిటో నాకు చూపండి? పోనీ, గగన సీమల్లో వారికేదన్నా

భాగస్వామ్యం ఉన్నదా? మీరు చెప్పేదే నిజమైతే, దీనికి పూర్వం ఉన్న ఏదయినా గ్రంథంగానీ, చెలామణిలో ఉన్న ఏదయినా జ్ఞాన విశేషం గానీ నా వద్దకు తీసుకుని రండి." అల్లాహ్‌ను వదలి ప్రళయదినం వరకూ తన పిలుపునకు సమాధానం ఇవ్వలేని వారిని ప్రార్థించే వానికంటే ఎక్కువ మార్గభ్రష్టుడు ఎవడుంటాడు? తమను మొరపెట్టుకున్న సంగతి కూడా (కనీసం) వారికి తెలిసి ఉండదు. జనులు సమావేశపరచబడినప్పుడు, వారు వారికి శత్రువులై పోతారు. తమను ఆరాధించిన విషయాన్ని వారు నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చు తారు." *(అల్ అహ్‌ఖాఫ్ : 4 – 6)*

## (16) మార్గదర్శకత్వం వహించడం, సన్మార్గం ప్రసాదించటం ఆరాధ్య దైవం అతి ముఖ్యమయిన గుణం

ప్రతి వస్తువును సృష్టించిన మీదట, దానిని ఉనికిలోకి తీసుకు రావటంలోని ఉద్దేశం నెరవేరటానికి గాను, దానికి మార్గం చూపేవాడే ఆరాధ్య దైవం అవుతాడు. ఆ వస్తువు నైజంలో దానిని పొందుపరుస్తాడు. అలాగే మానవులకు మార్గదర్శకత్వం వహించడానికి తాను ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న దాసులకు మార్గబోధనను, గ్రంథాన్ని ఇచ్చి పంపుతాడు. అన్ని కాలాలకు, అన్ని ప్రాంతాల వారి కొరకు ఈ ఏర్పాటు జరుగుతుంది. దివ్య ఖుర్ఆన్ ప్రవక్త మూసా (అ) – ఫిరౌన్‌ల సంఘటన ద్వారా అల్లాహ్ యొక్క ఈ 'గుణాన్ని' స్పష్టపరచింది. "ఇంతకీ నీ ప్రభువు ఎవరు మూసా?" అని ఫిరౌన్ అడిగినప్పుడు –

"ప్రతి వస్తువుకూ దాని ఆకారాన్ని ఇచ్చినవాడు, తరువాత దానికి మార్గం చూపినవాడే మా ప్రభువు" అని మూసా సమాధానమిచ్చాడు.

*(తాహా – 50)*

## (17) బలహీన కాల్పనిక దైవాలకు ఎదురుగా నిజ ఆరాధ్య దైవం

ఏ దైవాలు తాను ఆశించే పెద్ద పెద్ద పనులు చేసిపెడతాయని మనిషి ఊహిస్తాడో ఆ చిల్లర దేవుళ్ళ అశక్తత గురించి ఏమని చెప్పేది? ఒక ఈగపైన కూడా వాటి అధికారం చెల్లదు. సులభంగా, మనోగతమయ్యేలా ఖుర్ఆన్ ఈ యదార్థాన్ని బోధపరచింది –

"ప్రజలారా! ఒక ఉపమానం ఇవ్వబడుతోంది. శ్రద్ధగా వినండి. మీరు అల్లాహ్‌ను కాదని ఎవరెవరిని మొరపెట్టుకుంటున్నారో వారంతా ఏకమై ఒక ఈగనయినా సృష్టించలేరు. ఒకవేళ ఈగ వారి నుండి దేనినయినా లాక్కుపోతే, వారు ఆ వస్తువును దాని నుండి విడిపించుకోనూ లేరు. సహాయం అర్థించేవారూ బలహీనులే. సహాయం అర్థించబడేవారు కూడా బలహీనులే. (అసలు విషయం ఏమిటంటే) వారు అల్లాహ్ విలువను తెలుసుకోవలసిన విధంగా తెలుసుకోలేదు. నిశ్చయంగా అల్లాహ్ మహాబలుడు, ఆధిపత్యం కలవాడు." *(అల్ హజ్జ్ – 73, 74)*

తెలిసిందేమిటంటే పుట్టించినవాడే పూజనీయుడవుతాడు. ఆయన అసాధారణమయిన శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటాడు. శక్తి, అధికారం కలవాడే గౌరవనీయుడు. ఇది విశ్వసామ్రాట్టు అయిన అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం. శక్తి, ఆధిపత్యం, గౌరవం కలవాడే ఆరాధ్య దైవం. ఆయన అల్లాహ్ మాత్రమే. ఈ స్పృహ, నమ్మకం లేనివాడు ఇతరత్రా వాటిని ఆరాధ్య దైవాలుగా తలపోసి వాటిని సేవిస్తాడు. ఎవరయినా తనంతట తానుగా ఇలా తలపోయటం వల్ల 'వాస్తవం' మారిపోతుందా? ఆలోచించాలి.

ఏదయితే నిర్మించదో, స్వయంగా నిర్మితమైందో (ఇతరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడిన బలహీనమైన వస్తువుగా ఉందో), ఏదయితే వినలేదో, కనలేదో, అనలేదో, ఎవరికీ ఎలాంటి సహాయం చేయలేదో అది ఆరాధనకు ఎలా తగును?

ఈ నేపథ్యంలో ఖుర్ఆన్ మనిషి హృదయకవాటాలను తట్టే ప్రయత్నం చేసింది –

ఇంకా ఈ గ్రంథంలో ఇబ్రాహీమ్‌ను గురించి ప్రస్తావించు. నిశ్చయంగా అతను సచ్ఛీలుడు, ప్రవక్త. అతను తన తండ్రితో,"ఓ నాన్నా! మీరు వినలేని, కనలేని, మీకు ఏ విధంగా కూడా తోడ్పడలేని వాటిని ఎందుకు పూజిస్తున్నారు?" అని అన్నప్పుడు... *(మర్యమ్–41,42)*

## (19) ఆరాధ్య దైవం అవడానికి కావలసిన గుణగణాలు

ఎవరయినా ఆరాధ్య దైవం అవడానికి అతనిలో ఏ గుణగణాలు ఉండాలని మనిషి బుద్ధి, మానవ నైజం వాంఛిస్తుందో వాటిని ఖుర్ఆన్

వివరిస్తుంది – ఆ గుణగణాల గురించి అతని బుద్ధి ఏమంటుందో అతను ఆలోచించాలి. తాను ఆరాధ్య దైవంగా స్వీకరించడానికి యోగ్యమయిన సుగుణాలు అతనిలో ఉన్నాయో లేదో అతను చూడదలుస్తాడు. ఖుర్ఆన్ వివిధ చోట్ల ఆ గుణగణాలను స్పష్టంగా విశదీకరించింది –

> "అయినప్పటికీ జనులు నిజ దైవాన్ని వదలి దేనినీ సృష్టించలేని వారిని, స్వయంగా సృష్టించబడినవారిని తమ ఆరాధ్య దైవాలుగా చేసుకున్నారు. వారు తమ స్వయానికి కూడా ఏదయినా లాభంగానీ, నష్టంగానీ చేకూర్చుకునే అధికారం కలిగి లేరు. ఒకరి జీవన్మరణాలను శాసించే, మరణానంతరం తిరిగి బ్రతికించే అధికారం కూడా వారికి లేదు." *(అల్ ఫుర్ఖాన్ – 3)*

ఇలాంటి నిస్సహాయులైన వారిని ఆరాధ్య దైవంగా చేసుకోవటం తెలివైన పనేనా? ఇలాంటి దేవుళ్ళు ఏమయినా పనికి వస్తారా? వారు మొరలను ఆలకిస్తారా? అక్కరలు తీరుస్తారా? వారు మనుషులను రక్షించగలరా? మార్గదర్శకత్వం వహించగలరా?

> "నిశ్చయంగా నీ ప్రభువు పట్టు మాగట్టిది. నిస్సందేహంగా ఆయనే మొదటిసారి పుట్టిస్తాడు. మలిసారి పుట్టించేది కూడా ఆయనే. ఆయన క్షమాసాగరుడు, ప్రేమమయుడు, మహత్పూర్వకమయిన పాలనా పీఠానికి అధిపతి. మహిమాన్వితుడు. కోరినదానిని చేసితీరేవాడు."
> *(అల్ బురూజ్ : 12 – 16)*

**పట్టు చాలాగట్టిది** ... అంటే దుర్వర్తనలో, తలబిరుసుతనంలో ముందుకు సాగిపోయే వారిని, ఉపదేశాన్ని వినీవిననట్లుగా వ్యవహరించేవారిని, అల్లాహ్ చాలా గట్టిగా పట్టుకుంటాడు. ఆయన పట్టు నుండి ఎవరూ తప్పించుకోలేరు.

**'మొదటిసారి పుట్టించడం'** అంటే ... ప్రస్తుత ప్రాపంచిక జీవితం కర్మ జీవితం. మనిషి మంచిమార్గంలో జీవిస్తాడా లేక చెడుమార్గాన పోతాడా? అన్నది పరీక్షించబడుతుంది. **'మలిసారి జీవితం'** ఎందుకు ఇవ్వబడుతుందంటే; ఈ ప్రాపంచిక జీవితంలో మనిషి చేసిన ఆచరణల లెక్క తీసుకోవడానికి. దాని ప్రకారమే బహుమానం (స్వర్గం) ఇవ్వటమో, శిక్ష (నరకం) విధించడమో జరుగుతుంది. ఇది జరిగి తీరాల్సిందే. అయితే ఇదంతా జరగటానికి ముందు

అల్లాహ్ తన కరుణానుగ్రహాలను ప్రస్తావించి, దాసుడు చెడు మార్గాన పోకుండా ఆపుతున్నాడు. అతడు అవిధేయతకు ఒడిగట్టకుండా ఉండేలా బోధిస్తున్నాడు. అందుకే పైన ప్రస్తావించిన ఆయత్‌లో ఆయన **'క్షమాసాగరుడు'** అని అనటం జరిగింది. అంటే ఎవరయినా తాను చేసిన పాపాల పట్ల పశ్చాత్తాపం చెంది, క్షమాభిక్షకై వేడుకున్నట్లయితే అతను అల్లాహ్ యొక్క కారుణ్యఛాయలో చోటు పొందగలడు.

**'ప్రేమమయుడు'** ... అంటే ఆయనకు తన సృష్టితాలలో ఎవరి పట్ల కూడా శత్రుత్వం, పగలేదు. పైగా తాను పుట్టించిన వారిని ఆయన అమితంగా ప్రేమిస్తాడు. అవిధేయతకు ఒడిగట్టి, తలబిరుసుగా మారినప్పుడే ఆయన తన దాసుణ్ణి శిక్షిస్తాడు.

**పీఠాధిపతి** లేక **సింహాసనానికి అధిపతి** అంటే అర్థం సమస్త జగతికి ఆయనే పరిపాలకుడు, సార్వభౌమాధికారి. పొగరుబోతుగా వ్యవహరించే వాడెవడూ ఆయన పట్టు నుండి తప్పించుకోలేడు.

**మహిమాన్వితుడు** అని చెప్పి ఇక్కడ మనిషికి అతని దుశ్చేష్టలపై హెచ్చరిక చేయడం జరిగింది. చూడు! అటువంటి ఘనాఘనునికి, ప్రేమమయునికి ప్రతిగా నీవు దురుసుగా వ్యవహరిస్తున్నావు. ఇది నీకు ఎంతమాత్రం తగదు.

**కోరినదానిని చేసితీరేవాడు** అంటే, ఆయన ఏ పనినయినా చేయదలచుకున్నప్పుడు, దానిని అడ్డుకునే శక్తి ఎవరికీ లేదు.

## (20) మానవ నైజం – అంతరాత్మ ప్రబోధం

మానవ నైజం దేనిని ఒప్పు, దేనిని తప్పు అంటుందో ఖుర్‌ఆన్ ప్రశ్నలువేసి, దాని ఆధారంగానే తప్పొప్పులను అందరి ముందుకు తెస్తుంది. మీ నైజంలోనే, మీ అంతరాత్మలోనే ఈ వాస్తవం పొందుపరచబడి ఉందనీ, మీ నోళ్ళు సయితం దాని గురించి సాక్ష్యమిస్తున్నాయని, కాకపోతే మీ మనసు కొన్ని స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా దానిని అవలంబించదని ఖుర్‌ఆన్ అంటోంది. మనిషి అంతరాత్మ ముందు అల్లాహ్ వేసే ప్రశ్నలు ఇవి :

> (ప్రవక్తా!) వారిని అడుగు : "ఈ భూమి, అందులో ఉన్న సమస్తం ఎవరిదో చెప్పండి?" 'అల్లాహ్‌దే' అని వారంటారు. "మరయితే

మీరు ఆలోచించరా?" అని అడుగు. వారిని ఇలా అడుగు : "సప్తాకాశాలకు యజమాని ఎవరు? మహోన్నతమైన అధికార పీఠానికి (అర్షకు) అధిపతి ఎవరు?" 'అల్లాహ్‌యే' అని వారంటారు. "మరి అలాంటప్పుడు మీరు భయభక్తులతో ఎందుకు మెలగరు?" అని వారిని నిలదీసి అడుగు. ఇలా అడుగు : "ప్రతి వస్తువుకు సంబంధించిన అధికారం హస్తగతమై ఉన్నవాడు ఎవడు? శరణు ఇచ్చే వాడెవడు? ఎవరికి ఎదురుగా ఎలాంటి ఆశ్రయం లభించదో ఆయన ఎవరు? మీకు తెలిస్తే చెప్పండి?" 'ఇవన్నీ అల్లాహ్‌కే స్వంతం' అని వారంటారు. వారితో అను, "మరి అలాంటప్పుడు మీరు ఎటువైపు నుండి మోసపోతున్నారు?" నిజానికి మేము సత్య విషయాన్ని వారి ముందుకు తీసుకువచ్చాము. కాని వారే అసలు అబద్ధీకులు. అల్లాహ్ ఎవరినీ కుమారునిగా చేసుకోలేదు. ఆయనతో పాటు మరో ఆరాధ్య దైవం కూడా లేదు. ఒకవేళ ఉండి ఉంటే ప్రతి దేవుడూ తాను సృష్టించిన దానిని తీసుకుని వేరైపోయేవాడు. ఆధిపత్యం కొరకు ఒకడింకొకడిపై దండెత్తి వచ్చేవాడు. వారు కల్పించేవాటికి అల్లాహ్ అతీతుడు, పరిశుద్ధుడు. ఆయన గుప్తమైవున్న దానినీ, బహిర్గతమై ఉన్నదానిని కూడా ఎరిగినవాడు. వారు కల్పించే సాటి (షిర్క్)కి ఆయన అతీతుడు, చాలా ఉన్నతుడు."

*(అల్ మోమినూన్ : 84 – 92)*

పైన వేయబడిన ప్రశ్నలకు మానవాత్మ, మానవ నైజం సర్వకాల సర్వావస్థల్లో ఇచ్చిన సమాధానం ఇదే. దానిని అల్లాహ్ తన గ్రంథంలో పొందుపరిచాడు. ఎందుకంటే ప్రతి కాలంలో, ప్రతి మనిషి అంతరాత్మ, అతని నైజం ఒకేవిధంగా ఉండింది. ఇప్పుడూ ఉంది. ఎప్పటికీ ఉంటుంది. అందుకే మంచి విషయాలు గత కాలంలో కూడా మంచివిగా ఉండేవి. చెడు విషయాలు, అబద్ధాలు, తప్పుడు మాటలు గత కాలంలో కూడా అలాగే ఉండేవి. నేడూ అలాగే ఉన్నాయి. మానవాత్మ దృష్టిలో కూడా అవి అలాంటివే. మానవ నైజం మంచి విషయాలను ఈనాడు ఇష్టపడినట్లే అలనాడు కూడా ఇష్టపడేది. చెడు విషయాలను ఈనాడు అసహ్యించుకున్నట్లే ఆనాడు కూడా అసహ్యించుకునేది. కాబట్టి అవగతమయిన దేమిటంటే; మానవ నైజంగానీ, సత్యంగానీ మారలేదు. ఆ విషయాన్నే ఖుర్ఆన్ ప్రస్తావించింది. మనస్సాక్షి గనక బ్రతికి ఉంటే ఈ

యదార్థాల గురించి సాక్ష్యమిస్తుంది. కాని మనిషి తన మనోవాంఛలకు లొంగిపోయి, తన స్వార్థప్రయోజనాల దృష్ట్యా, జాతి వర్గ దురభిమానాల దృష్ట్యా మనస్సాక్షికి వ్యతిరేకంగా పోయి సత్యాన్ని స్వీకరించడు. పైగా కుంటిసాకులు చెబుతాడు. తనదైన భాష్యం (Interpretation) చెబుతాడు. తాతముత్తాతల ఆచార సంప్రదాయాల సహారా తీసుకుంటాడు. ఇదంతా తనను తాను మోసగించుకోవటం, వంచించుకోవటం తప్ప మరేమీ కాదు.

పైన పేర్కొనబడిన గుణగణాలన్నీ 'ఆరాధ్యదైవం'లో ఉండటం అవసరం. మరిన్ని గుణగణాలను కూడా ఖుర్‌ఆన్ ఇతర చోట్ల ప్రస్తావించింది. ఈ సుగుణాలన్నీ అల్లాహ్‌లో మాత్రమే ఉన్నాయి. వేరొకరిలో అవి లేవు. మానవ నైజం అన్ని కాలాల్లో దీనికి సాక్ష్యంగా నిలిచింది. ఖుర్‌ఆన్ విసిరిన ఈ సవాలు (Challenge) ను ఎవరూ ఇంతవరకు స్వీకరించలేదు కూడా.

## (21) ప్రభువు

క్రింద ఇవ్వబడిన ఆయత్‌లలో మానవ అవసరాల నిమిత్తం, మనుగడ నిమిత్తం ఏ ఏ పనులు ప్రస్తావించబడ్డాయో వాటిని చేసేవాడు కేవలం మానవుల ప్రభువు మాత్రమే. ప్రభువు (రబ్) మాత్రమే ఆరాధ్యదైవం కాగలడు. ఆ ఆరాధ్య దైవం పేరే అల్లాహ్.

> "ఆయనే మీ కొరకు రాత్రిని తెరగా, నిద్రను విశ్రాంతిగా, పగటిని బ్రతికి లేచే సమయంగా చేశాడు. తన కారుణ్యానికి (వర్షానికి) ముందు చల్లని గాలులను శుభవార్తగా పంపేవాడు ఆయనే. మరి మేము ఆకాశం నుండి స్వచ్ఛమయిన నీటిని కురిపిస్తాము – తద్వారా మృతభూమిలో ప్రాణం పోయాలని! మా సృష్టితాలలోని ఎన్నో జంతువులకు, మరెందరో మనుషులకు నీరు త్రాపాలని!!"
>
> *(అల్ ఫుర్ఖాన్ : 47 – 49)*

> ఇంకా ఆయనే మానవుణ్ణి నీటితో సృష్టించాడు. పిదప అతనిని ఒక వంశీయునిగా చేశాడు. అత్తవారితో అతనికి బంధుత్వం ఏర్పరచాడు. నీ ప్రభువు గొప్పవాడు, శక్తిసంపన్నుడు." *(అల్ ఫుర్ఖాన్ – 54)*

ఒక్క సృష్టికర్తను వదలి మిగిలినవన్నీ – అవి ప్రాణమున్నవయినా, ప్రాణం లేనివయినా – సృష్టించబడినవే. సృష్టితాలు బలహీనమైనవై ఉంటాయి.

అవి ఇతరులకు జీవనం ప్రసాదించలేవు. ఆఖరికి తమ జీవితాన్ని కూడా నిలిపి ఉంచుకోలేవు. మొరలను ఆలకించలేవు, ఇతరులకు సహాయం చేయలేవు. ఈ వాస్తవాన్ని ఖుర్ఆన్ ఇలా విప్పి చెబుతోంది –

> "మీరు నిజ దైవాన్ని వదలి వేటిని పిలుస్తున్నారో అవన్నీ మీలాంటి దాసులే. మీరు వాటిని పిలుస్తూనే ఉండండి. వాటి గురించి మీ ఊహలు సరైనవే అయితే అవి మీకు సమాధానం ఇవ్వాలిగా మరి."
>
> *(అల్ ఆరాఫ్ – 194)*

మీరు ఎవరినయితే మొరపెట్టుకుంటున్నారో వారు మీ మాదిరిగానే దాసులు (బానిసలు). మీరు ఏ విధంగా మీ స్వయానికి సహాయం చేసుకోలేరో అవీ అంతే. ఎందుకంటే అవి కూడా నిస్సహాయమైనవే. బలహీనమైనవే. అలాంటప్పుడు మీకు ఎలా తోడ్పడగలవు.

దాసుని మొరను ఆలకించేవాడు, లాభనష్టాలు కలిగించే అధికారం ఉన్నవాడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు.

సత్యాన్ని బోధపరచడానికి ఖుర్ఆన్ దైవప్రవక్త మూసా (అ) కాలం నాటి చారిత్రక వాస్తవాన్ని మన ముందుంచుతుంది –

> "ఏమిటి, అది (ఆ ఆవుదూడ విగ్రహం) ఏ మాటకూ సమాధానం ఇవ్వటం లేదనీ, వారికెలాంటి నష్టంగానీ, లాభంగానీ కలిగించ జాలదన్న విషయాన్ని వారు గమనించటం లేదా?" *(తాహా–89)*

ప్రవక్త మూసా (అ) కాలంలో ప్రజలు తమ స్వహస్తాలతో తయారు చేసిన ఆభరణాల ఆవుదూడను ఆరాధ్య దైవంగా చేసుకున్నారు.

## (22) కాల్పనిక దైవాల అశక్తత

విశ్వ ప్రభువును కాదని జనులు మొరపెట్టుకునేవారి కాల్పనిక దైవాల నిస్సహాయ స్థితిని గురించి ఏమని చెప్పేది??

వారి దయనీయ స్థితిని ఖుర్ఆన్ ఈ విధంగా చిత్రించింది :

> "ఆయన్ని మొరపెట్టుకోవటమే సత్యం. ఆయన్ని కాదని జనులు మొరపెట్టుకునే వారంతా వారి మొరను ఆలకించలేరు. వారిని మొరపెట్టుకోవటం అనేది ఒక వ్యక్తి నీళ్ళ వైపు తన రెండు చేతుల్ని చాపి, అది తన నోటి వరకూ రావాలని ఆశించటం వంటిదే. అది

అతని నోటి వరకూ రానే రాదు. సత్యతిరస్కారుల మొరలన్నీ నిరర్థకమైనవే." *(అర్రాద్ : 14)*

నిజ దైవాన్ని కాదని, వేరితరులను పిలిస్తే సమాధానం ఎలా లభిస్తుంది?

## (23) నిజ ఆరాధ్య దైవం లోపాలకు అతీతుడు

దాసుల స్థితిగతులను ఎరిగినవాడు, అనుక్షణం వారి వ్యవహారాల పట్ల శ్రద్ధ వహించేవాడు, వారి గోడును వినేవాడు, వారి ఇబ్బందుల పట్ల అలసత్వం ప్రదర్శించనివాడు మాత్రమే ఆరాధ్య దైవం కాగలడు.

అలసిపోయేవాడు, నిద్రపోయేవాడు, కునుకు తీసేవాడు, దాసుల స్థితిగతులను గురించి తెలియనివాడు ఆరాధ్య దైవం ఎలా కాగలుగుతాడు? వారి మొరలను అతడు ఎలా వినగలుగుతాడు? వారి అవసరాలను ఎలా తీరుస్తాడు? వారికి సహాయం ఎలా చేస్తాడు? వారికి న్యాయం ఎలా చేస్తాడు?

నిద్రపోవటం అంటే అర్థం సృష్టికర్త తన పనుల భారం వల్ల అలసి పోతాడన్నమాట! అతను విశ్రాంతి తీసుకుని ఉల్లాసం పొందుతాడన్నమాట! ఇది ఎటువంటి దౌర్బల్యమంటే అనుక్షణం విశ్వాన్ని కనిపెట్టుకుని ఉండే పనితో ఇది పొసగదు. ఇలాంటి బలహీనతలున్నవారు సృష్టికర్త, ప్రభువు, పాలకుడు, ఆరాధ్యదైవం కాజాలరు. అల్లాహ్ ఇలాంటి దౌర్బల్యాలకు అతీతుడు, పవిత్రుడని ఖుర్ఆన్ అంటోంది –

"ఆయనకు కునుకుగానీ, నిద్రగానీ పట్టదు." *(అల్ బఖరా – 255)*

నిద్ర ఒకలాంటి మృత్యువే. ఈ బలహీనత నుండి అల్లాహ్ పవిత్రుడు. నిద్రలోకి జారుకున్నవాడు తాను స్వయంగా నిలదొక్కుకోడు. అలాంటప్పుడు ఇంతపెద్ద విశ్వాన్ని ఎలా నిలిపి ఉంచగలడు?

## (24) సృష్టికర్త, యజమాని మాత్రమే తన సృష్టితాలకు, సొత్తుకు ఆరాధ్య దైవం కాగలడు

ఎవరయితే గగన భువనాలలో ఉన్న వాటన్నింటికీ యజమానో, వాటిని కనిపెట్టుకుని ఉన్నాడో, జ్ఞాన సంపన్నుడో, వివేచనాశీలుడో ఆయనే తన సొత్తుకు, సృష్టితాలకు ఆరాధ్య దైవం. ఆ ఆరాధ్య దైవం అల్లాహ్‌యే.

సహజమైన ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఇలా సమర్పిస్తోంది –

> "కనుక గగనాల ప్రభువు, భువన ప్రభువు, సమస్త లోకాల ప్రభువు అయిన అల్లాహ్‌కే స్తోత్రం శోభాయమానం. గగన భువనాలలో పెద్దరికం ఆయనకే చెందుతుంది. ఆయనే శక్తిమంతుడు, వివేకవంతుడు." *(అల్ జాసియహ్ – 36, 37)*

అల్లాహ్‌కు సమ ఉజ్జీగా ఎవడయినా ఉన్నాడా అని కూడా ఖుర్ఆన్ ప్రశ్నిస్తోంది. ఆయనకన్నా ఉన్నతుడున్న సంగతి అలా ఉంచితే, కనీసం ఆయన దరిదాపుల్లోకి రాగలిగేవాడైనా ఉన్నాడా? లేనప్పుడు ఆరాధనకు అర్హుడెలా అవుతాడు?

> "ఆకాశాలకు, భూమికి, వాటి మధ్యన ఉన్న సమస్తానికి ఆయనే ప్రభువు. కనుక నీవు ఆయన్నే ఆరాధించు. ఆయన దాస్యంపైనే స్థిరంగా ఉండు. నీకు తెలిసినంత వరకు ఆయన గుణవిశేషాలు కలవాడు మరెవడయినా ఉన్నాడా?" (మర్యమ్ – *65).*

ఆయనే ప్రభువు. కనిపెట్టుకుని ఉండేవాడు, రక్షకుడు, అవసరాలను తీర్చేవాడు ఆయనే. కనుక ఆయన మాట వినాలి. ఆయనకు దాస్యం చేయాలి. ఆయన్ని వదలి వేరితరులకు దాస్యం చేయడానికి ఆయనలాంటి గొప్పవాడు లేడు కదా!

## (25) యజమాని, పాలకుడు మాత్రమే ఆరాధ్యుడు కాగలడు

సమస్త జగతిలో ఒకే ఒక పరిపాలకుని శాసనం, ఉత్తరువు (Law & Order) నడుస్తోంది. మానవుడు కూడా ఈ బ్రహ్మాండమయిన విశ్వ కర్మాగారంలో ఒక భాగమే. కాబట్టి మానవుడు కూడా ఒక్కడైన ఆ పరిపాలకుని ఆజ్ఞను శిరసావహించాలి. ఆయనే మానవునికి ప్రభువు. అదీగాక వరాల వర్షం కురిపించేవాడే ఆరాధ్యుడు కాగలడు. తన యాజమాన్యంలో ఉన్నవాటికి యజమానిగా వర్ధిల్లేవాడే ఆరాధ్య దైవం కాగలుగుతాడు. ఆపదల్లో చిక్కుకున్నప్పుడు, గండం నుంచి గట్టెక్కే ఉపాయం ఏదీ తోచనప్పుడు మన కంటికి కానరాని ఆ దైవమే కాపాడుతాడు. సృష్టితాలలో ఎవరూ ఎలాంటి సహాయం చేయలేరు. అలాంటి శక్తిమంతుడైన మహోపకారి మాత్రమే ఆరాధ్య దైవం

అవుతాడు. అందుకే ఖుర్‌ఆన్ ఆ సహజ విషయం వైపునకు దర్శకత్వం వహిస్తోంది –

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "ఇద్దరు దైవాలను చేసుకోకండి. ఆరాధ్య దైవమైతే ఒక్కడే కనుక మీరు నాకే భయపడండి." భూమ్యాకాశాలలో ఉన్నదంతా ఆయనదే. జగతిలో సర్వత్రా కేవలం ఆయన ధర్మం (ఆజ్ఞ) మాత్రమే నడుస్తోంది. మరయితే మీరు ఆ నిజ దైవాన్ని కాదని వేరెవరికో భయపడతారా? మీ దగ్గర ఏ అనుగ్రహ భాగ్యం ఉన్నా అది అల్లాహ్ తరఫు నుండి లభించినదే. మరి మీకు ఏ కష్టం కలిగినా విన్నపాలు చేసుకోవడానికి ఆయన వైపునకే పరుగులు తీస్తారు." *(అన్ నహ్ల్ : 50 – 53)*

మానవ నైజం అప్రయత్నంగా దేని వైపునకు లాక్కుని పోతుందో, అదే సత్యం.

## (26) విశ్వ సార్వభౌముడే నిజ ఆరాధ్య దైవం

విశ్వసామ్రాట్టు – అంటే మహోన్నతమైన సింహాసనానికి (అర్ష్‌కు, రాజ్యపీఠానికి) అధిపతి అయినవాడే నమ్మదగినవాడు. మానవునికి ఆయన ఒక్కడే చాలు. అందుకే నిజ ఆరాధ్యదైవం ఆయనే. ఖుర్‌ఆన్ ఇలా అంటోంది:

అప్పటికీ వారు గనక విముఖత చూపితే వారితో ఇలా అను : "నాకు అల్లాహ్ చాలు. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేడు. నేను ఆయన్నే నమ్ముకున్నాను. ఆయనే మహోన్నత సింహాసనానికి (అర్ష్‌కు) అధిపతి." *(అత్ తౌబా – 129)*

## (27) ఎవరి జ్ఞానం ప్రతి వస్తువునూ ఆవరించివుందో ఆయనే విధేయత చూపదగినవాడు

సర్వం తెలిసినవాడే చక్కగా పరిపాలించగలడు. ఎవరి ఆజ్ఞ జ్ఞానంతో, వివేకంతో నిండి ఉంటుందో, తత్కారణంగా ఆ ఆజ్ఞలో కరుణ ఉంటుందో ఆయనే విధేయత చూపదగినవాడు.

కాబట్టి ఆయనే పాలకుడు, ప్రభువు, ఆరాధ్యుడు అవుతాడు –

"(ప్రజలారా!) మీ ఆరాధ్య దైవమైతే ఒక్కడైన అల్లాహ్‌యే. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన జ్ఞానం అన్నింటినీ పరివేష్టించి ఉంది." *(తాహా – 98)*

## (28) అల్లాహ్ యొక్క విలక్షణమైన ప్రత్యేకత

దివ్య ఖుర్‌ఆన్ అల్లాహ్ యొక్క విలక్షణమయిన ప్రత్యేకతను గురించి ఇలా అంటోంది –

"ఆయనే తొలివాడు, తుదివాడు. ఆయనే బాహ్యం, నిగూఢం. ఆయన ప్రతిదీ తెలిసినవాడు." *(అల్ హదీద్ – 3)*

**ఆయనే తొలివాడు** : అంటే ఏమీ లేనప్పుడు, ఈ జగతి కూడా లేనప్పుడు ఆయన ఉన్నాడు. అంటే సింహాసనానికి అధిపతి అయిన అల్లాహ్ అప్పటికే ఉన్నాడు. కాబట్టి ఆయనే 'ఆది'. ఆ తరువాత ఆయన ఈ జగతిని, అందులో ఉన్న వస్తువులన్నింటినీ సృష్టించాడు.

**ఆయనే తుదివాడు** : అంటే ఏమీ మిగిలి ఉండదు, అంతా నశించిపోతుంది. కాని అల్లాహ్ మాత్రం సజీవంగా నిలిచి ఉంటాడు.

ఆయన వ్యక్తమైనవాడు : అంటే ప్రతి చోటా తన సృష్టి ద్వారా వ్యక్తమవుతాడు. అది కేవలం ఆయన ఘనకార్యమేనని అర్థమైపోతుంది. ప్రతి క్షణం ఆయన ఉనికికి సంబంధించిన శ్వాస వస్తూ ఉంటుంది. ఆయన శక్తి సామర్థ్యాలలో, ఆయన కారుణ్యంలో, అక్కరలను తీర్చడంలో, మొరలను ఆలకించడంలో, అసంభవమనిపించే కార్యాలను కూడా సంభవం చేయడంలో, విశ్వవ్యవస్థ సజావుగా సాగటంలో, మనిషి శరీరావయవాలన్నీ పద్ధతి ప్రకారం పనిచేయడంలో – ఆయన పనితనం, ఆయన గుణగణాల దర్పం, ఆయన నిర్వహణా దక్షత కొట్టొచ్చినట్లే కానవస్తుంది. అంతేకాదు – మానవ మనుగడతో, ఇతర సృష్టితాల వృద్ధీ వికాసాలతో భూమ్యాకాశాలలోని నియమాలు, శాసనాలు సమరసం చెందటం కూడా ఆయన పరిపాలనా దక్షతకు ప్రబల తార్కాణమే. అందుచేత ఆయన ప్రతి వస్తువుకన్నా ఎక్కువగా వ్యక్తమైనవాడు. చూడబోతే సూర్యుడు అన్నింటికన్నా ఎక్కువగా వ్యక్తమవుతాడు, ఉజ్వలంగా ఉంటాడు. కాని కొంత సమయం గడిచాక కనుమరుగైపోతాడు. కాని అల్లాహ్ ఉనికికి సంబంధించిన భావన రేయింబవళ్ళు, అన్నిచోట్లా, అన్నివేళలా, అన్ని వస్తువుల ద్వారా జాగృతమవుతూ ఉంటుంది. అయినప్పటికీ మానవునికి గనక 'అల్లాహ్' అనబడే సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, పరిపాలకుడు, కార్యనిర్వాహకునిపై

విశ్వాసం జనించకపోతే, అది మానవుని అతి పెద్ద విషాదం అనాల్సి ఉంటుంది. దానికి ఎవరో కాదు, స్వయంగా అతడే బాధ్యుడు.

**ఆయన గుప్తమైనవాడు** : అల్లాహ్ అందరికన్నా ఎక్కువగా గుప్తమైనవాడు. అగోచరుడు. ఏ కన్నూ ఆయన్ని కానజాలదు. ఇంతవరకూ ఎవరూ ఆయన్ని చూడలేదు. కాకపోతే ఆయన శక్తి, సామర్థ్యం, పనితనం, ఆయన దాక్షిణ్యం ప్రతి వస్తువులో తొణికిసలాడుతూ ఉంటుంది.

**ఆయన సర్వం తెలిసినవాడు** : పుట్టించిన ఆయనకే తెలియకుండా ఎలా ఉంటుంది? ఈ జగతిని సృష్టించినవాడు, అందలి ప్రతి వస్తువును పుట్టించినవాడు, శూన్యం నుండి అస్థిత్వాన్ని తీసేవాడు ఆయనే కాబట్టి నిశ్చయంగా ఆయనకు ప్రతిదీ తెలిసి ఉంటుంది. మానవుని జ్ఞానమంతా దైవ ప్రసాదితం. ఈ జగతిలో మానవుడు వేటిని కనుగొన్నా, ఏ ఆవిష్కరణ చేసినా అదంతా ఆ కరుణామయుని కటాక్షమే. అది కూడా చాలా పరిమితం. అది కూడా అతని మరణంతోనే అంతమైపోతుంది. అయితే అల్లాహ్ జ్ఞానం అపరిమితం, అనంతం. అది అంతమవదు. ఎందుకంటే ఆయన సమస్త జగతిని పర్యవేక్షించవలసి ఉంటుంది. జీవులను రక్షించటం, వాటి ఎదుగుదలకు కావలసినవన్నీ సమకూర్చటం, ఆయా జాతులను మిగిల్చి ఉంచటం – ఇత్యాది పనులన్నీ ఎంతో ఉపాయంతో, మరెంతో దయతో చేయవలసి ఉంటుంది. దీనికి 'జ్ఞానం' అవసరం.

అందుకే ఆయనే మొదటివాడు, ఆయనే ఆఖరివాడు, ఆయనే గుప్తమైనవాడు, ఆయనే వ్యక్తమైనవాడు. ఆయన ప్రతిదీ తెలిసిన మహాజ్ఞాని. ఆయనే నిజ ఆరాధ్యదైవం.

## జీవన్మరణాలు అల్లాహ్ హస్తగతమై ఉన్నాయి

అల్లాహ్ ఈ జగతికి, జగతిలోని సృష్టితాలకు కర్త. తాను పుట్టించిన దానిని అంతమొందించే అధికారం కూడా ఆయనకే ఉంది. ఉండాలి కూడా. ఆయనతో పాటు మరొకరు కూడా మృత్యువు ఇవ్వగలరని అనుకుంటే అల్లాహ్‌ను అశక్తుని క్రింద జమకట్టటమే. ఆయన, తాను సృష్టించిన ప్రాణాన్ని నిలిపి ఉంచలేడని తలపోయటమే. ఈ అపోహను ఖుర్ఆన్ దూరం చేస్తూ ఇలా అంటోంది –

"భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే. ఆయనే బ్రతికిస్తున్నాడు. ఆయనే చంపుతున్నాడు. ఆయన ఏదయినా సరే చేయగల సమర్థుడు."

*(అల్ హదీద్ – 2)*

ఆయన రాజ్యంలో ఆయన ఆనతి లేకుండా ఎవరయినా ఏమీ చేయలేనప్పుడు, జీవన్మరణాల విషయంలో వారు ఎలా జోక్యం చేసుకోగలుగుతారు? ఏ ప్రాణికి ఎప్పుడు మరణం రుచి చూపాలి, ఏ తీరులో అంతమొందించాలి? అన్న నిర్ణయం అల్లాహ్ చేతుల్లో ఉంది. దానిని ఆయనే నిర్ణయిస్తాడు. ఎవరయినా ఒక వ్యక్తి ఎవరినయినా చంపాలని పథకం వేస్తే, ఆ పథకాన్ని ఫలించనివ్వాలా? లేదా? అన్నది దైవ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అంటే ఆ ప్రాణాన్ని కాపాడాలా? లేక అంతమొందించాలా? అన్నది దైవాభీష్టం ప్రకారమే జరుగుతుంది. అయితే హత్యాయత్నం చేసినవాడు మాత్రం తన దుశ్చేష్టకు బాధ్యుడవుతాడు. శిక్షను అనుభవిస్తాడు. అలాగే ఒక వ్యక్తి నీటిలో మునుగుతున్నాడు. రెండవ వ్యక్తి అతన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. అతని ప్రయత్నం ఫలిస్తుందా? లేదా? అనేది కూడా అల్లాహ్ అభీష్టంపై, ఆయన నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అంతిమ నిర్ణయం అల్లాహ్‌దే. అయితే కాపాడటానికి యత్నించిన వ్యక్తికి మాత్రం అతని సత్క్రియకుగాను మంచి ప్రతిఫలం (బహుమానం) లభిస్తుంది.

అంటే ప్రాణం పోకుండా కాపాడటం లేదా కాపాడకపోవటం అల్లాహ్ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంది. ఈ అధికారం ఎవరికీ లేదు. తన సామ్రాజ్య పరిధి (విశ్వం)లో ఆయన ఒక్కడికే ప్రతిదీ చేయగలశక్తి, అధికారం ఉంది.

ఈ యదార్థాన్ని ఖుర్ఆన్ మరో పద్ధతిలో వివరిస్తోంది – మానవుడు తన ప్రయత్నం తాను చేస్తాడు. అతని కృషి ఫలించేలా చేయటం లేక చేయకపోవటం అనేది అల్లాహ్ అంతిమ నిర్ణయమై ఉంటుంది. దీని భావమేమిటంటే ఆయన సామ్రాజ్య పరిధిలో ప్రతి వ్యక్తీ, తన ఇష్టం ప్రకారం – తాను కోరినది – చేసుకోగలడు. అయితే అతను చేసే సాధన ప్రకారం మంచి ప్రతిఫలమో లేదా చెడు ప్రతిఫలమో అతనికి ఇవ్వబడుతుంది – అతని కృషి ప్రాపంచికంగా ఫలించినాసరే, ఫలించకపోయినాసరే!

"గగన భువనాల సార్వభౌమత్వం ఆయనదే. సమస్త వ్యవహారాలు అల్లాహ్ వైపునకే మరల్చబడతాయి." *(అల్ హదీద్ – 5)*

అంటే నిర్ణయాత్మకమైన అధికారం (Final Authority) అల్లాహ్‌కే ఉంది.

## (29) దాసునికి దగ్గరగా ఉండటం ... అతని సంకల్పాన్ని ఎరిగి ఉండటం

అల్లాహ్ ప్రతి దాసుని స్థితిగతులను ప్రతి క్షణం తెలుసుకుంటూ ఉంటాడు. వారి గోడును వింటాడు. వారి అక్కరలను తీరుస్తాడు. సత్కార్యాలలో వారికి తోడ్పడుతూ ఉంటాడు. వారి జీవిత రికార్డు అంతా ఆయన దృష్టిలో ఉంది. ఆఖరికి వారి గుండెల్లోని గుట్టును, ఉద్దేశాలను సయితం ఆయన ఎరిగినవాడు. ఆయన సూక్ష్మద్రష్ట. దాసులతో అల్లాహ్‌కు గల సామీప్యం గురించి ఖుర్‌ఆన్ ఇలా అంటోంది –

> "మీరెక్కడ ఉన్నాసరే ఆయన మీతోనే ఉన్నాడు. మీరు చేసేదంతా ఆయన చూస్తున్నాడు." *(అల్ హదీద్ – 4)*

ఆ తరువాత ఇలా అనటం జరిగింది –

> "ఆయనే రాత్రిని పగటిలోనికి జొప్పిస్తున్నాడు. పగటిని రాత్రిలోనికి జొప్పిస్తున్నాడు. ఆయన ఆంతర్యాల్లోని రహస్యాన్ని సయితం ఎరిగినవాడు." *(అల్ హదీద్ – 6)*

బ్రహ్మాండమయిన ఈ విశ్వకర్మాగారాన్ని, అందలి ప్రాణులను కాపాడుతూ, వాటికి కావలసినవన్నీ సమకూర్చాలంటే అనుక్షణం వాటి అవసరాలను గురించి తెలుసుకుంటూ ఉండాలి. అలాంటి అద్భుత శక్తి మాత్రమే మనుషులకు – జ్ఞానపరంగా – చేరువలో ఉండి వారి అవసరాలను తీర్చగలదు. అటువంటి శక్తి మాత్రమే ఆరాధ్యదైవం కాగలదు. ఈ ప్రత్యేకతలు అల్లాహ్‌లో మాత్రమే ఉన్నాయి కాబట్టి అల్లాహ్‌యే నిజ ఆరాధ్యదైవం.

ప్రప్రథమంగా మానవ సృష్టి జరిగినప్పటి దృశ్యాన్ని ఖుర్‌ఆన్ ఇలా చిత్రించింది –

> "నీ ప్రభువు తన దూతలతో ఇలా చెప్పినప్పటి విషయాన్ని జ్ఞాపకం చేసుకోండి : "నేను మానవుణ్ణి నాన్చిన మట్టిని ఎండబెట్టి, దాని గారతో సృజించబోతున్నాను. నేనితనికి సంపూర్ణ ఆకృతినిచ్చి, అందులో నా ఆత్మను ఊదినప్పుడు, మీరంతా అతని ముందు సాష్టాంగపడాలి." *(అల్ హిజ్ర్ – 28, 29)*

ఆ తరువాత ఆ సృష్టిప్రక్రియ కొనసాగిన విధానం (Methodology)

గురించి ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్, మానవ సృష్టియొక్క వివిధ దశలను (Stages) కూడా వివరించింది –

> "కాబట్టి మనిషి, తాను దేంతో పుట్టించబడ్డాడో కాస్త చూసుకోవాలి. ఎగిసిపడే నీటితో పుట్టించబడ్డాడు. అది వెన్నుముక – రొమ్ము ఎముకల మధ్య నుండి వెలువడుతుంది." *(అత్ తారిఖ్ : 5 – 7)*

> "మేము మానవుణ్ణి పరీక్షించడానికి మిశ్రమ బిందువుతో పుట్టించాము. మేము అతనిని వినేవాడుగా, చూసేవాడుగా చేశాము. ఇంకా మేమతనికి మార్గం చూపాము – ఇక అతను కృతజ్ఞుడుగానయినా మెలగవచ్చు లేదా కృతఘ్నుడు అయినా కావచ్చు (మేమతని స్వేచ్ఛపై ఆంక్ష విధించలేదు)." *(అద్ దహ్ర్–2, 3)*

సృష్టించినవాడే తన సృష్టితాలకు అధిపతి. అధికారం ఆయనదే. ఆ అధికారి ఎవరో కాదు, అల్లాహ్‌యే.

> "చదువు, సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన మనిషిని ఘనీభవించిన రక్తంతో సృష్టించాడు." *(అల్ అలఖ్ – 1, 2)*

మానవ సృష్టిప్రక్రియలోని పలు దశలను ఖుర్‌ఆన్ – వివరంగా – ఇలా తెలుపుతోంది –

> "మానవులారా! తిరిగి బ్రతికించబడే విషయంలో మీకు ఏమయినా సంశయం ఉంటే (ఒక విషయం మీకు తెలియాలి), మేము మిమ్మల్ని మట్టితో పుట్టించాము. తరువాత వీర్యబిందువుతో, ఆ తరువాత ఘనీభవించిన రక్తంతో, అటుపిమ్మట మాంసపు ముద్దతో – రూపుదిద్దుకున్నదీ, రూపరహితమైనదీను – మీకు స్పష్టంగా తెలియపరుద్దామని. మరి మేము కోరిన దానిని ఒక నిర్ధారిత గడువు వరకు మాతృగర్భాలలో ఆపి ఉంచుతున్నాము. దరిమిలా మేము మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తెస్తున్నాము – మరి మీరు పూర్తి యవ్వనానికి చేరుకోవాలని. మీలోని ఒకరు (వార్ధక్యానికి) ముందే మరణిస్తారు. మరొకరు మరీ వృద్ధాప్యానికి చేర్చబడతారు – అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ తెలియని వారవుతారు."
>
> *(అల్ హజ్జ్ : 5)*

మట్టిలాంటి నిర్జీవమైన వస్తువుతో మనిషిలాంటి ప్రాణమున్న దానిని పుట్టించగలిగినప్పుడు, అతన్ని మళ్ళీ పుట్టించటం అల్లాహ్‌కు కష్టమవుతుందా? ఏమీ కష్టం కాదు. మనిషిని మట్టితో పుట్టించగలిగినప్పుడు, ఆ మట్టి నుండే అతనిని వెలికి తీయటం ఏమాత్రం కష్టతరం కాదని వేరొక చోట సెలవీయ బడింది :

> "మేము మానవుణ్ణి మట్టి సారంతో పుట్టించాము. తరువాత మేమతనికి నీటి (వీర్య) బిందువు రూపంలో ఒక సురక్షిత స్థానంలో ఉంచాము. తరువాత మేము ఆ నీటి బిందువును (ఒంటిని అంటిపెట్టుకుని ఉండే) జిగట పదార్థంగా చేశాము. తరువాత దానిని మాంసపు ముద్దగా చేశాము. ఆ తరువాత ఆ మాంసపు ముద్దలో ఎముకలను సృజించాము. దరిమిలా ఆ ఎముకలపై మాంసం ఎక్కించాము. ఆపైన మేము దానిని సరికొత్త సృష్టిగా ఆవిష్కరించాము. కనుక అల్లాహ్ ఎంతో శుభప్రదమైనవాడు. అత్యుత్తమ సృష్టికర్త. ఆ తరువాత మీరు తప్పక మరణించవలసి ఉంది. పిమ్మట మీరు ప్రళయదినాన అవశ్యంగా లేపబడతారు."
>
> *(అల్ మోమినూన్ : 12 – 16)*

సృష్టించినవాడు మాత్రమే మహోపకారి అయి ఉంటాడు. ఎవరి ఉపకారం చాలా గొప్పదో అతనే ఆరాధించదగినవాడు. ఖుర్‌ఆన్ శాస్త్రీయ పద్ధతిలో మానవుని సృష్టి యొక్క వివిధ దశలను వివరించి, ఇదంతా విశ్వ ప్రభువు అయిన అల్లాహ్ శక్తికి నిదర్శనమని అంటోంది. వైజ్ఞానిక పరిశోధనలు జరగక వందలాది సంవత్సరాల క్రితమే ఖుర్‌ఆన్ మానవ సృష్టికి సంబంధించిన విజ్ఞానాన్ని మనకు ఇచ్చింది. ఎందుకంటే ఈ గ్రంథకర్త కూడా అల్లాహ్‌యే. మొదట్లో ఆయన మనిషిని ఏ విధంగా సృష్టించి, ఆ తరువాత పుట్టుక దశలను నిర్ధారించాడో విశదపరిచాడు. మానవ శరీరావయవాలకు మట్టితో అవినాభావ సంబంధం ఉంది. అందుకే మనిషి మట్టితో చేయబడ్డాడు. బలం కొరకు మనిషి ఈ మట్టిలోని భాగాలనే ఉపయోగిస్తాడు. ఉదాహరణకు – Zinc, Fe, K మొదలగునవి.

మానవ సృష్టికి సంబంధించిన మరిన్ని కోణాలను కూడా ఖుర్‌ఆన్ విశదీకరిస్తోంది. తద్వారా అల్లాహ్ మనిషిని ఎంత వివేకవంతంగా, మరెంత కరుణతో సృష్టించాడో బోధపడుతుంది –

"ఆయనే మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. మరి దానితోనే ఆయన దాని జతను కూడా చేశాడు." *(అజ్ జుమర్ – 6)*

ఇదే ఆయత్‌లో ఈ విధంగా కూడా సెలవీయబడింది –

"ఆయనే మీ మాతృగర్భాలలో మూడేసి చీకటి పొరలలో ఒకదాని తరువాత ఒకటిగా – దశల వారీగా – మీ రూపకల్పన చేస్తూ పోతున్నాడు. ఈ అల్లాహ్‌యే మీ ప్రభువు. సార్వభౌమాధికారం ఆయనదే. ఆయన తప్ప మరో దేవుడు లేడు. మరలాంటప్పుడు మీరు ఎటు (దారి) మళ్ళించబడుతున్నారు?"

**అల్లాహ్‌యే మీ ప్రభువు** – అంటే మీ పాలకుడు, పోషకుడు, మీ ఎదుగుదలకు తోడ్పడేవాడు. మాతృగర్భాలలో కూడా ఆయన మీ ప్రభువే. బయట కూడా మీ ప్రభువే. ఆయన మీ జీవికకు కావలసినవన్నీ ఏర్పాటు చేస్తున్నాడు. తల్లి చనుబాలు మొదలుకుని జగతి అంతటా మీ పోషణకు కావలసిన వస్తువులను ఆయన పొందుపరచాడు. కాబట్టి ప్రభువే (రబ్) ఆరాధ్యదైవం (మాబూద్) కాగలడు. ఆ ప్రభువు అల్లాహ్‌యే.

దైవ కారుణ్యం గురించి ఎంతగా అభివర్ణించినా తక్కువే. ఆయన మనిషి సుఖం, ప్రశాంతత కొరకు, మానవ జాతి మనుగడ కొరకు వారిని జంటల రూపంలో పుట్టించాడు. ఆయన తాను కోరినదల్లా చేస్తాడు. అందువల్ల జగతిలో రాజ్యాధికారం ఆయనదే. అల్లాహ్‌యే సృష్టికర్త, విశ్వసామ్రాట్టు గనక ఆయనే ఆరాధ్య దైవం. ఆయన తప్ప వేరితరులను ఆరాధ్య దైవంగా కొలవటమంటే మోసపోవటం తప్ప మరొకటి కాదు.

## (31) ఆరాధ్య గుణాలతో సహా అల్లాహ్ పరిచయం

మానవుడు ఎవరినయినా ఆరాధించేది అతని మహోపకారాల ఆధారంగానే. తన అవసరాలు తీర్చేవానిని, తనను కష్టాల నుండి గట్టెక్కించేవానిని అతను పూజిస్తాడు. వాస్తవానికి ఈ విషయాలన్నీ అల్లాహ్‌కు సంబంధించినవి. కనుక ఆయనే ఆరాధనకు తగినవాడు. ఆయనను కాదని వేరితరులను పూజించటం తప్పు. అది ఆత్మ వంచన. దాని పరిణామ స్వరూపం చాలా చెడ్డగా ఉంటుంది. ఆ మహిమాన్వితుని మహోపకారం ఏమిటంటే, ఆయన మట్టిలాంటి ప్రాణం లేని వస్తువుతో మనిషి లాంటి ప్రాణమున్నవాణ్ణి చేశాడు. అద్భుతమైన పద్ధతిలో – వివిధ దశలలో – మాతృగర్భంలో అతని

పెంపుదలకు ఏర్పాటు చేశాడు. అతను పరిపూర్ణ ఆకృతిని సంతరించుకున్న తరువాత ఈ పుడమిపైకి తీసుకువచ్చాడు. ఆ తరువాత కూడా అతని పోషణా ఏర్పాట్లు చేశాడు.

ఆయన ఆజ్ఞ ప్రతి వస్తువుపై చెల్లుతుంది. జగతిలోని ప్రతి వస్తువు ఆయన ఆదేశాన్ని శిరసావహించి తీరుతుంది. మానవుడు ఉనికిలోనికి వచ్చినప్పటి నుండి అతను అంతమయ్యే వరకు – అంటే పూర్తి మానవ జీవితంపై ఆయన ఆజ్ఞ నడుస్తుంది.

అత్యుత్తమమయిన రీతిలో అల్లాహ్ తన గ్రంథంలో తన దాసులకు తన పరిచయం చేసుకుంటున్నాడు – తన శక్తి సామర్థ్యాల గురించి తెలియజేయడంతో పాటు, దాసుల యెడల తన ప్రేమ, కరుణ, క్షమాగుణం ఎటువంటిదో కూడా విశదపరిచాడు. దాసులు ఆయన్ని ఒక ఆరాధ్య దైవంగా, ప్రభువుగా, పాలకునిగా గుర్తెరిగి ఆయన్ని విశ్వసించాలి, ఆయనకు విధేయత చూపాలి, ఆయన వైపునకు మరలాలి అన్నదే దీని ఉద్దేశం.

అల్ మోమిన్ సూరా 60 – 68 ఆయత్‌లలో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు –

> నీ ప్రభువు ఇలా అంటున్నాడు, "నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పనిసరిగా అవమానానికీ, పరాభవానికీ గురిఅయి నరకంలో ప్రవేశిస్తారు.
>
> మీరు విశ్రాంతి తీసుకోవటానికి మీ కొరకు రాత్రిని సృష్టించినవాడూ, పగలును వెలుగుతో నింపినవాడూ అల్లాహ్‌యే కదా! వాస్తవానికి అల్లాహ్ ప్రజల పట్ల ఎంతో దయగలవాడు. కాని ఎక్కువ మంది కృతజ్ఞతలు తెలుపరు. ఆ అల్లాహ్‌యే (మీ కొరకు ఇదంతా చేసినవాడు) మీ ప్రభువు, ప్రతిదాన్నీ సృజించినవాడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మార్గం తప్పిపోతున్నారు? ఇదేవిధంగా అల్లాహ్ వాక్యాలను తిరస్కరించే వారందరూ మార్గం నుంచి తప్పించబడుతూ వచ్చారు.
>
> "మీ కొరకు భూమిని నివాసస్థలంగా చేసినవాడూ, పైన ఆకాశాన్ని కప్పుగా నిర్మించినవాడూ, మీ రూపాన్ని తీర్చిదిద్దినవాడూ, దానిని ఎంతో చక్కగా మలచినవాడూ, మీకు పరిశుభ్రమైన పదార్థాలను

ఆహారంగా ఇచ్చినవాడూ, అల్లాహ్ కదా! ఆ అల్లాహ్‌యే (ఈ పనులన్నీ చేసినవాడు) మీ ప్రభువు. ఆ విశ్వ ప్రభువు అసంఖ్యాకమైన శుభాలు కలవాడు. ఆయనే సజీవుడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే మీరు వేడుకోండి, మీ ధర్మాన్ని ఆయనకే ప్రత్యేకం చేసి. సకల ప్రశంసలు సర్వలోకాలకూ ప్రభువైన అల్లాహ్‌కే చెందుతాయి.

"ప్రవక్తా! వారితో ఇలా అను : 'అల్లాహ్‌ను కాదని మీరు వేడుకుంటున్న వారి ఆరాధన చేయకూడదని నన్ను వారించటం జరిగింది. నా ప్రభువు వైపు నుండి నా వద్దకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. (నేను ఈ పనిని ఎలా చేయగలను) సకల లోకాల ప్రభువునకు విధేయత చూపాలని నేను ఆజ్ఞాపించబడ్డాను.

ఆయనే మిమ్మల్ని మట్టితో సృజించాడు, ఆపై రేతస్సుతో, తరువాత నెత్తురు ముద్దతో, ఆ పిదప ఆయన మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తీస్తాడు. తదనంతరం మీరు పూర్తి బలం పుంజుకునే వరకు మిమ్మల్ని పోషిస్తాడు. ఆ పిమ్మట మీరు ముదిమికి చేరుకునేవరకు, మిమ్మల్ని పెంచుతాడు. మీలో కొందరు ముందే పిలువబడతారు. మీరు మీ నిర్ణీత వ్యవధికి చేరి యదార్థం ఏమిటో అర్థం చేసుకోవాలని ఇదంతా చేయబడుతోంది. ఆయనే జీవితాన్ని ఇస్తాడు, ఆయనే మరణాన్నీ ఇస్తాడు. ఆయన ఏ విషయాన్ని గురించి నిర్ణయం చేసినా, అది అయిపోవాలని కేవలం ఒక ఆజ్ఞ జారీ చేస్తాడు, అంతే, అది అయిపోతుంది." *(అల్ మూ'మిన్:60-68)*

ఈ ఆయత్‌ల ద్వారా అల్లాహ్ విశదపరచేదేమంటే మానవులకు, జగతికి ప్రభువు ఆయనే. అందువల్ల మానవ జీవితానికి జగతితో గల సంబంధం ప్రగాఢమైనది. ఇద్దరి ప్రభువు ఒక్కడే. ఆయన లోకేశ్వరుడు. ఎందుకంటే సమస్త లోకాల కర్త ఆయనే. అందుకే నన్ను మాత్రమే అర్థించండి, నేను సకల లోకాల ప్రభువును, ప్రతి ఒక్కరి మొరను ఆలకిస్తాను, ఆమోదిస్తానని అల్లాహ్ అంటున్నాడు.

నేనే సృష్టికర్త అయినప్పుడు, వెనుకటి పుటల్లో ప్రస్తావించినట్లు మానవ పుట్టుకకు సంబంధించిన ఒక వ్యవస్థను నెలకొల్పినప్పుడు – మీకు చెప్పబడిన

దానిపై ఆలోచించి ఇదంతా వాస్తవానికనుగుణంగా ఉందో లేదో మీరే చెప్పండి. పుట్టుక వ్యవస్థ మొదలుకుని జీవన వ్యవస్థ, జీవన్మరణాలను ఇవ్వటం వరకు అంతా నా అధీనంలో ఉన్నప్పుడు మిమ్మల్ని మోసపుచ్చుతున్న విషయం ఏది? మీరెందుకు ఇతరులను మీ ఆరాధ్య దైవంగా చేసుకుంటున్నారు? వారినే ఎందుకు అర్థిస్తున్నారు? అశక్తులు, నిస్సహాయులైన వారు మీకు తోడ్పడగలరా? మరోవైపున సృష్టితాలపై అల్లాహ్ శక్తి, అదుపు అధికారాన్ని కూడా చూడండి. ఆయన కేవలం 'అయిపో' అంటే చాలు, ఆ వస్తువు అయిపోతుంది. ఉనికిలోకి వచ్చేస్తుంది; అల్లాహ్‌ను అర్థించకపోతే స్వయంగా మీరే నష్టపోతారు. అదీగాక, ఆయన సజీవుడు, అజరుడు. ఆరాధ్యునిగా చేసుకోదగినవాడు. సృష్టించిన కారణంగానే అల్లాహ్ లోకేశ్వరుడయ్యాడు. సృష్టించిన కారణంగానే ఆరాధ్యుడు కూడా అయ్యాడు. సృష్టించినందునే ఆయన ప్రేమిస్తాడు, కనికరిస్తాడు, మొరలను ఆలకిస్తాడు, క్షమిస్తాడు, శిక్షిస్తాడు. సృష్టించిన కారణంగా సామ్రాజ్యం ఆయనకే చెందాలి. ఆయన నిర్ణయమే అంతిమ నిర్ణయం అవుతుంది. జగతికి సామ్రాట్టు అయిన ఆ మహోన్నతుడే అల్లాహ్. ఆయన తొలి నుంచీ ఉన్నందున సృష్టి ఆయనదే. కాబట్టి ఆరాధ్య దైవం కూడా ఆయనే. ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. కనుక ఆరాధనలోగానీ, సహాయమర్థించటంలోగానీ వేరొకరిని భాగస్వామిగా చేర్చటం తగదు.

## (32) క్షమాసాగరుడు, కృపాశీలుడు అనే గుణాల ద్వారా దాసుల పట్ల ప్రేమను వ్యక్తపరచటం

సృష్టికర్త, ఆరాధ్యుడు అయినవాడు అమితంగా క్షమించేవాడై ఉండాలి. ముఖ్యంగా దాసుడు తన వైపునకు పశ్చాత్తాపభావంతో మరలివచ్చి, క్షమాపణ కోరుకున్నప్పుడు ఆయనలోని క్షమాసాగరం ఉప్పొంగాలి. ఇది అల్లాహ్ గుణాలలో ఎంతో ముఖ్యమైనది. ఇదిగో, ఖుర్‌ఆన్ ఇలా అంటోంది –

> (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించేవాడూను. (అయితే ఒక షరతు) మీరు మీ ప్రభువు వైపునకు చిత్తశుద్ధితో మరలాలి. ఆయనకు విధేయత చూపాలి. మీపై ఆపద వచ్చిపడక ముందే, మీకు ఎలాంటి సహాయం అందని పరిస్థితి ఏర్పడక ముందే (మీరు

> మీ ప్రభువు వైపునకు మరలాలి). మీకు తెలియకుండానే మీపై అకస్మాత్తుగా ఆపద విరుచుకు పడకముందే, మీ ప్రభువు తరఫు నుండి మీపై అవతరింపజేయబడిన గ్రంథంలోని అత్యుత్తమ విషయాన్ని అనుసరించండి.” *(అజ్ జుమర్ : 53 – 55)*

సత్యం ముందుకు వచ్చిన తరువాత, అసత్యమేదో అవగతమైన తరువాత కూడా మీరు గనక అల్లాహ్‌ను క్షమాపణ కోరుకోకపోతే, మీ దుర్వర్తనను సద్వర్తనగా మార్చుకోకపోతే, మీపైన అకస్మాత్తుగా విపత్తు వచ్చిపడే ఆస్కారం ఉంది. తప్పును సంస్కరించుకుని రుజువర్తనులైతే ఆయన అమితంగా క్షమించేవాడు. అన్యథా ఆయన శిక్షించడంలో కూడా కఠినుడే.

## (33) ఆరాధ్య దైవం అవడానికి కావలసిన గుణగణాలు

ఆరాధ్య దైవం అవడానికి ప్రతిక్షణం, ప్రతి వస్తువు గురించి తెలిసి ఉండాలి. మనిషి ముందున్నవి, మనిషికి కానరానివి కూడా. భూత భవిష్యద్వర్తమానంలోని వస్తువులన్నీ ఒకేసారి ఆయన దృష్టిలో కదలాడుతూ ఉండాలి. అప్పుడే ఆయన మనిషి కొరకు ఉపయోగకరమైన చర్యల్ని గైకొనగలుగుతాడు. అతని మొరలను ఆలకించి స్వీకరించగలుగుతాడు. తన దాసుల కోసం ప్రయోజనకరమైన నిర్ణయం తీసుకోగలుగుతాడు – ఆయన నిర్ణయం ఆయన జ్ఞానంతో, యుక్తితో, కారుణ్యంతో నిండి ఉంటుంది. అదీగాక యావజ్జగతిపై ఆయన నిఘా ఉంది. ప్రతిదీ ఆయన జ్ఞాన పరిధిలో ఉంది. ఏ వస్తువు కూడా ఆయనకు కనుమరుగైలేదు. వర్తమాన భూత భవిష్యత్కాలాల పరిమితులు ఆరాధ్యునికి వర్తించవు. ఆయనకు ప్రతి కాలం వర్తమానమే. ప్రతిదీ ఆయన కళ్ల ముందర కదలాడుతూ ఉంటుంది.

> “ఆయనే అల్లాహ్ – ఆయన తప్ప మరో ఆరాధ్య దైవం లేనేలేడు. ఆయన నిగూఢమయిన, బహిర్గతమయిన విషయాలన్నింటినీ ఎరిగినవాడు. ఆయన అపార కరుణామయుడు, పరమ కృపా శీలుడు.” *(అల్ హష్ర్ – 22)*

ఆరాధ్య గుణాలతో నిండిన సమగ్ర పరిచయం దిగువనివ్వబడిన ఆయత్‌లలో ఉంది. ఆరాధ్య దైవం కావటానికి అవసరమైన గుణగణాలు అల్లాహ్‌లో పరిపూర్ణ స్థాయిలో ఉన్నాయని, అవి ఒక్క అల్లాహ్‌లో తప్ప మరెవరిలోనూ లేవని వాటి ద్వారా బోధపడుతుంది. కాబట్టి ఆయన ఒక్కడే ఆరాధ్యదైవం. ఆ హక్కు ఆయన ఒక్కడికే ఉంది –

"ఆయనే అల్లాహ్, ఆయన తప్ప ఆరాధ్యుడెవ్వడూ లేడు. ఆయన చక్రవర్తి. ఎంతో పరిశుద్ధుడు, సురక్షితుడు, శాంతిప్రదాత, సంరక్షకుడు, సర్వాధికుడు, తన ఉత్తరువులను తిరుగులేని విధంగా అమలుపరచేవాడు, ఎల్లప్పుడూ గొప్పవాడుగానే ఉండేవాడు. ప్రజలు కల్పించే దైవత్వపు భాగస్వామ్యం వర్తించని పరిశుద్ధుడు అల్లాహ్, సృష్టివ్యూహాన్ని రచించేవాడు, దానిని అమలుపరచేవాడు, ఆపై దాని ప్రకారం రూపకల్పన చేసేవాడు. ఆయనకు మంచి పేర్లు ఉన్నాయి. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న ప్రతి వస్తువూ ఆయనను స్మరిస్తోంది. ఆయన సర్వాధికుడు, వివేకవంతుడూను."

*(అల్ హష్ర్ – 23, 24)*

రాజు, చక్రవర్తి అనగానే అతని పట్ల గౌరవభావం, విధేయతా భావం మనిషిలో జనిస్తుంది. దానికి తోడు పరమ పవిత్రుడు, లోపాలన్నింటికీ అతీతుడు! ఇది ఆయన ఔన్నత్యాన్ని ద్విగుణీకృతం చేసేస్తుంది. అంతేకాదు, ఆ చక్రవర్తి ఎంతటి ఘనుడంటే, ప్రతి వస్తువుపై ఆయనకు గల పట్టు, అధికారం తిరుగులేనిది. ఆయన జారీ చేసే ప్రతి ఆదేశంలో, శాసనంలో మానవుని మేలు ఇమిడి ఉంది. (ఎందుకంటే ఆయన మహా వివేకి). గొప్ప రక్షకుడు, శాంతి ప్రదాత, విపత్తుల నుండి కాపాడేవాడు, గండం నుంచి గట్టెక్కించేవాడు. తన శాసనాన్ని ప్రవేశపెట్టడంలో తిరుగులేనివాడు. దోషరహితుడు. సృష్టిప్రక్రియలోని అన్ని దశలను గురించి క్షుణ్ణంగా తెలిసినవాడు, తన ప్రణాళికలకు కార్యరూపం ఇచ్చేవాడు, తాను సృష్టించిన ప్రాణులన్నింటికీ ఆరాధ్యుడు. ప్రతి ప్రాణి (సృష్టించబడినది) తన భాషలో ఆయన సంస్మరణ చేస్తోంది. ఆయన్ని స్తుతిస్తోంది, ఆయన పవిత్రతను కొనియాడుతోంది. లోకంలో ఉనికిలో ఉన్న ప్రతిదీ అల్లాహ్ పవిత్రతకు, పరిపూర్ణ (Perfect) శక్తికి, ఆయన యుక్తికి సాక్షీభూతంగా ఉంది.

## ఇది దైవ (సృష్టికర్త) గ్రంథం

దిగువ నివ్వబడిన ఆయత్‌లలో అల్లాహ్ ఖుర్ఆన్ పరిచయం చేస్తూ, ఇది తన గ్రంథం అని అంటున్నాడు –

"ఈ గ్రంథం శక్తిసంపన్నుడు, జ్ఞానధనుడు అయిన అల్లాహ్ తరపున అవతరింపజేయబడినది. ఆయన పాపాలను క్షమించేవాడు,

పశ్చాత్తాపాన్ని ఆమోదించేవాడు. కఠినంగా శిక్షించేవాడు, అపార అనుగ్రహశాలి. ఆయన తప్ప మరో దేవుడు లేడు. ఆయన వైపునకే మరలిపోవలసి ఉంది.” *(అల్ మోమిన్ – 2, 3)*

ఈ ఆయత్‌లలో అల్లాహ్, తాను తన దాసులకు అతి సమీపంలో ఉన్నానని, వారి పట్ల ప్రేమమయుణ్ణి అనీ, వారి తప్పులను మన్నిస్తానని అంటున్నాడు. తన దాసుల యెడల గల అపారమైన ప్రేమ కారణంగానే వారి మార్గదర్శకత్వం నిమిత్తం తన గ్రంథాన్ని పంపానని కూడా విశదపరుస్తున్నాడు. ఆయనకు ప్రతిదీ క్షుణ్ణంగా తెలుసుకాబట్టి మార్గదర్శకత్వ వ్యవహారంలో ఆయన వల్ల పొరపాటు జరిగే ఆస్కారమే ఉండదు. కనుక దైవదాసులు నిశ్చింతగా, పూర్తి ఆత్మ విశ్వాసంతో ఆ మార్గబోధనను అవలంబించి లబ్ది పొందవచ్చు, తమను తాము వినాశం నుండి కాపాడుకోవచ్చు. ఇప్పటి వరకూ ఈ అనుగ్రహ భాగ్యానికి దూరంగా ఉన్నారు. ఇప్పటికీ మించి పోయిందేమీ లేదు; దాని వైపునకు హృదయపూర్వకంగా మరలి రండి, క్షమాభిక్ష పొందుతారు. లేకపోతే మీ పాపాలకు గాను కఠినంగా శిక్షించబడతారు. గుర్తుంచుకోండి! అందరూ మరలిపోవలసింది అల్లాహ్ వైపునకే.

పైన పేర్కొనబడిన గుణాలు – సామీప్యం, ప్రేమ, దయ, మన్నింపు, గ్రంథం ద్వారా మార్గదర్శకత్వం కారణంగా అల్లాహ్‌యే మానవులందరికీ ఆరాధ్య దైవం.

## (34) అన్నింటిచే స్తుతించబడే ఆరాధ్య దైవం

జగతిలోని ప్రతి వస్తువుచే స్తుతి స్తోత్రాలందుకునేవాడే ఆరాధ్య దైవం కాగలడు. సృష్టించినవాని దృష్టిలో ప్రతి వస్తువూ సృష్టియే. పుట్టించబడిన వస్తువు తనను పుట్టించినవానిని తప్పక జ్ఞాపకం చేసుకుంటుంది. ఆయన్ని స్తుతిస్తుంది. ఆయన గొప్పతనాన్ని, పవిత్రతను కొనియాడుతుంది. ఈ విధంగా అది తన సృష్టికర్త ఆరాధనలో నిమగ్నమై ఉంటుంది – అది ప్రాణమున్నదైనా, ప్రాణం లేనిదైనా – అది అల్లాహ్‌చే పుట్టించబడినదే. తాను పుట్టించిన వస్తువుల భాషను ఆయన బాగా ఎరుగు. ఆ విషయాన్ని ఆయన తన గ్రంథంలో ఇలా ప్రస్తావించాడు :

“భూమ్యాకాశాలలో ఉన్న వస్తువులన్నీ రాజాధిరాజు, పరిశుద్ధుడు, శక్తిమంతుడు, వివేకవంతుడు అయిన వాని పవిత్రతను కొనియాడు తున్నాయి.” *(అల్ జుముఅహ్ – 1)*

ప్రతి వస్తువు తనకు వచ్చిన భాషలో స్మరిస్తోంది. ప్రతిదీ అల్లాహ్ యొక్క పరిపూర్ణ (Perfect) ఉనికికి, శక్తికి, వివేచనకి, పరిశుద్ధతకి సాక్ష్యంగా ఉన్నాయి.

## (35) సృష్టికర్తతో, విశ్వసార్వభౌమునితో షిర్క్ పొసగుతుందా?

షిర్క్ (భాగస్వామ్యం)తో ఆయనకు ఎట్టి సంబంధం లేదు. అది ఆయనకు పొసగదు. షిర్క్‌తో పాటు ఆయన ప్రశంసార్హుడుగా మిగులడు. ఆరాధనకు అర్హుడు కూడా కాలేడు. ఎందుకంటే షిర్క్ (భాగస్వామ్యం) సృష్టికర్తను బలహీనపరుస్తుంది. లోపాల పుట్టగా చేసేస్తుంది. బలహీనుడు, లోపాలతో కూడుకున్నవాడు ఆరాధనకు ఎలా యోగ్యుడవుతాడు? సర్వవిధాల పరిపూర్ణుడు, లోపాలు లేనివాడు, ఒకరిపై ఆధారపడటం (Dependency) నుండి అతీతుడు, అద్వితీయుడైనవాడే సాష్టాంగ ప్రణామానికి అర్హుడు. సాధారణంగా చాలామంది ప్రజలు షిర్క్‌కు ఎలా ఒడిగడతారో అల్లాహ్ ఎత్తి చూపుతున్నాడు :

> ఇలా పలుకు : "ప్రశంసలన్నీ ఆ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన ఎవరినీ సంతానంగా చేసుకోలేదు. రాజరికంలో ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఒకరి సహాయంపై ఆధారపడటానికి ఆయన అశక్తుడేమీ కాదు. కనుక నీవు ఆయన గొప్పదనాన్ని ఘనంగా కీర్తించు." *(బనీ ఇస్రాయీల్ – 111)*

## (36) పరస్పర విరుద్ధ వాస్తవాలు

రెండు పరస్పర విరుద్ధ విషయాలు ఒకే సమయంలో సరైనవి కాజాలవు. ఒకటి తప్పయితే మరొకటి ఒప్పు అయి ఉంటుంది –

> "మీకు భూమ్యాకాశాల నుండి జీవనోపాధిని సమకూర్చేది ఎవరు?" అని (ఓ ప్రవక్తా!) వారిని అడుగు. "అల్లాహ్‌యే" అని వారికి చెప్పు. మేము గానీ, మీరు గానీ – ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గాన ఉన్నాము లేదా స్పష్టమయిన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము."
> *(సబా – 24)*

అంటే, నిజదైవం (దేవుని ఏకత్వం) – కాల్పనిక దైవం (షిర్క్)లో భూమ్యాకాశాలంత అంతరం ఉంది. వ్యత్యాసం ఉంది. వైరుధ్యం ఉంది. కాబట్టి

ఇవి రెండూ ఏకకాలంలో ఒప్పు లేక తప్పు కాలేవు. ఒకటి ఒప్పు అయితే రెండవది తప్పు అయి ఉంటుంది. కాబట్టి ఒక సిద్ధాంతాన్ని నమ్మేవారు సన్మార్గాన ఉంటే రెండవ దానిని నమ్మేవారు అపమార్గాన ఉంటారు.

ఎవరు సన్మార్గాన ఉన్నారు? ఎవరు మార్గభ్రష్టులై ఉన్నారనేది మొదటి మెట్టులోనే తేలిపోతుంది. నిజదైవాన్ని తెలుసుకుని, ఆయన్ని స్వీకరించి, తనను తాను ఆయన ముందు ఆత్మ సమర్పణ చేసుకున్నవారా? లేక ఆయన్ని త్రోసిపుచ్చినవారా? అన్నదానిపై అది ఆధారపడి ఉంటుంది.

## (38) ఊహా దేవుళ్ళను పూజనీయులుగా చేసుకోవటం మానవుని వింత చేష్ట

కొంతమంది ఊహాలోకంలో కాల్పనిక దేవుళ్ళను ఆవిష్కరించు కుంటారు. వారికి పేర్లు పెడతారు. విశ్వ ప్రభువు రాజ్యాధికారంలో వారికి భాగస్వామ్యం కల్పిస్తారు. చూడబోతే సృష్టికర్త తరపున ఆ మేరకు ఎలాంటి ప్రమాణం వారి వద్ద ఉండదు. తాను తప్ప మరో ఆరాధ్య దైవం లేదని సృష్టికర్త స్వయంగా – చాలా స్పష్టంగా – ప్రకటిస్తున్నాడు –

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌ని చూడండి :

> "ఇతరులను కాదని మీరు వేటినయితే పూజిస్తున్నారో, అవి కొన్ని పేర్లు తప్ప మరొకటి కావు – అవి కూడా మీరూ, మీ పూర్వీకులు కల్పించుకున్నవే. అల్లాహ్ వాటికి సంబంధించిన ఏ ప్రమాణాన్నీ అవతరింప జేయలేదు. పరిపాలనాధికారం ఒక్క ఆ దైవానికే చెందుతుంది. తనను తప్ప వేరెవరినీ ఆరాధించరాదన్నదే ఆయన ఆదేశం. ఇదే సరైన, స్థిరమయిన ధర్మం. కాని చాలామంది ఈ విషయాన్ని తెలుసుకోరు." *(యూసుఫ్ – 40)*

## (39) నిజ ఆరాధ్య దైవాన్ని ఆయన గుణగణాల ఆధారంగా తెలుసుకోవడం

ప్రజలు ఎవరినయితే ఆరాధ్య దైవాలుగా ఊహించుకుంటున్నారో, వారు భూమ్యాకాశాలకు యజమానులు కారు. భూమ్యాకాశాల మధ్యన ఉన్న ఏ వస్తువుకు కూడా యజమానులు కారు. ఆఖరికి వారికేదన్నా భాగస్వామ్యం

ఉందా అంటే అదీ లేదు. ఈ యదార్థంపై పడివున్న ముసుగును ఖుర్ఆన్ ఎలా తొలిగించిందో చూడండి –

> వారికి చెప్పు : అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధ్య దైవాలుగా భావిస్తున్న వారిని పిలిచి చూడండి! ఆకాశాలలో గానీ, భూమిలో గానీ వారికి రవంత అధికారం లేదు. ఆ రెండింటిలో వారికి ఎలాంటి భాగ స్వామ్యం కూడా లేదు. వారిలో ఎవడూ ఆయనకు సహాయకుడుగా కూడా లేదు." *(సబా – 22)*

ఖుర్ఆన్ ఇక్కడ చెప్పదలచిన విషయం ఏమిటంటే, ఈ సుగుణాలు (పిలుపును వినటం, సహాయం చెయ్యటం, కష్టాలను దూరం చేయటం) వేరితరులలో ఉన్నాయా? ఒకవేళ లేకుంటే వారిని ఆరాధ్య దైవంగా ఎలా చేసుకుంటారు? అయితే ఈ సుగుణాలు అల్లాహ్‌లో ఉన్నాయి. అందువల్ల ఆయనే నిజ ఆరాధ్య దైవం. అందువల్లనే ఈ సవాలును స్వీకరించలేక పోతున్నారు.

## (40) షిర్క్ మహాపరాధం, ఘోరమైన అన్యాయం

షిర్క్ చేయటం (దైవత్వంలో భాగస్వామ్యానికి పాల్పడటం) అంటే అర్థం; పాలకుడు, ప్రభువు, యజమాని యొక్క శక్తిని కాల్పనిక దైవాల మధ్యన పంచిపెట్టడం. నిజ ఆరాధ్య దైవం యొక్క జ్ఞానాన్ని, అధికారాన్ని చిల్లర దేవుళ్లకు తలోకాస్త విభజించి ఇవ్వటం లేదా నిజదైవం హక్కులను పంచిపెట్టడం.

'షిర్క్' ద్వారా సృష్టికర్త హక్కును కాజేసినవాడు, జులుంకు ఒడిగట్టినవాడు, తోటి మానవుల హక్కును కూడా అలవోకగా కొల్లగొడతాడు. తోటి సోదరులపై నిర్భయంగా దౌర్జన్యానికి ఒడిగడతాడు.

అందువల్ల షిర్క్ ద్వారా ఇతరులను అల్లాహ్ హక్కులలో, అధికారాలలో భాగస్వాముల్ని కల్పించినవారు ఈ ప్రపంచంలో అందరికన్నా పెద్ద దుర్మార్గులుగా, కల్లోల జనకులుగా పరిగణించబడతారు.

ఏ దేవుడు – అంటే అల్లాహ్ – మనకు ఈ శరీరాన్ని ఇచ్చి, నఖశిఖ పర్యంతం అందంగా తీర్చిదిద్ది, అందులో ప్రాణం పోశాడో (తత్కారణంగానే మనం నడవగలుగుతున్నాము, వినగలుగుతున్నాము, ఆలోచించగలుగు తున్నాము), స్పందించే హృదయం ఇచ్చాడో, ఆపైన జీవితానికి కావలసిన

అవసరాలన్నీ సమకూర్చాడో, ఆయనే నిశ్చయంగా సాష్టాంగ ప్రణామానికి తగినవాడు. సహాయమర్థించడానికి, వేడుకోళ్ళకు, విధేయతకు ఆయనే అర్హుడు. ఇంకా చెప్పాలంటే సకల ఆరాధనలు, స్తుతిస్తోత్రాలు ఆయన ఒక్కనికే శోభిస్తాయి. ఆయనే కార్యభారం మోపదగినవాడు, అత్యుత్తమ కార్యసాధకుడు. ఎవరికయితే సృష్టిలోగానీ, వరప్రసాదాలలో, ఉపకారాలలోగానీ, దయానుగ్రహాలలో గానీ ఏ కొద్ది ప్రమేయం కూడా లేదో అలాంటివారు ఆరాధనలకు, విధేయతకు అర్హులు కారు.

> "ప్రజలారా! మీపైన గల దైవానుగ్రహాన్ని కాస్త జ్ఞాపకం చేసుకోండి. అల్లాహ్ తప్ప ఆకాశం నుండి, భూమి నుండి మీకు జీవనోపాధిని ఇచ్చే సృష్టికర్త ఎవడయినా ఉన్నాడా? ఆయన తప్ప వేరొక ఆరాధ్య దైవం లేనేలేడు. మరి అలాంటప్పుడు మీరు ఎటునుండి మోసగించబడుతున్నారు?" *(ఫాతిర్ – 3)*

ఒకరికి ఇవ్వాల్సిన హక్కును వేరొకరికి ఇస్తున్నారు. ఇది కేవలం అన్యాయం మాత్రమే కాదు, అపరాధం, నమ్మక ద్రోహం కూడా. ఇది మోసగించ బడటం కాకపోతే మరేమిటి? అల్లాహ్ సృష్టికర్త, ఉపాధిప్రదాత అయి ఉండగా వేరితరులను ఆరాధ్య దైవంగా చేసుకుని పూజించటం అంటే చేసిన మేలును మరచిపోవటమే.

**ఆరవ అధ్యాయం :**

**(Chapter - VI)**

# పరలోకం - ఒక చూపులో

**(ప్రళయం, తీర్పుదినం, శిక్షా బహుమానాలు)**

- తొలి పలుకులు (పరిచయ వాక్యాలు)
- ఈ ప్రపంచం పరీక్షాలయం – పరలోకం ఫలితాలు వెలువడే స్థలం
- మానవ నైజం వాంఛించేది
- ప్రపంచం పరీక్షాస్థలం – పరీక్ష కోరేది ప్రతిఫలదినం
- ప్రళయ దినం
- మళ్ళీ పుట్టడంపై ఆశ్చర్యం!
- పరలోకం తథ్యం
- మనిషి బ్రతికి లేవటం
- పరలోకం నిశ్చయం, సులభం కూడా
- మళ్ళీ బ్రతికించబడటం సంభవమేనా?
- మళ్ళీ పుట్టించబడటం నిశ్చయం
- మళ్ళీ పుట్టడం నిశ్చయం
- పరలోక తిరస్కరణ జ్ఞానం ఆధారంగానే జరుగుతోందా?
- ప్రళయం అకస్మాత్తుగా వచ్చేస్తుంది – ఒక ప్రేలుడు మాదిరిగా! ఎంతమాత్రం గడువు లభించదు
- సంజాయిషీ కొరకు సృష్టికర్త ముందు హాజరుకావలసి ఉంది
- చేసిన కర్మలకు బహుమానం లేదా శిక్ష అవశ్యం
- న్యాయబద్ధంగా కర్మల ఫలం
- పరలోకం దృశ్య చిత్రీకరణ
- వాగ్దానం నెరవేరాలి
- స్వర్గనరకాల చిత్రం

# పరలోకం

### (ప్రళయం, తీర్పుదినం, శిక్షాబహుమానాలు)

## పరిచయం వాక్యాలు

జీవితంలోని మజా మరణానంతరం తిరిగి బ్రతికటంపైనే ఉంది. కేవలం మరణంతోనే కథ సమాప్తం అయినట్లయితే మానవ మనోమయ భావాలకు మిగిలేది నిరాశే. దీనివల్ల జీవితానికి 'జీవితం' లభించదు. జీవన మాధుర్యం ప్రాప్తమవదు.

ప్రతి కార్యానికి, చేష్టకు, కృషికి, త్యాగానికి గాను బహుమానం అనేది ఉంటే మనిషి దానిని దీక్షతో చేస్తాడు. ఆ పనిని చేస్తూ అందలి మధురిమను ఆస్వాదిస్తాడు. లేకుంటే తన శ్రమ వృధా అనుకుని దానిని మధ్యలోనే ఆపేస్తాడు. దీనినిబట్టి బోధపడేదేమంటే, ప్రతి పని వెనుక పురస్కారం, ప్రతిఫలం ఉండాలని మానవ నైజం కోరుకుంటుంది. ఈ విధంగా వివిధ పనుల, ప్రయత్నాల సమాహారమే జీవితం. ఇది ఒక ఏకాంకం వంటిది. ఎందుకంటే మానవ జీవితం కూడా అవిభాజ్యమైన ఏకాంకమే (Unit). అందలి ప్రతి పని స్వయంగా అతనిది. కనుక అతని శ్రమకు ప్రతిఫలం అతనికి లభించాలి. తప్పక లభించాలి. ఈ ప్రతిఫలం లేక బహుమానం కొరకు జీవితం ముగిసిన తరువాత – అంటే మరణానంతరం – మరో జీవితం ఉండాలి. వెనుకటి జీవితపు ప్రతిఫలం అతనికి లభించాలి. నిశ్చయంగా కర్మల తరువాతనే వాటి ప్రతిఫలం లభిస్తుంది లేదా ఫలితం వెలువడుతుంది. అలాగే ఈ జీవితం కూడా క్షణాల కూడికే. ఈ క్షణాలు ముగిసిన పిమ్మటే ఇక్కడ చేయబడిన ఆచరణలకు బహుమానం లభించాలి.

మానవుని ఆలోచన కూడా కడు విచిత్రమైనది. తాను ఏ పని చేసినా నిరర్థకంగా, లక్ష్య రహితంగా చేయనని అతను అనుకుంటాడు. మరలాంటప్పుడు

తనను పుట్టించినవాడు లక్ష్య రహితమయిన పని ఎలా చేస్తాడు? ఈ జీవితం సఫలం కావాలంటే, ఈ జీవిత లక్ష్యం సిద్ధించాలంటే, ఇందులో చేయబడిన ఆచరణల ఫలితాలు మరణానంతర జీవితంలో వెలువడాలి. మరో ప్రపంచంలో శిక్ష బహుమానాలు లభించాలి. ఈ మరో జీవితం, మరో ప్రపంచమే 'పరలోకం' అనబడుతుంది. అక్కడ న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా కర్మల ఫలం ఇవ్వబడుతుంది. అంటే మనిషి ఆచరణలనుబట్టి అతనికి బహుమానం వొసగటమో, శిక్ష విధించటమో జరుగుతుంది. కనుక పరలోకం తప్పక నెలకొనాలి. నెలకొనకపోతే ఈ మనిషి పుట్టుక, జగతి నిర్మాణం అంతా నిరర్ధకం అవుతుంది.

దేవుని ఏకత్వం (తౌహీద్) కోరేది కూడా ఇదే. అంటే సృష్టికర్త, పాలకుడు, యజమానిపై గల దృఢ నమ్మకం పరలోకం నెలకొనాలని వాంఛిస్తుంది. అక్కడ న్యాయం జరగాలని కోరుకుంటుంది. పరలోకం కంటికి కానరాదు, ఊహలకు అందదు. అక్కడి జీవితాన్ని శాశ్వతమయిన జీవితంగా భావిస్తూ, విశ్వసిస్తూ దాని కొరకు తయారీ చేసుకోవలసి ఉంటుంది. అంటే నరకాగ్ని యాతన నుండి తప్పించుకోవాలి. స్వర్గప్రాప్తికై పాటుపడాలి. ఇదంతా ఎప్పుడు సాధ్యమవుతుంది? సృష్టికర్తను ప్రసన్నుణ్ణి చేసుకోవాలన్న సత్సంకల్పం, తీర్పుదినపు భయం ఉన్నప్పుడు. అగోచరమయిన ఈ యదార్ధానికి సంబంధించి అసలు సిసలు తయారీ కొరకు పరలోక ప్రస్తావన పదే పదే జరుగుతూ ఉండటం అవసరం. పలు విధాలుగా, పలుకోణాల నుంచి ఈ ప్రస్తావన పునరావృతం అవుతూ ఉండాలి. మానవుని బలహీనత ఏమిటంటే, అతను మరచిపోతూ ఉంటాడు. అతని ఈ బలహీనతను దృష్టిలో పెట్టుకుని అతని జీవిత లక్ష్యాన్ని, పరలోకాన్ని మాటిమాటికీ గుర్తుచేస్తూ ఉండవలసిన ఆవశ్యకత ఉంది. ఈ పునశ్చరణ పని ఖుర్ఆన్ బాగా చేస్తుంది. అందులోని విషయాలు పదే పదే పునరావృతం అవుతూ ఉంటాయి.

మెదడును బయటకు తీసి, కళ్ళ ముందు పెట్టుకుని చూస్తే అదొక ముద్దలాగా మాత్రమే కనిపిస్తుంది. కాని మనిషి దాంతో ఎంత ఆశ్చర్యకరంగా ఆలోచిస్తాడు! అద్భుతమైన ఆవిష్కరణలు చేస్తాడు!! జరిగిన విషయాలను, సంఘటనలను మెదడులో సేవ్ చేసుకుంటాడు. అవసరం ఏర్పడినప్పుడు వాటిని వెల్లడిస్తాడు. సృష్టికర్త అతనిని ఎంత అద్భుతంగా నిర్మించాడో, అతనిలో తెలివితేటలను ఎలా పొందుపరిచాడో ఆలోచించండి. ఈ భూమి కూడా అంతే. తన మీద జరిగిన ప్రతి సంఘటనను అది పదిలపరచుకుని పరలోకంలో

వెల్లడిస్తుంది. అంటే మొదటి నుంచి చివరి వరకు ధరిత్రి మీద జరిగిన వాటన్నింటినీ అది భద్రపరచు (Retain) కుని, అవసరం ఏర్పడినప్పుడు (Vomit) వెళ్ళగ్రక్కుతుంది. సృష్టికర్త దానికి ఈ శక్తిని ఇచ్చాడు. సూరయె జిల్‌జాల్‌లో ఈ సత్యాన్ని ఖుర్‌ఆన్ ఇలా చాటిచెప్పింది :

> "భూమి తీవ్రమయిన ప్రకంపనతో కంపింపజేయబడినప్పుడు, ఇంకా భూమి తనలోని బరువునంతా బయటపడవేసినప్పుడు, 'అరె! దీనికేమయి పోయిందీ!?' అని మనిషి అంటాడు. ఆనాడు భూమి తన స్థితిగతులన్నింటినీ ఏకరువు పెడుతుంది. ఎందుకంటే, నీ ప్రభువు దానికి ఆ మేరకు ఆజ్ఞాపించి ఉంటాడు మరి. ఆ రోజు మనుషులు - వారి కర్మలు వారికి చూపబడటానికి - వేర్వేరు గుంపులుగా బయలుదేరుతారు. కనుక ఎవడు రవంత సత్కార్యం చేసివున్నా, అతను దానిని చూసుకుంటాడు. మరెవడు రవంత దుష్కార్యం చేసుకున్నా, దానిని అతను చూసుకుంటాడు."

## చర్చ సారాంశం

(1) ఈ జగతి, మానవుని పుట్టుక ఉద్దేశం నెరవేరాలంటే పరలోకం అవసరం.

(2) మానవుని పుట్టుక పరమార్థం పరిపూర్ణమవ్వాలంటే తీర్పుదినం నెలకొనాలి.

(3) మనిషి అంతరాత్మ ప్రబోధం ప్రకారం పరలోకంలో న్యాయనిర్ణయం జరగాలి. మనిషి కర్మలను బట్టి శిక్షా బహుమానాలు లభించాలి.

(4) సృష్టికర్తలోని న్యాయశీలం, దయాగుణం వాంఛించే దేమిటంటే న్యాయనిర్ణయం జరిగే స్థలం, దినం నిర్ధారించబడాలి. అక్కడ ఎవరికీ రవంత అన్యాయం జరగని విధంగా తీర్పు జరగాలి. ఎవరి ఆచరణలనుబట్టి వారికి బహుమానం లేక శిక్ష లభించాలి.

## ఈ ప్రపంచం పరీక్షాలయం - పరలోకం ఫలితాన్ని పొందే స్థలం

ఖుర్‌ఆన్ ఇచ్చిన ఈ సమాచారంపై యోచన చేయండి :

> "విశ్వరాజ్యాధికారం హస్తగతమై ఉన్న ఆయన ఎంతో శుభకరుడు. ఆయన ప్రతిదానిపై సంపూర్ణ అధికారం కలవాడు. మీలో ఎవరు

సదాచరణ చేస్తారో పరీక్షించటానికి ఆయన జీవన్మరణాలను సృష్టించాడు." *(అల్ ముల్క్ – 1,2)*

"తమ ప్రభువు యెడల తిరస్కార వైఖరిని అవలంబించిన వారికి నరక యాతన ఉంది. అది చాలా చెడ్డ నివాసం." *(అల్ ముల్క్–6)*

"ఎవరయితే తమ ప్రభువును చూడకపోయినప్పటికీ ఆయనకు భయపడతారో వారి కొరకు క్షమాపణతో పాటు గొప్ప ప్రతిఫలం ఉంది." *(అల్ ముల్క్ – 12)*

సూరయె దహ్ర్‌లోని 2 – 5 ఆయత్‌లలో ఈ ప్రాపంచిక జీవితం పరీక్షా జీవితమని చెబుతూ, ఆ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేవారి, పరీక్ష తప్పేవారి పరిణామం గురించి తెలియజేయటం జరిగింది –

"మేము మనిషిని ఓ మిశ్రమ బిందువుతో పుట్టించాము. అతనిని పరీక్షించే నిమిత్తం మేమతనిని వినేవాడుగా, చూసేవాడుగా చేశాము. మేమతనికి మార్గం చూపాము. ఇక అతను కృతజ్ఞుడుగానయినా మెలగవచ్చు లేదా కృతఘ్నుడు అయినా కావచ్చు (మేమతని స్వేచ్ఛపై ఆంక్ష విధించలేదు. అయితే) మేము సత్యతిరస్కారుల కోసం సంకెళ్ళను, కంఠపాశాలను, మండే అగ్నిని సిద్ధం చేసి ఉంచాము. సజ్జనులు మాత్రం కర్పూరం కలుపబడిన మధుపాత్రల నుండి సేవిస్తారు." *(అద్ దహ్ర్ : 2 – 5)*

అల్ కహ్ఫ్ సూరాలో ఈ విధంగా సెలవీయబడింది –

"ప్రజలలో సదాచరణ చేసేవారెవరో పరీక్షించటానికి మేము భువిలో ఉన్న దానినంతటినీ భూమికి అలంకరణగా చేశాము. కడకు మేము భూమిపై ఉన్న వాటినన్నింటినీ ఒక చదునైన మైదానంగా చేసేస్తాము." *(అల్ కహ్ఫ్ – 7,8)*

పరీక్షా హాలులో ప్రశ్నలకు సమాధానం వ్రాయడానికి ఒక విద్యార్థికి కొంత సమయం ఇవ్వబడినట్లే మనిషికి ఈ ప్రపంచంలో గడువు ఇవ్వబడుతుంది. ప్రశ్నలకు సమాధానం రాసే స్వేచ్ఛ విద్యార్థికి ఉంటుంది. తప్పు రాస్తాడో, సరిగ్గా రాస్తాడో, ఏం రాసినా అతని ఇష్టం. పరీక్షా హాలులో అతని వ్రాతపై ఎలాంటి ఆంక్ష ఉండదు. కొంతకాలం తర్వాత పరీక్షా ఫలితాలు వెలువడుతాయి. ప్రశ్నా పత్రానికి సరైన సమాధానాలు రాసినవారు ఉత్తీర్ణులవుతారు. వారికి

బహుమానం లభిస్తుంది. వారు సంతోషిస్తారు. సన్మానించబడతారు. సరైన సమాధానాలు రాయనివారు పరీక్ష తప్పుతారు. అవమానానికి గురవుతారు. సిగ్గుతో కుంచించుకుపోతారు. కాని ప్రయోజనం ఏమీ ఉండదు.

పరీక్ష రాసిన తరువాత ఫలితాలు వెలువడకపోతే, సరైన సమాధానాలు రాసినవారు, రాయనివారు – ఇరువురూ సమానులే అవుతారు. ఎవరికీ ఏమీ లభించలేదు. బహుమానంగానీ, శిక్షగానీ ఏమీ లేదు. మరలాంటప్పుడు ఎగ్జామినేషన్ సెంటర్‌ని నిర్మించి, ప్రశ్నాపత్రం రూపొందించి, పరీక్ష నిర్వహించి లాభం ఏమిటి? ఇదంతా అర్ధంలేని వ్యర్ధ ప్రయత్నమే కదా! బుద్ధివున్న వారెవరయినా ఇలాంటి అర్ధంలేని పనిని ఇష్టపడతారా? పైగా ఈ వెకిలి చేష్టపై కోపం వస్తుంది. పరీక్ష బాగా వ్రాసిన వారిలో నిరాశా నిస్పృహలు ఆవరిస్తాయి. వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారవుతుంది. వారిలో ఆగ్రహం, ఆవేశం జనిస్తుంది. పరీక్ష పెట్టిన వారి మాడు బద్దలు గొట్టాలన్నంత కోపం వస్తుంది. పరీక్ష నిర్వహించే (Conduct చేసే) మాటైతే దాని ఫలితాన్ని కూడా వెలువరించాలి.

అలాగే ఈ ప్రపంచంలో, ప్రాపంచిక జీవితంలో మంచి వస్తువులతో పాటు చెడు వస్తువులు కూడా ఉన్నాయి. వాటిని మానవ నైజం మెచ్చుకుంటుంది, గర్హిస్తుంది. ఇక్కడ మంచి పనులు జరుగుతున్నాయి. వాటిని మానవ నైజం స్వాగతిస్తుంది. చెడుపనులు కూడా జరుగుతున్నాయి. మానవ స్వభావం వాటిని అసహ్యించుకుంటుంది. ఇక్కడ మానవ సేవ కూడా జరుగుతోంది. మానవ హక్కులను హరించే దౌర్జన్యకర చేష్టలు కూడా జరుగుతున్నాయి. మానవ సేవచేసే వారికి పురస్కారం లభించాలని, హక్కులను కొల్లగొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని మానవ నైజం సహజంగానే కాంక్షిస్తుంది. కాని ఈ ప్రపంచంలో, ప్రాపంచిక జీవితంలో అలా జరుగుతున్నట్లు కానరావటం లేదు. మంచివారు, దుర్మార్గులు – ఇరువురూ ఒకేవిధంగా పరిగణించబడుతున్నారు. వ్యవహారం ఇంతటితో సమాప్తం అనుకుంటే ఈ ప్రపంచానికి, ప్రాపంచిక జీవితానికి అర్ధమే లేదు. ఈ ప్రపంచాన్ని, మానవుణ్ణి పుట్టించినవాడు ఎందుకిలా చేశాడు? అన్న ప్రశ్న మనసులో జనిస్తుంది. దేవుడు ఈ ప్రపంచంలో మంచీ చెడులను ఉంచటంతో పాటు మంచి ఏదో, చెడు ఏదో పరికించే విచక్షణా జ్ఞానాన్ని కూడా మనిషికి ప్రసాదించాడు. మంచి లేదా చెడును అవలంబించే స్వేచ్ఛను కూడా అతనికి ఇచ్చాడు. దీని ఉద్దేశం ఒక్కటే – ప్రతి మనిషిని

పరీక్షించాలి. ఈ ప్రపంచంలో అతనికి ఇవ్వబడిన వ్యవధిలో ఎవడు మంచి పనులు చేస్తాడో, ఎవడు దుష్కార్యాలకు ఒడిగడతాడో చూడాలి. ఇదే అసలు పరీక్ష.

ఇదే నిజమైతే, ఈ పరీక్షా ఫలితం ఈ ప్రపంచంలోనే వెలువడకూడదు. ఏ విధంగానైతే స్కూలు పరీక్షా హాలులో – పరీక్ష జరుగుతుండగానే – ఫలితం వెలువడకుండా, పరీక్ష ముగిసిన కొన్నాళ్ళ తర్వాత రిజల్ట్ వస్తుందో, అదేవిధంగా ఈ ప్రాపంచిక జీవితపు పరీక్షా ఫలితం ప్రపంచమనే పరీక్షాలయంలో కాకుండా, అందరి పరీక్షలు అయిన మీదట మరోచోట – మరో ప్రపంచంలో ఫలితాలు వెలువడాలి. ఆ లెక్క ప్రకారమే రిపోర్ట్ కార్డ్ (Report Card) ఇవ్వబడాలి. అతను దానిని తీసుకుని ఆనందంతో కేరింతలు కొడుతూ తన వాళ్ళ దగ్గరకు పోవటమో లేదా సిగ్గుతో కుమిలిపోతూ ముఖం చాటేయటమో చేస్తాడు. ఈ ప్రాపంచిక జీవితంలో మనుషులకు బహుమానం లేక శిక్ష లభిస్తున్నట్లు కానరాదు. మరోవైపు మనిషి నిరంతరం జీవన పోరాటంలో పరుగులు తీస్తున్నాడు. ఏదో ఒక పని చేస్తూనే పోతున్నాడు. దీనినిబట్టి అవగతమయ్యే దేమిటంటే, ఈ జీవితం పరీక్షా జీవితం. ప్రతిక్షణం, ప్రతి చోటా, తన స్థితిలో మనిషి పరీక్ష రాస్తున్నాడు. తన 'ఆచరణ' ద్వారా పరీక్ష బాగానే రాస్తున్నాడు. లేదా రాయలేకపోతున్నాడు. కాగా; ఈ పరీక్ష ఫలితాలు తక్షణం వెలువడుతున్నట్లు కనిపించటం లేదు. కాబట్టి ఈ ప్రపంచం గానీ, ఈ జీవితం గానీ ఫలితాలు పొందే స్థలం కాదు, ఇది సాధన చేసే స్థలం! పరీక్షా స్థలం!! కాబట్టి ఈ ఆచరణ, ఈ పరీక్ష లక్ష్యబద్ధం అవటానికి మరో జీవితం ఉండాలి. మరో ప్రపంచం ఉనికిలోకి రావాలి. అక్కడ పరీక్షా ఫలితాలు వెలువడాలి. అంటే తీర్పు జరిగే, శిక్షా బహుమానాలు లభించే జీవితం మరొకటి ఉండాలి. ఆ తీర్పు దినానికి, ఆ ప్రతిఫల దినానికి మరోపేరే పరలోకం (ఆఖిరత్).

ఫలితాల కోసం, శిక్షా బహుమానాల కోసం మరో ప్రపంచం, మరో జీవితం ఉన్నప్పుడే ఈ జీవితం అర్థవంతం అవుతుంది. శిక్షా బహుమానాల ప్రపంచం లేకుంటే ఈ జీవితానికి అర్థమే లేదు. ఈ ప్రపంచాన్ని, ఈ ప్రాపంచిక జీవితాన్ని నిర్మించినవాడు దీన్ని అర్థరహితంగా సృష్టించాడన్న పెద్ద అపవాదు ఉండిపోతుంది. ఈ జీవితం అర్థరహితం కాదనీ, పైగా ఇదొక పరీక్షా జీవితమని, పరీక్షా ఫలితాలు వెలువడే మరో జీవితం ఈ ప్రాపంచిక పరీక్షాలయం అంతమైనాక వస్తుందన్న యదార్థాన్ని సృష్టికర్త తన గ్రంథం ఖుర్ఆన్‌లో – పరలోకం పేరుతో – స్పష్టం చేశాడు.

## ఈ ప్రపంచ స్థాయి పరీక్షా స్థలం వంటిది. మరో ప్రపంచం ఫలితాల ప్రపంచం. మానవ నైజం వాంఛించేది కూడా ఇదే

తన సృష్టికర్తను తెలుసుకోవటం, ఆయన్ని విశ్వసించటం మానవుని అతి పెద్ద పరీక్ష! దానికన్నా పెద్ద పరీక్ష మరొకటి లేదు. ఈ పరీక్షలో గనక మనిషి కృతార్థుడు కాలేకపోతే, ఇక ఏ పరీక్షలో కూడా కృతార్థుడు కాలేడు. కాబట్టి సిసయిన ప్రతిఫలం (Reward) అవార్డు (Award) ఈ పెద్ద పరీక్షతోనే ముడిపడి (Attach అయి) ఉంది.

సృష్టికర్త మానవుని కంటికి కానరాని కారణంగా అతడు పరీక్షించబడ తాడు. ఆ పరీక్ష కోసం తగు సదుపాయాలు, సౌలభ్యాలు కల్పించబడ్డాయి. ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ పరీక్షా ఉద్దేశాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా విశదపరచాడు –

> "మేము మానవుణ్ణి పరీక్షించటానికి ఒక మిశ్రమ వీర్యబిందువుతో పుట్టించాము. మరి మేము అతన్ని వినేవానిగా, చూసేవానిగా చేశాము. మేమతనికి మార్గం కూడా చూపాము. ఇక అతను కృతజ్ఞుడుగా వ్యవహరిస్తాడో లేక కృతఘ్నుతకు పాల్పడతాడో (అతని ఇష్టం. మేమతని స్వేచ్ఛను హరించలేదు)." *(అద్ దహ్ర్ – 2, 3)*

మానవ జీవిత లక్ష్యం పరీక్షించటం. ఈ ప్రస్తావన అల్ ముల్క్ సూరాలో కూడా చేయబడింది –

> "మీలో సదాచరణ చేసేవారెవరో పరీక్షించటానికి ఆయన జీవన్మరణాలను సృష్టించాడు." *(అల్ ముల్క్ – 2)*

పరీక్షలో ఉత్తీర్ణత పొందడానికి మానవుడు సృష్టికర్త (అల్లాహ్) సూచనలపై నిదర్శనాలపై చింతన చేసినట్లయితే అతను సులభంగా 'యదార్థం' వరకు చేరుకుంటాడు. అందుకే అల్లాహ్ తన శక్తి సూచనల వైపు, తన కరుణానుగ్రహాల, మహోపకారాల వైపు తన గ్రంథంలో సంజ్ఞ చేస్తున్నాడు – తద్వారా మానవుడు సృష్టికర్తను తెలుసుకుని, విధేయత చూపుతాడని.

> వాస్తవంగానే విశ్వాసుల కొరకు ఆకాశాలలోనూ, భూమిలోనూ అసంఖ్యాకమైన సూచనలు ఉన్నాయి. మిమ్మల్ని సృష్టించటంలోనూ, అల్లాహ్ (భూమిలో) వ్యాపింపజేస్తూ ఉన్నటువంటి జంతువులలోనూ,

నమ్మే వారి కొరకు గొప్ప సూచనలు ఉన్నాయి. రేయింబవళ్ల మధ్య ఉన్న వ్యత్యాసంలో, వ్యతిరేకతలో, ఆకాశం నుండి అల్లాహ్ అవతరింపజేస్తున్న ఆహారంలో – దాని ద్వారా ఆయన మృతభూమిని బ్రతికిస్తాడు – వాయువుల పరిభ్రమణంలో, బుద్ధిని ఉపయోగించే వారికి ఎన్నో సూచనలు ఉన్నాయి. ఇవన్నీ అల్లాహ్ సూచనలు, మేము వాటిని నీకు యథాతథంగా వివరిస్తున్నాము. ఇక అసలు వారు అల్లాహ్‌నూ, ఆయన వాక్యాలనూ కాక మరే విషయాన్ని విశ్వసిస్తారు?" *(అల్ జాసియహ్ : 3 – 6)*

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

సముద్రాన్ని మీకు వశపరచినవాడు అల్లాహ్‌యే కదా! ఆయన ఆదేశానుసారం అందులో ఓడలు ప్రయాణం చేయటానికి; మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి; కృతజ్ఞులు కావటానికి; భూమిలోని, ఆకాశాలలోని సకల వస్తువులనూ ఆయన మీకు వశపరచాడు. ఇదంతా తన వద్దనుండే – ఆలోచనాపరులకు ఇందులో గొప్ప సూచనలు ఉన్నాయి." *(అల్ జాసియహ్–12,13)*

ఈ పరీక్షలో మనిషి నెగ్గుకు రావటానికి అతని అంతరాత్మను తట్టడం జరిగింది. చెడును అతని మనసు అసహ్యించుకుని సన్మార్గాన్ని ఇష్టపడేలా అతని మనస్సాక్షిని తీర్చిదిద్దటం కూడా జరిగింది. పిదప ఆ మనస్సాక్షిని మరింత సెన్సెటివ్‌గా ఉండేలా చేయటానికి గీటురాయి (ఫుర్ఖాన్) అయిన ఖుర్ఆన్ చేయవలసినదంతా చేస్తుంది. అంటే మంచీ చెడులను, సత్యాసత్యాలను, ఉచితానుచితాలను బాగా విడమరచి చెబుతూ, మరణానంతరం జవాబు ఇచ్చుకోవలసి ఉందన్న భావనను నూరిపోస్తుంది. మనిషి చెడుల నుండి తనను కాపాడుకోవడానికి, పరీక్షలో ఉత్తీర్ణుడు కావటానికి ఇన్ని విధాలుగా ఏర్పాటు చేయటం జరిగింది. దహ్ర్ సూరాలోని 3వ వచనంలో "మేమతనికి మార్గం చూపాము" అని సృష్టికర్త అంటున్నాడు. మార్గాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ కూడా అతనికి ప్రసాదించాడు. అతను కోరిన మార్గాన్ని ఎన్నుకోవచ్చని కూడా అన్నాడు. అయితే ఈ ప్రపంచం పరీక్షా కాలం అయినందున, మానవుడు ఇక్కడ పరీక్షించబడుతున్నందున, ఈ పరీక్షా ఫలితం కొరకు మరో ప్రపంచం ఆవశ్యకత ఉంది.

## ప్రపంచం పరీక్షా స్థలం. ఫలితం వెలువడే దినం రావాలని పరీక్ష కోరుకుంటుంది

ప్రపంచం పరీక్షాలయం అన్న భావన ద్వారా ప్రతిఫలదినం (పరలోకం) వస్తుందన్న ఊహ (Inference) కలుగుతుంది. పరీక్షా ఫలితాలు కోరే వాటి ద్వారా స్వర్గ నరకాల ఆలోచన (Inference) వస్తుంది.

అల్ ముల్క్ సూరా 2వ ఆయత్‌లో చెప్పబడినట్లు, 'పరీక్షించాలని' అనే దానికి అర్థం ఏమిటంటే పరీక్షకు ఒక నిర్ధారిత గడువు (Period) ఉంటుంది. ఆ గడువే ప్రాపంచిక జీవితం. పరీక్షా గడువు పూర్తయిందంటే అర్థం మృత్యువు వచ్చిందన్నమాట. పరీక్ష అనంతరం ఫలితాల దినం వస్తుంది. అదే లెక్కల దినం (యౌముల్ హిసాబ్). అప్పుడు మనుషులందరికీ మలిసారి జీవితం ఇచ్చి, వారికి పరీక్షా ఫలితాలు చూపించబడతాయి. ఫలితాన్ని బట్టి బహుమానమో (స్వర్గమో), శిక్షయో (నరకమో) ఉంటుంది. ఫలితాల తరువాత (స్వర్గవాసులకు) ప్రాప్తమయ్యే సుఖ సంతోషాల కాలం చాలా సుదీర్ఘమైనదై ఉంటుంది. ఈ ప్రాపంచిక పరీక్షలో డిగ్రీ (Degree) పుచ్చుకున్న తర్వాత ఆస్వాదించే ఆనందం కన్నా అది ఎన్నో రెట్లు అధికం. పైగా ఆ సుఖ సంతోషాలు ఎన్నటికీ తరగనివి.

పరీక్ష నిర్వహించేవానిని విశ్వసించి, ఆయన సూచనలను పాటించి, ఆయన ఇచ్చిన సిలబస్ ప్రకారం పరీక్ష వ్రాసినవారే సదాచరణ చేసిన వారుగా, మెరుగైన ప్రతిభ (Performance) ను ప్రదర్శించిన వారుగా గుర్తించబడతారు. అలా చేయనివారు వైఫల్యాన్ని, పరాభవాన్ని చవి చూడవలసి ఉంటుంది. ఇక పరీక్షను కండక్ట్ చేసేవాడు విద్యార్థుల కోసం గైడ్ బుక్‌గా ఖుర్ఆన్‌ను పంపాడు. దానిని బోధపరిచే సందేశహరుణ్ణి (సఅసం) కూడా పంపాడు. ఆ సందేశహరుడు ఆ మార్గదర్శక గ్రంథం ప్రకారం ఆచరించి ఉత్తమ నమూనాను అందరి ముందు ఉంచారు. కనుక ప్రవక్త (స) విధానం ప్రకారం ఆచరించటమే సాఫల్యానికి గ్యారంటీ. ఎందుకంటే ఆ ప్రవక్త (స) ఆచరణ పూర్తిగా ఖుర్ఆన్‌కు ప్రతిబింబంగా ఉంది. ఆయన (స) జీవితం తెరచిన పుస్తకంలా అందరి ముందుంది. కాబట్టి అనుక్షణం, ప్రతి సదాచరణ సందర్భంగా మనిషి ముహమ్మద్ ప్రవక్త (స) జీవితాన్ని అనుకరించగలడు. ఇంతచేసిన తరువాత కూడా ఎవరయినా పరీక్షలో విఫలమైతే అది అతని దౌర్భాగ్యమే.

## ప్రళయం

ప్రళయం తప్పక రావాలి. ఎందుకంటే తన యజమానిని తెలుసుకుని, ఆయన ఆజ్ఞలను శిరసావహించి, మంచి మనిషిగా రాణించిన వారికి బహుమానం లభించటానికి, తద్భిన్నంగా వ్యవహరించి, యజమానిపై తిరుగుబాటు చేసి, దురాగతాలకు పాల్పడిన వారిని దండించటానికి ఇది చాలా అవసరం.

అల్లాహ్ తన ప్రవక్త ద్వారా ఇలా చెప్పించాడు –

> "మాపై ప్రళయం రాదు" అని సత్యతిరస్కారులు అంటారు. (ప్రవక్తా!) వారికి చెప్పు : "ఎందుకు రాదు? అగోచరాల జ్ఞాని అయిన నా ప్రభువు తోడుగా! అది వచ్చి తీరుతుంది –" *(సబా – 3)*

ప్రళయం యొక్క సంబంధం అగోచర జ్ఞానంతో ఉంది. కాగా; అగోచరాల జ్ఞానం కలవాడు, ప్రళయాన్ని నెలకొల్పేవాడు (అల్లాహ్) స్వయంగా ఏమంటున్నాడంటే, అది తప్పక వస్తుంది. ఎందుకు వస్తుంది. అన్నదానికి సమాధానం ముమ్మందు వస్తుంది –

> "విశ్వసించి, మంచి పనులు చేసేవారికి బహుమానం ఇవ్వటానికి (ఈ ఏర్పాటు చేయటం జరిగింది). ఇలాంటి వారి కోసమే క్షమాపణ, గౌరవ ఉపాధి ఉన్నాయి. మరెవరయితే మా సూచనలను లొంగదీసుకోవాలని ప్రయత్నించారో, వారికి అత్యంత నికృష్ట మయిన, బాధాకరమయిన శిక్ష ఉంటుంది." *(సబా–4,5)*

మంచీ చెడుల మధ్య గల తేడాను మానవుడు స్వయంగా గ్రహిస్తాడు. మంచిపనులు చేసిన వారికి బహుమానం ఇస్తాడు. దుర్మార్గులను శిక్షించమని ఆదేశిస్తాడు. ఎందుకంటే మనిషిని పుట్టించిన అల్లాహ్ అతనిలో ఈ తెలివిడిని ఉంచాడు. మరి అలాంటి గొప్పవాడే మంచి మనిషి – చెడ్డ మనిషి మధ్య విచక్షణ పాటించకుండా ఉంటాడా? వారికి బహుమానం ఇవ్వకుండా లేక శిక్ష విధించకుండా ఉంటాడా? ఖచ్చితంగా! ఆ తీర్పుకోసమే ఆయన ఈ ఆచరణల ప్రపంచాన్ని (దారుల్ అమల్) అంతమొందించి మరో ప్రపంచాన్ని – ప్రతిఫల నెలవు (దారుల్ జజా)ను స్థాపిస్తాడు.

ఈ ప్రాపంచిక జీవితంలో చేయబడే మంచీ చెడుల ఫలితం వెలువడి, ప్రతిఫలం ఇవ్వబడకపోతే కరుణామయుడైన అల్లాహ్‌పై చాలా పెద్ద నింద

మోపబడుతుంది – ఆయన వ్యర్థమయిన పనులు చేస్తాడని. మనిషిలో మంచీ చెడుల స్పృహ ఉంచబడిన మీదట, తదనుగుణంగా అతను ఆచరించిన పిదప కూడా దాని ఫలితం వెలువడకపోతే, దాని ప్రకారం బహుమానం లేక శిక్ష లభించకపోతే మనిషి నిరాశకు గురవుతాడు. అతనికి కోపం వస్తుంది. 'ప్రతిఫలం' ఇవ్వలేనివాడు ఈ మంచీ చెడులను ఎందుకు ఉంచాడు? అని అతను ప్రశ్నిస్తాడు. అసలు నిన్ను మనిషిగా ఎందుకు పుట్టించాడు? ఏ పశువుగానో పుట్టించి ఉంటే, ఎక్కడో ఒకచోట మేత మేస్తూ, లక్ష్య రహితమైన జీవితం గడిపేవాణ్ణి కదా! అని కూడా అంటాడు.

ప్రపంచంలో మంచీ – చెడు ఉన్నప్పుడు, మనిషిలో మంచీ చెడులను పరికించే తెలివి ఉంచబడినప్పుడు, లోకంలో మంచివారు – చెడ్డవారు కూడా నివసిస్తూ ఉన్నప్పుడు తప్పకుండా మంచివారికి మంచి ఫలితం, దుర్మార్గులకు దుష్ఫలితం లభించాలి. మానవ అంతరాత్మ ప్రబోధించేది కూడా ఇదే. అందుకే అతని మనస్సాక్షి కోరేదానిని నెరవేర్చటం జరిగింది. ఖుర్ఆన్ ద్వారా అల్లాహ్ తన ప్రవక్త నోట పునరుత్థానానికి సంబంధించిన సమాచారం అందించాడు. మానవ నైజం వాంఛించే దానిని నెరవేరుస్తానని ఓదార్చాడు –

> (ప్రవక్తా!) వారికి చెప్పు : "అల్లాహ్‌యే మిమ్మల్ని బ్రతికిస్తున్నాడు. తరువాత ఆయనే మిమ్మల్ని చంపుతున్నాడు. ఆ తరువాత ఆయనే ప్రళయదినాన మిమ్మల్ని సమావేశపరుస్తాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కాని చాలామంది తెలుసుకోరు."
>
> *(అల్ జాసియహ్ – 26)*

**గమనిక :** దేవుని ఏకత్వంతో పాటు పరలోకాన్ని కూడా విశ్వసించటం అవశ్యం. పరలోకాన్ని నమ్మటం అంటే భావం ఇది – అల్లాహ్ గుణగణాలలో న్యాయగుణం అత్యంత ముఖ్యమైనది. తీర్పుదినాన ఆయన నిష్పక్షపాతంగా న్యాయనిర్ణయం గైకొంటాడు. కాబట్టి దీనిని నమ్మటం తప్పనిసరి. ఇది లేనంత వరకూ దేవుని ఏకత్వపు భావనా నమ్మకం పరిపూర్ణమవదు.

పరలోకం యొక్క అర్థంలో ఎన్నో విషయాలు ఇమిడివున్నాయి. వాటిలో మొదటిది : ప్రస్తుత ప్రపంచం విచ్ఛిన్నమవటం, దైవాజ్ఞపై ఈ ప్రపంచంలో ఉన్న మానవులంతా ఒక్కసారిగా అంతమైపోవటం. ఆ తరువాత అల్లాహ్ ఆజ్ఞపై మరో ప్రపంచం ఉనికిలోకి వస్తుంది. లెక్కలు తేల్చబడతాయి. ఈ ప్రపంచంలో మొదటి నుండి చివరి వరకు మరణించిన మనుషులంతా

దైవాజ్ఞపై ఒకేసారి మళ్ళీ బ్రతికి దైవసన్నిధిలో హాజరవుతారు. లెక్కలు తేల్చబడిన తరువాత వారి ఆచరణలను బట్టి న్యాయసమ్మతంగా తీర్పు జరుగుతుంది. దాని ఆధారంగానే వారు స్వర్గంలో ప్రవేశించటమో, నరకాగ్నికి ఆహుతి అవటమో జరుగుతుంది. పరలోక జీవితం శాశ్వతమైనది. స్వర్గంలో ప్రవేశించినవారు కలకాలం అందులో ఉంటారు. నరకాగ్నికి ఆహుతి అయినవారు ఎల్లకాలం నరక యాతనను అనుభవిస్తూ ఉంటారు.

## మళ్ళీ పుట్టడంపై ఆశ్చర్యం!

సృష్టికర్త శక్తి సామర్థ్యాల గురించి స్పృహ లేనివారు మళ్ళీ పుట్టడం అనే మాటపై ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తారు. కాని స్పృహ ఉన్నవారు మాత్రం గట్టిగా నమ్ముతారు. అలాగే జరుగుతుంది, జరగాలి కూడా అంటారు. మొదటిసారి పుట్టించిన సృష్టికర్తకు మలిసారి పుట్టించడం ఏమాత్రం కష్టం కాదని కూడా అంటారు.

> ఒకవేళ నీవు ఆశ్చర్యపడేవాడవైతే, వారి ఈ పలుకులు నిన్ను ఆశ్చర్యపరచాలి. వారు ఇలా అంటారు : "ఏమిటి, మేము (మరణించి) మట్టిగా అయిపోయిన తరువాత కూడా మళ్ళీ సరికొత్తగా పుట్టించబడతామా?" అలాంటివారే తమ ప్రభువును తిరస్కరించినవారు. *(అర్రాద్ – 5)*

అంటే; వారు తమ ప్రభువును అబద్ధీకరించారు. ఆయన శక్తిని అబద్ధీకరించారు.

ఈ ప్రాపంచిక జీవితపు లక్ష్యం పూర్తవ్వాలంటే పరలోకం నెలకొనటం అనివార్యం. కాని ఇది జరగటం అసంభవమని మనిషి అనుకుంటాడు. దీనికి కారణమేమంటే, మనిషి తన శక్తియుక్తుల్ని, తన తెలివితేటల్ని, తన పరిజ్ఞానాన్ని ముందుంచుకుని ఆలోచిస్తాడు గాని సృష్టికర్త శక్తి, పరిజ్ఞానం దృష్ట్యా ఆలోచించడు. మరో ప్రపంచాన్ని స్థాపించటం, మరో జీవితాన్ని ప్రసాదించటం సృష్టికర్తకు ఎంత తేలికైన పనో ఈ 'ఆజ్ఞ' ద్వారా ఊహించవచ్చు –

> "భూమ్యాకాశాలలోని సమస్త నిగూఢ విషయాల జ్ఞానం అల్లాహ్‌కే స్వంతం. ప్రళయం కనురెప్ప వాల్చినంత సమయంలో లేదా అంతకన్నా వేగంగానే సంభవించవచ్చు. నిశ్చయంగా అల్లాహ్ ప్రతిదీ చేయగల సమర్థుడు." *(అన్ నహ్ల్ – 72)*

## ప్రళయం రావటం తథ్యం

> "ఏమిటి, వారు గమనించటంలేదా? భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్, వాటిని సృష్టించటంలో ఏమాత్రం అలసిపోనివాడని, మృతులను తిరిగి బ్రతికించగలవాడన్న విషయాన్ని వారు గ్రహించటం లేదా? ఎందుకు బ్రతికించలేడు? ఆయన ప్రతిదానిని చేయగల దిట్ట." *(అల్ అహ్ఖాఫ్ - 33)*

## మనిషి బ్రతికి లేవటం

ఏ వస్తువుపై ఏ వస్తువు వేస్తే కావలసిన వస్తువు ప్రాప్తమవుతుందో సృష్టికర్తకే బాగా తెలుసు. ఉదాహరణకు : ఎండిపోయిన మృతభూమిపై వర్షం కురిపిస్తే అది ప్రాణం పోసుకుంటుంది. పంటలు పండిస్తుంది.

మృతి చెందిన మనిషి వ్యవహారం కూడా ఇటువంటిదే. అతని ఎముకలు కృశించి, కరిగిపోయాయి. అతని శరీరంలోని కణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఏమో! వాటన్నింటినీ సేకరించి, మళ్ళీ అతనిని యధాతథంగా చేసి నిలబెట్టడం ఎలాగో సృష్టికర్తకే బాగా తెలుసు. ఆ సృష్టికర్త శక్తికి సంబంధించిన ఒక దృష్టాంతాన్ని ఖుర్ఆన్ మన ముందుంచింది.

> "గాలులను పంపేవాడు అల్లాహ్యే. తరువాత అవి మేఘాలను లేపుతాయి. ఆ తరువాత మేము వాటిని ఓ మృతభూమి వైపునకు తీసుకుపోతాయి. తద్వారా మేము ఆ భూమికి, అది మృతిచెందిన పిదప జీవం పోస్తాము. ఇదేవిధంగా (మృతులను) తిరిగి బ్రతికించటం జరుగుతుంది." *(ఫాతిర్ - 9)*

ఏ పని మనిషికి ఎంత క్లిష్టమైనదో, అసంభవమైనదో అది సృష్టికర్తకు ఎంతో సులువైనది, ఆయన చేసిన ఒక్కగానొక్క ఆజ్ఞపై మృతభూమి మళ్ళీ బ్రతుకుతుంది. ఇది ఆయన శక్తికి నిదర్శనం. మానవుణ్ణి కూడా మళ్ళీ బ్రతికించటం ఆయనకు ఎంతమాత్రం కష్టమైన పని కాదు.

నెర్రె కొట్టిన నేలను చూసి, ఇక ఈ నేలలో పంటలు పండవని మానవుడు నిరాశ చెందినట్లే, మృతులు తిరిగి బ్రతకటం పట్ల కూడా నిరాశకు గురవుతాడు. ఇలా జరగటం అసంభవం అనుకుంటాడు. కాని కొద్దిపాటి వర్షపు చినుకులతో నేల పులకిస్తుంది. ప్రాణం పోసుకుంటుంది. మొక్కల్ని

మొలకెత్తిస్తుంది. నవధాన్యాలు పండుతాయి. అలాగే మనిషిని మళ్ళీ ఎలా బ్రతికించి లేపాలో అల్లాహ్‌కు తెలుసు. మృతభూమికి జీవం పోసినట్లే ఆయన మృతులకు ప్రాణం పోస్తాడు. ఈ పని ఆయనకు కష్టసాధ్యం ఏమీ కాదు. ఆయన శక్తి అద్భుతమైనది. మానవుడు తనకు అసంభవం అనుకున్న దానిని ఆయన ఒక్కగానొక్క ఆజ్ఞతో సులువుగా చేసేస్తాడు.

## పరలోకం తథ్యం, సులభం కూడా

మానవుడు అశక్తుడు, నిస్సహాయుడు. అతని సృష్టికర్త అతనికి చావు నివ్వదలిస్తే, ఇక అతను బ్రతికి ఉండలేడు. అలాగే సృష్టికర్త మనిషిని మృత స్థితి నుండి తిరిగి బ్రతికించగోరితే, మనిషి మళ్లీ బ్రతకటం తప్ప అతనికి వేరే మార్గాంతరం ఉండదు. దీనివల్ల రెండు విషయాలు ముందుకు వస్తున్నాయి – ఒకటి : మానవుని అశక్తత. రెండు : సృష్టికర్త శక్తి. అశక్తత ఎటువంటిదంటే, చచ్చిపో అంటే మనిషి చచ్చిపోవాలి. మళ్ళీ బ్రతుకు అని అంటే చచ్చినట్లు బ్రతకాల్సిందే. ఈ విషయాన్నే ఖుర్‌ఆన్‌లో సృష్టికర్త ఇలా తెలియజేస్తున్నాడు :

> ‘ఏమిటి, మేము మరణించి మట్టిగా, ఎముకలుగా అయిపోయాక కూడా మేము మళ్లీ లేపబడతామా? పూర్వీకులైన మా తాత ముత్తాతలు కూడానా?’ వారితో అను : “అవును. మీరు అల్లాహ్ వ్యవహారంలో అశక్తులు.” అదొక గద్దింపు మాత్రమే వారు అకస్మాత్తుగా దిక్కులు చూడసాగుతారు. ఆ సమయంలో వారు ఇలా అంటారు : ‘అయ్యో! మా దౌర్భాగ్యం! ఇదేకదా ప్రతిఫలం లభించే దినం!?’ (అప్పుడు వారితో అనబడుతుంది:) “ఇదే ఆ తీర్పుదినం. దీనిని మీరు అబద్ధమంటూ కొట్టివేసేవారు.”
>
> *(అస్ సాఫ్ఫాత్ : 16 – 21)*

నిద్రిస్తున్న మనిషికి మనం ఒక కేకవేయగానే ఎలా గాభరాపడుతూ లేస్తాడో, అలాగే మృతునిగా పడివున్న మనిషికి అల్లాహ్ యొక్క ఒక్కగానొక్క గద్దింపు సరిపోతుంది.

## మళ్ళీ బ్రతికించబడటం సంభవమేనా?

ఒకప్పుడు మనిషి అసలేమీ లేడు. అతనిదంటూ ఒక ఉనికిగానీ, జీవితంగానీ లేదు. అతనెక్కడా కనిపించేవాడు కాడు. అతనికి ఉనికి ప్రసాదించటం జరిగింది. జీవితం ఇవ్వబడింది. అతని జీవికకు కావలసిన

గుణాలన్నీ వొసగబడ్డాయి. బుద్ధి వొసగబడింది. అతను గనక తన ఈ గతాన్ని నెమరువేసుకుంటే విషయం అతనికి సులువుగా అర్ధమైపోతుంది. అప్పుడు అతను దాని విలువను గుర్తిస్తాడు. మళ్ళీ తనను బ్రతికించటం సంభవమేనని దృఢంగా నమ్ముతాడు. ఏమీలేని తనకు ఒక ఉనికిని ప్రసాదించిన సృష్టికర్తకు, చనిపోయిన మీదట తనను తిరిగి బ్రతికించటం ఏమాత్రం కష్టమైన పని కాదని, కాకపోతే తనకు మాత్రం అది అసాధ్యమని అతనికి బోధపడుతుంది. తొలిసారి ఉనికిలోనికి వచ్చిన మానవ ఎదుగుదల (Process of Development) యొక్క దశల (Stages) ను గురించి ఆలోచిస్తే, సృష్టికర్త ఏ వస్తువు (వీర్యం)తో ఏ వస్తువు (సంపూర్ణ ఆకృతి గల మనిషి)ని చేసి నిలబెట్టాడో కూడా తెలుస్తుంది. ఇదొక అద్భుతమయిన కార్యం. అమోఘమయిన సృష్టి. ఇది చేయగలిగిన వానికి మళ్ళీ పుట్టించటం కష్టమైన పని ఎలా అవుతుంది? అన్న విషయం అతనికి అర్ధమవుతుంది.

మానవుని సృష్టి ఎలా జరిగిందో మనిషికి గుర్తు చేస్తూ, దీనిపై ఒకసారి గంభీరంగా ఆలోచించమని సృష్టికర్త అంటున్నాడు :

> "ఏమిటి, ఈ అనంత కాల గమనంలో మానవుడు ప్రస్తావించదగిన వస్తువుగా లేని సమయం ఒకటి గడవలేదా?" *(అద్ దహ్ర్ - 1)*

మరి అలాంటప్పుడు ఈ మానవుడు శూన్యంలోనికి పోయి, తొలిసారి ఉనికిలోనికి వచ్చినట్లుగా మళ్ళీ ఉనికిలోనికి రాలేడా? ఇప్పుడైతే కనీసం, ఫలానా వ్యక్తి లోగడ పుట్టాడు, అతను మళ్ళీ పుట్టించబడుతున్నాడు అన్న సంగతి తెలుస్తుంది. దీని గురించి ఖుర్ఆన్ ఇలా అంటోంది –

> "మొదటిసారి పుట్టుక గురించి మీకు ఎలాగూ తెలిసిందే. మరి దానిద్వారా గుణపాఠం ఎందుకు నేర్చుకోరు?" *(అల్ వాఖిఅహ్-62)*

## మళ్ళీ బ్రతికించబడటం నిశ్చయం

మనిషి స్వయంగా తన పుట్టుక గురించి ఆలోచించాలి. ఒకప్పుడు అతనికంటూ ఉనికి లేదు. తరువాత వీర్యం అయ్యాడు. ఆ తరువాత మాంసపు ముద్దగా రూపొందాడు. ఆపైన క్రమక్రమంగా మానవరూపం దాల్చాడు. ఆ విధంగా ఏమీ లేని స్థితి నుండి సజీవమైన ఉనికిని సంతరించుకున్నాడు. మరి అలాంటప్పుడు తాను మళ్ళీ నిర్మించబడటంపై, మళ్ళీ సజీవంగా లేపబడటంపై

సంశయం ఎందుకు? ఒకసారి పుట్టించబడినప్పుడు, మళ్ళీ అది ఎందుకు సాధ్యం కాదు? ఒకసారి ఏ తెలివితేటలతో, ఏ శక్తి యుక్తులతో ఒకరికి ఉనికిని ప్రసాదించాడో, ఆ వ్యక్తిని మళ్ళీ అలాగే లేపి నిలబెట్టడం సృష్టికర్తకు కష్టమైన పనా? క్రింది ఆయత్‌లపై యోచన చేయాలి –

> "మానవులారా! తిరిగి బ్రతికించబడే విషయంలో మీకు ఏదన్నా సంశయం ఉంటే (ఒక విషయం మీకు తెలియాలి), మేము మిమ్మల్ని (1st Time) మట్టితో పుట్టించాము. తరువాత వీర్య బిందువుతో (తరువాత వంశపరంపర Procedure ని ఉంచాము). ఆ తరువాత ఘనీభవించిన రక్తంతో, అటు పిమ్మట మాంసపు ముద్దతో – అది రూపుదిద్దుకున్నదీ, రూపరహితమైనదీను – మీకు స్పష్టంగా తెలియపరిచే నిమిత్తం ఈ యదార్థాన్ని విడమరచి చెబుతున్నాము. మరి మేము కోరిన దానిని, ఒక నిర్ధారిత గడువు వరకు మాతృగర్భాలలో ఆపి ఉంచుతున్నాము. దరిమిలా మేము మిమ్మల్ని శిశువు రూపంలో బయటికి తెస్తున్నాము." *(అల్ హజ్జ్ – 5)*

మట్టి ఒక జీవంలేని వస్తువు. మరి దాని ద్వారానే తయారైన వీర్యం (Sperm) మరియు Ova ను కలిపి వివిధ దశలలో మానవుని రూపంలో అందమైన ఆకృతిగల శిశువును రూపొందించటం మానవ మేధకు అందే విషయమేనా? మరి ఆ మనిషిలో కూడా అద్భుతమైన తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు ఉంచబడ్డాయి. జీవితానికి అవసరమైన శక్తి (Potential)ని పొందుపరచటం జరిగింది. ఇదంతా జీవంలేని మట్టితోనే చేయటం జరిగింది.

దీనిపై చిత్తశుద్ధితో ఆలోచించినప్పుడు అర్థమయ్యేదేమిటంటే మళ్ళీ బ్రతికి లేపబడటం ఏమంత కష్టమైన పని కాదు. సృష్టికర్త శక్తి ముందు ఇది ఏ పాటి?

## మళ్ళీ పుట్టడం తథ్యం

మనిషి కాలో, చెయ్యో విరిగిపోతుంది. లేదా మెదడు పని చేయటం లేదు (Brain Degeneration). లేదా గుండె రక్తనాళాలు బ్లాక్ అయిపోయాయి. అయినా మనిషి బ్రతికే ఉన్నాడు. అతనిలో చలనం ఉంది. కాని మరోవ్యక్తి శారీరకంగా చాలా బాగున్నాడు. అతనికి ఏ జబ్బూ లేదు. కాని అతని శరీరంలోని ఒక వస్తువు (ప్రాణం, ఆత్మ) అతన్ని వీడిపోయింది. ఫలితంగా

అతని శరీరంలోని చలనం స్తంభించిపోయింది. అతని జీవనంలో కదలిక లేదు. దీనినిబట్టి అర్థమయిందేమిటంటే శరీరంలో ఒక వస్తువు ఉంది. అది దెబ్బతిన్న శరీరంలో కూడా చలనాన్ని నిలిపి ఉంచుతుంది. అదేగనక లేకపోతే ఆరోగ్యవంతమయిన శరీరం కూడా చలించదు. మనిషి మరణించినప్పుడు అతని లోపల ఉన్న ఆత్మను వశపరచుకుని, భద్రపరచటం జరుగుతుంది. అతన్ని మళ్లీ బ్రతికించదలచినప్పుడు చెల్లాచెదురుగా – ఎక్కడెక్కడో పడివున్న – అతని శరీరావయవాలను, ఎముకలను జోడించి, అతనికి పూర్వ ఆకృతినిచ్చి, అందులో ఆ ప్రాణం పోయటం జరుగుతుంది. తత్ఫలితంగా అతను మళ్ళీ బ్రతుకుతాడు. ఆ విధంగా మరణించిన తరువాత మరో జీవితం లభించింది. తాను మళ్ళీ బ్రతికించబడటం చాలా కష్టం, అసంభవం అని మనిషి అనుకుంటాడు. కాని ఇది ఏమాత్రం కష్టం కాదని, అసంభవం కూడా కాదని తెలిసింది. మనిషికి గనక నిజ భావంలో సృష్టికర్త భావన (True Concept) కలిగితే మరణానంతర జీవితం పట్ల అతనికి గల సంశయం దూరమైపోతుంది. ఆ సంశయాన్ని దూరం చేయడానికి అల్లాహ్ అసలు విషయాన్ని సుబోధకం చేస్తున్నాడు – అదేమిటంటే, మరణ సమయంలో దైవదూత 'అసలు వస్తువు'ను శరీరంలో నుండి వశపరచుకుంటాడు. తత్ఫలితంగా మనిషి చనిపోతాడు. అతనిలోని చలనం ఆగిపోతుంది. అతని శరీరంలోని శక్తులన్నీ స్తంభించి పోతాయి.

> ఈ ప్రజలు ఇలా అంటారు : "మేము మట్టిలో కలిసి నశించి పోయినా, మళ్లీ మేము క్రొత్తగా సృష్టించబడతామా?" అసలు విషయం ఏమిటంటే వారు తమ ప్రభువును కలుసుకోవటాన్ని తిరస్కరిస్తారు. వారితో ఇలా అను : "మీపై నియమింపబడిన మృత్యుదూత మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకుంటాడు. తరువాత మీరు మీ ప్రభువు వైపునకు మరలింపబడి తీసుకుపోబడతారు. ఈ దోషులు తలలు వంచి తమ ప్రభువు సమక్షంలో నిలబడి ఉండే ఆ సమయాన్ని నీవు చూస్తే ఎంత బాగుండును! (అప్పుడు వారు ఇలా అంటారు),"మా ప్రభూ! మేము బాగా చూశాము, బాగా విన్నాము, ఇక మమ్మల్ని వెనక్కి పంపించు, మేము మంచి పనులు చేస్తాము. మాకు ఇప్పుడు నమ్మకం కలిగింది." *(అస్ సజ్దా:10–12)*

వారు అపరాధులుగా ఎందుకు నిలబడ్డారంటే, మరణానంతర జీవితం పట్ల తిరస్కార భావం, దేవుని సమక్షంలో జవాబు ఇచ్చుకోవలసి

ఉందన్న విషయం పట్ల ధిక్కార వైఖరి వారిని తలబిరుసులుగా చేసేసింది. ఈ లోకంలో వారు చెలరేగిపోయారు. ప్రజలపై దౌర్జన్యానికి ఒడిగట్టారు. మానవ హక్కుల్ని కాలరాశారు.

## పరలోక తిరస్కరణకు ప్రాతిపదిక విజ్ఞానమా?

ఎవరయితే మరణానంతర జీవితాన్ని, లెక్కల దినాన్ని తిరస్కరిస్తున్నారో వారు ఊహల ఆధారంగా తిరస్కరిస్తున్నారా? లేక 'జ్ఞానం' ఆధారంగానా? పరలోకం ఏర్పడనున్నదన్న విషయం 'జ్ఞానం' ఆధారంగా, అగోచరాల జ్ఞాని తరఫున చెప్పబడుతోంది. ఆ మహాజ్ఞాని ఈ జగతిని, మనిషిని లక్ష్యబద్ధంగా సృష్టించాడు. లక్ష్యం సిద్ధించాలంటే మనిషి ఆచరణల తనిఖీ జరగాలి. తదనుగుణంగా – న్యాయబద్ధంగా – తీర్పు ఇవ్వబడాలి. తీర్పు ప్రకారం బహుమానం ఇవ్వటమో, శిక్షకు గురిచేయటమో జరగాలి.

అగోచరాల జ్ఞాని తరఫున 'జ్ఞానం' ఆధారంగా పరలోక సమాచారం ఇవ్వబడింది గనక, ఈ సమాచారాన్ని ఎవరయినా కాదంటే 'జ్ఞానం' ఆధారంగానే కాదనాలి గాని ఊహల ఆధారంగా కాదు. కాని ఆ సాహసం చేయకుండా, తమ అబద్ధీకరణ బండారం బట్టబయలు కాకూడదన్న ఉద్దేశంతో తిరకాసుగా మాట్లాడతారు. మరణానంతర జీవితమనేదే ఉంటే, చనిపోయిన మా తాతముత్తాతల్ని బ్రతికించి తీసుకు రండి అని ఎదురు ప్రశ్న వేస్తారు.

పరలోకాన్ని తిరస్కరించే మనస్తత్వాన్ని, కుంటిసాకులను ఉదాహరిస్తూ ఖుర్ఆన్, వారి తిరస్కారం 'జ్ఞానం' ప్రాతిపదికపై లేదని అంటోంది –

> వారు ఇలా అంటారు : "జీవితం అంటే కేవలం మన ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే. ఇక్కడే మన మరణం, ఇక్కడే మన జీవితం. కాల పరిభ్రమణం తప్ప, మనలను ఏదీ చంపలేదు." వాస్తవంగా ఈ విషయానికి సంబంధించిన జ్ఞానమేదీ వారివద్ద లేదు. వారు కేవలం ఊహ ఆధారంగా ఈ మాటలు అంటున్నారు."
>
> *(అల్ జాసియహ్ – 24, 25)*

## ప్రళయం అకస్మాత్తుగా (ఒక ప్రేలుడు మాదిరిగా) వస్తుంది. ఎలాంటి గడువు ఇవ్వబడదు

పరలోకాన్ని తిరస్కరించేవారు ఏమనుకుంటున్నారంటే, అది ఒక అబద్ధం, కల్పిత విషయం. లేదా ఒకవేళ అది వచ్చే సూచనలు కనిపిస్తే

అప్పటికప్పుడు విశ్వసించి, దైవానికి విధేయత కనబరచవచ్చు. దిగువనివ్వబడిన ఆయత్‌లలో ఏమనబడిందంటే; ప్రళయం రావటం తథ్యం. అది ముందుగా సూచనలు చేసిరాదు. అకస్మాత్తుగా – ఒక ప్రేలుడు మాదిరిగా – వచ్చి పడుతుంది. ఆ సమయంలో మనిషికి ఎలాంటి గడువుగానీ, అవకాశం గానీ ఇవ్వబడదు. రెండవ ప్రేలుడు తరువాత అందరూ ప్రళయదిన అధినేత వైపునకు మరలివస్తారు. ఎందుకంటే ఆ రెండవ జీవితం న్యాయ సంస్థాపనం కొరకు నెలకొల్పబడుతుంది. ప్రజల విశ్వాసాన్ని, ఆచరణనుబట్టి వారికి బహుమానం లేక శిక్ష ఇవ్వబడుతుంది. ఆ ప్రళయం అకస్మాత్తుగా ఎలా సంభవిస్తుందో అల్లాహ్ తెలియజేస్తున్నాడు –

> వారు “ప్రళయం గురించిన ఈ బెదిరింపు అసలు ఎప్పుడు నెరవేరుతుంది? నీవు సత్యవంతుడవయితే చెప్పు?” అని అడుగుతారు. వాస్తవానికి వారు దేని కొరకు నిరీక్షిస్తున్నారో, అది కేవలం ఒక ప్రేలుడు మాత్రమే. అది వారిని అకస్మాత్తుగా పట్టుకుంటుంది; అప్పుడు వారు (తమ ప్రాపంచిక వ్యవహారాలను గురించి) వివాదపడుతూ ఉంటారు. ఆ సమయంలో వారు మరణ శాసనం సయితమూ వ్రాయలేరు. తమ ఇళ్లకు తిరిగి పోనూ లేరు. ఆ తరువాత ఒక శంఖం ఊదబడుతుంది. అప్పుడు వారు హఠాత్తుగా తమ ప్రభువు ముందు హాజరయ్యేందుకు తమ సమాధుల నుండి బయటికి వస్తారు. భయాందోళనలతో వారు “అరే, మనల్ని మన పడకల నుండి లేపి ఎవరు నిలబెట్టారు?” అని అంటారు. “ఇది దయామయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయమే. దైవప్రవక్తల మాట పూర్తిగా నిజమే.” అది భయంకరమైన ఒక ధ్వని మాత్రమే. దానితో అందరూ మా ముందు హాజరు పరచబడతారు.
>
> *(యాసీన్ : 48 – 53)*

## జవాబు ఇవ్వడానికి సృష్టికర్త సమక్షంలో హాజరవ్వాలి

ప్రళయదినాన అందరినీ సమావేశపరచి లెక్క తీసుకోవటం సృష్టికర్తకు ఏమాత్రం కష్టం కాదు. ప్రతిదీ సునాయాసంగా, పరిపూర్ణ (Perfection) రీతిలో జరుగుతుంది. అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు :

> మేము మానవులందరినీ చుట్టిముట్టి సమావేశపరుస్తాము. వారంతా నీ ప్రభువు సాన్నిధ్యంలో వరుసలు వరుసలుగా ప్రవేశపెట్టబడతారు

– ఇదిగో చూడండి, మేము మిమ్మల్ని మొదటిసారి పుట్టించిన స్థితిలోనే మీరు మా వద్దకు వచ్చేశారుకదా! మాతో సమావేశమయ్యే కాలాన్ని దేనినీ మేము మీ కొరకు నిర్ణయించనేలేదని మీరు భ్రమపడ్డారు–అప్పుడు కర్మల పత్రం వారి ముందు ఉంచబడుతుంది. ఆ సమయంలో అపరాధులు తమ జీవిత గ్రంథంలో నమోదు చేయబడిన విషయాలకు భయపడుతూ ఉండటాన్ని నీవు చూస్తావు. వారు "అయ్యో! మా దౌర్భాగ్యం! ఇదేమి గ్రంథం! మేము చేసిన చిన్న పనిగానీ, పెద్ద పనిగానీ ఏదీ ఈ గ్రంథంలో నమోదు చేయబడకుండా ఉండలేదే" అని అంటూ ఉంటారు. వారు ఏమేమి చేశారో అదంతా తమ ముందు ప్రత్యక్షం కావటాన్ని చూస్తారు. నీ ప్రభువు ఎవరికీ ఏమాత్రమూ అన్యాయం చేయడు.

*(అల్ కహ్ఫ్ : 47 – 49)*

## సాక్ష్యాధారాలతో సహా తీర్పు జరుగుతుంది

చేసిన పనికి బహుమానం లేక శిక్ష లభించాలి. అప్పుడే ఈ పుట్టుకకు అర్థం ఉంటుంది. లేకుంటే ఈ జీవితం, ఈ జగతి యొక్క ఉనికి నిరర్థకం అనిపిస్తుంది. కాని అలా జరగదు. అల్లాహ్ చేసే ప్రతి పని లక్ష్యబద్ధంగా ఉంటుందని ఖుర్ఆన్ అంటోంది :

"అల్లాహ్ భూమ్యాకాశాలను సత్యబద్ధంగా పుట్టించాడు – ప్రతి వ్యక్తికీ అతను చేసుకున్న దాని ప్రతిఫలం సంపూర్ణంగా ఇవ్వాలని. వారికెలాంటి అన్యాయం జరగదు." *(అల్ జాసియహ్ – 22)*

'సత్యబద్ధంగా' అంటే ఇక్కడ అర్థం 'లక్ష్యబద్ధంగా' అని. అంటే ఏ వ్యక్తి మంచీ చెడుల మధ్యగల వ్యత్యాసాన్ని పరికించి మంచిని అవలంబిస్తాడో, చెడుకు దూరంగా ఉంటాడో చూసి, తదనుగుణంగా ప్రతిఫలం ఇవ్వటం జరుగుతుంది. ఈ విషయంలో ఎవరికీ ఎంతమాత్రం అన్యాయం జరగదు. ప్రతిఫల దినం రాకపోవటం కూడా సజ్జనుల పాలిట అన్యాయమే. ఎందుకంటే ఆ రోజు రాకపోతే వారికి వారి మంచి పనులకు గాను పురస్కారం లభించదు.

పరీక్షా ఫలితాలు వెలువడితేనే గాని విద్యార్థులు పరీక్షా హాలులో కూర్చోవటంలోని ఉద్దేశం నెరవేరదు.

చెడులకు పాల్పడగోరేవారు న్యాయ విచారణ జరగటాన్ని ఇష్టపడరు.

అందుకే వారు పరలోకాన్ని నమ్మగోరరు. వారు నమ్మకపోయినంత మాత్రాన యదార్థం మారదు కదా! అందుకే మంచీ – చెడు నైజం కూడా వేరుగా ఉంటుంది. వాటి ఫలితం కూడా భిన్నంగానే ఉంటుంది. మంచి స్వాగతించబడు తుంది. చెడు ఏవగించుకోబడుతుంది. అందుకే మంచివారికి ఆదరణ లభిస్తుంది. చెడ్డవారు అసహ్యించుకోబడతారు. మంచి వారికి వారి మంచి పనులకుగాను పురస్కారం లభించాలని, దుర్మార్గులకు శిక్ష విధించబడాలని మానవ నైజం కాంక్షిస్తుంది. కాబట్టి ఇరువర్గాల వారి పరిణామం ఒకేవిధంగా ఉండటం స్వీకారయోగ్యం కాజాలదు. దీనికి వ్యతిరేకంగా మానవ నైజం నిరసన (Protest) చేస్తుంది. ఇరువర్గాల వారి పట్ల ఒకేవిధమయిన వ్యవహారం జరుగుతుందని అంటే అర్థం తీర్పుదిన న్యాయాధీశునిపై పెద్ద అపనింద మోపటమే. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఏమంటున్నాడో చూడండి –

> "ఏమిటి, తమనూ – విశ్వసించి మంచిపనులు చేసిన వారిని మేము ఒకేవిధంగా పరిగణిస్తామనీ, వారందరి జీవన్మరణాలు ఒకేవిధంగా ఉంటాయని పాపాలకు ఒడిగట్టినవారు భావిస్తున్నారా? వారు గైకొన్న ఈ నిర్ణయం బహుచెడ్డది." *(అల్ జాసియహ్ – 21)*

## ఆచరణ ఫలితం న్యాయబద్ధంగా ...

నాయకమన్యులు తమ నేతృత్వాన్ని వెలగబెట్టడానికి తమ అనుంగు అనుచరుల (Followers) ను మోసగిస్తూ ఉంటారు. వారిలా అంటారు : "మరణానంతరం జీవితం, పరలోకం – ఇదంతా ఉత్తిదే. ఒకవేళ పరలోకం లాంటిది వచ్చినా మిమ్మల్ని కాపాడటానికి మేమున్నాము కదా!" జాగ్రత్త! ఇవన్నీ వారి కల్లబొల్లి కబుర్లు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలి, తమ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయం కూడా తాము స్వయంగా గైకొనాలి. ఎందుకంటే; ప్రాపంచిక న్యాయస్థానంలోనే చట్టానికి దొరికిపోయిన వ్యక్తిని లీడర్లు కాపాడలేక పోయినప్పుడు, పరలోక న్యాయస్థానంలో ఎలా కాపాడుతారు? అల్లాహ్ నిష్పక్షపాతంగా తీర్పు ఇచ్చేవాడు, ఆయన ప్రతిదీ తెలిసిన మహాజ్ఞాని. ఆయన సమక్షంలో బూటకపు నిందారోపణలు, కుంటిసాకులు పనికిరావు. దాని గురించే అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు :

> వారు ఒకరి వైపునకు మరొకరు తిరిగి పరస్పరం వాదించుకోవటం ప్రారంభిస్తారు. (అనుచరులు తమ నాయకులతో ఇలా) అంటారు, "మీరు మా వద్దకు కుడి వైపునుండి వచ్చేవారు." వారు సమాధానం ఇస్తారు, "అది కాదు, అసలు మీరే విశ్వసించేవారు కారు, మీమీద మాకు అధికారం లేదు, మీరు సహజంగానే తలబిరుసువాళ్ళు. చివరకు మీరు తప్పకుండా యాతనను చవిచూస్తారు" అని మా ప్రభువు అన్న మాటకు మేము అర్హులమై పోయాము. కనుక మేము మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చేశాము, స్వయంగా మేము కూడా మార్గభ్రష్టులమయ్యే ఉన్నాము. ఈ విధంగా వారందరూ ఆ రోజు ఉమ్మడిగా శిక్ష అనుభవిస్తారు. మేము అపరాధుల విషయంలో ఇలానే చేస్తూ ఉంటాము." *(అస్ సాఫ్ఫాత్ : 27 – 34)*

ప్రతి ఒక్కరూ తన ఆచరణనుబట్టి నేరస్థుడే. వారిలో ప్రతి ఒక్కరికీ బుద్ధీవివేకాలతో పాటు, ఎంపిక స్వేచ్ఛ ఇవ్వటం జరిగింది.

## పరలోక దృశ్య చిత్రీకరణ

మరణానంతరం తిరిగి లేపబడే ఈ విషయం జరిగిన సంఘటనలా వివరించబడింది. మానవ మనస్తత్వాన్ని ఎరిగి, దానికనుగుణంగా అతనికి నమ్మకం కుదిరేలా విశ్లేషించి చెప్పటం జరిగింది. దీని గురించి వినేవారికి కూడా గట్టి నమ్మకం కలుగుతుంది. దానిని వారు నిరాకరించలేరు. ఒకవేళ నిరాకరిస్తే అది మంకుతనం తప్ప మరొకటి కాదు. ఎందుకంటే ఈ సంఘటన జరిగిన సంఘటన. కళ్లారా వీక్షించినది. ఖుర్ఆన్ మరణానంతరం తిరిగి లేపబడే దృశ్యాన్ని, ఆ తరువాత జరగబోయే దానిని జరిగిన సంఘటనలలాగే కళ్ళకు కట్టినట్లే – చిత్రించింది. మానవునికి అగోచర విషయాలపై నమ్మకం ఏర్పడటానికి ఇలా చేయాల్సి వచ్చింది –

> అది కేవలం ఒక పెద్ద గద్దింపు మాత్రమే. హఠాత్తుగా వారు (తమకు తెలుపబడుతూ ఉన్న విషయాలనన్నింటినీ) కళ్ళారా చూస్తూ ఉంటారు. అప్పుడు వారు "మేమెంత దౌర్భాగ్యులం, ఇది తీర్పుదినం కదా! అని అంటారు – మీరు తిరస్కరిస్తూ ఉండే తీర్పుదినమే ఇది. (ఆజ్ఞ అవుతుంది) దుర్మార్గులందరినీ, వారి సహచరులనూ దేవుణ్ణి కాదని వారు ఆరాధిస్తూ ఉండిన దైవాలనూ చుట్టుముట్టి తీసుకురండి.

తరువాత వారందరికీ నరకానికి దారి చూపండి.” కాస్త వారిని ఆపండి, ఒక విషయం అడగాలి. “ఏమయింది మీకు ఇపుడెందుకని ఒకరికొకరు సహాయం చేసుకోరు? అరే, ఈ రోజు వారు తమను తాము (ఒకరినొకరు) అప్పగిస్తున్నారేమిటి?” ఆ తరువాత వారు ఒకరి వైపునకు మరొకరు తిరిగి పరస్పరం వాదించుకోవటం ప్రారంభిస్తారు. (అనుచరులు తమ నాయకులతో ఇలా) అంటారు, “మీరు మా వద్దకు కుడివైపు నుండి వచ్చేవారు.” వారు సమాధానం ఇస్తారు, “అది కాదు, అసలు మీరే విశ్వసించే వారు కారు, మీమీద మాకు అధికారం లేదు, మీరు సహజంగానే తలబిరుసువాళ్ళు. చివరకు మీరు తప్పకుండా యాతనను చవిచూస్తారు” అని మా ప్రభువు అన్న మాటకు మేము అర్హులమైపోయాము. కనుక మేము మిమ్మల్ని మార్గభ్రష్టులుగా చేశాము, స్వయంగా మేము కూడా మార్గభ్రష్టులమయ్యే ఉన్నాము. ఈ విధంగా వారందరూ ఆ రోజు ఉమ్మడిగా శిక్ష అనుభవిస్తారు. మేము అపరాధుల విషయంలో ఇలానే చేస్తూ ఉంటాము. వారు ఎలాంటివారంటే, “అల్లాహ్ తప్ప మరొక సత్యమైన ఆరాధ్యుడు లేడు” అని చెప్పినపుడు, వారు అహంకారంతో, “మేము ఒక పిచ్చి కవి కోసం మా దేవుళ్లను వదలుకోవాలా?” అని అనేవారు. వాస్తవానికి అతను సత్యాన్నే తెచ్చాడు, దైవప్రవక్తలను ధ్రువీకరించాడు (ఇప్పుడు వారితో ఇలా అనటం జరుగుతుంది) మీరు తప్పనిసరిగా బాధాకరమైన శిక్ష చవిచూస్తారు. మీకు ఏ ప్రతిఫలం ఇవ్వబడుతూ ఉన్నా అది మీరు చేస్తూ ఉండిన కర్మల ఫలమే. *(అస్ సాఫ్ఫాత్ : 19 – 39)*

పైన పొందుపరచబడిన ఆయత్‌ల ద్వారా దాసులకు సుబోధకం చేయదలచిన వాస్తవాలివి :

- మలిసారి బ్రతికించి లేపటం అల్లాహ్‌కు ఏమాత్రం కష్టమైన పనికాదు. మానవుడు దానిని అసంభవం అనుకుంటున్నాడు. కాని ఒక్కగానొక్క గద్దింపు దానికి సరిపోతుంది.
- ఇప్పుడు లెక్కల దినం గురించి కేవలం సమాచారం మాత్రమే ఇవ్వబడుతోంది. అయితే మానవుడు ఆ సమయంలో స్వయంగా ఆ దృశ్యాన్ని తన కళ్ళారా వీక్షిస్తాడు. అంటే సమాచారం దశ (Phase) ను దాటి సంఘటన దశలోకి ప్రవేశిస్తాడు.

- ❖ 'అయ్యో మా దౌర్భాగ్యం! ఇదేకదా ప్రతిఫల దినం! దీని కొరకు మేము తయారీ చేసుకోలేదే!' – ఇంతకు ముందు ఆయత్‌లలో, వారి అర్ధంలేని వ్యర్థమయిన మాటలకు సమాధానం ఇవ్వకుండా, "అల్లాహ్‌కు ఇది ఏమాత్రం కష్టం కాద"ని తిరుగులేని విధంగా చెప్పటం జరిగింది.
- ❖ 'దుర్మార్గులకు సమీకరించండి (వారు అల్లాహ్‌కు సహవర్తుల్ని కల్పించి, మనోవాంఛల దాస్యం చేసి తమ ఆత్మలకు అన్యాయం చేసుకున్నారు). వారితో జతగట్టిన వారినీ, అల్లాహ్‌ను వదలి వారు పూజించే చిల్లర దేవుళ్లను కూడా ప్రోగుచేయండి' – వారి ఈ జీవన విధానానికి తగిన శాస్తి నరకమే.
- ❖ మొత్తం సీను (Scene) కళ్లకు కట్టినట్లే చిత్రించబడింది. వారి నాయకుల అనుయాయుల పరిణామ స్వరూపం ఎలా ఉంటుందో చూపించటం జరిగింది. వారి దగాకోరు దేవుళ్లు కల్లబొల్లి మాటలు చెప్పి పబ్బం గడుపుకునేవారు. వారి అనుయాయులు (Followers) కూడా వారి మాయ మాటలకు మోసపోయి గుడ్డిగా అనుసరిస్తారు. వారిలో చాలామంది దృష్టి తాత్కాలిక ప్రాపంచిక ప్రయోజనాలపై ఉంటుంది. అది ప్రాప్తించాలంటే ఈ బూటకపు నాయుకుల అడుగులకు మడుగులొత్తటం తప్ప మార్గాంతరం లేదని అనుకుంటారు. దేవుని ఏకత్వాన్ని (తౌహీద్‌ను), దైవ సందేశహరుని మాటను నమ్మితే ఇప్పటికిప్పుడే తమకు లభించేదేమీ ఉండదు కాబట్టి, తొందరగా కోరికలు నెరవేర్చే బాబాల పంచన చేరాలనుకుంటున్నారు. అనుయాయుల ఈ బలహీనతను పసిగట్టిన వారి బాబాలు సునాయాసంగా వారిని బోల్తా కొట్టిస్తారు.
- ❖ శిక్షను అనుభవించే విషయంలో వారి బాధ్యత ఉమ్మడి బాధ్యత అయి ఉంటుంది. ఎందుకంటే లీడర్లు – అనుయాయులు పరస్పరం సహకరించుకున్నారు. వారికి ప్రసాదించబడిన తెలివితేటలను, బుద్ధీ వివేకాలను దుర్వినియోగం చేశారు. అందువల్ల వారి నివాస స్థలం కూడా చెడు నివాస స్థలమయింది.
- ❖ అక్కడ మాత్రం వారు ఒకరింకొకరికి సహాయం చేసుకోలేరు. 'పరలోకమే గనక సంభవిస్తే మిమ్మల్ని కాపాడటానికి మేమున్నాము కదా!' అని వారి నాయకులు ప్రపంచంలో అభయం ఇచ్చేవారు. కాని అక్కడ కథ

అడ్డం తిరుగుతుంది. అక్కడ వారికి లభించే శిక్ష కూడా వారి దురాగతాలను బట్టి – న్యాయబద్ధంగా – ఉంటుంది.

## వాగ్దానం నెరవేరవలసి ఉంది

న్యాయం జరిగే రోజు రావలసి ఉంది. అల్లాహ్ తరఫున ఒక వాగ్దానం చేయబడింది. అది నెరవేరవలసి ఉంది. దాని గురించి అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో ఇలా ప్రస్తావించాడు :

> "ఆ రోజు మేము పత్రాల గొట్టంలో పుటలు చుట్టిపెట్టినట్లుగా ఆకాశాన్ని చుట్టిపెడతాము. తొలుత మేము సృష్టిని మొదలు పెట్టినట్లే దానిని పునరావృతం చేస్తాము. ఈ వాగ్దానాన్ని నెరవేర్చవలసిన బాధ్యత మాపైన ఉంది. దానిని మేము ఎట్టి పరిస్థితిలోనూ చేసి తీరుతాము." *(అల్ అంబియా – 104)*

మాట నిలబెట్టుకునే శక్తి ఉన్నప్పుడే వాగ్దానం చేయబడుతుంది. ఇది దైవ వాగ్దానం. వాగ్దానాన్ని నిలబెట్టుకోవటం గౌరవోన్నతుల చిహ్నం. మహిమాన్వితుడు, శక్తిమంతుడు అయిన దేవుడు వాగ్దానం చేశాడంటే, దాని విషయంలో ఆయన చాలా సెన్సెటివ్‌గా ఉంటాడు.

ఏ వస్తువునయినా మొదటిసారి చేయటం కష్టం. దానిని మళ్ళీ చేయటం చాలా తేలిక. నిశ్చయంగా తొలిసారి ఉనికిని ప్రసాదించి, తరువాత మళ్ళీ మళ్ళీ దానికి ఉనికిని ఇవ్వగల ప్రతిభ ఉన్నవాడే సృష్టికర్త కాగలుగుతాడు. దానికి తోడు ఇచ్చిన మాటను నిలబెట్టుకునేవాడై ఉంటాడు.

జీవితాన్ని ప్రసాదించటం అల్లాహ్‌కు చాలా తేలికైన పని. ఒక్కగానొక్క బొట్టుతో మానవుడు వంటి గొప్ప వ్యక్తిత్వాన్ని సృష్టిస్తాడు. మలిసారి జీవితాన్ని ఇవ్వటం కూడా ఆయన బాధ్యతే. అది మీ బాధ్యత కాదు. ఖుర్ఆన్ ఇలా అంటోంది –

> "ఆయనే ఆడమగల జంటలను సృష్టించాడు – స్ఖలించబడినప్పటి ఒక్కగా నొక్క వీర్యబిందువుతో. మలిసారి (బ్రతికించి) లేపే బాధ్యత కూడా ఆయనదే." *(అన్ నజ్మ్ : 45 – 47)*

పునరుత్థాన దినాన్ని తిరస్కరించడమంటే అర్థం సృష్టికర్త శక్తిని శంకించటమే. ఆయన్ని బలహీనునిగా భావించటమే. తమలో బలహీనతలున్నట్లే

సృష్టికర్తలో కూడా బలహీనతలు, లోపాలుంటాయని ఊహించటం అనుచిత విషయం. ఇది సమంజసమైన (Reasonable) ఆలోచనేనా అని సృష్టికర్త ప్రశ్నిస్తున్నాడు :

"నేను మరణించిన పిదప మళ్లీ బ్రతికించబడి వెలికి తీయబడతానా?" అని మనిషి అంటున్నాడు. ఏమిటీ, అసలు అతను ఏమీ లేనప్పుడే, అతనిని పుట్టించామన్న సంగతి మనిషికి గుర్తుకు రావటం లేదా?" *(మర్యమ్ – 66,67)*

ఈ భూమి కేవలం నివాసముండటానికి, సైర్లు చేయటానికి మాత్రమే ఉందని మనిషి తలపోస్తున్నాడు. ఇక్కడ వున్న వస్తుసామగ్రి అంతా సుఖపడటానికి మాత్రమే అనుకుంటున్నాడు. జనాభా పెరిగిపోతే ఈ భూమి సరిపోదనే బెంగ కూడా అతనికి పట్టుకుంది. లేదు, దీని పని బహుళార్థక (Multi-purpose) మైనది. మరణించవలసింది ఇక్కడే, ఖననమవవలసిందీ ఇక్కడే. బ్రతికి లేవవలసిందీ ఇక్కడి నుండే.

"ఈ భూమి నుండే మిమ్మల్ని పుట్టించాము. ఇందులోనికే మిమ్మల్ని చేరుస్తాము. ఇందులో నుండే మిమ్మల్ని మేము మళ్లీ వెలికి తీస్తాము." *(తాహా – 55)*

మలిసారి జీవితం ఎందుకంటే, పుట్టించిన వాని వైపునకు మరలవలసి ఉంది – లెక్కలు సమర్పించటానికి, బహుమానం లేక శిక్ష పొందటానికి. ఖుర్ఆన్ ఇలా అంటోంది –

"ప్రాణం పోసేదీ ఆయనే. ప్రాణం తీసేదీ ఆయనే. ఆయన వైపునకే మీరంతా మరలించబడతారు." *(యూనుస్ – 56)*

మలిసారి పుట్టుకపై అల్లాహ్ తన గ్రంథంలో తన సందేశహరుని (సఅసం) ద్వారా మానవాళిని ఇలా సావధానపరుస్తున్నాడు –

(ప్రవక్తా!) వారికి చెప్పు : "అల్లాహ్‌యే మిమ్మల్ని బ్రతికిస్తున్నాడు. తరువాత ఆయనే మిమ్మల్ని చంపుతున్నాడు, తరువాత ఆయనే ప్రళయదినాన మిమ్మల్ని సమావేశపరుస్తాడు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కాని చాలామంది తెలుసుకోరు."

*(అల్ జాసియహ్ – 26)*

పరలోకాన్ని త్రోసిపుచ్చినంత మాత్రాన అది రాకుండా ఆగదు. అది ఎలాగూ రావలసిందే. అది మానవుని అవసరం. న్యాయం కోసం అది రావటం అవసరం. తనకు న్యాయం జరిగినప్పుడే మనిషికి ఊరట లభిస్తుంది. బహుమానం పొందినప్పుడు మనిషికి అమితమైన ఆనందం కలుగుతుంది. అతని అలసట దూరమైపోతుంది. సృష్టికర్తలోని కారుణ్యగుణం, న్యాయశీలం కూడా పరలోక జీవితం ఉండాలని తీవ్రంగా కోరుకుంటుంది. అందుకే ఖుర్ఆన్ ఏమంటుందంటే, తిరస్కరించినంత మాత్రాన అది రాకుండా ఆగదు. ప్రతి ఒక్కరి జీవితపు తుది (Final) ఫలితం వారికి చూపించటం జరుగుతుంది –

> "ఆయన వారిని సమీకరించే సమయం ఒకటి నిర్ధారించిపెట్టాడు. అందులో ఎంతమాత్రం సందేహం లేదు. అయితే దీనిని సయితం వారు తిరస్కరించకుండా ఉండలేరు." *(బనీ ఇస్రాయీల్ – 99)*

ఎవరయితే కేవలం అనుమానాల, అంచనాల ఆధారంగా విషయం చెబుతారో వారి మాటలు ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉంటాయి. పైగా అవి పరస్పర విరుద్ధంగా ఉంటాయి. అయితే జ్ఞానం ప్రాతిపదికగా విషయం చెప్పేవారి మాట సదా ఒక్కటే అయి ఉంటుంది. వివిధ కాలాలలో వివిధ ప్రదేశాలలో, వివిధ జాతులలో, వివిధ భాషలలో వచ్చిన ప్రవక్తలంతా మరణానంతర జీవితం గురించి పలికిన మాట ఒక్కటే. వారి మాటల్లో ఎక్కడా వ్యత్యాసంగానీ, వైరుధ్యంగానీ లేదు. ఎందుకంటే వారి జ్ఞానం యొక్క మూల సరోవరం ఒక్కటే. ఆ మూల సరోవరం ఎవరో కాదు, సృష్టికర్త, మహాజ్ఞాని, వివేకి అయిన అల్లాహ్. అందువల్ల ప్రవక్తల మాట సత్యం. మిగిలిన మాటలు అసత్యం. అందుకే ఖుర్ఆన్ ఉత్తమ రీతిలో – సూటిగానూ, హెచ్చరించే ధోరణిలోనూ – హితవు పలికింది –

> ఏ విషయం గురించి భయపెట్టడం జరుగుతోందో, ఆ సమయం సత్యం. కర్మలకు ప్రతిఫలం లభించటం అనే పని తప్పకుండా జరగవలసి ఉన్నది. విభిన్న ఆకారాలు గల ఆకాశం సాక్షిగా! (పరలోక విషయం గురించి) మీ మాటలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. సత్యం నుండి ముఖం తిప్పుకున్నవాడే దాని నుండి విముఖుడవుతాడు. ఊహ, అనుమానాలు ఆధారంగా నిర్ణయం చేసేవారు నాశనమవుదురు గాక! వారు అజ్ఞానంలో కూరుకుపోయారు. మరియు ఏమరుపాటు మైకంలో పడి ఉన్నారు. అసలు ఆ తీర్పు

> దినం ఎప్పుడు వస్తుంది అని అడుగుతున్నారు. అది వారు అగ్నిలో దహింపజేయబడే రోజున వస్తుంది. (వారితో ఇలా అనబడుతుంది). ఇక చవిచూడండి మీ ఆగడాల రుచిని; మీరు తొందరపెడుతూ ఉన్న విషయం ఇదే."
>
> *(అజ్ జారియాత్ : 5 – 14)*

మరణించిన తరువాత తిరిగి బ్రతికించబడేది లేదని జనులు ఏ జ్ఞానం ఆధారంగా చెబుతున్నారు? వారు తమ వాదన కొరకు తగు 'ప్రమాణం' ఏదీ చూపించటం లేదు. తమ తిరస్కార వైఖరి వెనుక తగు Source కూడా వారి వద్ద లేదు. కాని, తప్పక లేపబడతారని ప్రవక్త అంటున్నాడు. అతను చెప్పేమాటకు మూల సరోవరంగా స్వయంగా సృష్టికర్త ఉన్నాడు. గోచర అగోచర విషయాలను ఎరిగిన విశ్వ ప్రభువు ఆయన! ఏమిటి, పుట్టించినవాడే, ప్రణాళికను రచించినవాడే ఎరుగకుండా ఎలా ఉంటాడు? మళ్ళీ లభించబోయే శాశ్వత జీవితాన్ని సుఖవంతంగా, ఆహ్లాదకరంగా మలచుకునే ప్రయత్నం చేయమని ఆ ప్రణాళిక రచయిత ముందస్తు సమాచారం ఇస్తున్నాడు.

> అవిశ్వాసులు తాము మరణించిన పిదప మళ్ళీ లేపబడటం అనేది ఎంతమాత్రం జరగదు అని పెద్ద సవాలు విసిరారు. వారితో ఇలా అను, "కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా లేపబడతారు. తరువాత, మీరు (ప్రపంచంలో) ఏమేమి చేశారో అదంతా మీకు తప్పకుండా తెలియజేయటం జరుగుతుంది. ఇలా చేయటం అల్లాహ్‌కు చాల సులభం." *(అత్ తగాబున్ – 7)*

దాసుల మధ్యన న్యాయం చేయటానికి పరలోకం రావటం అత్యంత అవసరం. 'న్యాయం' సృష్టికర్త యొక్క అత్యంత ముఖ్యమయిన గుణం. దీని గురించి ఆయన వాగ్దానం కూడా చేశాడు –

> "నిశ్చయంగా అల్లాహ్ వాగ్దానానికి విరుద్ధంగా చేయడు."
>
> *(అర్రాద్ – 31)*

మృత భూమిగా పడివున్న నేలకు ప్రాణం పోసి, దాసులకు జీవనోపాధిని సమకూర్చటం కూడా అల్లాహ్ కారుణ్యానికి ఒక తార్కాణమే. అలాగే మృతులను మళ్ళీ బ్రతికించి వారిలోని సజ్జనులకు మంచి ప్రతిఫలం ఇప్పించటం కూడా ఆయన కరుణకు ప్రతిరూపమే. ఆయన తన కరుణను, శక్తిని గురించి ఏమంటున్నాడో చూడండి –

అల్లాహ్‌యే గాలులను పంపేవాడు, అవి మేఘాలను లేపుతాయి, తరువాత ఆయన ఆ మేఘాలను తన ఇష్టం ప్రకారం ఆకాశంలో వ్యాపింపజేస్తాడు, వాటిని ఖండికలుగా విభజిస్తాడు, తరువాత మేఘంలో నుండి వర్షపు బిందువులు కురియటాన్ని నీవు చూస్తావు. ఆయన ఈ వర్షాన్ని తన దాసులలో తనకు ఇష్టమైన వారిపై కురిపించగానే, వారు ఆనందంతో పొంగిపోతారు. వాస్తవానికి దాని అవతరణకు పూర్వం వారు నిరాశకు లోనై ఉండేవారు, అల్లాహ్ కారుణ్యం యొక్క ప్రభావాలను చూడు; నిర్జీవంగా పడివున్న భూమిని ఆయన ఎలా బ్రతికించి లేపుతాడో; నిశ్చయంగా ఆయన మృతులకు ప్రాణం పోసేవాడు, ఆయన ప్రతి విషయంపై అధికారం కలవాడు.

*(అర్ రూమ్ : 48 – 50)*

## స్వర్గం – నరకం

అల్లాహ్ న్యాయస్థానంలో తీర్పు ఇవ్వబడిన తరువాత స్వర్గంలో ప్రవేశించేవారి పరిస్థితిని, నరకానికి ఆహుతి అయ్యేవారి స్థితిని ఖుర్‌ఆన్ అపురూపంగా చిత్రించింది. పరలోకంలో – లెక్కలదినాన, తీర్పుదినాన – అవిశ్వాసులు నరకానికి ఆహుతి అవటం ఎందుకు తథ్యమంటే, వారు దాని నుండి కాపాడుకునే ప్రయత్నం చేయలేదు. అసలు ఈ లెక్కల దినాన్నే వారు త్రోసిపుచ్చారు. అందువల్ల వారి జీవితమంతా ప్రజలను దోచుకోవటంలో, దౌర్జన్యాలు చేయుటంలో, హక్కులను కాలరాయుటంలో, కల్లోలాన్ని రేకెత్తించటంలోనే గడిచిపోయింది. స్వర్గనరకాల దృశ్యాన్ని ఖుర్‌ఆన్ ఎలా చిత్రించిందో చూడండి –

తరువాత మేము (ఈ గ్రంథ వారసత్వం కోసం) మా దాసులలో నుండి మేము ఎన్నుకున్న వారినే ఈ గ్రంథానికి వారసులుగా చేశాము. ఇప్పుడు వారిలో ఒకడు తన ఆత్మకు అన్యాయం చేసుకుంటున్నాడు. మరొకడు, మధ్యస్థంగా ఉంటున్నాడు, ఇంకొకడు అల్లాహ్ అనుమతితో పుణ్యకార్యాలలో ముందడుగు వేస్తున్నాడు. ఇదే మహా అనుగ్రహం. శాశ్వతంగా ఉండే ఉద్యాన వనాలలోకి వారు ప్రవేశిస్తారు. అక్కడ వారిని సువర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించటం జరుగుతుంది. అక్కడ వారు పట్టు వస్త్రాలు

ధరిస్తారు. ఇలా అంటారు, "అల్లాహ్‌కు కృతజ్ఞతలు. ఆయన మా దుఃఖాన్ని తొలగించాడు. నిశ్చయంగా మా ప్రభువు క్షమించేవాడూ, విలువ నిచ్చేవాడూను. ఆయన మమ్మల్ని తన అనుగ్రహం వల్ల శాశ్వత నివాస స్థలంలో నివసింపజేశాడు. ఇక ఇక్కడ మాకు ఏ కష్టమూ ఉండదు, ఏ అలసటా కలుగదు." అవిశ్వాసానికి పాల్పడిన వారికి నరకాగ్ని ఉన్నది. వారు చనిపోవాలనే తీర్పూ ఇవ్వబడదు, వారి నరక యాతనను ఏమాత్రం తగ్గించటమూ జరుగదు. ఇలా మేము అవిశ్వాసానికి పాల్పడే ప్రతి వ్యక్తికీ ప్రతిఫలం ఇస్తాము. వారు అక్కడ పెడబొబ్బలు పెడుతూ ఇలా అంటారు, "మా ప్రభూ! మమ్మల్ని ఇక్కడ నుండి బయటకు తియ్యి, మేము పూర్వం చేసిన పనులకు భిన్నంగా మంచి పనులు చేయటానికి." (వారికి ఇలా జవాబు ఇవ్వబడుతుంది) గుణపాఠం నేర్చుకోదలచిన వాడు గుణపాఠం నేర్చుకోవటానికి సరిపడిన ఆయుష్షును మేము మీకు ఇవ్వలేదా? మీ వద్దకు హెచ్చరిక చేసేవాడు కూడా వచ్చి ఉన్నాడు కదా! ఇక రుచి చూడండి (యాతనను). దుర్మార్గులకు ఇక్కడ సహాయం చేసే వాడెవ్వడూ లేడు. *(ఫాతిర్ : 32 – 37)*

**ఏడవ అధ్యాయం :**

**(Chapter - VII)**

# ఉపదేశం ... ఒక చూపులో!

- ఖుర్‌ఆన్‌లో విశ్వాసి అయిన ఒక వ్యక్తి సంఘటన ద్వారా ఉపదేశం
- పరలోక శిక్షను చూసిన మీదట తనను తాను కోపగించుకోవటం
- దుష్పరిణామం ఎదురుకాక ముందే పరిణామం గురించి సావధాన పరచటం జరుగుతోంది
- మరణానంతర జీవితంలో విధించబడే శిక్ష – ఒక్క చూపులో
- న్యాయం జరుగుతుంది. ప్రతి ఆచరణ ఫలితం వేరుగా ఉంటుంది
- దుష్పరిణామానికి ముందే హెచ్చరించటం దైవ కారుణ్యానికి తార్కాణం
- చివరి అవకాశం. మరో అవకాశం ఇవ్వబడదు
- ఒకే సమయంలో తౌహీద్ – షిర్క్ సరైనవి కావు
- మేల్కొల్పటానికి

# ఉపదేశం

## విశ్వసించిన ఒక వ్యక్తి ద్వారా సత్యోపదేశం

అల్లాహ్‌కు తన దాసులందరిపైన అమితమైన ప్రేమ ఉంది. వారిలో ప్రతి ఒక్కరూ యదార్థాన్ని అర్థం చేసుకుని, దానిని స్వీకరించాలన్నది ఆయన కోరిక. వివిధ రకాలుగా ఆయన వారికి సత్యాన్ని బోధపరచే ఏర్పాటు చేశాడు. 'వివిధ రకాలుగా' ఎందుకంటే మనుషుల ఆలోచనలు, అనుభవాలు, జ్ఞాన విశేషాలు, భావనలు విభిన్నంగా ఉంటాయి. అందుకే అందరినీ దృష్టిలో పెట్టుకోవటం జరిగింది. 'సత్యం' అన్నిటికన్నా విలువైన వస్తువు. దానిని గ్రహించిన మనిషి అపారంగా లబ్ది పొందుతాడు. అందుకే ఏ ఒక్కరూ సత్యానికి దూరం కారాదన్నది దేవుని అభిమతం.

ఫిరౌన్ చక్రవర్తి దర్బారులో ఒక వ్యక్తి దైవప్రవక్త మూసా (అ) సందేశం విని అల్లాహ్‌ను, మూసాను విశ్వసించాడు. ఆ వ్యక్తి తన జాతి ప్రజల, దర్బారు ప్రముఖుల శ్రేయాన్ని ఎంతగా అభిలషించాడో ఈ సంఘటన ద్వారా అల్లాహ్ ప్రస్తావించాడు :

> విశ్వసించిన ఆ వ్యక్తి ఇంకా ఇలా అన్నాడు : "నా జాతి ప్రజలారా! నా మాట వినండి. నేను మీకు సరైన మార్గాన్ని చూపిస్తాను. నా జాతీయులారా! ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం, శాశ్వత నివాస స్థలం పరలోకమే. చెడు చేసినవాడికి, అతడు చేసినంత చెడుకు మాత్రమే ప్రతిఫలం లభిస్తుంది. మంచి పనులు చేసిన వ్యక్తి, పురుషుడైనా స్త్రీ అయినా, విశ్వాసి అయితే, అటువంటి వారందరూ స్వర్గంలో ప్రవేశిస్తారు. అక్కడ వారికి అపరిమితమైన జీవన సామగ్రి ఇవ్వబడుతుంది. నా జాతీయులారా! ఇదేమి వైపరీత్యం! నేను మిమ్మల్ని ముక్తి వైపునకు పిలుస్తున్నాను, మీరేమో నన్ను అగ్ని వైపునకు పిలుస్తున్నారు! నేను అల్లాహ్‌ను తిరస్కరించాలనీ, నేను ఎరుగని శక్తులను ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టాలని మీరు

నాకు పిలుపు ఇస్తున్నారు. నిజానికి నేను మిమ్మల్ని సర్వశక్తి సంపన్నుడూ, క్షమాశీలుడూ అయిన దేవుని వైపునకు పిలుస్తున్నాను. కాదు, సత్యం ఇదే, దీనికి భిన్నంగా జరగటానికి వీల్లేదు, మీరు నన్ను ఎవరి వైపునకు పిలుస్తున్నారో, వారి వైపునకు పిలుపు అనేది ఇహలోకంలోనూ లేదు, పరలోకంలోనూ లేదు. మనం అందరం అల్లాహ్ వద్దకే మరలిపోవలసి ఉంది. హద్దులు మీరేవారే అగ్నిలోకి పోయేవారు. ఈనాడు నేను చెప్పేదాన్ని మీరు జ్ఞాపకం చేయనున్న సమయం త్వరలోనే రాబోతోంది. నా వ్యవహారాన్ని నేను అల్లాహ్‌కు అప్పగిస్తున్నాను. ఆయన తన దాసులను కనిపెట్టుకుని ఉంటాడు.

*(అల్ మూ'మిన్ : 38 – 44)*

యదార్ధమేమిటంటే, అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, తీర్పుదినాన్ని చిత్తశుద్ధితో విశ్వసించిన వ్యక్తి ఎంతో ఆర్ద్రతతో, ఆవేదనతో తోటి మానవ సోదరుల శ్రేయాన్ని అభిలషిస్తూ, వారిని శుభం వైపునకు పిలుస్తాడు. అతనిలోని ఈ 'మేలు' ఇహలోకం నుండి పరలోకం వరకూ వెళుతుంది.

## పరలోక శిక్షను – చవిచూసిన మీదట ...

సత్యాన్ని తిరస్కరించి విచ్చలవిడిగా ప్రజలపై దౌర్జన్యానికి ఒడిగట్టే వారి పరిణామం తీర్పుదినాన భయంకరంగా ఉంటుంది. ఆ దుర్భర స్థితి నుండి బయటపడటానికి అల్లాహ్ మనిషికి ఉపదేశం చేస్తున్నాడు. అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ న్యాయం చేసేవాడు. న్యాయం ఆయనలోని అత్యుత్తమ గుణాలలో ఒకటి. లేకపోతే ఈ జీవితానికి అర్ధమే ఉండదు. అందుకే అల్లాహ్ పరలోకం యొక్క ఈ దృశ్యాన్ని తన గ్రంథం ఖుర్‌ఆన్ ద్వారా ఇలా చిత్రించాడు:

అవిశ్వాసానికి పాల్పడిన వారిని ప్రళయం నాడు పిలిచి, "ఈనాడు మీకు మీ పట్ల ఎంత తీవ్రమైన కోపం వచ్చిందో, మిమ్మల్ని విశ్వాసం వైపునకు పిలువగా, మీరు నిరాకరించిననాడు అల్లాహ్‌కు మీ పట్ల అంతకంటే తీవ్రంగానే కోపం వచ్చింది" అని అనటం జరుగుతుంది. వారు ఇలా అంటారు : "ప్రభూ! నిజంగానే నీవు మాకు రెండుసార్లు మరణాన్నీ, రెండుసార్లు జీవితాన్నీ ఇచ్చావు. ఇప్పుడు మేము మా తప్పులను ఒప్పుకుంటున్నాము. కనుక ఇక్కడ నుండి బయటపడే మార్గం కూడా ఏదైనా ఉందా?" (ఇలా సమాధానం వస్తుంది) "మీరు గురియైన ఈ దుస్థితికి కారణం ఏమిటంటే, ఏకైక దేవుడు అయిన అల్లాహ్ వైపునకు మాత్రమే పిలిచినప్పుడు, మీరు విశ్వసించ

కుండా తిరస్కరించేవారు. ఇతరులను ఆయనకు సమానులుగా చేసినప్పుడు, మీరు వెంటనే విశ్వసించేవారు. ఇప్పుడు తీర్పు, మహనీయుడూ, మహోన్నతుడూ అయిన అల్లాహ్ చేతులలో ఉన్నది.” *(అల్ మూ'మిన్ : 10 – 12)*

మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి. *(అల్ బఖరా – 21, 22)*

మీరు అల్లాహ్ పట్ల తిరస్కార వైఖరిని ఎలా అవలంబించ గలుగు తారు? వాస్తవానికి ప్రాణం లేని మీకు ఆయన ప్రాణం పోశాడు. మళ్ళీ మీ ప్రాణాన్ని తీసేదీ ఆయనే. తిరిగి మిమ్మల్ని బ్రతికించేదీ ఆయనే. చివరకు మీరంతా ఆయన వద్దకే మరలిపోతారు.

*(అల్ బఖరా – 28)*

మొదటినుంచి చివరి వరకు ఎవరు ఉపకారం చేస్తూ వస్తున్నాడో, ఎవరి అనుగ్రహాలలో, వరప్రసాదాలలో వేరొకరు భాగస్వాములుగా లేరో అట్టి అద్వితీయ దేవునికి సాటి కల్పించటం, వేరొకరిని ఆరాధించటం న్యాయమా? ఇది చేసిన మేలును మరువటం కాదా?

## దుష్పరిణామం ఎదురవక ముందే ...

దిగువ నివ్వబడిన ఆయత్‌ల ద్వారా మనసాక్షిని మేల్కొలిపే విషయంపై చింతన చేయమని, సత్యాన్ని స్వీకరించమని పురికొల్పటం జరిగింది. అయితే అల్లాహ్ ఎవరినీ బలవంతం చేయడు. తన మార్గబోధనను నమ్మి నడుచుకోవలసిందేనని నిర్బంధం విధించడు. ఆయన తన గ్రంథంలో తీర్పుదినం దృశ్యాన్ని చిత్రించి, అవిశ్వాసులకు చిత్తశుద్ధితో చింతన చేయమని ప్రేమతో పిలుపు ఇస్తున్నాడు. ఆనాడు న్యాయ విచారణ జరిగిన మీదట తీర్పు ఇవ్వబడి నప్పుడు, ఎలాంటి మొగమాటం లేకుండా, నిర్ద్వంద్వంగా తీర్పు ఇవ్వటం జరుగుతుంది. తీర్పు సందర్భంగా ఎవరి గోడూ వినిపించుకోబడదు. ఎవరి సిఫారసూ పనికి రాదు. కాబట్టి తమ భవిష్యత్తును ఇక్కడే నిర్ణయించుకుని,

దాని కొరకు సాధన చేయాలి. అల్లాహ్ ఫర్మానాను ఖుర్ఆన్ ఇలా పొందు పరిచింది.

> ఆయన మహెూన్నతమైన స్థానాలు కలవాడు, విశ్వ సామ్రాజ్యపీఠానికి అధిపతి. తన దాసులలో తనకు ఇష్టమైన వారిపై తన ఆజ్ఞ ప్రకారం ఆత్మను అవతరింపజేస్తాడు; అతను సమావేశదినం గురించి హెచ్చరించేటందుకు. పరదాలు తొలిగిపోయి అందరూ బయటకు వచ్చిన రోజున, వారికి సంబంధించిన విషయమేదీ అల్లాహ్‌కు రహస్యంగా ఉండదు. (ఆ రోజున బహిరంగంగా ఇలా అడగటం జరుగుతుంది), "ఈనాడు విశ్వసామ్రాజ్యాధికారం ఎవరిది?" అని. (విశ్వం మొత్తం ముక్తకంఠంతో ఇలా అంటుంది), "అది ఒకే దేవుడూ, సర్వాధిక్యం కలవాడూ అయిన అల్లాహ్‌ది" అని. (ఇలా అనటం జరుగుతుంది), "ఈనాడు ప్రతి ప్రాణికీ అది సంపాదించిన దాని ప్రకారమే ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఈనాడు ఎవరికీ ఎలాంటి అన్యాయమూ జరగదు. అల్లాహ్ మిక్కిలి వేగంగా లెక్క తీసుకుంటాడు. ఓ ప్రవక్తా! దగ్గర పడిన ఆ రోజును గురించి వారిని భయపెట్టు. అప్పుడు గుండెలు గొంతులకు అడ్డం పడుతూ ఉంటాయి. ప్రజలు దుఃఖాన్ని దిగమ్రింగి మౌనంగా నిలబడి ఉంటారు. దుర్మార్గులకు ఆప్తమిత్రుడు గానీ, మాట చెల్లుబడి అయ్యే సిఫారసు చేసేవాడు గానీ ఎవ్వడూ ఉండడు. అల్లాహ్, చూపుల చౌర్యాన్ని సైతం ఎరుగును. హృదయాలు దాచి ఉంచిన రహస్యాన్ని సైతం ఆయన ఎరుగును. అల్లాహ్ కచ్చితంగా, న్యాయంగా తీర్పు చేస్తాడు. ఇక అల్లాహ్‌ను వదలిపెట్టి, (ఈ ముష్రిక్కులు) వేడుకునేవారి విషయం, వారు ఏ విషయం గురించీ తీర్పు చెప్పగలవారు కారు. నిస్సందేహంగా అల్లాహ్ మాత్రమే అన్నీ వినేవాడు, అన్నీ చూచేవాడూను. *(అల్ మూ'మిన్ : 15 – 20)*

## మరణానంతర జీవితంలో విధించబడే శిక్ష – ఒక్క చూపులో

మనిషి తన భవిష్యత్తు గురించి గంభీరంగా ఆలోచించుకునేందుకు, ఆనాడు ఎవరూ ఎవరికీ ఏవిధంగా కూడా సహాయపడలేరన్న విషయం బోధపడేటందుకు మరణానంతర జీవితంలో విధించబడే శిక్షను సంక్షిప్తంగా ఇలా వివరించటం జరిగింది –

అల్లాహ్ తన గ్రంథంలో నరకవాసుల దురవస్థను ఇలా చిత్రించాడు:

వారు నరకంలో ఒకరితో ఒకరు కలహించే సందర్భం గురించి ఆలోచించు. ప్రపంచంలో బలహీనులుగా ఉన్నవారు, పెద్ద మనుషులుగా చెల్లుబడి అయిన వారితో ఇలా అంటారు, "మేము మిమ్మల్ని అనుసరిస్తూ ఉండేవారము. ఇప్పుడు మీరు ఇక్కడ నరకాగ్ని బాధ నుండి కొంతవరకైనా మమ్మల్ని కాపాడతారా?" ఆ పెద్ద మనుషులు ఇలా జవాబు ఇస్తారు, "ఇక్కడ మనమందరం ఒకే స్థితిలో ఉన్నాము. దాసుల మధ్య అల్లాహ్ తీర్పు చేసేశాడు." తరువాత అగ్నిలో పడివున్న వారు నరక భటులతో, "మా శిక్షను కనీసం ఒక్క రోజైనా తగ్గించమని మీరు మీ ప్రభువును ప్రార్థించండి" అని అర్థిస్తారు. భటులు ఇలా అడుగుతారు, "మీ వద్దకు దైవప్రవక్తలు స్పష్టమైన సూచనలు తీసుకుని రాలేదా?" అప్పుడు వారు, "అవును, వచ్చారు" అని అంటారు. నరకభటులు, "అలా అయితే, మీరే ప్రార్థించండి; సత్యతిరస్కారుల ప్రార్థన నిరర్థకమే అవుతుంది" అని అంటారు. *(అల్ మూ'మిన్ : 47 - 50)*

వారి ఈ పరిస్థితికి కారణమేమిటంటే, హెచ్చరిక చేసేవాడు హెచ్చరించినప్పటికీ వారు దుర్మార్గాన్నే అవలంబించారు.

## న్యాయం జరుగుతుంది. ప్రతి ఆచరణ పర్యవసానం వేరుగా ఉంటుంది

ప్రతి వస్తువు యొక్క విలువ వేరుగా ఉన్నట్లే ప్రతి ఆచరణ యొక్క పర్యవసానం, దాని ప్రతిఫలం కూడా వేర్వేరుగా ఉంటుంది. సత్కార్యానికి సత్ఫలితం. దుష్కార్యానికి దుష్ఫలితం. రెండింటి పర్యవసానం ఒకేవిధంగా ఉండదు. ఏ విధంగా వజ్రం విలువ, మామూలు రాయి విలువ ఒకే విధంగా ఉండదో అదేవిధంగా ఇదీను. సదాచరణ విలువ స్వర్గమైతే దురాచరణ మూల్యం నరకం. కర్మల పర్యవసానాన్ని, ఫలితాన్ని వెలువరించడానికి తీర్పుదినం అనేది ఒకటి ఉండాలి. దాసుల ఆచరణలకు విలువ ఇచ్చే అల్లాహ్ తప్పకుండా తీర్పుదినాన్ని నెలకొల్పుతాడు. ఆ సమాచారాన్ని ఆయన తన గ్రంథంలో ఇస్తున్నాడు –

కళ్లు లేనివాడూ, కళ్లు ఉన్నవాడూ సమానం కావటం; విశ్వసించి

సత్కార్యాలు చేసేవారూ, దుర్వర్తనులూ సరిసమానం కావటం అనేది ఎంతమాత్రం జరగదు. కాని మీరు అర్థం చేసుకోవటం చాలా తక్కువ. నిశ్చయంగా ప్రళయ గడియ తప్పకుండా వస్తుంది. అది వచ్చే విషయం గురించి ఏమాత్రం సందేహం లేదు. కాని చాలామంది నమ్మరు. *(అల్ మూ'మిన్ – 58, 59)*

## దుష్పరిణామానికి ముందే సావధానపరచటం దైవ కారుణ్యానికి ప్రతిరూపం

అవిశ్వాసులకు అల్లాహ్ తన గ్రంథంలో చాలా స్పష్టంగా వారి దుష్పరిణామం గురించి హెచ్చరించాడు. ముందస్తు సమాచారం ఇచ్చి హెచ్చరించటం, పశ్చాత్తాపం చెంది దిద్దుబాటు చేసుకోవటానికి అవకాశం కల్పించటం కూడా అల్లాహ్ కారుణ్యానికి తార్కాణమే. దేవుని ఈ కారుణ్యం దాసులను వెన్నంటి ఉంటుంది – చూడండి! సత్యాన్ని స్వీకరించటంలోనే మీ ఇహపరాల సాఫల్యం ఉంది. కాబట్టి సత్యాన్నే మీ జీవితానికి పునాదిగా చేసుకోండి. అన్నింటికన్నా పెద్ద సత్యం, ప్రథమ సత్యం అల్లాహ్ ఏకత్వం. ఈ సత్యాన్ని గనక ఒప్పుకుంటే మనిషి మిగిలిన సత్యాలను కూడా వరుసగా ఒప్పుకుంటూ పోతాడు. ప్రాపంచిక తళుకు బెళుకులను చూసి అతను మోసపోడు. వట్టిమాటల వెనుక పరుగెత్తడు. ప్రాపంచిక పదవీ వ్యామోహంలో పడిపోయి జీవిత లక్ష్యాన్ని మరచిపోడు అని గుర్తుచేస్తూ ఉంటుంది.

హెచ్చరిక రూపంలో అల్లాహ్ తన కారుణ్యాన్ని తన పవిత్ర గ్రంథంలో వెల్లడించే తీరును చూడండి –

అల్లాహ్ వాక్యాలను గురించి వాదులాడే వారిని నీవు చూశావా, వారు ఎలా విముఖులుగా చేయబడుతున్నారో? ఈ గ్రంథాన్నీ, మేము (ఇది వరకు) మా ప్రవక్తలతో పంపిన అన్ని గ్రంథాలనూ తిరస్కరించే వారికి త్వరలోనే తెలిసిపోతుంది; అప్పుడు వారి మెడలలో కంఠపాశాలు ఉంటాయి, సంకెళ్లు కూడ ఉంటాయి; వాటితో వారు కాగే నీటి వైపునకు ఈడ్వబడతారు, తరువాత నరకాగ్నిలోకి నెట్టబడతారు. అప్పుడు వారిని ఇలా అడగటం జరుగుతుంది, "అల్లాహ్‌ను కాదని మీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టిన దేవుళ్లు ఇప్పుడు ఎక్కడున్నారు?" వారు ఇలా సమాధానం చెబుతారు, "వారు మానుండి విడిపోయారు. దీనికి పూర్వం మేము

> అసలు దేనినీ ప్రార్థించేవారము కాదు. ఈ విధంగా అల్లాహ్ అవిశ్వాసులు ఎలా మార్గభ్రష్టులయిందీ ఋజువు చేస్తాడు. వారితో ఇలా అనబడుతుంది, “మీ ఈ ముగింపునకు కారణం మీరు భూమిలో అసత్యాన్ని అనుసరించి ఆనందించటమే, దానికి గర్వపడ టమే. ఇక వెళ్లండి, నరక ద్వారాలలో ప్రవేశించండి, కలకాలం మీరు అక్కడనే ఉండవలసి ఉంది. అది దురహంకారుల నివాసం, బహుచెడ్డది.” *(అల్ మూ'మిన్ : 69 – 76)*

## ఆఖరి అవకాశం, ఆపైన ఏ అవకాశం ఉండదు

శిక్షను చూసుకున్న మీదట లేదా మరణ ఘడియలు ఆసన్నమైన తర్వాత సత్యాన్ని ఒప్పుకుని విశ్వసించటం లాభదాయకం కాజాలదు. ఇది అల్లాహ్ ప్రకటన, నియమం. దాని గురించి ఆయన తన అంతిమ గ్రంథంలో కూడా ప్రస్తావించాడు :

> వారు మా శిక్షను చూచిన పిమ్మట ఇలా అన్నారు : “ఒక్కడూ, ఏ భాగస్వాములు లేనివాడూ అయిన అల్లాహ్‌ను మేము విశ్వసించాము. మేము ఆయనకు భాగస్వాములుగా నిలబెట్టిన వేల్పులనందరినీ నిరాకరిస్తున్నాము.” కాని మా శిక్షను చూచిన తర్వాత వారి విశ్వాసం వారికి ఏమాత్రం లాభదాయకం కాజాలదు. ఎందుకంటే, అల్లాహ్ నిర్ణయించిన నియమావళి ఇదే. ఆయన దాసులలో ఎల్లప్పుడూ అమలులో ఉండేది ఈ నియమావళియే. అప్పుడు అవిశ్వాసులు నష్టానికి గురిఅయ్యారు. *(అల్ మూ'మిన్ – 84, 85)*

ప్రత్యక్షంగా తిలకించడానికి ముందు అగోచర విషయాలను నమ్మి, వాటిని సత్యమని ధ్రువపరచటమే విశ్వాసం (ఈమాన్). నమ్మడానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయబడ్డాయి – భూమ్యాకాశాలలోనూ! స్వయంగా మానవునిలోనూ!! అంతేకాదు, దైవ ప్రవక్తను పంపటం, గ్రంథాన్ని అవతరింపజేయటం జరిగింది. ఈ సత్యధర్మాన్ని పరిచయం చేసే ఒక జమాఅత్‌ని కూడా నిలబెట్టడం జరిగింది. విశ్వాసాన్ని (ఈమాన్‌ని), సత్యాన్ని స్వీకరించే సామర్థ్యం కూడా మనిషి లోపల పొందుపరచటం జరిగింది. ఈ ఆధ్యాత్మిక సౌకర్యాలతో లబ్ధి పొందుతూ సత్యాన్ని కనుగొని, దానిని విశ్వసించేబదులు, ప్రత్యక్షంగా కళ్ళతో చూసినమీదటే అంగీకరిస్తానని అంటే అలాంటి విశ్వాసం అంగీకార యోగ్యం కాజాలదు. ఎందుకంటే ప్రత్యక్షంగా చూసిన మీదట ఎలాగూ విశ్వసించవలసిందే, ఎలాగూ ఒప్పుకోవలసిందే. ఇక ఎలాంటి Choice లేదు. అవకాశం మిగిలి ఉండగా

విశ్వసించినవాడు తన లాభం కొరకే విశ్వసిస్తాడు. లేకుంటే నష్టపోతాడు. ఎవరు విశ్వసించినా, విశ్వసించకపోయినా అల్లాహ్‌కు కలిగే నష్టం ఏమీ ఉండదు. ఆయన నిరపేక్షాపరుడు.

## తౌహీద్ – షిర్క్ ఒకచోట ఇమడలేవు

ప్రజలు ఆరాధ్య దైవాలుగా భావిస్తున్నవారు భూమ్యాకాశాలకు గానీ, వాటి మధ్యన ఉన్న ఏ వస్తువుకు గానీ యజమానులు కారు. వారికెలాంటి భాగస్వామ్యం కూడా లేదు. నిజ ఆరాధ్య దైవానికి వారు సహాయకులు కూడా కారు. పోనీ వారికి సిఫారసు చేసే అధికారం ఉందా అంటే అదీ లేదు. అల్లాహ్ తన గ్రంథం ఖుర్‌ఆన్‌లో, తన ప్రవక్త ద్వారా ప్రజలు తిరస్కరించిన ఈ వాస్తవాలను ఎత్తిచూపుతున్నాడు –

> (ప్రవక్తా! ఈ ముష్రిక్కులతో) ఇలా అను, "అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధ్యులుగా భావించిన వారిని పిలిచి చూడండి, వారు ఆకాశాలలో గాని, భూమిలోగాని, రవ్వంత వస్తువుకు కూడా యజమానులు కారు. ఇంకా వారు భూమ్యాకాశాల ఆధిపత్యంలో భాగస్వాములునూ కారు. వారిలో ఎవ్వడూ అల్లాహ్‌కు సహాయకుడూ కాడు, అల్లాహ్ ఏ వ్యక్తి విషయంలో సిఫారసుకు అనుమతి ఇచ్చాడో, ఆ వ్యక్తికి తప్ప మరెవరికినీ ఏ సిఫారసూ అల్లాహ్ సమక్షంలో లాభదాయకం కాదు, చివరకు ప్రజల హృదయాల నుండి భయం తొలగిపోయి నప్పుడు, వారు (సిఫారసు చేసేవారిని) "మీ ప్రభువు ఏమని సమాధానం పలికాడు?" అని అడుగుతారు. వారు, "సరైన సమాధానమే దొరికింది, ఆయన మహిమాన్వితుడు, మహోన్నతు డూను" అని చెబుతారు. *(సబా – 22, 23)*

> (ప్రవక్తా!) వారిని ఇలా అడుగు, "ఆకాశాల నుండి, భూమి నుండి మీకు ఉపాధిని ఎవడు ఇస్తున్నాడు?" ఇలా అను, "అల్లాహ్‌యే. ఇప్పుడు నిశ్చయంగా మేమో, మీరో ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము." *(సబా : 24)*

అంటే, నిజ ఆరాధ్యదైవం (తౌహీద్) లోనూ, కాల్పనిక దైవం (షిర్క్)లోనూ భూమ్యాకాశాలంత అంతరం ఉంది. వ్యత్యాసం ఉంది. వైరుధ్యం ఉంది. కాబట్టి ఇవి రెండూ ఒకేసారి తప్పో లేక ఒప్పో కాలేవు. వాటిలో ఒకటి

సరైనదైతే. మరొకటి సరైనది కాదు. కాబట్టి ఒక సిద్ధాంతాన్ని నమ్మేవారు సన్మార్గాన ఉన్నారు, మరొకరు అపమార్గాన ఉన్నారు.

## మేల్కొలుపు కోసం

తన దాసులైన మానవులపై అల్లాహ్‌కు అమితమైన ప్రేమ. ఆయన మందలింపులో కూడా ప్రేమ తొణికిసలాడుతూ ఉంటుంది. ఆయన హెచ్చరికలో కూడా శ్రేయోభిలాష ఉట్టిపడుతూ ఉంటుంది. మానవుని బద్ధవిరోధి అయిన షైతాన్ పట్ల అప్రమత్తంగా ఉండమని అల్లాహ్ చెబుతున్న పలుకులను చూడండి:

> "మానవులారా! నిశ్చయముగా అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసానికి గురిచేయకూడదు. ఆ మహా వంచకుడు కూడా మిమ్మల్ని అల్లాహ్ విషయంలో మోసగించగలగకూడదు. యధార్థానికి షైతాను మీకు శత్రువు. కనుక మీరు కూడా వాడు మీ శత్రువే అని భావించండి. వాడు, తన అనుచరులు నరక వాసులలో చేరిపోవాలని వారిని తన మార్గం వైపునకు పిలుస్తున్నాడు. అవిశ్వాసానికి పాల్పడే వారికి కఠిన శిక్ష పడుతుంది. విశ్వసించి మంచి పనులు చేసేవారికి క్షమాభిక్ష, గొప్ప ప్రతిపలం లభిస్తాయి. *(ఫాతిర్ : 5 – 7)*

మానవుని బద్ధశత్రువు అయిన షైతాన్ పలురకాల ఎత్తులువేసి, పలు కోణాల నుండి మనిషిని బోల్తా కొట్టిస్తాడు. లేదా మోసగించే ప్రయత్నం చేస్తాడు. అతని దుష్ప్రేరణలు ఇలా ఉంటాయి – "సృష్టికర్త (అల్లాహ్) అనేవాడు అసలు లేడు. ఒకవేళ ఉన్నా ఆయన ఈ విశ్వాన్ని నిర్మించిన మీదట పడుకున్నాడు. మానవ వ్యవహారాలతో అతనికెలాంటి ఆసక్తి లేదు. ఒకవేళ ఈ జగతిని నడుపుతున్నా మానవ మార్గదర్శకత్వంతో ఆయనకెట్టి సంబంధం లేదు. దైవవాణి, దైవదౌత్యం అనేవి అంతా వట్టిదే" లేదా ఈ విధంగా మోసగిస్తాడు – "అల్లాహ్ క్షమాసాగరుడు, అనంత కరుణామయుడు. మీరేం చేసినా క్షమించబడతారు. లేదా మీ పూర్వీకుల సిఫారసు అక్కడ మీకు పనికి వస్తుంది. కాబట్టి వాళ్ళను ఆశ్రయించండి."

ఇవన్నీ దారి తప్పిన ఆలోచనలు. ఇది పచ్చి మోసం.

**ఎనిమిదవ అధ్యాయం :**

**(Chapter - VIII)**

# హెచ్చరిక ... ఒక చూపులో

- సత్యాన్ని త్రోసిపుచ్చే వారి ప్రాపంచిక పర్యవసానం చెడుగానే ఉంటుంది
- దురభిమానానికి, మనోవాంఛలకు లోనై సత్యాన్ని తిరస్కరించటం
- అహంకారంతో సత్య తిరస్కరణ
- సత్యాన్ని ఎదిరించే వారికి ...
- సూచనలు, నిదర్శనాలు నలువైపులా విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ అంగీకరించని వారికి మందలింపు
- అల్లాహ్ విధానంలో బలవంతానికి తావు లేదు
- విశ్వసించేవారికి అల్లాహ్ సహాయం

# హెచ్చరిక

## సత్యాన్ని త్రోసిపుచ్చేవారి ప్రాపంచిక పర్యవసానం

మౌలిక యదార్థాలను – అంటే అల్లాహ్‌ను, దైవప్రవక్తను, దైవ గ్రంథాన్ని, తీర్పుదినాన్ని తిరస్కరించేవారి ఐహిక పర్యవసానం కూడా బాగుండదు. ఎందుకంటే ఒకటి : వారిపై దైవాగ్రహం ఉంటుంది. రెండు : దైవమార్గదర్శకత్వానికి దూరమైన కారణంగా వారి జీవితం అశాంతికి, అరాచకానికి ఆలవాలమై ఉంటుంది.

అలాంటివారి జీవన పరిస్థితిని గురించి అల్లాహ్ తన గ్రంథంలో ఇలా అంటున్నాడు :

> వారు భూమిలో ఎన్నడూ సంచరించలేదా, వారికి పూర్వం గతించిన ప్రజల ముగింపు ఎలా జరిగిందో వారికి కనిపించేందుకు? వారు వీరికంటే ఎక్కువ బలాఢ్యులు, వీరికి మించిన గొప్ప గుర్తులను భూమిపై వదలివెళ్లారు. కాని అల్లాహ్ వారి పాపాలకుగాను వారిని పట్టుకున్నాడు. అల్లాహ్ పట్టునుండి వారిని రక్షించేవాడెవడూ లేకపోయాడు. వారి ముగింపు ఇలా ఎందుకు జరిగిందంటే, వారి వద్దకు వారి ప్రవక్తలు స్పష్టమైన సూచనలు తీసుకుని వచ్చారు; కాని వారు విశ్వసించకుండా వాటిని తిరస్కరించారు. చివరకు అల్లాహ్ వారిని పట్టుకున్నాడు. నిశ్చయంగా ఆయన అత్యంత శక్తిమంతుడూ, శిక్షించటంలో కఠినుడూను.
>
> *(అల్ మూ'మిన్ – 21, 22)*

దేవుని ఏకత్వం (తౌహీద్) వైపునకు పిలవటం, విశ్వసించిన వారికి స్వర్గ శుభవార్తను వినిపించటం, తిరస్కరించిన వారికి నరకాగ్ని యాతన గురించి భయపెట్టడం దైవప్రవక్త పని.

అత్యంత ముఖ్యమయిన అంశంపై సీరియస్‌గా ఆలోచించమని పిలుపు ఇవ్వబడుతోంది – ఎందుకంటే దేవుని ఈ సందేశాన్ని విశ్వసించిన వారి పర్యవసానం, త్రోసిపుచ్చిన వారి పర్యవసానం ఒకేవిధంగా ఉండవు. రెండింటి మధ్య నింగికీ – నేలకు మధ్య ఉన్నంత వ్యత్యాసం ఉంటుంది. విశ్వసించటంలో సాఫల్యం, లాభం ఇమిడి ఉంది. తిరస్కారంలో వైఫల్యం, నష్టం ఇమిడి ఉంది. దైవప్రవక్త అందజేసే మార్గబోధనను ఖాతరు చేయనివారిని విశ్వసామ్రాట్టు అయిన అల్లాహ్ ఇలా హెచ్చరిస్తున్నాడు :

> ప్రవక్తా! వారికి ఇలా చెప్పు : "ఒకవేళ ఈ గ్రంథం అల్లాహ్ తరఫు నుండి వచ్చి ఉండి, మీరు దానిని తిరస్కరిస్తూ ఉన్నట్లయితే, (అప్పుడు మీ గతి ఏమవుతుందో అనే) ఆ విషయం గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?" *(అల్ అహ్ఖాఫ్ – 10)*

## దురభిమానానికి, మనోవాంఛల దాస్యానికి లోనై సత్యాన్ని కాదనటం

మానవుడు దురభిమానానికి లోనైన కారణంగానయినా సత్యాన్ని తిరస్కరిస్తాడు లేదా బాగా తెలిసిన మీదట కూడా తిరస్కరిస్తాడు. ఎందుకంటే సత్యాన్ని స్వీకరించటం వల్ల అతని స్వప్రయోజనాలపై, అహంపై దెబ్బపడుతుంది. అయితే సత్యాన్ని (తౌహీద్‌ను) నిరాకరించిన కారణంగా తాను నరకాగ్నికి ఆహుతి కావలసి ఉంటుందని గనక అతనికి తెలిస్తే, అప్పుడు ఆగి ఆలోచిస్తాడు. మరో నిర్ణయం తీసుకుంటాడు.

అందుకే ప్రజలకు భయబోధ చెయ్యి అని అల్లాహ్ తన ప్రవక్త (సఅసం)తో అంటున్నాడు :

> (ప్రవక్తా!) వారికి ఇలా చెప్పు : "దీనికంటే కూడా ఘోరమయిన విషయం ఏమిటో నేను మీకు తెలిపేదా? అది అగ్ని. సత్యాన్ని స్వీకరించక నిరాకరించే వారి విషయంలో అల్లాహ్ దానిని గురించిన వాగ్దానమే చేశాడు. అది అతి చెడ్డ నివాస స్థలం." *(అల్ హజ్జ్ : 72)*

ఆ శిక్ష రాకముందే సావధానపరచటం జరిగింది. హెచ్చరించటం జరిగింది. ఇది దయామయుడైన ప్రభువు కృప.

## అహంకారం వల్ల తిరస్కార వైఖరి

అహంకారం, గర్వం కూడా సత్యాన్ని (తౌహీద్, రిసాలత్, ఆఖిరత్‌ని) స్వీకరించకుండా మనిషిని ఆపుతుంది. అహంకారానికి మూలం అధికారం కావచ్చు, ఐశ్వర్యం కావచ్చు లేదా జ్ఞానసంపద కూడా కావచ్చు, సత్యాన్ని అంగీకరించటం తన పెద్దరికానికి వ్యతిరేకం అని అతననుకుంటాడు. ప్రపంచంలో ఒక సామాన్య మనిషిగా పరిగణించబడేవాని నోట వెలువడిన సత్యవాక్కును తాను అంగీకరించటం తలవంపు అని భావిస్తాడు.

> "ఎవరయితే తిరస్కరించారో (వారితో ఇలా అనబడుతుంది) : "మా వచనాలు మీకు చదివి వినిపించబడలేదా? కాని మీరు అహంకారం ప్రదర్శించారు. మీరు అపరాధ జనులు." *(అల్ జాసియహ్–31)*

ఫలితాలు ఆచరణలపై ఆధారపడి ఉన్నాయి. ఆచరణలేమో విశ్వాసంపై ఆధారపడి ఉన్నాయి. సదాచరణలు ఈమాన్‌తో ముడిపడి ఉన్నాయి. దుష్కర్మల సంబంధం తౌహీద్, ఆఖిరత్‌ల తిరస్కరణతో ఉంది. లేదా వాటిపట్ల శంకతో ఉంది లేదా బలహీన విశ్వాసంతో ఉంది. అందుకే ఖుర్‌ఆన్ ఇలా అంటోంది :

> "కనుక విశ్వసించి, సత్క్రియలాచరించిన వారిని, వారి ప్రభువు తన కారుణ్యంలో చేర్చుకుంటాడు. ఇదే స్పష్టమయిన సాఫల్యం."
>
> *(అల్ జాసియహ్ – 30)*

## సత్యాన్ని ఎదిరించేవారి పర్యవసానం

సత్యం తమ ముందుకు వచ్చేసిన తరువాత ఎవరయితే దాని ముందు తలవంచే బదులు దురహంకారం ప్రదర్శిస్తారో, వారు ఒక విధంగా అల్లాహ్‌ను ఎదిరిస్తున్నారు. ఫలితంగా వారికి కఠిన శిక్ష తప్పదు. దీని గురించి ఖుర్‌ఆన్ నిర్ద్వంద్వంగా ఇలా అంటోంది –

> ఇలా ఎందుకంటే, వారు అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఎవడు అల్లాహ్‌ను వ్యతిరేకించినా అల్లాహ్ అతనిని కఠినంగా దండిస్తాడు." *(అద్ దహ్ర్ – 4)*

## సూచనలు తమ ముందు విస్తరించి ఉన్నప్పటికీ నమ్మకపోతే ...

ఈ జగతికి, జీవితానికి సంబంధించిన అసంఖ్యాకమయిన సూచనలు, నిదర్శనాలు సర్వత్రా వ్యాపించివున్నాయి. అడుగడుగునా, ప్రతి మలుపులో అవి ఆలోచింపజేస్తున్నాయి. తద్వారా సృష్టికర్త వరకు చేరటం సులువైపోయింది. అయినప్పటికీ ఎవరయినా ఈ మార్గదర్శక సూచనల ద్వారా లబ్ధి పొందకపోతే, తనను తాను సృష్టికర్తకు దూరంగా ఉంచుకుంటే లేదా మంకుతనంతో మొండిగా వ్యవహరిస్తే ఆ వ్యక్తి తన దుష్పరిణామానికి తానే బాధ్యుడవుతాడు. ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవీయబడింది –

> "నిశ్చయంగా ఎవరయితే అల్లాహ్ సూచనలను విశ్వసించరో, వారికి అల్లాహ్ ఎన్నటికీ సన్మార్గం చూపడు. వారికి బాధాకరమయిన శిక్ష ఉంటుంది." *(అన్ నహ్ల్ – 104)*

> అవిశ్వాసులు అగ్ని ముందుకు తీసుకురాబడే రోజున వారిని, "ఇది సత్యం కాదా?" అని అడగటం జరుగుతుంది. వారు, "అవును, మా ప్రభువు సాక్షిగా! (ఇది నిజంగానే సత్యం)" అని అంటారు. అల్లాహ్, "సరే, ఇక మీరు తిరస్కరిస్తూ ఉండిన దాని పర్యవసానంగా, శిక్షను రుచి చూడండి" అని సెలవిస్తాడు. *(అల్ అహ్ఖాఫ్ – 34)*

## దైవ విధానంలో బలవంతం ఉండదు

దైవప్రవక్త, దైవ గ్రంథం ఆధారంగా నిజదైవాన్ని విశ్వసించటం అనేది దాసుని ఐచ్ఛిక ఆచరణ. అల్లాహ్ తన తరఫున బలవంతం చేయడు. బలవంతంగా ఒప్పించటం అల్లాహ్ సంప్రదాయం కానేకాదు. బలవంతం చేయటం వల్ల పరీక్షకు అర్థం లేకుండాపోతుంది. అయితే అల్లాహ్ తన కారుణ్యం, ప్రేమ ఆధారంగా దాసునికి బోధపరచి, అతని ఆలోచనలకు పరీక్ష పెడతాడు. అతను సత్యాన్ని తెలుసుకుని సన్మార్గానికి వచ్చేలా ప్రయత్నిస్తాడు. ఉదాహరణకు ఖుర్ఆన్‌లోని ఈ ఆయత్‌ని గమనించండి –

> "మేము గనక తలచుకుంటే ఆకాశం నుండి వారిపై సూచనలు అవతరింపజేసి, దాని ముందు వారి మెడలు వంగిపోయేలా చేయగలం." *(అష్ షుఅరా – 4)*

## విశ్వసించిన వారికి అల్లాహ్ తోడ్పాటు

దైవదాసుల వరకు దేవుని కారుణ్య సందేశాన్ని చేరవేయటం, దైవదాసులకు దేవుని పరిచయం చేయటం అన్నిటికన్నా ఉత్తమమైన కార్యమని అల్లాహ్ తన గ్రంథం (హామీమ్ సజ్దా సూరా)లో ప్రకటిస్తున్నాడు.

కనుక ఈ పనిలో నిమగ్నులై ఉన్న విశ్వాసులకు, విశ్వసించిన సముదాయాలకు అల్లాహ్ సర్వవిధాలా సహాయపడతాడు. అడుగడుగునా వారికి మార్గదర్శకత్వం వహిస్తాడు. వారి పనిని సులభతరం చేస్తాడు. వారి కష్టాలను దూరం చేస్తాడు. శత్రువుల పన్నాగాల నుండి వారిని కాపాడుతాడు. ఖుర్ఆన్‌లో అల్లాహ్ విశ్వాసులకు ఈ మేరకు హామీ ఇస్తున్నాడు –

> నిశ్చయంగా మేము మా ప్రవక్తలకూ, విశ్వాసులకూ ఇహలోక జీవితంలో కూడా తప్పకుండా సహాయం చేస్తాము; సాక్షులు నిలబడే రోజున కూడా సహాయం చేస్తాము. ఆ రోజున దుర్మార్గులకు వారి సాకు ఏమాత్రం ఉపయోగపడదు, వారి మీద శాపం విరుచుకుపడు తుంది, అతి నికృష్టమైన నివాసం వారి వాటాగా లభిస్తుంది.”
>
> *(అల్ మూ'మిన్ – 51, 52)*

> కనుక ఓ ప్రవక్తా! ఓరిమి చూపు, అల్లాహ్ వాగ్దానం సత్యం. నీ తప్పులకు క్షమాభిక్ష వేడుకో. ఉదయం, సాయంత్రం నీ ప్రభువును స్తుతిస్తూ, ఆయన పరిశుద్ధతను కొనియాడు. తమ వద్దకు ఏ అధికారపత్రామూ రాకుండానే అల్లాహ్ వాక్యాల విషయంలో వాదులాడే వారి మనస్సులు గర్వంతో నిండిపోయాయి. కాని తాము గర్వపడుతూ ఉన్నంత గొప్పతనానికి వారు చేరుకోలేరు. కనుక అల్లాహ్ శరణు వేడుకో; ఆయన అన్నీ చూస్తాడు, అన్నీ వింటాడు.
>
> *(అల్ మూ'మిన్ – 55, 56)*

**–ః సమాప్తం ః–**